ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2009 Q2 ఏప్రిల్ - జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

**రెడ్ల రాజ్యమేనా..?**
**రాజకీయాల్లో కమ్మలు 1-2**
**రాజకీయాల్లో కాపులు..**
**క్రిస్టియన్ రెడ్లు 1-2**
**కమ్మల జనాభా శాతం ఎంత?**
**ఎవరు గెలుస్తారు 1- 12**
**చిరును ఎందుకు రెచ్చగొట్టినట్టు?**
**ఆంధ్రభోజనం**
**ఎల్‌టిటిఇ పై జాలి పడాలా?**
**ఎల్‌టిటిఇ గురించి ముక్తాయింపు**
**రాష్ట్ర విభజన 1-13**
**ఎల్‌టిటిఇపై స్పందన**
**స్విస్ బాంకులపై స్పందన**
**ఎగ్జిట్ పోల్స్ చెప్పే కథ**
**పరకాల(కూట)విషం**
**ఫలితాలు వచ్చాక...**
**ఎందుకిలా ఓటేశారు...? 1-8**

**2009 ఏప్రిల్** **ఎమ్బీయస్: రెడ్ల రాజ్యమేనా...?**

నాకు వచ్చే మెయిల్స్‌లో చాలామంది జనరలైజ్ చేసే పాయింటు ఒకటుంది. కాంగ్రెస్ రెడ్ల పార్టీ అని! రెడ్లకు ప్రాముఖ్యత యిచ్చేది కాంగ్రెస్సేనని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెడ్లు మాత్రమే పాలిస్తారని ఒక అభిప్రాయం. వైయస్ అధికారంలోకి వచ్చాక కమ్మవారిని వ్యాపారాలు కూడా చేసుకోనివ్వటం లేదని మురళీమోహన్ వంటి సౌమ్యుడు కూడా బహిరంగంగా విరుచుకుపడ్డారు.

ఇప్పుడు పార్టీలన్నీ తమ తమ అభ్యర్థులను ప్రకటించాయి కాబట్టి కులాలవారీగా లిస్టు ఈనాడులో వేశారు. దాని ఆధారంగా నేను యీ విశ్లేషణ చేస్తున్నాను. ఇలా జాగ్రత్త పడడానికి కారణం ఏమిటంటే - కొన్ని పొరబాట్లు గ్లేరింగ్‌గా నాకే కనబడ్డాయి. వైయస్ జగన్ క్రైస్తవుడు కదా, కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థుల లిస్టులో ఆయనను రెడ్డిగానే గణించారు. కొంతమంది మతం మారినా, సాంఘికహోదా గురించో, రిజర్వేషన్ లాభాల గురించో పాత కులాన్నే చెప్పుకుంటున్నారో, లేక పత్రికల వాళ్లు వాళ్లని అలా లెక్కవేస్తున్నారో నాకు తెలియదు.

సరే యింతకీ ఆ లిస్టు ప్రకారం అసెంబ్లీ అభ్యర్థులలో కాంగ్రెస్ తరఫున నిలబడిన రెడ్లు 88, మహా కూటమి తరఫున 66, పీఆర్పీ తరఫున 42! తక్కిన కులాలన్నిటికన్నా వీళ్లదే హైయ్యస్ట్ - బిసిలందర్నీ కట్టకట్టి ఒకే కులంగా లెక్కవేస్తే తప్ప! అంటే మురళీమోహన్‌కి చెందిన మహాకూటమి అధికారంలోకి వచ్చినా రెడ్లదే రాజ్యమన్నమాట! ఎటు చూసినా రెడ్డి ప్రభువులే కనబడడమేల? ఎందుకీ పరిస్థితి? తక్కినవారెవరికీ పరిపాలన రాదనా?

నాకు తోచిన సమాధానం రాస్తున్నాను. తప్పులుంటే చెప్పండి. తక్కిన రాష్ట్రాల మాట ఎలాగున్నా తెలుగునాట రెడ్లే మొదట్నుంచీ రాజకీయాలను నమ్ముకున్నారు. ఎప్పుడూ కలిసివచ్చే వ్యాపారం కాదు రాజకీయాలంటే! ఓ సారి గెలిస్తే మరోసారి ఓడిపోవచ్చు. గెలిచినా, ఓడినా అనుచరులను మేన్‌టేన్ చేయడం పెద్ద భారం. అలా మేన్‌టేన్ చేయడానికి భేషజం వుండాలి, పెద్ద మనసు వుండాలి. కరగదీయడానికి ఆస్తులు వుండాలి. పగలు వుండాలి, కక్షలు, కార్పణ్యాలు వుండాలి. అవేమీ లేకుండా ఈ క్రీడ అడలేరు.

ఎన్నికల్లో నెగ్గేవాడు ఒకడైతే ఓడిపోయేవాడు అరడజనుమంది. వీళ్లందరూ రాజకీయాలు వదిలేసి యింట్లో కూచున్నా, యిది

వదిలేసి వేరే పని చూసుకున్నా లాభం లేదు. ఓడిపోయినా వూళ్లో యాక్టివ్‌గానే వుండాలి. చీటికి మాటికీ జనాల్ని పోగేసి, పత్రికలకు ఎక్కుతూ వుండాలి. రెడ్లకే యీ క్రీడంటే మక్కువ.

దీనికి మూలం గ్రామపాలనలో కనబడుతుంది. గ్రామాధికారులు యిద్దరుంటారు. మునసబు, కరణం లేదా పటేల్, పట్వారీ. కరణం లెక్కాడొక్కా చూస్తూ లౌక్యంతో నెట్టుకొస్తూ వుంటాడు. మునసబు గ్రామపెద్దగా చలామణీ అవుతాడు. గౌరవవేతనం కాస్త లభించడం తప్ప కిట్టుబాటు వ్యవహారం కాదు. అయినా గొప్ప వూళ్లో ఏది వచ్చినా తనను పిలుస్తారు, తనను సంప్రదిస్తారన్న ఓ అహం.

వెనక్కాల మనుష్యులని వేసుకుని తనమాట చెల్లుబాటు అయ్యేట్లు చూసుకుంటే, తన ప్రత్యర్థులను నయానా, భయానా అణచివేయడం, అవసరమైతే హింసాప్రయోగం చేసైనా తన ఆధిపత్యం చెదరకుండా చూసుకోవడం – యిలాటి విద్యలు వచ్చినవాడే మునసబుగా చలామణీలో వుంటాడు. ఈ మునసబుగిరీ చాలాప్రాంతాల్లో రెడ్లు నిర్వహిస్తూ వచ్చారు.

రాజకీయాలన్నవి యీ మునసబుగిరీకి ఎక్స్‌టెన్షన్ లాటివే. అందుకనే వాళ్లు సునాయాసంగా రాజకీయాల్లోకి చొరబడ్డారు. దీన్ని ఊహించే మద్రాసు రాష్ట్రంలోనుండి వేరుపడడానికి ఆంధ్రోద్యమం నడిచే రోజుల్లో శ్రీశ్రీ రాశారు –

'తెలుగు రాజ్యమేర్పడితేను
తొలి వజీరు రెడ్డి
తాగడానికి కుళ్లు నీరు
తినడానికి గడ్డి' అని. (వజీరు అంటే మంత్రి. ఇక్కడ ముఖ్యమంత్రి అని అర్థం)

ఓ సారి ఇందిరా గాంధీ వచ్చినపుడు బ్రహ్మానందరెడ్డిగారు తన క్యాబినెట్ పరిచయం చేస్తూ 'ఆ రెడ్డి, యీ రెడ్డి' అని చెప్తూంటే మీ ఆంధ్రదేశంలో రెడ్లు తప్ప ఎవరూ లేరా? అని అడిగిందట. తర్వాత ఛాన్సు వచ్చినపుడు తెలంగాణోద్యమం సందర్భంగా బ్రహ్మానందరెడ్డిని పీకేసి పి వి నరసింహారావును పెట్టింది. ఆయనా నిలదొక్కుకోలేక పోయాడు. దాంతో వెంగళరావును నియమించింది. ఆయన ఆవిడతో విభేదించి వేరేపార్టీలో చేరడంతో, చెన్నారెడ్డి వచ్చి తన పార్టీలో చేరడంతో తర్వాత మళ్లీ రెడ్డిరాజ్యం ప్రారంభమైంది. విజయభాస్కరరెడ్డి, భవనం వెంకట్రామ్ (రెడ్డి).. కాంగ్రెస్ పాలన అనగానే రెడ్లే కనబడసాగారు.

ఇప్పుడున్న వైయస్ క్రిస్టియన్ కాబట్టి టెక్నికల్‌గా రెడ్డి అనడానికి వీల్లేదు. కానీ రెడ్డి రాజ్యంగానే చలామణీ అవుతోంది. ఆ మాటకొస్తే బ్రహ్మానందరెడ్డిగారూ క్రిస్టియనే. ఆయన లాయరుగా ప్రాక్టీసు చేసే రోజుల్లో బ్రహ్మానందం అన్న పేరుతోనే ప్రాక్టీసు చేశారు. రాజకీయాల్లోకి రావాలని నిశ్చయించుకోగానే 'రెడ్డి' తగిలించుకున్నారు. అదీ రెడ్డి పేరుకు ఆంధ్రలో వున్న పవర్!

వీళ్లతో రాజ్యాధికారంకై పోటీ పడుతున్న కమ్మల గురించి వచ్చే వ్యాసంలో చర్చిద్దాం! **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: రాజకీయాల్లో కమ్మలు..

నాకు వచ్చే మెయిల్స్‌లో చాలామంది జనరలైజ్ చేసే పాయింటు యింకోటి వుంది. టిడిపి కమ్మపార్టీ అనీ, బిసిల సపోర్టుతో నడుస్తోంది అని. కాదు బిసిల పార్టీయే అనీ, నిజానికి కమ్మలు కాంగ్రెస్‌లోనే ఎక్కువమంది వున్నారని కొందరు వాదిస్తారు. ఈ సారి అసెంబ్లీ అభ్యర్థుల లిస్టు ఈనాడు లిస్టు ప్రకారం పరికిస్తే కమ్మ అభ్యర్థులు కాంగ్రెస్‌లో 16, మహాకూటమిలో 46, పీఆర్పీలో 11 మంది వున్నారు.

మహాకూటమిలో టిడిపిదే ముఖ్యపాత్ర కాబట్టి యితర పార్టీలన్నిటికంటె టిడిపి కమ్మలకు టిక్కెట్లు యిచ్చిందనిపిస్తోంది. రాజకీయాలు రెడ్లకు సహజక్రీడ కాబట్టి ఏ పార్టీయైనా సరే వాళ్లకే ప్రాధాన్యం యిస్తోందని గత వ్యాసంలో రాశాను కదా. ఇప్పుడు కమ్మల గురించి చూద్దాం. ఇటీవల రాజ్యాధికారం కోసం రెడ్లతో కమ్మలు పోటీ పడుతున్నా చాలాకాలం వారు రాజకీయాల జోలికి రాలేదు.

కమ్మల స్వభావాన్ని జనరలైజ్ చేసి మాట్లాడితే కనబడేవి – అవకాశాల కోసం ఇతరప్రాంతాలకు వెళ్లడానికి చొరవ, చదువుల పట్ల, ఉన్నతోద్యోగాల పట్ల మక్కువ, కష్టపడి వ్యాపారం చేసే లక్షణం. కోయంబత్తూరు, సేలం ప్రాంతాల్లో కుటీరపరిశ్రమల నుండి, భారీపరిశ్రమలదాకా స్థాపించి నడుపుతున్న కమ్మలు ఎందరో కనబడతారు. అదే విధంగా గత 70, 80 ఏళ్లగా తెలంగాణాకు వచ్చి కష్టపడి పనిచేసి, స్థిరపడి ఆస్తులు సంపాదించిన కమ్మలు కనబడతారు. స్థానికులతో సౌమ్యంగా మెలగుతూనే వీళ్లు కార్యాన్ని సాధించుకుంటూ వచ్చారు.

గ్రామాలను వదిలి అర్బనైజేషన్ పట్టి, చదువులు నేర్చి, ఉద్యోగాలు సంపాదించినవారిలో బ్రాహ్మలది మొదటిస్థానం. గ్రామాలలో పట్టు పూర్తిగా వదులుకోకుండా అర్బనైజేషన్ నేర్చినవారిలో కమ్మలు కనబడతారు. ఉద్యోగాలలో బ్రాహ్మలతో, వ్యాపారాలలో వైశ్యులతో, వ్యవసాయంలో కాపులతో పోటీ పడుతూ పైకి ఎదిగినవారు కమ్మలు. జనాభాలో వీరి శాతం ఎంత వుంటుందంటారు? ఏ 3%యో వుండవచ్చు. అంటే బ్రాహ్మల శాతం కంటె, వైశ్యుల శాతం కంటె ఎక్కువ కాదు. పైగా వీరి ప్రాబల్యం 4 జిల్లాల కంటె ఎక్కువ కాదు. అయినా రాష్ట్రంలో అనేక రంగాలలో వీరు ముందున్నారు. ధనవంతులయ్యారు.

జాగ్రత్తగా వ్యవహరిస్తూ వ్యవహారాలు చక్కబెట్టుకోవడంలో నేర్పరులైన వీరిని రాజకీయాలు ఆకర్షించలేదు. దానికి దురుసుతనం,

తెగింపు కావాలి. పైగా తప్పకుండా గెలుస్తామన్న గ్యారంటీ లేదు. అంత రిస్కు తీసుకోవడం వీళ్లకు రుచించలేదు. అలా అని కమ్మలు రాజకీయాల్లో బొత్తిగా లేరని నా ఉద్దేశం కాదు. రాష్ట్రమంతా ప్రభావితం చేసేటంత మోతాదులో లేరని నా భావం. ఆ పాటి రాజకీయ భాగస్వామ్యం అన్ని కులాలలోనూ వుంది. ఈ రోజు రాజకీయాల్లో పెద్ద పీట కోరుకునేటంత లెవెల్లో ముందునుండీ లేరని చెప్పడానికి యిదంతా చెపుతున్నాను.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఎక్కువమంది కమ్మలు కమ్యూనిస్టు పార్టీని ఆదరించారు. కొందరు బ్రిటిష్ వారిని సమర్థించే జస్టిస్ పార్టీని, మరికొందరు కాంగ్రెస్‌ను సమర్థించారు. రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ వెనుకబడడంతో వాళ్లూ వెనకబడ్డారు. క్రమంగా రాజకీయాల్లో పెద్దగా ఆసక్తి కనబరచలేదు. కమ్యూనిస్టు సానుభూతిపరులుగా వుంటూనే వ్యాపారాలు నిరాటంకంగా చేసుకున్నారు. ఎదిగారు. దేని దారి దానిదే!

వ్యాపారాభివృద్ధికి అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులకు మద్దతు యిచ్చారు. పనులు జరిపించుకున్నారు. అవసరమైనంతమేరకే రాజకీయాల్లో పాల్గొన్నారు తప్ప రెడ్లలా అదే వ్యాపకంగా పెట్టుకోలేదు. ఇప్పటికీ చూడండి, మురళీమోహన్, రామానాయుడు వీళ్లందరూ సినిమాలు, వ్యాపారాలు చేసుకుంటూనే వుంటారు. అప్పుడప్పుడు పార్టీ ఫోరమ్స్‌లో కనబడతారు. వారికి వృత్తి ఫస్ట్, రాజకీయాలు నెక్స్ట్.

పివి నరసింహారావు భూ సంస్కరణల బిల్లు పెట్టడం డబ్బున్న భూస్వాములందరినీ మండించింది. జై ఆంధ్ర ఉద్యమం పేరుతో ఆయన్ని పదవీభ్రష్టుడిని చేశారు. 7, 8 నెలల ఉధృత వుద్యమం తర్వాత రాష్ట్రం విడిపోనూ లేదు, అధికారం పార్టీ చేతుల్లోంచి జారిపోనూ లేదు. భూ సంస్కరణ బిల్లు అటకెక్కించడంతో తృప్తి పడ్డారు. ఈ సారి ముఖ్యమంత్రి కాబోయే వ్యక్తి తమకు అనుకూలంగా వుండాలని అనుకున్నారు.

తెలంగాణా ప్రాంతానికి చెందిన వెలమ కులానికి చెందిన వెంగళరావుగారు ముఖ్యమంత్రి కావడానికి కమ్మల మద్దతు వుందని చెప్పుకున్నారు. ఆయన ప్రాతినిథ్యం వహించిన ఖమ్మం జిల్లాలో కమ్మలకు చాలా పట్టు వుంది కాబట్టి యిది నిజమే అనుకుని చాలామంది నమ్మారు. ఎమర్జన్సీ తర్వాత వెంగళరావుగారు బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్‌లో చేరి, ఇందిరా గాంధీని ఎదిరించారు, ఎన్నికలలో ఓడిపోయారు. ఇందిరా గాంధీ కాంగ్రెస్ తరఫున చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.

ఆ తర్వాత వచ్చిన అంజయ్య బిసిల ప్రతినిధిగా ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రి అయ్యాక అంజయ్య తాను నిజానికి రెడ్డిననీ బిసిలు పెంచారనీ చెప్పుకున్నారు. క్రితం వ్యాసంలో చెప్పానుగా, రాజ్యం చెయ్యాలంటే రెడ్డి అయివుండాలన్న నమ్మకం తెలుగువారిలో పాతుకుపోయిందని! ఆ తర్వాత వచ్చినది భవనం వెంకట్రామ్. ఆయన రెడ్డి, భార్య కమ్మ. రెడ్డి కులనామాన్ని వాడేవారు కారు. ఆయన్ని మార్చేసి రెడ్డి పేరున్న విజయభాస్కరరెడ్డిని తీసుకుని వచ్చారు. ఈ దశలో ఎన్‌టి రామారావు రంగప్రవేశం చేశారు.

2

ఎన్టీయార్‌ను కమ్మగా ప్రజలెవరూ చూడలేదు. కాంగ్రెస్‌వారు ఆయన కా ముద్ర కొడితే ఆయన బాధపడ్డాడు కూడా. జనాభాలో 3% వున్న కమ్మవారి సపోర్టు చూసుకుని రంగంలోకి దిగేటంత అమాయకుడు కాదు ఎన్టీయార్. కాంగ్రెస్ వ్యతిరేకత, తెలుగువారి ఆత్మగౌరవం అనే ప్లాంక్ తప్ప ఎన్టీయార్ బిసిల గురించి మాట్లాడలేదు 1983లో.

'ఇప్పటిదాకా కమ్మలు అన్ని రంగాల్లోనూ పైకి వచ్చారు. రాజ్యాధికారం ఒక్కటీ వారికి దూరంగా వుంది. ఎన్టీయార్ రాకతో అదీ తీరబోతోందన్న ఉత్సాహంలో కమ్మలున్నారు' అన్న పత్రికల ప్రచారంతో కాంగ్రెస్‌లో వున్న కమ్మలు యిరకాటంలో పడ్డారు. వారంతా కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని వున్నారు తప్ప ఎన్టీయార్ వెంట నడవలేదు. ఎన్టీయార్ నెగ్గుతాడో లేదో నన్న సందేహం అప్పుడు అందర్నీ పట్టి పీడిస్తోంది. ఈనాడు ఒక్కటీ తప్ప తక్కిన మీడియా అంతా ఎన్టీయార్ నెగ్గడనే అంటోంది. వ్యాపారస్తుడి లక్షణాలు పుష్కలంగా వున్న కమ్మలు ఎన్టీయార్‌ను బాహాటంగా సమర్థించలేదు.

అనుకోకుండా ఎన్టీయార్ అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చాక పర్మనెంట్ వోట్‌బ్యాంక్ అంటూ ఏర్పడాలని సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె మోడల్లో బిసిలను తమవైపు తిప్పుకోవాలని అనుకున్నారు. ప్రథమ వార్షికోత్సవ సభలో అన్నాళ్లూ బూజుపట్టి మూలపడి వున్న మురళీధరరావు కమిటీ రిపోర్టును అమలు చేస్తామని ప్రకటించారు. ఎన్టీయార్ కమ్మవారినే ఫేవర్ చేశారని ఎవరూ అనలేరు. కానీ కొంతమంది కమ్మలు తమ స్వార్థానికి ఆయన పేరుని వుపయోగించుకుని ఆయన ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చారన్న మాట మాత్రం వచ్చింది. ఎన్టీయార్ ఎన్నికల్లో ఓడడానికి కొన్ని ప్రాంతాల్లో కమ్మవ్యతిరేకతే కారణమన్న రిపోర్టులూ వచ్చాయి. (చంద్రబాబు 2004లో ఓడినప్పుడు యీ మాట రాలేదు)

ఏమైతేనేం, మళ్లీ కాంగ్రెస్ పాలన చెన్నారెడ్డి, విజయభాస్కరరెడ్డి.. మళ్లీ ఎన్టీయార్ అధికారంలోకి రావడం జరిగింది. ఆయన్ని చంద్రబాబు కూలదోసి, తొమ్మిదేళ్లపాటు పాలించడమూ జరిగింది. తర్వాత వైయస్ పాలనలో కమ్మవారి పట్ల చాలా వివక్షత చూపుతున్నారన్న ఆరోపణలు ముంచెత్తాయి. వైయస్-రామోజీ వైరానికి క్రైస్తవ-హిందూ కలర్ యివ్వకుండా రెడ్డి-కమ్మ కలర్

యివ్వడం జరిగింది. మార్గదర్శి ఫైనాన్సు వ్యవహారాలు బయటపెట్టినందుకు గాను, వైయస్ యావన్మంది కమ్మవారిని వ్యాపారాలను చేసుకోనివ్వటం లేదన్న ఆరోపణలు కమ్మసంఘాలు కొన్ని చేశాయి. ఇది నిరాధారమైన, అన్యాయమైన ఆరోపణ అని ఎవరికైనా తెలుస్తుంది. ఇప్పటికీ అనేక వ్యాపారాలలో కమ్మలు అగ్రగాములుగా వున్నారు.

కానీ యీ విధంగా కమ్మలు రెచ్చగొట్టబడ్డారు. కాంగ్రెస్‌ను, తద్వారా రెడ్డి రాజ్యాన్ని అంతం చేసి, కమ్మరాజ్యాన్ని స్థాపించేయాలన్న దృఢసంకల్పంతో కొన్ని కమ్మవర్గాలు దివారాత్రాలు వుద్యమిస్తున్నట్టు కనబడుతోంది. వేర్వేరు పార్టీల్లో వున్నా, కమ్మలందరూ మానసికంగా టిడిపితోనే వున్నారని వీళ్లు నమ్ముతారు. అంటే లగడపాటి రాజగోపాల్ తను ఓడిపోయి టిడిపి నెగ్గాలని కోరుకుంటారా? అలా అయితే రేణుకా చౌదరి టిడిపి ఎందుకు వదిలినట్టు?

మనం గుర్తు పెట్టుకోవలసినదేమిటంటే ఎవరికైనా వాళ్ల బాగు ముఖ్యం. ఆ తర్వాతే కులం, మతం వగైరా వగైరా. మనవాడు గద్దె మీద వున్నాడంటే కాస్సేపు మానసికానందం కలగవచ్చు అంతే తప్ప మనకు ఒనగూడే ప్రయోజనం ఏమీ లేదని అందరికీ తెలుసు. మన ప్రధానమంత్రుల్లో ఎక్కువమంది బ్రాహ్మలే! అయితే ప్రభుత్వపరంగా బ్రాహ్మలకు కలిసి వచ్చింది ఏమైనా వుందా? ఢిల్లీలో సులభ్ కాంప్లెక్స్‌లలో 50% సఫాయి పనివాళ్లు బ్రాహ్మలు అని చిరంజీవి గారన్నారు. (ఈ సమాచారం వారికి ఎక్కడ లభించిందో మరి!)

అందువలన వడ్డించేవాడు మనవాడు కానక్కరలేదు. మనవాణ్ని చేసుకుంటే చాలు – డబ్బుతోనో, పలుకుబడితోనో. అందుకనే వైయస్ జగన్ భాగస్వాముల్లో కమ్మలు, చంద్రబాబు భాగస్వాముల్లో రెడ్లు కనబడతారు. ఒకవేళ యీ ఎన్నికల్లో టిడిపి తుడిచి పెట్టుకుని పోయిందనుకోండి (వాదనకోసం అంటున్నాను) కమ్మలు రాజకీయాల్లోంచి తొలగిపోతారా? రాజకీయాలకు, రాజకీయ నాయకులకు దూరంగా వుంటారా? అబ్బే, ఎవరు అధికారంలోకి వస్తే వాళ్లతోనే అంటకాగుతారు.

వాళ్లే కాదు, ఏ కులంవారైనా సరే, యిదే పద్ధతి! డబ్బున్నవాడికి ఎలా సర్వయివ్ అవ్వాలో తెలుసు. అధికారంలో వున్నవాళ్లు కూడా – మరీ మూరు?డయితే తప్ప – ఎవర్నీ దూరం చేసుకోరు. వేరే కులం కదాని పనులు చేయకుండా వుండరు. అస్మదీయుడై వుండాలి, అంతే!

ఈ వాతావరణానికి కులం రంగు పులిమి ఫలానాది రెడ్డి పార్టీ, ఫలానాది కమ్మ పార్టీ అనుకోవడం సరికాదని నా అభిప్రాయం. కాంగ్రెస్సే తీసుకోండి. కమ్మలు, బ్రాహ్మలు, వైశ్యులు జనాభాపరంగా చూస్తే ఒకేశాతంలో వుంటారు కదా! మరి అసెంబ్లీ టిక్కెట్లు ఎలా యిచ్చింది కాంగ్రెస్? బ్రాహ్మలకు 4, వైశ్యులకు 5, కమ్మలకు 16? కమ్మ వ్యతిరేకత వుంటే వీళ్లకంటె తక్కువ యిచ్చి వుండాలి కదా! అలాగే టిడిపికి రెడ్డి వ్యతిరేకత వుంటే కమ్మలకు 46 యిచ్చి రెడ్లకు 66 ఎలా యిస్తుంది?

వచ్చే వ్యాసంలో కాపుల గురించి చర్చించుకుందాం. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: రాజకీయాల్లో కాపులు..

ఎన్టీయార్ రాకతో కమ్మల్లో రాజకీయ చైతన్యం రగిలినట్లే చిరంజీవి రాకతో కాపుల్లో కూడా వచ్చినట్టు కనబడుతోంది కాబట్టే యీ వ్యాసం రాసే అవసరం పడుతోంది. ఇప్పటివరకు కాపులు సంఖ్యలో ఎక్కువగానే వున్నా, రాజకీయాధికారానికి దూరంగానే వున్నారు. పంతం పద్మనాభం, దాసరి వంటి నాయకులు, కాపునాడు లాటి పార్టీలు కాస్త హడావుడి చేయబోయినా అవి సామాన్యులపై ఎలాటి ప్రభావాన్ని చూపలేదు.

అందరికీ అభిమాన నటుడైన చిరంజీవిని కాపుగా ముద్ర కొట్టి కాపునాడులో చేరమని కోరినా ఆయన చేరలేదు. కాంగ్రెస్, టిడిపి తమ తమ పార్టీల్లో చేరమని అడిగినా ఆయన చేరలేదు. స్వంతరైలు వచ్చేవరకూ ఆగి, దానిలోనే ఎక్కారు. చిరంజీవి పార్టీ ఆవిర్భావానికి ముందు జరిగిన సదస్సుల్లో కానీ, తిరుపతి సభలో కానీ కులప్రస్తావన లేదు. ఉన్న పథకాలనే యింతకంటె మెరుగ్గా, అవినీతి లేకుండా కొనసాగిస్తాం, సమాజంలో మార్పు తెస్తాం అన్నదే ఆయన అప్పటి నినాదం.

అయితే ప్రతిపక్షాలు వూరుకోలేదు. ఎన్టీయార్ రాజకీయాల్లోకి వచ్చినపుడు కమ్మ ముద్ర కొట్టి ఆ పార్టీ ప్రభావాన్ని పరిమితం చేయడానికి కాంగ్రెస్ ఎలా ప్రయత్నించిందో, ఇప్పుడు చిరంజీవి వచ్చినప్పుడు అలాగే కాపు ముద్ర కొట్టడానికి చూసింది. దానికి టిడిపి తోడుగా వచ్చి చేరింది. 1983 లో దీనిపై మీడియా నిశ్శబ్దంగా వుంది కానీ యిప్పుడు మీడియా కూడా 'చిరంజీవి సామాజికవర్గం వారి ప్రభావం ఎక్కువగా వున్న ప్రాంతాలు' అంటూ ఆయన కులాన్ని ఎత్తి చూపసాగాయి. ఇతర పార్టీలనుండి వచ్చి వెళ్లిపోయినవారు కూడా 'కాపు పార్టీ' అని, 'కమ్మవ్యతిరేక పార్టీ' అని, ముద్రలు కొట్టి, యాగీచేసి మరీ వెళ్లారు.

దాని ప్రభావం చిరంజీవి పార్టీపై కనబడింది. కాపు నాయకులే ప్రధానంగా మిగిలినట్టు అనిపించింది. తక్కిన కులాలకు చెందిన పీఆర్పీ నాయకులలో నిరాసక్తత కనిపించింది. ఈనాడు లిస్టు ప్రకారం కాపులకు టిక్కెట్లు యిచ్చిన పద్ధతి చూడబోతే – కాంగ్రెస్ 14 యిస్తే, మహా కూటమి 8 యిస్తే, పీఆర్పీ 37 యిచ్చింది. జనాభా నిష్పత్తి ప్రకారం కమ్మల కంటె కాపులు రెట్టింపు వుంటారనుకుంటే కమ్మలకు 46 యిచ్చిన మహాకూటమి కాపులకు యిచ్చిన 8 మహా తక్కువ అనిపించడం లేదూ!?

అదే విధంగా కాపులకు 37 యిచ్చిన పీఆర్పీ కమ్మలకు 11 మాత్రమే యిచ్చిందంటే అర్థం ఏమిటి? మహాకూటమి (టిడిపి అని

అర్థం) కమ్మలకు, పీ ఆర్పీ కాపులకీ ప్రాధాన్యం యిచ్చినట్టేగా! 'ఇది మీ పార్టీ సుమా' అని సంబంధిత వర్గాలకు సంకేతం యిచ్చినట్టేగా!

ఎందుకీ పరిస్థితి దాపురించింది? కాంగ్రెస్ అన్ని వర్గాల్లోనూ బలంగా వుందని, యాంటీ-ఇంకంబెంట్ ఫ్యాక్టర్ (ప్రభుత్వ వ్యతిరేకత) మరీ అంత బలంగా లేదని అందరూ అనడంతో టిడిపి, పీఆర్పీలలో కాస్త గుబులు పుట్టి కనీసం కొన్ని వర్గాలలోనైనా బలంగా వేళ్లూనుకుంటే పైన వచ్చినది బోనస్ కదా అనుకుంటున్నారులా వుంది. ఆ వర్గాలను కులాలుగా అన్వయించుకుని టిడిపి కమ్మలకు, పీఆర్పీ కాపులకు ప్రాధాన్యత యిచ్చింది. కాంగ్రెస్ ఆ మేరకు రెడ్లకు యిచ్చుకుని కమ్మలకు 16, కాపులకు 14 యిచ్చింది.

కాపుల రాజకీయగతం గురించి కాస్త ఆలోచిస్తే - సంఖ్యాపరంగా కాపులు పెద్ద సంఖ్యలో వున్నా వారికి ముఖ్యమంత్రి పదవి యిప్పటివరకు దక్కలేదు. కులం స్పృహతో వాళ్లు ఎప్పుడూ ఆలోచించినట్టు లేదు. ఎందుకంటే కాపుల్లో చాలా తెగలు వున్నాయి. అందరం ఒకటే, ఒకే గ్రూపుగా వోటేయాలి అన్న ఆలోచన ఎన్నడూ వున్నట్టు తోచదు. ఎవరిమానాన వాళ్లు పైకి వచ్చారు తప్ప, కులం పేరు చెప్పి గ్రూపుగా దబాయించినట్టు తోచదు. విజయవాడ, అమలాపురం లాటి కొన్నిచోట్ల తప్ప కులపరమైన కొట్లాటలూ, కులంపేరుమీద ఐక్యత ప్రదర్శించినట్టూ కనబడదు.

గత ఏడెనిమిదేళ్లగా కొన్ని జిల్లాలలో మాత్రం చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లను కాపులు తమ కులం వాడిగా క్లెయిమ్ చేయడం , వారి సినిమాలు రిలీజైనప్పుడు హంగామా చేయడం కనబడుతోంది. కమ్మలు బాలకృష్ణ, జూనియర్ ఎన్టీయార్ (ఆయన నిజానికి సగం కమ్మ మాత్రమే) సినిమాలు రిలీజైనప్పుడు హంగామా చేయడం కూడా! తక్కిన జిల్లాల్లో యిదేమీ లేకుండానే వారి వారి హవా నడిచింది కాబట్టి, యిది స్థానిక నాయకుల హడావుడి తప్ప మరొకటి కాదని తేల్చేయచ్చు.

ఇప్పుడు చిరంజీవి రాజకీయాల్లోకి రావడంతో ఆ జిల్లాల్లో హడావుడి మరింత పెరిగింది. కాపులకు తోడు బిసిలను కూడా చేర్చుకుని డెడ్లీ కాంబినేషన్‌గా తయారవుతుందన్న ఆశ కనబడుతోంది కొందరు కాపు నాయకుల్లో. ఆ పథకానికి అనుగుణంగానే కాబోలు యిప్పటివరకూ ఎవరూ యివ్వనంత స్థాయిలో 104 సీట్లు బిసిలకు యిచ్చారు పీఆర్పీ వారు.

చిరంజీవి గెలిస్తే ఎలా వ్యాఖ్యానించాలి? - కాపులకు విజయమనా? మార్పుకు గెలుపనా? అన్న మీమాంసలో పడేసేటంత యిదిగా చిరంజీవిపై కులం ముద్ర కొట్టేయడం నిజంగా దురదృష్టకరం. ఎందుకంటే చంద్రబాబు సిఎం అయితే కమ్మ నాయకుని విజయం అని ఎవరూ అనరు. పరిపాలనాదక్షుని విజయమని కొనియాడుతారు! వైయస్ నెగ్గితే వర్షాల మహిమ అంటారు తప్ప రెడ్ల విజయం అనరు. **- ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: క్రిస్టియన్ రెడ్లు...

ఇది ఎలక్షన్ సీజన్. రాయాల్సింది, చెప్పాల్సింది ఎంతో వుంది. సమయాభావం వలన రాయలేకపోతున్నాను. అయినా యిలాటి జనరల్ టాపిక్ గురించి ముందుగా ఎందుకు రాస్తున్నానంటే దానికో కారణం వుంది. నేను రాసిన రాజకీయాల్లో రెడ్డి, కమ్మ, కాపు (వీళ్ల గురించే రాశారేం? అని ఎవరో అడిగారు. రాజకీయాల్లో వీళ్లే యిప్పుడు లైమ్‌లైట్‌లో వున్నారు కాబట్టి రాశా. రాజకీయాల్లో ఆర్యవైశ్యులు అని రాస్తే అది టాపికల్ కాదు) గురించి రాసిన తర్వాత నా మెయిల్ బాక్స్ పొంగి పొరలిపోతోంది. నా విశ్లేషణ గురించి చర్చించినవారు తక్కువే. కానీ రెండు విషయాలపై చాలామంది తీవ్రంగా స్పందించారు.

ఒకటి - వైయస్ జగన్ క్రైస్తవుడు కాబట్టి మైనారిటీలో పరిగణించాలి తప్ప రెడ్ల కోటాలో వేయకూడదు అన్న అంశం. రెండోది - జూనియర్ ఎన్టీయార్ సగం కమ్మ అన్న అంశం.

దీనిలో మొదటిదాని గురించి యీ వ్యాసంలో చెప్తా. నాకు మెయిల్స్ రాసినవారు అభ్యంతర పెట్టినదేమిటంటే, క్రైస్తవుడు అయినంత మాత్రాన రెడ్డి కాకుండా పోడని. 'మా మతం క్రైస్తవం, కులం రెడ్డి' అని చాలామంది రాశారు. సంగతులు తెలిసీ తెలియకుండా చేతికి ఏది వస్తే అది రాసేయవద్దని మందలించారు కొందరు.

ఇంకొకాయన ఇంకాస్త విశదీకరించాడు - రెడ్లు వంటి అగ్రవర్ణస్తులు మతం మారితే వారిని కేథలిక్స్ అంటారట. మాల, మాదిగ వంటి వారు మారితే వారిని క్రిస్టియన్లు అంటారట. నేను చదువుకున్న చరిత్ర ప్రకారం క్రిస్టియన్లలోనే రెండు విభాగాలు - కేథలిక్స్, ప్రొటెస్టంట్స్. కేథలిక్స్‌ని క్రిస్టియన్లు కారని అనడం హాస్యాస్పదం. ఇక మతం మారితే కులం వుంటుందా లేదా? అన్న అంశం చర్చిద్దాం.

వర్ణవ్యవస్థ హిందూమతానికి ప్రత్యేకం. హిందూమతం ప్రకారం నాలుగు కులాలు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. పంచములు (హరిజనులు, షెడ్యూలు కులాలవారు, బహుజనులు ఏ పేరుతో పిలిచినా వారే) అనేది ఆదిలో లేదు. ఈ పంచములు ఎలా తయారయ్యారు అన్నదానిమీదనే అంబేడ్కర్ చాలా పరిశోధన చేసి పుస్తకాలు రాశారు. కమ్మ, కాపు, రెడ్డి వంటి అగ్రవర్ణాలతో సహా ఇప్పుడు బిసిలుగా పిలవబడుతున్నవారు అందరూ శూద్రులలోనే లెక్కించబడతారు. శూద్రులకు మన రాష్ట్రంలో యీ పేర్లున్నాయి. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో పేరు కనబడుతుంది. మొదలియారు, వన్నియార్, జట్, లింగాయత్.. యిలా ఎన్నో వున్నాయి.

ఈ వర్ణవ్యవస్థే హిందూమతంలో అనైక్యత తెచ్చి పెట్టింది. కొందరు ఎక్కువనీ, మరికొందరు తక్కువనీ భావన కలిగి నిరంతరం పోరాడుతూ వున్నారు. క్షత్రియుల్లో కూడా సూర్యవంశమనీ, చంద్రవంశమనీ అనుకుని మేం గొప్ప అంటే మేం గొప్ప అనుకుని

వాళ్లలో వాళ్లు పోట్లాడుకున్నారు. ఇతరమతస్థులు హిందూమతాన్ని ఎక్కువగా తప్పుపట్టేది యీ విషయంలోనే! ఇతరజాతుల్లో వర్గాలుంటాయి, వర్గపోరాటాలుంటాయి. కానీ మనకు దానికి తోడు వర్ణం కూడా వచ్చి చేరింది. ఈ పరిస్థితి బాగాలేదనుకున్నవారు హిందూమతాన్ని సంస్కరించబోయారు. కానీ సంస్కరణ కుదరక, వేరే మతాలు పుట్టుకు వచ్చాయి. బౌద్ధం, జైనం – వీటిలో వర్ణవ్యవస్థ లేదు. అందరూ సమానమే.

తర్వాత ఇస్లాం వచ్చింది, క్రైస్తవం వచ్చింది. వాటిలోని సిద్ధాంతాల కంటె (అన్ని మతాలూ చెప్పేదొకటే, మంచి చేయమని, కానీ ఆచరణలోనే తేడాలొస్తాయి) వర్ణవివక్షత కారణంగా కొందరు హిందువులు పడే వేదన ఆ యా మతాలలో చేరడానికి దోహదపడింది. ఇస్లాంలోకి వెళ్లినవారు ముస్లిములుగానే పరిగణింపబడతారు కానీ వారికంటూ ఓ కులాన్ని వెంటబెట్టుకుని వెళ్లరు. 1980 ప్రాంతాల్లో మీనాక్షిపురం అనే తమిళనాడు గ్రామం మొత్తం అగ్రవర్ణాల అత్యాచారాలు భరించలేక ముస్లిములుగా మారారు. వాళ్లు అసదుద్దీన్ నాడార్ అనో, ముకరం పిళ్లయ్ అనో పెట్టుకోలేదు.

కులం నామం పెట్టుకున్న ఒక్క ముస్లిమూ నాకు తారసపడలేదు. మస్తాన్ రెడ్డి అని కనబడితే ఆయన ముస్లిము కాదు. ఏదో మొక్కు కారణంగా ముస్లిం మతగురువుల పేరు పెట్టుకున్న హిందువే అయివుంటాడు. అంతెందుకు ఎ ఆర్ రహమాన్ జన్మతహ హిందువనీ ముస్లిముగా మారాడనీ తెలుసు. ఆయన మలయాళీ అని తెలుసు. కులం తెలియదు. ఉదాహరణకి నాయర్ అనుకుందాం. ఆయన పేరు రహమాన్ నాయర్ అని పెట్టుకోలేదుగా! దిలీప్ అనే పేరును అల్లా రఖా రహమాన్‌గా మార్చుకున్నాడు. షర్మిలా టాగూర్ నవాబ్ పటౌడీని పెళ్లి చేసుకుందామనుకున్నపుడు ఆయేషా బేగంగా పేరు మార్చుకుంది. అంతేకానీ అయేషా టాగూర్ (ఇంటిపేరు) పెట్టుకోలేదే. హేమమాలిని ధర్మేంద్రను పెళ్లాడడానికి ముస్లింగా మారిందని ఆ మధ్య వార్త వచ్చింది. అప్పుడు పెట్టుకున్న ముస్లిం పేరుకి చివర అయ్యంగార్ అని తగిలించిందా?

ఇలా ఎందుకు చేయలేదంటే కులం హిందువులకే ప్రత్యేకం కాబట్టి. మతం మారితే కులం నిలవదు కాబట్టి. కాదు, క్రైస్తవంలో కూడా కులాలు వున్నాయని వాదించేవారుంటే వారిని బైబిల్‌లో లేదా ఏ క్రైస్తవ మతగ్రంథంలో కులప్రస్తావన వుందో చెప్పమని ఛాలెంజ్ చేస్తున్నాను. క్రీస్తు శిష్యులు (ఎపోస్టెల్స్) ఏ వ ృత్తుల వారో చెప్పారు కానీ ఏ కులంవారో చెప్పలేదు. ఎందుకంటే ఆ సమాజంలో కులాలే లేవు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ చూడండి. కేస్ట్ అన్నదానికి అర్థం ఏమిచ్చారో తెలుసా? – 'వన్ ఆఫ్ ది హిందూ హెరిడిటరీ సోషల్ క్లాసెస్' అని. గమనించండి – హిందూ అయితేనే కులం. హిందువు కానివాడికి కులమే లేదు. క్రైస్తవంలోకి కానీ, మరే మతంలోకి కానీ మారిన తర్వాత కులం కొనసాగిస్తే అవి ఆ మతధర్మాలను (టెనెట్స్) మీరుతున్నట్టే అని నా అభిప్రాయం.

## 2

దళితులనే వారు హిందూమతంలోనే వున్నారు. అంబేడ్కర్ దళితుల పట్ల అగ్రవర్ణాల దృక్పథాన్ని మార్చాలని ఎంతో ప్రయత్నించారు. సాధ్యపడలేదు. అగ్రవర్ణాల్లో మెజారిటీ మంది దళితులను తమతో సమానంగా చూడడానికి యిష్టపడలేదు. విసిగి వేసారి అంబేడ్కర్ వారిని మతం మారుద్దామనుకున్నాడు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'ఇలాటి తవ్వాయి వస్తే...?' కథ 70 ఏళ్ల నాటిది. దానిలో ఆయన యిలాటి సమస్యే చూపించారు. హరిజనుల చెరువు పాడయిపోతుంది. నీళ్లకోసం అగ్రవర్ణాల వారి చెరువుకి వెళితే వాళ్లు రానివ్వరు. గ్రామంలో గొడవ జరుగుతుంది.

చివరకు హరిజనులు ముస్లిములుగా మారతారు ఎందుకంటే హిందూ హరిజనులైతే చెరువు ముట్టుకోకూడదు కానీ ముస్లిములైతే ముట్టుకోవచ్చు. వాళ్లు ముస్లిములుగా మారిన తర్వాత ముస్లిములు వాళ్లకు అండగా నిలుస్తారు. దెబ్బకి అగ్రవర్ణాల వారు నోరుమూస్తారు.

ఇదీ ఆనాటి పరిస్థితి. అందువలన అంబేడ్కర్ తన అనుయాయులైన దళితులను యిస్లాంలోకి తీసుకెళదామనుకున్నాడు. కానీ అంబేడ్కర్‌కే యిస్లాంపై అభ్యంతరాలున్నాయి. అందువలన వాళ్లను బౌద్ధం లోకి తీసుకెళ్లాడు. బౌద్ధం అయితే సన్యాసులవడం, అదీ వుంటుంది. అందుకని అవేమీ లేకుండా నవబౌద్ధం అని పేరు పెట్టి ఆ మతంలోకి మారాడు. మార్చాడు. అంబేడ్కర్ అనుయాయులను నియో–బుద్ధిస్టులంటారు.

అంబేడ్కర్ దళితులను యిలా హిందూమతంలోంచి తరలించుకుని పోవడం ఆనాటి హిందూ నాయకులను కలవరపెట్టింది. అందుకే దళిత రిజర్వేషన్లను ప్రవేశపెట్టారు. హిందూమతంలోనే వుండిపోయే దళితులకు యీ రిజర్వేషన్ సౌకర్యాలు వర్తింపజేశారు. ఇతరమతాల్లోకి మారితే రిజర్వేషన్ సౌకర్యాలు పోతాయనే భయంతో చాలామంది హిందూమతంలోనే వుండిపోయారు. అయినా క్రైస్తవం వ్యాప్తి చెందుతూనే వచ్చింది. మతాంతీకరణలు సాగుతూనే వచ్చాయి.

గత 30 యేళ్లగా క్రైస్తవ దళితులు ఆందోళనలు చేస్తున్నారు. క్రైస్తవంలోకి మారినా మా సాంఘిక స్థితి మారలేదు కాబట్టి మాకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయాలి అని. ప్రభుత్వం యింకా వారి డిమాండ్‌ను మన్నించలేదు. బిసిలుగా చూస్తుంది. హిందువులుగా వున్నపుడే వారిని మాలలనీ, మాదిగలనీ వ్యవహరించడం, చిన్నచూపు చూడడం జరుగుతోంది కాబట్టి రిజర్వేషన్లు యిచ్చాం. క్రైస్తవులయిన తర్వాత కులం ఎక్కడుంది? చిన్నచూపు చూడడమెక్కడ వుంది? అని లాజిక్.

ఇదంతా ఎందుకు చెప్పానంటే కులం ట్యాగ్ వదల్చుకోవాలంటే వేరేమతంలోకి మారాల్సిందే. అక్కడికి వెళ్లాక కూడా యీ ట్యాగ్

పట్టుకుని వేళ్లాడతానంటే అర్థరహితం. దళిత క్రిస్టియన్లు రిజర్వేషన్ల కోసం కులం ట్యాగ్ వదలనంటూ వుంటే క్రిస్టియన్ రెడ్లు సాంఘిక హెూదా కోసం వదలకపోవచ్చు. కానీ వారు కేథలిక్స్ అయితే వాటికన్‌కి రాసి కులం అనేది క్రైస్తవంలో వుందని నిర్ధారించుకోవడం మంచిది. అది నాకు తెలియపరిస్తే నా వాదన తప్పని నేను ఒప్పుకుంటాను.

ఇక రెడ్డి పేరు పెట్టుకోవడమంటారా? అది వాళ్ల యిష్టం. సంజీవరెడ్డిగారి మీద అభిమానం కొద్దీ వేరే కులానికి చెందిన ఆయన అనుయాయుడు తన కొడుక్కి సంజీవరెడ్డి అని పెట్టుకున్నాడు. అంతమాత్రం చేత ఆ సంజీవరెడ్డిగారు రెడ్డి కులస్తుడవడు. కృష్ణా జిల్లాలో బోల్డుమంది చటర్జీలు, బెనర్జీలు కనబడతారు. వాళ్లు బెంగాలీలు కారు. ఇంకో తమాషా చూశారా? వైయస్ అల్లుడు బ్రాహ్మడని విన్నాను. ఆయన బ్రదర్ అనిల్ శర్మ అనో, జాన్ అనిల్ దీక్షితులు అనో పెట్టుకోవడం లేదు. ఇంకో మాట కూడా – రాజశేఖరరెడ్డి అన్న పేరు జార్జి రెడ్డి. ఈయన పేరు హిందూ పేరులా కనబడే రాజశేఖర్. తరచిచూస్తే అది హిందూ దేవుడి పేరు కాదు. సంస్కృతం పేరంతే. అలాగే జగన్మోహన్. అదీ అలాటిదే. జార్జి వెంకటాచలపతి రెడ్డి అని కనబడితేనే మనం వులిక్కిపడాలి.

వైయస్ జగన్ క్రైస్తవుడు అనేది నిర్వివాదాంశం. అన్యమతస్థులు తిరుమల గుడిలోకి వెళ్లినపుడు సంతకం చేయవలసిన రిజిస్టర్‌లో సంతకం చేయలేదని బిజెపి ఎత్తి చూపుతోంది. ఆయన క్రైస్తవుడే కానీ కులం రెడ్డి అని వాదించేవారు కూడా ఓ విషయం ఒప్పుకోవాలి. ముస్లిములతోబాటు క్రైస్తవులు మైనారిటీల క్రింద వస్తారు. జగన్ క్రైస్తవుడు. అందువలన ఈనాడు ఎంపీ జాబితాలో జగన్ పేరు మైనారిటీగా కనబడి తీరాలి. వేరే చోట కనబడితే తప్పు.

ఇక దీనిపై నేను విడివిడిగా సమాధానాలు యివ్వడం లేదు. ఈ విషయంపై యింకెవ్వరూ మెయిల్స్ రాయనవసరం లేదని ప్రార్థన. ఇక జూనియర్ విషయం వచ్చే వ్యాసంలో రాస్తాను. ఈ లోపున యింకో విషయం రాస్తాను. నా వ్యాసాలు చదివి కొందరు అడిగారు – అది సరే, గురువుగారూ యింతకీ మీదే కులం? అని. అది అప్రస్తుతం.

నేను గాంధీగారిని మెచ్చుకుంటే రాస్తే గుజరాతీ వైశ్యుణ్ని అయిపోను. ఐన్‌స్టీన్ మెచ్చుకుంటూ రాస్తే జర్మన్ జ్యూని అయిపోను. నన్ను కాదు, నా రాతలను చూడమని ప్రార్థన. నా కులం, ప్రాంతం ఏదైనా సరే, నేను రాసేదానిలో సబబు వుందా లేదా అన్నదే చూడాలి మీరు. బేసబబుగా తోచినది సూచించండి. ఎత్తి చూపండి. పొరబాటైతే సవరించుకుంటాను.

నేను నా కులం గురించి గానీ, భాష గురించి గానీ, ప్రాంతం గురించి గానీ – గొప్పగా ఫీలవను, కించపడను కూడా. మనం దేవుడితో బేరం పెట్టుకుని ఫలానా వూళ్లో, ఫలానా యింట పుట్టించు అని చెప్పుకుని రాలేదు. మన పుట్టుకను మనం యేక్సెప్ట్ చేయడంలోనే విజ్ఞత వుంది. అంతమాత్రాన మనం తప్ప తక్కినవాళ్లందరూ తక్కువన్న భావం పెట్టుకోవడం చాలా తప్పు. ముఖే ముఖే సరస్వతీ అన్నారు. అన్ని వర్గాలలో, అన్ని వర్ణాలలో ప్రతిభ వుంది. దానికి సమస్కరిద్దాం.

భాష విషయంలోనైనా అంతే! ప్రపంచభాషల్లో కన్నా ఉత్తమమైన భాష తెలుగు అని ఎవరైనా అన్నా నాకు ఫక్కున నవ్వు వస్తుంది. మీకెన్ని ప్రపంచభాషలు వచ్చు? అని అడుగుతాను. భాషలు రావాలి, వాటిలో సాహిత్యం తెలియాలి, సాహిత్యపు విలువలు బేరీజు వేయగలగాలి. అదేమీ తెలియకుండా వాగడం వాగాడంబరమే! గట్టిగా మాట్లాడితే మనకు తెలుగే సరిగ్గా రాదు. తక్కిన వాటి గురించి మనమేం మాట్లాడతాం? అందువలన నా గురించి వర్రీ కాకండి. అనేక సందర్భాల్లో నా కులంవారినే నేను విమర్శించాను. పైగా కష్టపడి నా కులం గురించి పరిశోధన చేయడానికి నేనంత గొప్పవాణ్నీ కాను. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: కమ్మల జనాభా శాతం ఎంత?

నేను జూనియర్ ఎన్టీయార్ గురించి రాస్తూ 'ఆయన సగం కమ్మ' అని రాయడం కొంతమందికి కోపం తెప్పించింది. 'తండ్రిది ఏ కులమైతే కొడుకుదీ అదే కులమని తెలియదా మూరు?డా?' అంటూ తిట్టేశారు.

ధృతరాష్ట్రుడు, పాండురాజులకు వ్యాసమహర్షి తండ్రి అనీ అంబిక, అంబాలిక తల్లులనీ తెలుసు కదా! మరి వారు బ్రాహ్మణులయ్యారా? క్షత్రియులయారా? అదే వ్యాసమహర్షికి అంబిక దాసియందు పుట్టిన విదురుడు శూద్రుడిగా మిగిలాడేం? ధృతరాష్ట్రుడు అంధుడై, పాండురాజు చచ్చిపోయినా విదురుణ్ని కాస్సేపైనా రాజుగా చేయలేదేం? అతను క్షత్రియుడు కాదు కాబట్టి! అక్కడ కులం తల్లిబట్టి వచ్చిందా? తండ్రి బట్టి వచ్చిందా?

భీముడి తల్లి కుంతి క్షత్రియ రాజకన్య. తండ్రి వాయుదేవుడు. అతణ్ని క్షత్రియుడే అన్నారు. దేవుడనలేదు. భీముడి వలన హిడింబికి ఘటోత్కచుడు పుడితే అతన్ని తల్లి కులం బట్టి రాక్షసుడే అన్నారు కానీ క్షత్రియుడనలేదు.

ఇలా వంద చెప్పగలను. బీజప్రధానంగా కొన్ని సందర్భాలలో, క్షేత్రప్రధానంగా కొన్ని సందర్భాలలో పరిగణించడం జరుగుతుంది. పితృస్వామ్య వ్యవస్థలో, మాతృస్వామ్య వ్యవస్థలో వేరేవేరే పద్ధతులుంటాయి. పుత్రులు ఎనిమిది రకాలు. ధర్మశాస్త్రాల గురించి యిప్పుడు చర్చ అనవసరం. ఇప్పుడున్న రాజ్యాంగం ప్రకారం చూసినా తండ్రి షెడ్యూల్ కాస్ట్ అయితేనే పిల్లలకు షెడ్యూల్ హెూదా వస్తోందా? లేదే!

ఏది ఏమైనా ఒక వ్యక్తి జన్మలో తల్లీ, తండ్రీ యిద్దరి ప్రస్తావన వుంటుంది. తల్లికి ఏ విలువా లేకుండా పోదు. మేట్రిమోనియల్ యాడ్స్‌లో కులాంతర వివాహం వలన పుట్టిన వారి విషయంలో 'మిక్సెడ్ పేరెంటేజ్' అని రాస్తారు తప్ప తండ్రి కులం ఒక్కటే

రాయరు. రాజీవ్ గాంధీ గురించి రాసేటప్పుడు జర్నలిస్టులు కూడా హాఫ్-పార్సీ అని రాస్తారు. అదే విధంగా రాహుల్ గాంధీ గురించి రాసినప్పుడు హాఫ్-ఇటాలియన్ అని రాస్తారు. తలిదండ్రులు వేర్వేరు జాతులైన ఒబామా విషయంలో హాఫ్-బ్లాక్ అనీ పూర్తి బ్లాక్ అధ్యక్షుడయ్యే రోజు రావలసివుందనీ అనలేదా? దీనిలో తప్పు పట్టవలసినది, నొచ్చుకోవలసినది ఏమీ లేదు.

నేను జూనియర్ ఎన్టీయార్ గురించి రాస్తూ 'సగం-కమ్మ' అని రాయడం ఇదే కోవలోకి వస్తుంది. జర్నలిస్టు పరిభాషలో యిది పూర్తిగా ఒప్పు. పైగా నేను అసందర్భంగా రాయలేదు కూడా. ఈ మాత్రం గ్రహించకుండా నన్ను బూతులు తిట్టినవారిది అజ్ఞానం, అవివేకం. జూనియర్‌ను నేను కించపరిస్తే నొచ్చుకోవచ్చు. నేనేమీ అతని గురించి తక్కువగా రాయలేదు. అతని నేపథ్యం వెలుగులోకి వచ్చినకొద్దీ అతనిపై గౌరవం పెరుగుతోంది తప్ప తరగటం లేదు.

ఇక కొంతమంది జూనియర్ తల్లి వివరాలు తెలుసా అని అడిగారు. నాకు తెలియదు. ఆవిడ ప్రైవేటు వ్యక్తి కాబట్టి, వార్తల్లోకి ఎక్కడానికి యిష్టపడని వ్యక్తి కాబట్టి ఆవిడ గురించి చర్చించడం భావ్యం కాదు. జూనియర్ కులప్రస్తావన వచ్చింది కాబట్టి ఒక సాంకేతిక విషయం చెప్పక తప్పదు. ఆవిడ కన్నడిగులనీ, మలయాళీ అనీ, బ్రాహ్మణులనీ, క్రైస్తవులనీ రకరకాలుగా విన్నాను. ఒకవేళ ఆవిడ మలయాళీ అయి మాతృస్వామ్య వ్యవస్థ పాటించే కులమైతే, జూనియర్‌కు ఆవిడ కులమే వస్తుంది తప్ప తండ్రిది రాదు!

ఇదే సందర్భంలో కమ్మల గురించి వ్యాసంలో నేను రాసిన 'జనాభాలో వీరి శాతం ఎంత వుంటుందంటారు? ఏ 3%యో వుండవచ్చు.' అన్న వాక్యానికి ఒకాయనకు కోపం వచ్చింది. 'జనాభాలో కమ్మల శాతం 4.8%. మీరు అనవసరంగా వాళ్లను చంపేయకండి' అంటూ ఓ స్టాటిస్టిక్స్ టేబుల్ పంపారు.

అది 1921 నాటిది. మద్రాసు రాష్ట్రంలోని కొన్ని తెలుగు జిల్లాలు (గంజాంతో సహా) నిజాం రాష్ట్రపు సెన్సస్ కలిపి ఓ పట్టిక వేశారు. తెలుగు జిల్లాల జనాభా సంఖ్య విడిగా యిచ్చారు కానీ తెలంగాణా జిల్లాలది విడిగా యివ్వలేదు. దాని ప్రకారం బ్రాహ్మణులు 3.0%, కాపులు 15.2%, కమ్మలు 4.8%, కోమటి 2.7%, క్షత్రియ 1.2%, వెలమ 3.0%. బ్యాక్‌వర్డ్‌లు (వీరిలో బలిజ, తెలగ కూడా వున్నారు) 46.1%, షెడ్యూల్ కులాలు 17.0%. ముస్లిం, క్రైస్తవులు - 7%

దాన్ని యిప్పటి పరిస్థితులకు అన్వయించడం కరక్టు కాదని నా అభిప్రాయం. 1) ఎందుకంటే గత 87 ఏళ్లలో ఫ్యామిలీ ప్లానింగ్ వేర్వేరు కులాల్లో, వేర్వేరు మతాలలో వేర్వేరు రకాలుగా అమలైంది. 2) మతాంతీకరణలు విస్తారంగా జరిగాయి. 3) రాష్ట్రంలో వుండే యితర జాతుల వారికి ఎక్కడా చోటివ్వలేదు. 4) రెడ్ల గురించి ప్రస్తావించలేదు. కాపుల్లో కలిపేశారేమో 5) షెడ్యూల్ తెగల వారిని లెక్కల్లోకి తీసుకోలేదు వారు 10% దాకా వుంటారు కదా. 6) గంజాం జిల్లా ఇప్పుడు మనరాష్ట్రంలో లేదు.

నేను ఓ సారి ఓ ఆర్టికల్‌లో కులాల శాతం గురించి అంచనా వేయడానికి ప్రయత్నించాను. కులాల ప్రకారం సెన్సస్ తీయలేదు కాబట్టి ఎవరి అంచనా వారే వేసేస్తున్నాం. తేడాపాడాలుంటే సూచించండి. నా లెక్క ప్రకారం ప్రస్తుతం మన రాష్ట్రంలో ముస్లిములు, క్రైస్తవులు యితర మైనారిటీలు కలిపి 15% వుంటారు. అంటే హిందువులు 85% వారిలో షెడ్యూల్ కాస్ట్, ట్రైబ్‌ల వాళ్లు 25% (అందుకేగా వారికి అంత రిజర్వేషన్ యిస్తున్నారు) అంటే వారు మొత్తం జనాభాలో 21.25% అన్నమాట (85%లో 25%).

అలాగే హిందువుల్లో బ్రాహ్మణులు 4% (మొత్తంలో 3.4%) క్షత్రియ 2%, వైశ్య 3%, కమ్మ 4%, వెలమ (ఓసి) 4%, శిష్టకరణాలు వగైరా 4%, కాపు (తెలగ, బలిజలతో సహా) 9%, రెడ్డి 9% ఇతరభాషీయులు (తమిళ, కన్నడ, మరాఠీ, గుజరాతీ, కాయస్థ, ఒరియా..) 2%, బిసిలు 35%. ఈ విధంగా చూస్తే కమ్మల జనాభా 85%లో 4% చొప్పున 3.4% తేలవచ్చు. ముందే చెప్పినట్టు యిది డిబేటబుల్. చర్చిద్దాం. పై విషయం సగం కమ్మపై మాత్రం నో డిస్కషన్ ప్లీజ్. **- ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: ఎవరు గెలుస్తారు?

మంచి యింట్రెస్టింగ్ టైటిల్ కదూ! సాధారణంగా వ్యాసకర్తలు యిలాటి హెడింగ్స్ పెట్టే మనల్ని మోసగిస్తారు. మనకు తెలిసున్నదే వివరంగా రాసి, చివరకి 'ఎవరు గెలిచారో మే 16 న తేల్తుంది' అనో 'అంతా వోటరు చేతిలో వుంది.' అనో ముగిస్తారు. వాళ్లకు ఏదో అభిజ్ఞవర్గాల వార్తలు తెలుసేమోనన్న ఆశతో మనం చచ్చీ చెడి చదివితే చివరకు యిదిగో యిలా సంపాదకీయంలా ముగిస్తారు.

అందుకని నేను ముందుగానే చెప్పేస్తున్నాను - నాకు ప్రత్యేక యింటెలిజెన్సు వర్గాలు ఎవరూ తెలియదు. నేను సర్వేలు ఏమీ చేయించలేదు. నాకు పెద్ద ముందుచూపూ లేదు. నేను గెలుస్తారనుకున్నవాళ్లు ఓడిపోవడం, ఓడిపోతారనుకున్నవాళ్లు గెలవడం అనేకసార్లు జరిగింది. 'మరింకెందుకు యీ సుత్తి చదవడం?' అనుకునేవాళ్లు యీ టాపిక్‌మీద వచ్చే రెండు, మూడు వ్యాసాలు స్కిప్ చేసేయండి. ఏదో సమీక్షించుకుంటున్నట్టుగా చెప్పే ధోరణి నచ్చితేనే చదవండి.

ఎవరు గెలుస్తారో మనకు భవిష్యత్తు ఎలా తెలుస్తుంది? కోట్లుఖర్చు పెట్టి జోస్యుల వెంట, సర్వేకారుల వెంట తిరిగే అభ్యర్థులకు, పార్టీ నాయకులకే తెలియదు. కానీ కామన్ సెన్స్‌తో ఆలోచిస్తాం కాబట్టి మనకు లీలగా తెలియవచ్చు. ఎందుకంటే మనం వాళ్లలా గెలిచితీరతామనే ఓ ఉధృతంలో పడి కొట్టుకుని పోము. నేలమీద నిలబడి ఆలోచిస్తాం.

అయితే మనకున్న పెద్ద సమస్య - సమాచార సేకరణ. సమాచారం ఎక్కణ్నుంచి వస్తుంది? పేపర్లనుండి, టీవీల నుండి, ఓటర్ల పిచ్చాపాటీ కబుర్లనుండి. పేపర్ల సంగతి చూడబోతే ''సాక్షి'' కాంగ్రెస్ వాళ్ల పేపరు. దానిలో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుంది అని

రాస్తే ఎలా నమ్మగలం? వాళ్లు యింకోలా రాయరు కదా! రాసేమాటయితే పేపరు పెట్టుకోవడం దేనికి?

ఇక 30 ఏళ్లగా ప్రజాభిప్రాయానికి ప్రతీకగా నిలిచిన ఈనాడు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటినుండి ఈనాడు సర్క్యులేషన్ పెంచుకోగలిగింది కానీ విశ్వసనీయత క్రమేపీ పోగొట్టుకుంది. ఈనాడులో వార్తలు ఎలా వస్తాయో కళ్లుమూసుకుని వూహించే స్థితి వచ్చేసింది. ముఖ్యంగా వైయస్ వచ్చిన దగ్గర్నుంచీ ఏకపక్షంగానే రాస్తోంది. అసలు 2004 ఎన్నికల్లో ఈనాడు చదివే చంద్రబాబు ఘనవిజయం సాధిస్తాడని నమ్మాను. ఊళ్లనుండి బాబు వీక్‌గా వున్నాడన్న వార్తలు వస్తూ వుంటే కొట్టి పారేశాను.

'వార్త'లో వైయస్ పాదయాత్ర వార్తలు వస్తూంటే వాళ్లూ, వాళ్లూ ఒకటే కదాని నమ్మలేదు. చివరకు టిడిపి 46 సీట్లతో తేలారు. 2009లో కూడా ఈనాడుకి కాంగ్రెస్‌లో ఒక్క మంచిలక్షణం కూడా కనబడటం లేదు. ఎన్నికలు ప్రారంభమైన దగ్గర్నుంచీ కాంగ్రెస్ పని అయిపోయిందనే రాసేస్తోంది ఈనాడు. ఇప్పటిదాకా ఒక్క నియోజకవర్గంలో నైనా కాంగ్రెస్ తప్పకుండా గెలుస్తుంది అని రాయలేదు.

ఆంధ్రజ్యోతి కూడా ఈనాడుకి సవతి సోదరుడిలాగానే నడుస్తుంది. తెలంగాణా వలపక్షం ఒకటి తోడైంది. వీళ్లూ కాంగ్రెస్ పని యింతటితో సరి అని రాశారు. ఒక్కసీటులోనూ గెలుస్తుందని రాయలేదు. కానీ మొదటి విడత ఎలక్షన్ తర్వాత ఫస్ట్ రౌండ్‌లో 40-60 అసెంబ్లీ 6-10 పార్లమెంటు సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ అనుకుంటోంది అని రాశారు. తమ వ్యాఖ్య ఏదీ జోడించలేదు.

నాకు హిందూ పేపరుపై చాలా గౌరవం వుండేది, చాలా బాలన్స్‌డ్ అని. కానీ ఎన్.రామ్ ఎడిటర్‌గా వచ్చిన తర్వాత అదీ పక్షపాత ధోరణే అవలంబిస్తోంది. పేపర్లే కాదు, టీవీల సంగతీ అంతే. సాక్షి టీవీ ఒక్కటీ తప్ప అందరూ కాంగ్రెస్‌ని తిట్టడమే. మహాకూటమిదే మహా విజయం అని రాయడమే. మీడియా యిలా వుంటే ఏం తెలుస్తుంది చెప్పండి. తెలంగాణా ఉపయెన్నికల సమయంలో ఫలితాలను సరిగ్గా ఊహించిన పత్రిక గానీ, టీవీ గాని ఒక్కటి వుందా? పార్టీల మాట ఎలావున్నా మీడియాకు విశ్వసనీయత పూర్తిగా అడుగంటింది.

ఇక చేయాల్సింది ఏమిటి? ప్రజలను అడగాలి. అసలు మనవాళ్లు ఎంత గడుసువాళ్లో తెలుసుకదా! ఏదైనా పల్లెటూరికి వెళ్లి కారాపి, ఎలా వుందయ్యా ఎలక్షన్ సీజను? అంటే వాడు పేపర్లలో చదివినదే మనకు అప్పచెప్తాడు – 'టిడిపి వస్తుందంటున్నారండి, చిరంజీవి రాడంటున్నారండి' అంటూ! ఎవరయ్యా చెప్పింది? అంటే మీలాటి చదువుకున్నవారండి అంటాడు. అందరి మాటా సరే, నువ్వు ఎవరికేస్తావ్ చెప్పు అంటే చూడాలండి, అందరూ ఎటుంటే అటే అంటాడు. ఎటున్నారు? అంటే అదే తెలవటం లేదండి. కొంతమంది అటంటున్నారు, కొంతమంది యిటంటున్నారు అంటాడు. ఇలా ఓ పావుగంట సేపు మాట్లాడినా విషయం బయటకు రాదు. స్పష్టంగా తేల్చడు. తేలిస్తే ఏం హానో అని అతనికి భయం. మనం ఎవరో, ఎవరికి యీ వార్త చేరేస్తామో, ఎందుకొచ్చిన ముప్పు. అమాయకుడిగా నటిస్తే పోలా? అని వాళ్ల వ్యూహం.

ఇలాటి వాళ్లతో చేసిన సర్వే ఫలితాలు పట్టుకుని మనం అంచనాలు వేయడమూ పొరబాటే. అందుకే పెద్ద పెద్ద సెఫాలజిస్టులు కూడా పప్పులో కాలేస్తారు. ఇండియా టుడే పుట్టిననాటినుండీ చూస్తున్నాను. ఫలితాల ఎనాలిసిస్ గురించి వాళ్లు రాసే ప్రతీ అక్షరం చదివాను. నాకు కంటిచూపు తగ్గింది కానీ ముందుచూపు పెరగలేదు. నాదే కాదు, వాళ్లదీ పెరగలేదు. వాళ్ల అంచనాలూ తప్పుతూనే వున్నాయి.

ఇలా అనుకుని మనం కాళ్లు చాచుకుని కూర్చోలేం కదా. ఏదో ఒకటి వాగి, తలకాయ రోట్లో పెడతాం. అదో మజా, ఓ గేమ్. మన వూహలు తప్పిపోవచ్చు. అంతమాత్రాన తలకాయకు పని చెప్పకుండా వుంటామా? పార్టీల వారీగా చెప్పుకుంటూ వస్తా.

బిజెపి – అసెంబ్లీ ఎన్నికల విషయంలో బొత్తిగా సోదిలోకి లేకుండా పోయిన పార్టీ బిజెపి అయింది. మీడియా లోక్‌సత్తానైనా పట్టించుకుంది కానీ బిజెపి వునికినే విస్మరించింది. 2004 ఎన్నికలతో పోలిస్తే ఎంత తేడా? అప్పుడు ఇండియా షైనింగ్ అంటూ హడావుడి చేయడం, దానిపై తర్జనభర్జనలు. టిడిపితో పొత్తు. ...ఒకటా? రెండా? బోల్డంత హంగామా. ఇవాళ బిజెపి టిక్కెట్టు అడిగేవాడూ లేడు. ఇవ్వలేదని అలిగే అసంతృప్తులూ లేరు.

2

పక్కనున్న కర్ణాటకలో అసెంబ్లీ గెలిచారు కదా. సరిహద్దు నియోజకవర్గాల్లోనైనా ప్రభావం వుండి తీరాలి. అదీ లేదు. తెలంగాణా యిచ్చేస్తాం, 100 రోజుల్లో యిస్తాం, రాష్ట్రాలు ముక్కలు చేయడంలో మమ్మల్ని మించినవారు లేరు అన్న స్లోగన్ తప్ప వారు వేరే నినాదం పట్టుకోలేదు. దీని పర్యవసానం కోస్తా, సీమల్లో ఎలా వుంటుందన్న ఆలోచనా లేదు. తెలంగాణా ఒక్కటే వారికి ముఖ్యం అన్న రీతిలో ప్రవర్తించారు. తెలంగాణా గురించి స్పష్టంగా, నిర్ద్వంద్వంగా మాట్లాడే ఏకైక జాతీయ పార్టీ కదా, పోనీ రాష్ట్రాన్ని ఎలా విడగొడతారో, హైదరాబాదుని ఏం చేస్తారో, ప్రాజెక్టులు ఏం చేస్తారో స్పష్టంగా చెప్పారా? అదీ లేదు. ఆంధ్ర, సీమలకు నష్టపరిహారంగా యింత యిస్తామని హామీలిచ్చారా? లేదు. స్విస్ బ్యాంకులనుండి డబ్బు తెస్తామని చెప్పి భలే వినోదం కలిగించారు. (దానిపై వేరే ఆర్టికల్ రాయాలి)

ఏతా??వాతా బిజెపికి 5,6 అసెంబ్లీ స్థానాలు వస్తే వాళ్లే ఆశ్చర్యపడతారేమో! అదీ లోకల్ కాండిడేట్ పార్టీని బట్టి. అనేక

రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పరచి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి నువ్వా? నేనా? అని కాంగ్రెస్‌తో పోటీ పడే స్థాయిలో వున్న వున్న పార్టీ రాష్ట్రంలో యీ దుస్థితిలో వుండడానికి కారణం – స్థానిక నాయకుల హ్రస్వద ృష్టి. తెలంగాణాను దాటి వారి చూపు సాగకపోవడం. తెలంగాణా ఏర్పాటు ఒక్కటే అన్ని సమస్యలకూ పరిష్కారం అన్నట్టు ప్రవర్తించడం.

లోక్‌సత్తా – జెపి గారి గురించి నా అభిప్రాయాలు యిదివరకే రాశా. విజ్ఞాన్ రత్తయ్యగారిని పార్టీలో చేర్చుకుంటూనే టిక్కెట్టు చేతిలో పెట్టడంతో జెపిగారిపై నా అభిప్రాయం మరింత తగ్గింది. రత్తయ్యగారు లోక్‌సత్తా గురించి వినని మనిషి కాదు, లోక్‌సత్తాకు ఆయన సహాయ సహకారాలు అందించినట్టుగా ఏమీ చెప్పుకోలేదు. ఎన్నికల సమయంలోనే పార్టీకి రావడమేమిటి? ఈయన ఒప్పుకోవడమేమిటి? ఆయనే కాదు, ఆఖరి నిమిషంలో ఎంతోమందికి పార్టీ టిక్కెట్టు యివ్వడం జరిగింది. ఇది సరైన పద్ధతి కాదని అని ఒప్పుకుంటూనే జెపిగారూ తక్కిన పార్టీల్లాగానే చేశారు. ఇక తేడా ఏముంది? ఆఖరి నిమిషంలో పార్టీలోకి వచ్చినవారి గుణగణాలేమిటో జెపిగారికే తెలియవు. మనని ఏం కన్విన్స్ చేస్తారు? జెపిగారికే తెలియవు. మనని ఏం కన్విన్స్ చేస్తారు?

హంగ్ ఎసెంబ్లీ ఏర్పడిన పక్షంలో యీ మహానుభావులు అమ్ముడు పోయినా అమ్ముడు పోవచ్చేమో. ఉద్యమంలో కనీసం ఐదారేళ్లు చేసినవారికి తప్ప టిక్కెట్టు యివ్వకుండా వుంటే బాగుండేదని నా అభిప్రాయం. ఇలాటి సలహాలు ఎన్నయినా చెప్పవచ్చు. కానీ ప్రాక్టికల్‌గా రాజకీయాల్లోకి దిగిన తర్వాత యీ సిద్ధాంతాలేమీ నడవవు. జెపి గారు కానీయండి, మరొకరు కానీయండి, రాజకీయాల క్రీడాప్రాంగణంలోకి దిగాక అక్కడి ఆట పద్ధతులలోనే ఆడాలి. అందుకనే ఆయనా ఐదేళ్లలో ఐదులక్షల వుద్యోగాలన్నాడు. స్విస్ బ్యాంకుల నుండి డబ్బు తెప్పిస్తానంటున్నాడు.

ఇక వాళ్ల గెలుపు అవకాశాలు ఎలా వుంటాయంటారు? జెపి యీసారి ముఖ్యమంత్రి అవరని అందరికీ తెలుసు. కానీ ప్రస్తుత విధానాలతో విసిగిపోయి, ఇప్పుడున్న వారికి బుద్ధి చెప్పాలన్న వుద్దేశంతో కొందరు లోక్‌సత్తాకు ఓటేయవచ్చు. కాండిడేట్ ఎవరో తెలియకపోయినా, జెపి గారి మొహం చూసి ఓట్లేయవచ్చు. ఈసారి మొదటి విడితలో ఓటింగ్ 70% దాకా జరిగింది. అంటే మధ్యతరగతివాళ్లు గడప దాటి వచ్చి ఓట్లేశారన్నమాట. ఇది లోక్‌సత్తాకు ఉపయోగపడుతుందని అనుకోవచ్చా? (వింతగా కూకట్‌పల్లిలో 52% ఓటింగే! ఓటుహక్కు వినియోగించుకోండోహో అని చాటి చెప్పిన జెపిగారి నియోజకవర్గ ప్రజలే యిలా తేలారు) ఇక్కడో విషయం చెప్తాను.

మా నాన్నగారు కాంగ్రెస్‌కు బద్ధవిరోధి. ప్రకాశం గారు స్థాపించిన ప్రజాపార్టీలో ఆయన చురుకైన కార్యకర్త. మా వూరి మునిసిపాలిటీ ప్రజాపార్టీ చేతిలో వున్నపుడు ఆల్డర్‌మెన్‌గా కూడా చేశారు. వాళ్ల మామగారిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. శుద్ధ కాంగ్రెస్ వాది, ఖద్దరువాది ఎట్సెట్రా. ఓ సారి ఎసెంబ్లీ ఎలక్షన్‌లో ప్రజాపార్టీ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి యిద్దరూ నిలబడ్డారు.

మా బాబాయ్ మా యింట్లోనే వుండేవాడు. ఓటు హక్కులేని పిల్లవాణ్ని కాబట్టి నాకు మహా వుబలాటంగా వుండేది. 'బాబాయ్, నాన్న చెప్పినట్టు ప్రజాపార్టీకే ఓటేశావా?' అన్నాను. 'లేదు, వాడెలాగూ నెగ్గడు, అందుకని కాంగ్రెస్‌కే వేశా' అన్నాడు తను. నేను కొయ్యబారిపోయి 'వాడు మంచివాడని నాన్న చెప్పాడుగా' అన్నాను. 'మంచివాడయితే మనకేంటి? మన ఓటుకి వేల్యూ వుండాలి. ఓడిపోయేవాడికి వేస్తే ఓటు వేస్టయినట్టే' అని వాదించాడు బాబాయి.

ఇలాటివాళ్లు నాకు జీవితంలో చాలామంది తారసపడ్డారు. ఓటంటే మన అభిప్రాయం తెలిపే సాధనం అని గాక, అది గెలిచేవాడికి వేస్తేనే సార్థకత అని భావించేవాళ్లు కోకొల్లలు. సర్వేలలో 'ఏం చెప్పలేం' అనే కేటగిరీ వుంటుంది చూశారా? వాళ్లే తటస్థ ఓటర్లు. వాళ్లే ఎప్పుడూ కొంపముంచేది. వీళ్లకు యిష్టాయిష్టాలుండవు. ఎవరు నెగ్గుతారనిపిస్తే వాళ్ల వైపు వేసి వాళ్ల ఓటు సద్వినియోగం అయినట్టు సంతోషిస్తారు వీళ్లు. వీళ్లను ద ృష్టిలో పెట్టుకునే 'ఇదిగో నెగ్గేస్తున్నాం, అదిగో నెగ్గేస్తున్నాం. 292 ఖాయం.., 234కు తగ్గే ప్రశ్నే లేదు..., మే 16 తర్వాత పునర్దర్శనం సెక్రటేరియట్‌లోనే...' వంటి స్టేటుమెంట్లు గుప్పిస్తారు నాయకులు.

లోక్‌సత్తా ఎలాగూ అధికారంలోకి రాదన్న విషయం చిన్నపిల్లవాడికి కూడా తెలుసు. ఎక్కువలో ఎక్కువ వాళ్లు చేయగలిగేది ఏమిటి? అసెంబ్లీలో ప్రజావాణిని వినిపిస్తారు. కానీ అసెంబ్లీ నడిచినప్పటి మాట కదా! అసెంబ్లీ పెట్టేది తక్కువ. దానిలో నన్ను ముందు మాట్లాడనివ్వాలి, నన్ను ముందు మాట్లాడనివ్వాలి అని కొట్టుకుని ఎవరూ మాట్లాడకుండా సభ వాయిదా వేయించడం ఎక్కువ. ఇక వీళ్లు చేయగలిగేదేముంది? ఈ ఆలోచనలో వున్న ప్రజలు ఓట్లేస్తారా? అన్నదే నా సందేహం.

అందువలన లోకసత్తాకు మొత్తం మీద 2–3% ఓట్ల కంటె, 2,3 సీట్ల కంటె ఎక్కువ రాకపోవచ్చని నా అంచనా. ఎన్నికల్లో చాలా తమాషాలు జరుగుతూంటాయి. జెపి స్వయంగా గెలవకుండా ఆయన పార్టీలోని అనామకులు యిద్దరు ముగ్గురు గెలిచినా ఆశ్చర్యపడనక్కరలేదు. వాళ్లయినా జెపి గారి వాగ్ధాటి అలవరుచుకుని అసెంబ్లీలో ప్రజావాణిని వినిపిస్తారని ఆశిద్దాం.

3

తెరాస – ఈ ఎన్నికల్లో తెరాసకు చాలా గుర్తింపు వచ్చింది అనడం కంటె కెసియార్‌కు వచ్చింది అనడం సబబు. ఉపయెన్నికల తర్వాత సగం సీట్లు పోగొట్టుకుని ఎవరూ పట్టించుకోరన్న కెసియార్ నిజానికి యీ ఎన్నికలలో కేంద్రబిందువుగా మారారు. కాంగ్రెస్, టిడిపి, పీఆర్పీల మధ్య త్రిముఖపోటీ ఏర్పడింది కాబట్టి తెరాసకు వున్న వోట్‌బ్యాంక్ వలన 30, 40 సీట్లు అదనంగా తెచ్చుకోగలమని

టిడిపి, పీ ఆర్పీ తెరాసతో సఖ్యానికి పోటీ పడ్డాయి. కానీ కెసియార్ కాంగ్రెస్‌తో జట్టుకి ఉవ్విళ్లూరారు. ఢిల్లీనుండి పిలుపు వస్తోందని చెప్పుకున్నారు.

కాంగ్రెస్‌లో ఆయన మిత్రులున్నారు. హంగ్ అసెంబ్లీ ఏర్పడి, తెరాస పొత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పరచవలసి వచ్చిన పరిస్థితిలో కెసియార్ వైయస్‌ను ముఖ్యమంత్రిగా ఆమోదించరనీ, తనని సమర్థిస్తారని డియస్ ఆశపెట్టుకుని వుండవచ్చు. 2004లో యిలాటి ఆశతోనే వైయస్ మెదలు వంచి తెరాసతో పొత్తుకు వొప్పించారు. వాళ్ల బలానికంటె ఎక్కువ సీట్లు యిచ్చారు. కానీ కాంగ్రెస్ ఘనవిజయం సాధించి డియస్ ఆశలు చల్లారాయి. 2009లో కూడా యిలాటిది ఏర్పడితే బాగుండునని ఆశించారు.

కానీ ఐదేళ్లలో పరిస్థితి మారింది. వైయస్ ముఖ్యమంత్రిగా స్థిరపడ్డారు. పైగా సోనియా ఇందిరా గాంధీ వంటి నాయకురాలు కాదు. ఇందిరా గాంధీ తను తప్ప దేశం మొత్తం మీద నాయకుడనే వాడు లేకుండా చేసిన వ్యక్తి. ఎవడైనా సిఎంగా బలపడుతున్నాడంటే వైయస్ వంటి అసమ్మతివాదిని దువ్వేది. అంతే అనుక్షణం ముఖ్యమంత్రికి తలనొప్పే. ఒకవేళ అసమ్మతివాదితో రాజీపడితే ఆ ముఖ్యమంత్రిని తీసేసి మరోణ్ని పెట్టేది. ఆ మహాతల్లి పుణ్యమే, మనకు గత పాతికేళ్లగా జాతీయ నాయకుడంటూ లేకుండా పోయాడు. అందరూ ప్రాంతీయ నాయకులే! సోనియా పద్ధతి వేరు. మినిమమ్ గవర్నెన్స్. ఒకడి చేతిలో అధికారం పెట్టడం. వాడు మరీ చెడగొట్టేదాకా సాగనీయడం. ఆవిడకి పెద్దగా రాజకీయాలూ తెలియవు. రాజకీయక్రీడలో ఆసక్తీ లేదు. ఏదో పని నడిచిపోతూ వుంటే చాలు. వైయస్ ఆ పనులు చేసిపెడుతున్నారు. వైయస్‌ను దింపేసి ఆ స్థానంలో నన్ను కూర్చోపెడితే యింకా ఆర్జించి పెడతాననే వాళ్లు వుండవచ్చు. అదో తలకాయనొప్పి. నడుస్తోంది కదా! నడవనీ.

ఇది వైయస్‌కు కలిసివచ్చింది. ఆంధ్రప్రదేశ్ సంగతి నాకు వదిలేయండి, నేను చూసుకుంటా అని వుంటాడు. నా వద్ద బ్రహ్మాస్త్రం వుంది కదా అని వుంటాడు. ఆ బ్రహ్మాస్త్రమేమిటో మొన్న బయటపడింది. తెలంగాణాలో ఎన్నికలు అయిపోతూనే, కోస్తా, సీమ వాసుల్లో హైదరాబాదు గురించి, ప్రాజెక్టుల గురించి భయాలు రేకెత్తించడం. ఆ విధంగా ప్రత్యర్థులను డిఫెన్సులోకి నెట్టడం. తెలంగాణా బూచితో రెండో రౌండ్‌లో ఓట్లు కొల్లగొట్టడం.

నిజానికి వైయస్ లేవనెత్తిన అంశాలు బూచి కాదు, చాలా ముఖ్యమైన అంశాలు. రాష్ట్రవాసులందరి తలలో మెదలుతున్న సంశయాలే! ఏ పార్టీ కూడా వాటిని డైరక్టుగా అడ్రస్ చేయకుండా దోబూచులాడుతూ వచ్చింది. రోశయ్య కమిటీ వేసినప్పుడే వైయస్ వీటిపై తను ఆలోచించే విధానం చాటుకున్నారు. ఎటొచ్చీ ఆ రోశయ్య కమిటీ ఐదేళ్లు లేటుగా వేయడంలోనే కనబడుతోంది మోసం.

కాంగ్రెస్ తెలంగాణా విషయంలోనే జనాలందరికీ కళ్లకు గంతలు కట్టింది. రెండో ఎస్సార్సీకి తెరాస నొప్పిస్తూ ఎగ్రిమెంటు రాయించుకుని, దాన్ని బయటపెట్టకుండా 2004 ఎన్నికల్లో నాటకమాడేసి, ఆ తర్వాత ఎప్రాప్రియేట్ టైమ్‌లో కాన్సెన్సస్ అని కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో రాసి, మాటల గారడీతో ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా ఐదేళ్లపాటు కథ నడిపించేసింది. 2007 జనవరిలో వైయస్ ధైర్యంగా తెలంగాణా యీ టెర్మ్‌లో రాదు అని చెప్పేసి సమైక్యవాదులకు ఛాంపియన్‌గా అవతారమెత్తారు.

కాంగ్రెస్‌లో సోకాల్డ్ సీనియర్లు మీడియాలో మాట్లాడడమే తప్ప ప్రజల్లోకి వెళ్లి వారి భావాలకు అనుగుణంగా జనసమీకరణ చేసిన పాపాన పోలేదు. వారి మాటలకు వినోదానికి పనికి వచ్చాయి తప్ప వేరెందుకూ కాదు. కెసియార్ మాట్లాడిన అవకతవక మాటలు యిప్పుడు మహాకూటమికి కాలకూటవిషం అయ్యాయి. మింగలేరు, కక్కలేరు. వారిని యీ పరిస్థితికి నెట్టిన ఘనత వైయస్‌దే.

ఇప్పుడు వైయస్ చేసిన పని 2004లో చంద్రబాబు చేసి వుండాల్సింది. కాంగ్రెస్, తెరాస గెలిస్తే కోస్తా, సీమవాసుల కష్టాలు పడతారని హైలైట్ చేసి వుండాల్సింది. కానీ అప్పుడు బాబు ఫోకస్ అంతా నక్సలైట్లను అణచడం మీదనే వుంది. రక్తాలు ఓడుతున్న చొక్కాతో పోస్టర్లు. సాక్షాత్తూ ముఖ్యమంత్రిమీదనే దాడి చేసిన నక్సలిజాన్ని సమూలంగా నాశనం చేయడానికి యింకో ఐదేళ్లు అధికారం యివ్వండి అని ఆయన స్లోగన్.

దాదాపు 200 సీట్లున్నపుడే అణచలేకపోయావు, ఇంకా ఎన్ని సీట్లు కావాలేం? అని జనాలు విసుక్కున్నారు. (తమాషా చూడండి, 2009 వచ్చేసరికి నక్సలిజం అసలు అంశమే కాకుండా పోయింది)

చెప్పవచ్చేదేమిటంటే బాబు యీ విషయం మీద అప్పుడు కాంగ్రెస్‌ను డిఫెన్సులోకి నెట్టలేదు. హైదరాబాదులో బాబు కట్టించిన ఫ్లయిఓవర్లు చూసి ముచ్చటపడి, బాబు మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్న నేను కోస్తా జిల్లాల్లో వున్న బంధువులతో లబలబలాడాను – 'కాంగ్రెస్‌కు వూపుందంటున్నారు. ప్రత్యేక తెలంగాణా యిచ్చేస్తుందని, హైదరాబాదు సమస్యల కేంద్రంగా తయారవుతుందనీ మీ దగ్గర భయం లేదా?' అని. వాళ్లు పకపక నవ్వి 'కాంగ్రెస్ ఎప్పుడైనా ఏ రాష్ట్రాన్నైనా చీల్చిందా? పంజాబ్, హరియాణా విడగొట్టి నాలుగు దశాబ్దాలవుతున్నా రాజధాని ఎవరికీ యివ్వకుండా లాక్కువస్తోంది. ప్రత్యేకరాష్ట్రం సమస్యే కాదు.' అన్నారు.

4

తమాషా ఏమిటంటే ఈ పాటి ఆలోచన కూడా కెసియార్‌కు రాలేదు. కాంగ్రెస్‌ను నమ్మామన్నారు. సోనియా దేవత అన్నారు. మూణ్నెల్లన్నారు, ఆర్నెల్లన్నారు. అదిగో పులి, యిదిగో తోక అన్నారు. ఇదంతా డ్రామా అని తర్వాత బయటపడ్డాయి. రెండో

ఎస్సార్సీకి ఒప్పుకుని నరేంద్ర చేత సంతకాలు పెట్టించిన పెద్దమనిషి కెసియార్. అసలు సంగతి తెలిసికూడా తెలంగాణా విషయంలో జనాలను ఏమార్చడంలో కాంగ్రెస్‌తో కలిసి ఆటలాడినవాడు. పైగా కెసియార్ పరిణతి చెందిన రాజకీయవాదిగా ఎదగలేదు. పార్టీ నిర్మాణాన్ని విస్మరించారు. నాలుగు జిల్లాలను దాటి విస్తరించలేదు. చక్కటి వక్తయే కానీ జనాల వద్దకు వెళ్లి, రోడ్‌షోలు చేసే ఓపిక ఆయనకు లేదు. లాబీయింగ్‌నే నమ్ముకున్నారు. కుటుంబపాలన, కార్యకర్తలను దూరం చేసుకోవడం, నోటి దురుసుతనం – ఒకటికాదు, రాజకీయ చతురుడికి వుండకూడని లక్షణాలన్నీ వున్నాయి.

పైగా రాజకీయంగా చాలా తప్పటడుగులు వేశారు. తెలంగాణాపై యితనికి చిత్తశుద్ధి లేదు అని తనను సమర్థిస్తూ వచ్చిన మేధావులకే సందేహాలు వచ్చేటంతగా ప్రవర్తించారు. కలిసి నడిచినవారందరూ దూరమయ్యారు. ఉద్యమం బలహీనపడింది. అయినా సెంటిమెంటు సజీవంగానే వుందని కొందరి అంచనా.

సరైన నాయకుడుంటే ఆ సెంటిమెంటును పండించుకోవచ్చని అంచనా వేశారు కొందరు టిడిపి నాయకులు. దేవేందర్ గౌడ్ బయటకు వచ్చారు. పార్టీ పెట్టి నవ్వులపాలయ్యారు. నవంబరు 2 నుండి వాహనాల రిజిస్ట్రేషన్‌లో ఎపి బదులు టిజి రాస్తాననడంతోనే ఆయన హుందాతనం పోయింది. ( ఇంతకీ ఇప్పుడు ఆయన కారుకి 'ఎపి' అని వుందా? టిజి అని వుందా?)

దేవేందర్‌ను వదుల్చుకున్న బాబు తన పార్టీలోని తెలంగాణా నాయకుల కోరిక మన్నించి సెంటిమెంటు, తెలంగాణాలో తన స్ట్రాంగ్ క్యాడర్ కలిపి సిక్సర్ కొడదామనుకున్నారు. గతంలో తెరాసతో పొత్తు పెట్టుకోమని డియస్, కాకా కాంగ్రెస్‌పై వత్తిడి తెచ్చినట్టే, యిప్పుడు టిడిపిలోని నాయకులు బాబుపై వొత్తిడి తెచ్చారు. వైయస్ తెరాసను దూరంగా పెట్టారు, సరే మనం కలుపుకుంటే ఓట్లు చీలవనుకున్నారు బాబు. కమ్యూనిస్టులు కూడా ఒత్తిడి చేశారు. ఇక తప్పలేదు. మహాకూటమి ఏర్పరచారు.

ఇక అక్కణ్నుంచి కెసియార్ బాబుతో ఆటలాడుకున్నారు. రాజకీయచాణక్యుడిగా బాబుకి వున్న పేరంతా మంట కలిపేట్లా ఆయన్ను ముప్పుతిప్పలు పెట్టారు. పొద్దున్న ఓ మాట, సాయంత్రం ఓ మాట.. రోజుల తరబడి కనబడకపోవడం... ఒక కాండిడేట్‌ను నిలబెడతానని చెప్పి మరొకరిని నిలబెట్టడం, ప్రజాజీవితంలో వుండే నాయకుడు చేయదగ్గ పనులు కావివి. వీటితో మహాకూటమి యిమేజి దెబ్బతింది. అత్యంత క్లిష్టమైన ఘట్టంలో పదిహేను రోజులు పోయాయి. కాంగ్రెస్‌కు చేజేతులా లీడ్ యిచ్చినట్టయింది.

ఈ గందరగోళానికి కారకుడు కెసియార్. స్వంత పార్టీ వ్యవహారాలే ఆయన చక్కబెట్టలేకపోయారు. తను ఎక్కడ పోటీ చేయాలో చివరిదాకా తేలలేదు. ఇదంతా వూరికేనే చేయలేదనే, కాంగ్రెస్‌కు మేలు చేయడానికే చేశారనీ పుకారులు వచ్చాయి. ఇలా డబుల్‌క్రాస్ చేస్తున్నారన్న ఆరోపణ రావడం నాయకుడికి గానీ, ఆ నాయకుడు నేతృత్వం వహిస్తున్న పార్టీకి మంచిది కాదు.

ఇంతకీ తెరాసకు వున్న వోట్‌బ్యాంక్ భద్రంగా వుందో లేదో ఎవరికీ తెలియదు. అది మహాకూటమిలో యితరులకు ట్రాన్స్‌ఫర్ అవుతుందో లేదో, వాళ్ల వోట్లు వీళ్లకు వస్తాయో రావో తెలియదు. ఎన్నికల్లో కూడా కెసియార్ తెలంగాణా కంటె నగదు బదిలీ పథకం గురించే ఎక్కువ మాట్లాడారు. మేధావులెవరూ కెసియార్‌కు అనుకూలంగా ప్రచారం చేయలేదు. తెలంగాణా వాదాన్ని సమాధి చేశాడంటూ నిరాశానిస్పృహల్లో కూరుకుపోయారు.

ఇలాటి ప్రతికూల పరిస్థితుల్లో, ఉద్యమం బలహీనపడి, నాయకుడు అప్రతిష్ట మూటగట్టుకున్న సందర్భంలో ఆ పార్టీకి 12-15 సీట్లకు మించి రాకపోవచ్చని నా వూహ. అదైనా మహాకూటమిలో యితర పార్టీల పొత్తు కారణంగానే రావాలి. తెరాస ఒంటరిగా పోటీ చేసి వుంటే 10కి మించి వచ్చేవే కావేమో!

పీఆర్పీ – చిరంజీవి పార్టీ పెట్టినపుడు నేను ఆయనకే ఓటేద్దామనుకున్నాను. ఎందుకంటే నాకు తొలినుంచీ కాంగ్రెస్ అంటే యిష్టం లేదు. చెప్పానుగా 1971లో ఒక్కసారే కాంగ్రెస్‌కు ఓటేశాను. మనదెప్పుడూ అపోజిషన్‌కే. ఏ స్టేట్‌లో వుంటే ఆ స్టేట్‌లో వున్న అపోజిషన్ పార్టీకి వేశాను. బిజెపి పాలసీలు నచ్చకపోయినా కేవలం కాంగ్రెస్‌మీద ద్వేషంతో ఓ సారి వాళ్లకు ఓటేశాను. ఆంధ్రకు తిరిగి వచ్చాక తెలుగుదేశం పార్టీ కనబడింది. వాళ్లకే ఓటేస్తూ వచ్చాను. 2004లో బాబు ఓడిపోయినప్పుడు రాష్ట్రప్రజలపై చాలా విసుగూ, చికాకూ వచ్చేశాయి.

అయితే బాబు ముఖ్యమంత్రిగా రాణించినట్టుగా ప్రతిపక్ష నాయకుడిగా రాణించలేదు. సంయమనం కోల్పోయేరు. నాకు రాజకీయాల వూహ తెలిసిన దగ్గర్నుంచీ వైయస్ అంటే – ఓ ఫ్యాక్షనిస్టు. ముఖ్యమంత్రిగా ఎవరున్నా సరే, వాళ్లను నిద్రపోనివ్వకుండా చేసి, సాధ్యమైనంత త్వరగా ఆ గద్దె నెక్కేద్దామని పన్నాగాలు పన్నే కుట్రదారు. టిడిపి అధికారంలో వుంటే రాయలసీమ వాదం లేవనెత్తిన ఉపప్రాంతీయవాది. ఇస్తే ముఖ్యమంత్రి పదవి యివ్వండి, లేదా ఏ మంత్రిపదవీ అక్కర్లేదంటూ దశాబ్దాల తరబడి అడ్మినిస్ట్రేషన్‌కి దూరంగా వున్న వ్యక్తి.

'మేం అధికారంలోకి వచ్చి వుచిత విద్యుత్ యిస్తాం. కరంటు బిల్లులు కట్టకండి' అని ప్రజలకు చెప్పిన అరాచకవాది. అటువంటి వ్యక్తిపై నాకు ఏ ఆశలూ లేవు. పాదయాత్ర చేసేడంటే నాకేమీ జాలి కలగలేదు. ఇలాటివి చాలామంది చేసారు. మాజీప్రధాని చంద్రశేఖర్ కూడా చేశాడు. వినోబా భావే యింకా ఎక్కువ నడిచాడు.నడిచినంతమాత్రాన బుద్ధిహీనులైన ప్రజలు పట్టం కట్టేశారే! అని నొచ్చుకున్నాను.

2004లో గద్దె నెక్కిన వైయస్ అలా అలా పడుతూ లేస్తూ, చూడకుండా జీవోలు సంతకాలు పెడుతూ బండి లాక్కుని వస్తూ వుంటే చంద్రబాబు హుందాగా అతణ్ని ఎదుర్కొంటాడనుకున్నాను. కానీ చంద్రబాబు చాలా నిరాశపరిచారు. అసెంబ్లీలో నిలదీయాల్సింది

పోయి, నడవకుండా చేసి కుయుక్తులు చేసినట్టు అనిపించింది. పైగా గత ఏడాదిగా ఎడాపెడా వాగ్దానాలు చేసి, అప్పటి బాబేనా యితను? అనిపించారు. పావలా వడ్డీ అని కాంగ్రెసంటే పదిపైసల వడ్డీ అంటున్నాడీయన. వైయస్ లాగనే బిల్లులు కట్టకండి, లోన్లు కట్టకండి, మేం మాఫీ చేస్తాం అంటున్నాడు. ఈ సారి బాబుకి వేయకూడదు అనుకున్నాను. అలాటి పరిస్థితిలో మూడో ప్రత్యామ్నాయంగా చిరు రంగంలోకి వచ్చారు.

5

ఈ వ్యాసపరంపరలో పీ ఆర్పీ గురించి యింకొంత చెప్పుకునేముందు ఓ పిడకలవేట. నా క్రిస్టియన్ రెడ్లు, కమ్మల జనాభా శాతం ఆర్టికల్స్ మాత్రం చదివి 'మీకింత కులద ృష్టి కూడదు' అంటూ హితబోధలు గుప్పించేస్తున్నారు చాలామంది. పూర్వాపరాలు తెలుసుకునేందుకు వాళ్లకు తీరికలేదు, ఆర్కయివ్స్‌లో నా అర్టికల్స్ పెట్టడం పనిఒత్తిడి వలన ఆలస్యమవుతోంది. అందువలన నేనేదో కులభావాల్ని ప్రచారం చేస్తున్నవాడిలా వాళ్లకు కనబడుతున్నానులాగుంది. 'సమాజానికి యిది అవసరమా?' అని అడుగుతున్నారు.

అయ్యా, అడగవలసినది మీడియా వారిని, 'ఫలానా సామాజికవర్గం వారి ఓట్లు యిన్ని వున్నాయి' అంటూ లెక్కలు వేసేవారిని, అసలు బిసిలు ఎందరు, నకలు బిసిలు ఎందరు అని బహిరంగచర్చలు చేసేవారిని. నేను నా కులనామధేయం ధరించలేదు, నా కులాన్ని నమ్ముకోనూ లేదు, అమ్ముకోనూ లేదు. నా ప్రతిభనే నమ్ముకున్నాను. నేను ఏ ప్రతిభావంతుడి గురించి రాసినా, వారి కులాన్ని ఎన్నడూ ప్రస్తావించలేదు. కావాలంటే నా పాత ఆర్టికల్స్ తీసి చూడండి.

ప్రస్తుత ఎలక్షన్లు కులప్రాతిపదకన జరుగుతున్నాయని మీడియా అంతా ఘోషిస్తోంది కాబట్టి, రాజకీయాల్లో రెడ్లు, కమ్మలు, కాపులు (వీరు మాత్రమే యిప్పుడు రెలవెంట్ కాబట్టి) రాసుకుని వచ్చాను. సందర్భవశంగా 'కొన్ని జిల్లాలలో కమ్మలు జూనియర్ ఎన్టీయార్‌ను సినిమాల్లో కమ్మ ఐకాన్‌గా చూస్తున్నారు, నిజానికి ఆయన సగం-కమ్మే అయినా..' అని రాశాను. జూనియర్ ఎన్టీయార్ నటనాప్రతిభ గురించి రాస్తూ కులప్రస్తావన తేలేదు. కమ్మలు అతనిపై ఓ స్టాంప్ వేయడం గురించి, సినిమాను, రాజకీయాలను మిళితం చేస్తున్నారని చెబుతూ చెప్పిన మాట అది.

దీనిలో తభావతు ఏదైనా వుంటే చెప్పండి. అంతే గానీ జూనియర్ కులం ఏదైతే నీకెందుకు అని అడిగితే ఎలా? ఆయన తల్లి కులం ఏదో తెలియదు, పట్టించుకోలేదు అని కూడా రాశాను. సగం-కమ్మ పదానికి రియాక్షన్ వచ్చింది కాబట్టి దానిలోని ఔచిత్యం గురించి చర్చించాను. ఇది గమనించండి. ఆ విషయంపై అయితే ఈ మెయిల్స్ పంపడం ఆపేయండి.

ఇక పీ ఆర్పీ కథలోకి వద్దాం. కాంగ్రెస్‌కి, టిడిపికి ఓటు వేయకూడదని నిశ్చయించుకున్న నాకు చిరు పార్టీతో ఆశ రగిలించింది. చిరుకి మంచివాడిగా యిమేజి వుంది, హుందాతనం వున్న మనిషి. ఆచితూచి అడుగులు వేస్తారు. డబ్బు బాగా వుంది కాబట్టి అవినీతికి పాల్పడవలసిన అవసరం లేదు. కెరిజ్మా వుంది కాబట్టి రాజకీయాల్లోకి వస్తే చేయవలసిన కొన్ని పనులు (అంటే అనవసరపు హామీలు యివ్వడం, అప్రతిష్ట పాలయిన వారిని పార్టీలో చేర్చుకోవడం, అవినీతితో రాజీ పడడం..) చేయనవసరం లేదు.

సరైన సలహాదారులుంటే ఎన్టీయార్ మొదటి దఫా పరిపాలనలా ఎన్నో మంచి పనులు చేయవచ్చు అనుకున్నాను. జెపి లాటి వారికి మంచి ఐడియాలు వుండవచ్చు. కానీ కెరిజ్మా లేదు కాబట్టి ఎన్నటికీ అధికారంలోకి రాలేరు. చిరంజీవికి కెరిజ్మా వుంది. వీళ్లిద్దరూ చేతులు కలిపితే చక్కటి ప్రత్యామ్నాయం ఏర్పడుతుంది అనుకున్నాను. (కానీ అది జరగలేదు)

నాగుబాబు చాలా డీసెంట్ ఫెలోలా అనిపిస్తారు నాకు. పార్టీ ఆవిర్భావానికి ముందు జిల్లాలన్నీ తిరిగి పరిస్థితి అధ్యయనం చేస్తూ వచ్చి, రకరకాల మేధావుల కూటములు ఏర్పాటు చేసి ఒక చక్కటి భూమిక ఏర్పరచారు. చిరంజీవి తిరుపతి ప్రసంగం కూడా నాకు నచ్చింది. ఎవర్నీ తిట్టలేదు. ఇప్పుడున్న పథకాలు బాగున్నాయి. వాటిని మరింత సమర్థవంతంగా, అవినీతిరహితంగా అమలు చేస్తానన్నారు. సంతోషించాను. అంతకు మించిన హామీలు వద్దులే అనుకున్నాను.

ఆ తర్వాత కథంతా అడ్డం తిరిగింది. ఎన్టీయార్‌తో పోల్చి చిరంజీవి ఉపన్యాసాలు చప్పగా వున్నాయన్నారు మీడియావాళ్లు. నిజానికి ఎన్టీయార్ ఉపన్యాసం వింటూంటే తమాషాగా వుండేది కానీ, ఏం చెప్పదలిచారో తెలిసేది కాదు. చిరంజీవి చెప్పదలచిన విషయాన్ని సూటిగా చెప్తారు. శాంతంగా చెప్తారు. ఎన్టీయార్‌లో డ్రామా వుంది. చిరు గొంతులో నిజాయితీ వుట్టిపడుతుంది. కానీ మీడియా మాటలకు చిరు ప్రభావితం అయ్యారు కాబోలు. ప్రతిక్షకులను తిట్టడం మొదలెట్టారు. ఎన్టీయార్ కాంగ్రెస్ పార్టీని తిట్టారు కానీ వ్యక్తిగతంగా తిట్టేవారు కారు. ఈయన వ్యక్తిగతంగానూ తిట్టడం మొదలెట్టాడు.

అన్నిటికంటె చిరు పార్టీపై నాకు కోపం తెప్పించినది హరిరామజోగయ్యను చేర్చుకోవడం. కొత్త పార్టీ వస్తే దానిలోకి సానుభూతి పరులు పార్టీ మారవచ్చు. కానీ జోగయ్య కాంగ్రెస్‌లో వుంటూ చిరును పొగిడి పొగిడి, వైయస్‌ను అప్రతిష్టపాలు చేసి, యింటిదొంగలా వ్యవహరించారు.

అలాటివాడు దగ్గరకు వస్తే చిరు 'నో థ్యాంక్స్' అంటారనుకున్నాను. కానీ నా పెళ్లి చేయించినది యీయనే అంటూ వాటేసుకున్నారు. అంటే ఎదుటి పార్టీలో కోవర్టును పెట్టేరన్నమాట. ఇంత నీచరాజకీయం అవసరమా?

ఆ తర్వాతనుండి ఎదుటి పార్టీలనుండి వలస ప్రారంభమైంది. చివరి నిమిషం వరకు తలుపులు తెరుచుకు కూర్చుని రండొహొ

అని కూచున్నారు. ఎవరు ఓట్లేసినా చిరుకి ఛాన్సు యిచ్చి చూతాం అనే ఓటేస్తారు. అభ్యర్థి ఎ, బి, సి.. ఎవరైనా ఒకటే. ఆ పాటి భాగ్యానికి యీ వలస పక్షులకోసం ఎదురుచూపులు చూడాలా?

పార్టీ పెట్టాక మేధావులు ఎటు పోయారో తెలియదు. సదస్సులు లేవు, సలహాలు లేవు. ఒక ప్రొఫార్మా బజెట్ లాటిది పెట్టి ఖర్చులో యింత శాతం అభివృద్ధికి, యింత శాతం సంక్షేమానికి పెడతాం అని చూపించివుంటే విశ్వసనీయత వుండేది. అదేమీ లేదు, కాంగ్రెస్, టిడిపిల్లాగానే సంక్షేమ పథకాలు గుప్పించేశారు. వంద రూపాయలకు సామాన్లు గట్రా, గట్రా. పేదలకు రెండు రూపాయలకు బియ్యం యిస్తేనే బయట మార్కెట్‌లో 35 రూ.లకు కొనుక్కోవలసి వస్తోంది.

ఇక యీ స్కీములు నిజంగా అమలైతే మధ్యతరగతివాళ్లు ఏం తినాలో భగవంతుడికి తెలియాలి. ఎస్టాబ్లిష్‌డ్ పార్టీల వాళ్లలాగానే యీయనా యీ స్కీములూ, బిసిలు, కులాలు యీ గోల మొదలెట్టారు. నేను పెదవి విరవడం మొదలెట్టాను.

6

తెలంగాణాపై కూడా చిరు నన్ను నిరాశపరిచారు. హైదరాబాదు విషయం తేలకుండా రాష్ట్రవిభజన గురించి మాట్లాడడమంటే నిప్పుల కుంపటిని రాజేయడమే! ఎన్టీయార్‌లాగ చిరు కూడా నేను సమైక్యవాదిని అని ప్రకటిస్తారేమో ననుకున్నాను. అబ్బే, తెలంగాణా గురించి కేంద్రం నిర్ణయం తీసుకోవాలట. రాష్ట్రంలో ఓ స్కీము పెట్టి దానికి నిధులు కేంద్రం యివ్వాలని అడుగుతూ, యీ విషయంలో మాత్రం కేంద్రం ఎందుకు నిర్ణయం తీసుకోవాలి?

నీ రాష్ట్రం సాధకబాధకాలు నీకు తెలుసా? ఎక్కడో అరుణాచల ప్రదేశ్‌లో వున్నవాడికి తెలుసా? వాళ్లా నిర్ణయం తీసుకునేది? కెసియార్ ఏమంటున్నారు? దివాకరరెడ్డి ఏమంటున్నారు? 1969 తెలంగాణా ఉద్యమం ఎంత హింసాత్మకంగా సాగింది? 1972 ఆంధ్ర వుద్యమం ఎన్నాళ్లు నడిచింది? ఇవన్నీ వాళ్లకు తెలుస్తాయా?

అందుకని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపవలసినది మనం. అయితే దానికి కూడా చిరు ఒక మెలిక పెట్టారు. తెలంగాణాలో వాళ్ల పార్టీకి మెజారిటీ వస్తే ఆ తీర్మానం పెడతారట. ఎందుకింత డొంక తిరుగుడు? రాష్ట్ర విభజన మంచిదా? కాదా? విడిపోవాలంటే ఏ షరతులపై, ఏ పద్ధతిలో విడిపోవాలి? అని ఓ మేధావుల సదస్సులో తేల్చమంటే పోలేదా?

తెలంగాణా విషయంలో చిరు కూడా యితర పార్టీల్లాగానే దోబూచులాడుతున్నారని అర్థమయ్యాక యీయనలో ప్రత్యేకత ఏమీ లేదని తెలిసి నిరాశ కలిగింది. ఓ దశలో తెలంగాణా వీరుణ్నంటూ కెసియార్ కంటె అధ్వాన్నంగా మాట్లాడిన, సంయమనం కోల్పోయి ఫెయిల్ అయిపోయిన దేవేందర్ గౌడ్‌ను చేర్చుకోవడం దేనికి? అది చాలనట్టు కాండిడేట్లు లేని 'మన పార్టీ' జ్ఞానేశ్వర్‌తో పొత్తా? ఇంకెవరూ దొరకలేదా? ఇదేమైనా గెలిచే పార్టీ లక్షణాలేనా?

చిరు పార్టీ స్ట్రేటజిక్‌గా చేసిన పెద్ద తప్పు – పార్టీ పెట్టేటప్పుడు ఓ పత్రిక, ఓ ఛానెల్ పెట్టుకోకపోవడం. రాష్ట్రాన్ని అధ్యయనం చేసేటప్పుడే మీడియా టిడిపికి సపోర్టుగా వుందన్న విషయం వారి దృష్టికి రాలేదా? సాక్షి అంటూ ఓ పేపరూ, ఛానెలూ పెట్టుకున్నారు కాబట్టి కాంగ్రెస్ తరపు వాదన వినగలుగుతున్నాం. లేకపోతే అంతా ఏకపక్షమే కదా! మరి చిరు పేపరెందుకు పెట్టుకోలేదు? జెపి లాగానే మీడియా తనను సపోర్టు చేసేస్తుందనుకున్నారా? సినిమాలో వుండగా సందర్భం వేరు. సినిమా పత్రికలకు యాడ్స్ యివ్వనక్కరలేదని, తమ సినిమా బొమ్మలు వేసుకుని పత్రికలు సేల్స్ పెంచుకుంటున్నాయి కాబట్టి వాళ్లే తమకు ఎదురివ్వాలనే సిద్ధాంతం అరవింద్ గారిది.

అదే థియరీని రాజకీయాల్లో అప్లయి చేయబోయారు లాగుంది. చిరు గురించి వార్త రాస్తే జనాలు చదువుతారు కాబట్టి మీడియా ఎలాగూ రాస్తుందని దానికోసం పత్రిక పెట్టనక్కరలేదని అరవింద్ అనుకుని వుంటారు. దానికి తగ్గట్టు ఆంధ్రజ్యోతి కొన్నాళ్లు చిరు న్యూస్ కవర్ చేసింది. తిరుపతి మీటింగ్ అన్ని టీవీ ఛానెల్సూ కవర్ చేశాయి.

తర్వాత తర్వాత ఏమైందో తెలియదు కానీ చిరు పార్టీ గురించి మీడియాలో వచ్చే వార్తలన్నీ వ్యతిరేకంగానే వచ్చాయి. దాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్‌కు సాక్షిలాగ వీళ్లకు ఏదీ లేదు. పోనీ టీవీ ఛానెలయినా పెట్టుకోలేదు. చిరుని క్రమంగా కాపు నాయకుడిగా చేసి పారేసింది మీడియా.

ఇది అత్యంత దురదృష్టకరం. సినిమాల్లో కులం పేరు ఎప్పుడూ వాడుకోని వ్యక్తి, స్వంత సినిమాల్లో సైతం స్వకులాభిమానం చూపని వ్యక్తి, కాపుల పార్టీలో చేరమంటే చేరని వ్యక్తి, ఎవరి గురించి ఘాటుగా మాట్లాడని వ్యక్తి యీనాడు ఒట్టి కాపు నాయకుడిగా చిత్రీకరించబడ్డాడు. తక్కిన పార్టీల్లోని కాపులను అనుమానంతో చూడసాగారు. ఈయన పార్టీకి కాపులు తప్ప వేరే కులంవారు రాకుండా పోయారు.

పైగా పార్టీలో టిక్కెట్లు అమ్ముకున్నారన్న ఆరోపణ పీఆర్పీకే ఎక్కువగా తగిలింది. నిజానికి అన్ని పార్టీల్లోనే అదే పరిస్థితి వుండి వుంటుంది. కానీ పీ ఆర్పీ ఒక్కటే దోషి అన్నట్టు చిత్రీకరించింది మీడియా. తెరాస విషయంలో కాండిడేట్ స్వయంగా పదికోట్లు యిచ్చానని చెప్పినా ఒక్కరోజులో ఆ న్యూస్ తొక్కేశారు.

ఇన్నాళ్లకి మనవాడు ఒకడికి సిఎం అయ్యే ఛాన్సు వస్తోందన్న వుత్సాహంతో కాపులందరూ చిరుకే ఓటేస్తారని, కాపులు ఎక్కువ

మంది వున్న ప్రాంతాల్లో ఆ పార్టీకి ఓట్లు వస్తాయని, వేరే చోట రావని ప్రచారం సాగుతోంది. ఇది ఎంతమాత్రం మంచిది కాదు. ఓ కులాన్నే నమ్ముకుని యిప్పటివరకూ ఏ పార్టీ బట్టకట్టలేదు. పైగా పరకాల, ఆంజనేయరెడ్డి – వీళ్లందరూ ప్రెస్ కెక్కి ఓ పథకం ప్రకారం పార్టీ పరువు తీశారు. రామ్ చరణ్ తేజ 14 మంది బోగస్ బిసిలున్నారని చెప్పడమెందుకు? ఇంత ఎమెచ్యూర్ ఫెలోస్‌ను చుట్టూ పెట్టుకుని చిరు సిఎం కాగలరన్న నమ్మకం ఎలా కలుగుతుంది? పార్టీ నిర్వహణలో ఎక్కడైనా ప్రొఫెషనలిజం కనబడుతోందా?

నిజంగా చెప్పండి – చిరును చూస్తే గౌరవం కలుగుతోందా? జాలి కలుగుతోందా? ఎన్టీయార్ రాజకీయాల్లో ప్రవేశించినప్పుడు ఆయన సిఎం అవుతాడన్న నమ్మకం ఎవ్వరికీ లేదు – ఆయనకు తప్ప! ఆ విశ్వాసం ఆయన ప్రదర్శించేవాడు ధీరోదాత్తంగా! చిరులో ఆ ధైర్యం కనబడుతోందా? పవన్‌లో వున్నంత ఫోర్సు కూడా చిరులో కనబడటం లేదు. తనమీద తనకు నమ్మకం వున్నవాడే నాయకుడవుతాడు. అనుచరుల్లో విశ్వాసం రేకెత్తిస్తాడు.

పైగా యింకో దుర్మార్గపు ప్రచారం మొదలెట్టింది మీడియా. ఎన్నికల తర్వాత చిరు కింగ్‌మేకర్ అవుతాడని, కాంగ్రెస్‌తో చేతులు కలిపి వాళ్లు ప్రభుత్వం ఏర్పరచేందుకు దోహదపడతాడని. దీనిలో అన్యాపదేశంగా చెప్పేదేమిటంటే అతను 'కింగ్' కాదని. నేను లోక్‌సత్తా విషయంలో చెప్పినట్టు 'గెలిచి సిఎం అయ్యేవాడికి వేసినంత వుత్సాహంగా 'ఆల్సో రేన్' వాళ్లకు ఓట్లేయరు. పైగా ఒక్క సర్వే కూడా చిరు పార్టీ నెగ్గుతుందని చెప్పలేదు. వీళ్లు సర్వేవాళ్లను కూడా మేనేజ్ చేయక్కర లేదనుకున్నారేమో! తటస్థ ఓటర్లు జారతారన్న భయం లేనట్టుంది.

ఇవన్నీ పరికిస్తే చిరు పార్టీకి 50-60 సీట్లకంటె ఎక్కువ వస్తాయనిపించడం లేదు.

## 7

తెలుగుదేశం పార్టీ గురించి చెప్పుకునేముందు ఓ పిడకలవేట – తెలుగుభాష గురించి. నాకు నిత్యజీవితంలో అతిశయోక్తులు గిట్టవు. తెలుగుభాష గురించి 'ప్రపంచభాషల్లో కల్లా గొప్ప భాష తెలుగు' అని ఎవరైనా అంటే 'గురువుగారూ మీకు ఎన్ని భాషలు వచ్చేమిటి?' అని అడుగుతాను అని రాశాను మొన్నటి వ్యాసంలో. కొందరికి కోపం వచ్చింది. 'ఇటాలియన్ ఆఫ్ ది యీస్ట్' గా విదేశీయులు సైతం కొనియాడిన తెలుగు గురించి ఇలా అంటారా? అని. ఎలిమెంటరీ స్కూల్లో వక్తృత్వ పోటీల్లో చేతులు కట్టుకుని గుప్పిళ్లు చంకల్లో యిరికించుకుని నేను అప్పుజెప్పిన మాటలే యివి.

కాస్త జ్ఞానం వచ్చాక ఇంతకీ ఆ యిటాలియన్ ఏమిటో, దానికీ మనకీ పోలిక ఏమిటో తెలుసుకుందామని ప్రయత్నించాను. లాటిన్ భాషలాగ ఆ భాషలో గొప్ప కావ్యాలు, ప్రబంధాలూ వున్నాయా? సంగీతరచనకు అది అనువుగా వుంటుందా? అతి ప్రాచీనమైన భాషా?

కొంపదీసి నీచోపమానం కాదు కదా!? ఇటలీలోని మాఫియా మాతృభాష యిటాలియన్, మన ఫ్యాక్షనిస్టుల మాతృభాష తెలుగు.. అందుకని యిలా అన్నారా? ఇప్పుడు ఒకాయనికి ఆంధ్ర నేతాజీ అని బిరుదు యిచ్చారు. ఆ నేతాజీ సుభాష్ చంద్రబోసు అయితే ఆనందిస్తాం, కాక రాజ్ నారాయణ్ (అతనికీ నేతాజీ బిరుదుంది) అయితే వుస్సురంటాం. మనల్ని మనం వూదరగొట్టేసుకునే ముందు ఇటాలియన్ ఎలాటి భాషో కనుక్కోవడం మంచిది కదా!

మీరు కాస్త ఆ ప్రయత్నంలో వుండండి. పోలిక ఏమిటో తెలిసేసరికి నాకు దశాబ్దాలు పట్టింది. ఇంటర్నెట్ వచ్చింది కాబట్టి మీకు రోజులు సరిపోతాయి. కనుక్కుని నాకు మెయిల్ చేయండి, సబ్జక్ట్‌లో తెలుగు అని రాయండి. ఈ ఎన్నికల అడావుడి అయ్యాక ఓ వారం ఆగి పంపండి.

ఇంకో మాట – దయచేసి ఈ మెయిల్స్ ఇంగ్లీషులో రాయండి. తెలుగుని ఇంగ్లీషు స్క్రిప్టులో కొట్టి పంపకండి. ఇంటర్నెట్‌లో లభించే వత్తులు వూడిపోయే, తలకట్టు రాలిపోయే తెలుగు లిపిలో అస్సలు పంపకండి. చదవడం నా వల్ల కాదు. తెలుగువాళ్లం కదా, తెలుగులోనే రాస్తాం అంటే ఇలాటి లిపిలో రాసి పంపండి. లేదా చేత్తో రాసి స్కాన్ చేసి పంపండి.

టిడిపి – టిడిపి గురించి మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ ప్రస్తావన రాకతప్పదు. వారిద్దరి మధ్యే ప్రధానమైన పోటీ కాబట్టి. ఇదివరకే చెప్పుకున్నట్టు బాబు పరిపాలన వెలిగిపోయిందని విశ్వసించినవారిలో నేనూ ఒకణ్ని. విద్యుత్ సమస్యలున్నా అవి అలవికానివి అనుకున్నాను. కాంగ్రెస్ వుచిత విద్యుత్ యిస్తానంటే ఏడిశారులే అనుకున్నాను. కానీ ఐదేళ్లగా విద్యుత్ బాగానే మానేజ్ చేశారు. ధరలు పెంచలేదు. బాబు హయాంలో ఎన్నిసార్లు పెంచారో లెక్కే లేదు. వర్షాల వలన హైడ్రో ఎలక్ట్రిసిటీ పెరిగిందనుకున్నా బాబు ఫెయిలైనది, వైయస్ సాధించినది విద్యుత్ రంగం ఒకటి.

అలాగే నక్సల్స్ సమస్య కూడా. బాబు హయాంలో కొన్ని జిల్లాలలో ప్రభుత్వ అజమాయిషీ లేనే లేదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రికే రక్షణ లేదు. కాంగ్రెస్ ఎన్నికల్లో నక్సల్స్ మద్దతు తీసుకుని, తర్వాత నక్సల్స్‌ని పిలిచి రాచమర్యాదలు చేస్తే అసహ్యించుకున్నాను. పోలీసుల చేత వాళ్ల ఎంగిలి కాఫీ కప్పులు మోయించారని విని ఆక్రోశించాను. తర్వాత తర్వాత తెలిసివచ్చింది యిదొక స్ట్రాటజీ అని. ఇప్పుడు నక్సల్స్ సోదిలోకి లేకుండా పోయారు. వారి సానుభూతి పరులు కూడా అప్రతిష్ట పాలై చచ్చుబడ్డారు. వైయస్ బాబుపై యీ విషయంలో కూడా పై చేయి సాధించారు.

ఇక వ్యవసాయ రంగం గురించి. బాబు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసినమాట నిజం. నెగటివ్ గ్రోత్‌లోకి వెళ్లిపోయింది. ఐటీ, ఐటీ అంటూ పరుగులు పెట్టారు. కోడిగుడ్లన్నీ ఒకే బుట్టలో పెట్టకూడదని సామెత. బాబు 2004లో ఎన్నికై మళ్లీ ఐటీయే అని వుంటే ఏమయేది? ఇప్పుడు ఐటీ ఢమాల్ అయింది కదా, మన శక్తియుక్తులన్నీ ఐటీమీదనే పెట్టి వుంటే అడుగంటిపోయేవాళ్లం.

ప్రాజెక్టులంటూ మానవ వనరులను అటువైపు మళ్లించబట్టి సమ్‌థింగ్ సాలిడ్ కనబడుతోంది. నిర్మాణ రంగంలో ఉద్యోగాలు నిలబడ్డాయి. వ్యవసాయం కాస్త కూడు పెడుతోంది. అయినా 1999-2004 మధ్య బాబంత అడావుడి చేయకపోయినా కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో ఐటీ రంగం బాగా పెరిగింది. మనకంటె బాగా!

గత ఐదేళ్లూ వర్షాలు బాగా పడ్డాయి. నీళ్లుంటే అంతా సస్యశ్యామలమే! వైయస్‌కు పాలనలో ఏ అనుభవమూ లేకపోయినా, జలప్రాజెక్టులనే థీమ్ బాగా పట్టుకున్నారు. నిజానికి అనాదిగా నీటిలభ్యతే అన్ని సమస్యలకూ మూలకారణం. ఇంత భారీయెత్తున ప్రాజెక్టులను తలపెట్టినపుడు ఇదో పెద్ద జోక్ అనుకున్నాం. అనుమతులు లేకుండా ప్రారంభించినపుడు మూర?త్వం అనుకున్నాం.

కానీ గతంలో ఎన్టీయార్ లాగానే వైయస్‌కు మొండితనం ఎక్కువ. అనుమతులు తర్వాత వాటంతట అవే వచ్చాయి. పనులు ప్రారంభమయ్యాయి. ప్రజలకు ఉపాధి దొరికింది. నిధులు ఎక్కణ్నుంచి వస్తాయని అందరూ మేలమాడారు. రియల్ ఎస్టేటు బూమ్ కలిసివచ్చింది. ప్రభుత్వభూములను తెగనమ్మి వీటిమీద పెట్టారు. (బూమ్ డౌన్ అయ్యాక నిధులు ఆగాయి. ఇకపై వాటిని పూర్తి చేయడం కష్టమే).

ఇది బాబు చూపిన బాటే! ఆయన మొహమాట పడుతూ ఒకటీ రెండూ చేస్తే వైయస్ అంతకు వందరెట్లు చేశారు. అమ్మకుండా అలాగే వుంచితే ఏమయ్యేది? ఏమయ్యేద నుకుంటున్నారు? ఏ గుడిసెల వెంకటస్వామో గుడిసెలు వేయించేవారు. మహానగరం నడిబొడ్డులో అసహ్యంగా వున్నాయని పీకిస్తే ప్రతిపక్షాలు అల్లరి చేసేవి. ఆ స్థలాల వలన మీకూ, నాకూ ఒరిగేది ఏమీ లేదు. వాటిని ఎక్కువ ధర పెట్టి కొనుక్కున్న మోతుబర్లు ఏడిస్తే ఏడవనీ. బహిరంగ వేలంలో అమ్మారు. నిధులు పట్టుకెళ్లి పార్టీ ఫండ్స్‌కి కాకుండా ప్రాజెక్టు ఖాతాలకు జమ చేశారు. కాలువలు తవ్వారు. తవ్వినవారికి ఉపాధి దొరికింది కదా.

8

ప్రాజెక్టుల్లో నీళ్లు ఎన్ని వచ్చాయన్నది వివాదం అయింది. సాక్షి పొంగిపొరలుతోంది అంటుంది. ఈనాడు ఒక్క చుక్క రాలలేదంటుంది. విదేశీ నిపుణులు అధ్యయనం చేసి నిజానిజాలు చెప్తే తప్ప తెలియదు. కానీ పదిశాతమైనా నీళ్లు వచ్చి వుంటాయని నా అంచనా. ఎందుకంటే చాలామంది వ్యవసాయం మళ్లీ చేపట్టారని వింటున్నాను. గ్రామీణప్రాంతాలలో ప్రజలు కాంగ్రెస్ పట్ల సంతోషంగా వున్నారన్న రిపోర్టులు చాలా వచ్చాయి.

ఇక ప్రాజెక్టుల్లో అవినీతి గురించి. వైయస్ ఓడిపోతే యిదే ప్రధానకారణమవుతుంది. చిన్న ప్రాజెక్టుల్లో చిన్న అవినీతి, భారీప్రాజెక్టుల్లో భారీ అవినీతి. కొంత అతిశయోక్తులున్నాయనుకున్నా అవినీతి భారీస్థాయిలోనే జరిగివుంటుంది. ఆశ్చర్యం లేదు. రాఘవులు గారి మాటల్లో 40 వేల కోట్ల ప్రాజెక్టు పనుల్లో 10 వేల కోట్లు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకే పోయాయన్నారు. ఆ మాట నిజమనుకున్నా 30 వేల కోట్లు ప్రాజెక్టుల మీద ఖర్చయ్యాయి కదా. దానికి నిధులు మనమీద పన్నులేసి లాగలేదు కదా. ప్రభుత్వస్థలాలు అమ్మారు. అవి వుండి వుద్ధరించిందీ లేదు.

బాబు యీ అవినీతి గురించి మాట్లాడుతూనే ఐదేళ్లూ లాగించేశారు. ఆధారాలతో వైయస్‌పై కేసులు పెట్టివుంటే అదో దారి. ఏదో అసెంబ్లీలో మన వినోదం కోసం తిట్టుకోవడం తప్ప సాలిడ్‌గా ఉద్యమాలు చేసింది లేదు. ఎందుకంటే ఆయన పార్టీ కార్యకర్తలూ అందరూ ప్రాజెక్టు కాంట్రాక్టులు చేపట్టినవారే.(ఆయన భార్యా చేపట్టారని సాక్షి లేటెస్టు రిపోర్టు).

ఇక పరిపాలన విషయానికి వస్తే బాబుకున్న విషయపరిజ్ఞానం, కార్యదక్షత, నిర్వహణా కౌశలం వైయస్‌కు వున్నట్టు కనబడదు. వైయస్ వచ్చాక ఎడ్మినిస్ట్రేషన్ నడుస్తున్నట్టు తోచదు. ఏ పనీ సాగదు, ఏ ఫ్లయి ఓవరూ పూర్తవదు. అడిగేవాళ్లు లేరు, చెప్పేవాళ్లు అంతకంటె లేరు. వైయస్ కాబినెట్ మినిస్టర్లే ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసేసుకున్నారు. ఎవరిపైనా అజమాయిషీ లేదు. ఉద్యోగుల్లో జవాబుదారీతనం ఎక్కడా కానరాదు. డబ్బిచ్చి పనిచేయించుకోవచ్చు అనే ఫీలింగే ఎల్లెడలా వ్యాపించింది. బాబు హయాంలో అన్నీ ఆయనే చూస్తాడు. మంత్రులూ, అధికారులూ అందరూ డమ్మీలు అన్న భావన. అందువలన బాబు ఒక్కడు ఎంతవరకు చేయగలిగితే అంతవరకూ పనులయ్యేవి. ఇప్పుడు వైయస్ హయాంలో డీ-సెంట్రలైజేషన్. ఎవరి పరిధి వారిది. అన్ని లెవెల్స్ లోనూ అవినీతి పెరిగిపోయిందన్న వాస్తవానికి (ఏసిబి దాడులే సాక్ష్యం) కారణం యిదే. పట్టుబడ్డవారు పట్టుబడ్డారు. లేనివారు లేదు.

బాబుకి హుందాతనం కల నాయకుడని పేరు వుంది. ఇతర రాష్ట్రాలవారి ముందు బాబును గర్వంగా చూపించుకునేవారం. పోనుపోను ఆయన తన షైన్ పోగొట్టుకున్నాడు. పరిటాల రవి హత్య కేసులో రాష్ట్రమంతటా బస్సులు తగలేయించడంతో నాకు ఒళ్లు మండిపోయింది. రవి ఏమైనా మహానుభావుడా? పగ, ప్రతీకారాలతో జరిగిన హత్యలకు మనమెందుకు బాధ్యత వహించాలి?

అక్కణ్నుంచి బాబు మామూలు రాజకీయ నాయకుడి కంటె తాను ఏమాత్రం మెరుగనిపించుకోలేదు. మీడియా ఆయనను ఎంతైనా వెనక వేసుకుని రావచ్చుగాక! నా బోటివాళ్ల దృష్టిలో ఆయన మళ్లీ లేవలేదు. అసెంబ్లీలో, బహిరంగ వుపన్యాసాల్లో ఆయన

స్థాయి మరిచి మాట్లాడుతూ వచ్చారు – ముఖ్యంగా గత ఏడాదిగా. మళ్లీ గెలవలేనేమోనన్న అసహనం ఆయనలో కనబడింది. ఇంతో ఐదేళ్లు ప్రతిపక్షంలో వుంటే కొంప మునిగిపోతుందా? కాంగ్రెస్ 9యేళ్ల పాటు లేదా?

గతంలో ఆయన 'ప్రజలకు చేప నివ్వడం కంటె, గేలాన్ని యివ్వడం మంచిది' అన్నప్పుడు చప్పట్లు కొట్టిన నేను, కాంగ్రెస్‌తో పోటీ పడి పథకాలు ప్రకటిస్తూ వుంటే ముక్కుమీద వేలేసుకుని వుండిపోయాను. 'నేను మారాను' అని అంటూ వుంటే అర్థం ఏమిటి? ఇదివరకటి నా విధానాలు తప్పని ఒప్పుకున్నట్టేనా? ఆ విధానాలు చూసే కదా మేం అభిమానించింది. ఈ రెండు రూపాయల బియ్యాలు, పావలా వడ్డీలు అందరు నాయకులూ ప్రకటించే చవకబారు పథకాలేగా? ఇక ఈయన స్థాయి ఎక్కడ? ఎలాగైనా అధికారంలోకి రావలన్న తాపత్రయం అసహ్యంగా బయటపడటం లేదా?

ఈయన ఈయన విధానాలకే కట్టుబడితే ఏమయ్యేది? ఒకవేళ 2009లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రియల్ ఎస్టేట్ బూమ్ చల్లారిపోయి, నిధులు కరువైనప్పుడు పథకాలు ఆపేసినపుడు, అప్పుడు ప్రజలు ఈయన విధానమే సరైనదని ఒప్పుకునేవారుగా! ఈలోపున తొందరపడి అలవికాని పథకాలను ప్రకటించడం దేనికి? మేం సృష్టించిన సంపద కాంగ్రెస్ ఖర్చు చేస్తోంది అంటున్నారు కదా. మళ్లీ ఎలా సృష్టిస్తారు? ప్రాజెక్టులు ఎలా పూర్తి చేస్తారు? అర్థంలేని యీ హామీల వలననే ఈయనకు అండగా నిలబడిన హనుమాన్ చౌదరి గారి లాటి మేధావులు మీకు దూరమయ్యారు.

తెలంగాణా విషయంలో ఈయన కప్పదాటు కూడా చాలామందిని నిరాశపరిచింది. సమైక్యవాదం వదిలేరు. పోనీ అలా అని తెలంగాణాకు పూర్తిగా జై, హైదరాబాదు తెలంగాణాకే, తెరాస కోరినట్టుగా ప్రాజెక్టులు ఆపేస్తాం అని ప్రకటించారా? లేదే. అదంతా ఓ కమిషన్ చూసుకుంటుంది అని అస్పష్టమైన సమాధానం యిచ్చారు. రోశయ్య కమిటీ లాటిది వేయలేదు. ఆంధ్ర ప్రాంత ప్రజలు రాష్ట్రవిభజనకు ఒడంబడ్డారు అన్నారు ఏ టెర్మ్స్‌పై ఒడంబడ్డారు? హైదరాబాదు అక్కరలేదు అన్నారా? రాజధాని ఎక్కడ పెట్టుకుంటామన్నారు? నగదుబదిలీ పథకం గురించి 25 దేశాలను అధ్యయనం చేసినవారు దీని గురించి ఆపాటి అధ్యయనం కూడా చేయలేదా?

9

అసలు విషయం ఏమిటంటే – 2004లో కాంగ్రెస్ చేసిన ట్రిక్ యిప్పుడు ఈయన చేద్దామనుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం యిస్తానని హామీ యివ్వడం, ఎగ్గొట్టడం. ఏ రోటి దగ్గర ఆ పాట పాడడం. కానీ ఒకే ట్రిక్ రెండుసార్లు పారుతుందా? 2004కి 2009 కి మధ్య రాజకీయ వాతావరణాన్ని ఎంత విద్వేషపూరితం చేశారు కెసియార్? రక్తాభిషేకాలు, కాలేజీలు మూయించడాలు, ..నీటిదొంగలు, . ఒకటా రెండా? ఇంత జరిగాక యింకో ఐదేళ్లు ఈయన కాంగ్రెస్ తరహా దోబూచులాడగలరా?

ఓ జోక్ చదివాను. అరడజను మంది యింజనీర్లు ఒకే టిక్కెట్టు కొని టిటిసి వచ్చినపుడు బాత్‌రూమ్‌లో దాగున్నారట. అది చూసిన డాక్టర్ల గుంపు తిరుగుప్రయాణంలో అలాగే చేయబోయారట. ఒకే టిక్కెట్టు కొని టిటిటసి వచ్చినపుడు బాత్‌రూమ్‌కోసం వెతికారట. అది లోకల్ ట్రెయిన్ కాబట్టి బాత్‌రూమ్‌లు లేవు. చచ్చినట్టు పెనాల్టీ కట్టారట.

కాంగ్రెస్‌కు ఓ రిప్యుటేషన్ అంటూ లేదు. వాళ్లు చెప్పినది చేయడమంటూ ఎప్పుడూ లేదు. ఈయనా అదే బాటలో నడుస్తానంటే ఎలా? ఈయనకీ వాళ్లకూ తేడా ఏముంది? తేడా లేనప్పుడు వాళ్లను తీసేసి యీయన్ని పిలవడం దేనికి? వాళ్లు చేస్తే సహించే ప్రజలు మీరు చేస్తే సహించకపోవచ్చు.

అన్నిటికన్నా ఘోరాతిఘోరమైనది నగదు బదిలీ పథకం. ప్రజలను సోమరులను చేసి చెడగొట్టడానికి యింతకంటె దగ్గరదారి లేదు. ఇది ప్రకటించినప్పుడు ప్రజలను యిది విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిసే దీని సాధ్యాసాధ్యాలపై గతంలోనే దీని గురించి విపులంగా రాశాను. అనుకున్నట్టుగానే ఇది బీదజనంలోకి బాగా వెళ్లినట్టుంది. టిడిపి గెలుపుకి యిది ముఖ్యకారణమైనా ఆశ్చర్యపడనక్కరలేదు.

బాబు అచ్చమైన రాజకీయజీవి. ఆయనకు గ్రాస్‌రూట్స్ లెవెల్‌నుండి వ్యక్తులు తెలుసు. నోరు పారేసుకోకుండా ఎవర్ని ఎక్కడ తుంచాలో, ఎప్పుడు పెంచాలో తెలుసు. తన బలమూ, బలహీనతా తెలుసు. అవసరమైనపుడు తగ్గడమూ తెలుసు, అదను చూసి పెరగడమూ తెలుసు. ముఖ్యమంత్రిగా బిజీగావుండి పార్టీని పట్టించుకోలేకపోయారు కాబట్టి 2004లో ఓడారు.

గత ఐదేళ్లలో ఓర్పుగా, ఓపికతో పార్టీని మళ్లీ నిర్మించుకున్నారు. దేవేందర్ గౌడ్ లాటి వారిని బయటకు పంపారు. నందమూరి వంశాన్ని దగ్గరకు చేసుకున్నారు. బాలకృష్ణతో వియ్యం కలుపుకున్నారు. జూనియర్‌ను మచ్చిక చేశారు. రాష్ట్రంలో లెఫ్ట్ రంకెలేస్తే జాతీయ నాయకత్వంతో చెప్పి మొట్టికాయలేయించారు. తెరాసను కూడా ఆకట్టుకున్నారు. మీడియాను దువ్వి మహాకూటమి చెలరేగిపోతోందని రాయించారు.

అయితే ఆయన ప్రయాణం సాఫీగా సాగలేదు. కెసియార్ ముప్పుతిప్పలు పెట్టి బాబు యిమేజిని దిగజార్చారు. లెఫ్ట్ కూడా పేచీ పెట్టింది. హరికృష్ణ దూరమయ్యారు. జూనియర్ యాక్సిడెంటు పాలయ్యారు. మహాకూటమిలో లుకలుకలు వచ్చాయి. జాతీయస్థాయిలో తృతీయ కూటమి రూపు దిద్దుకోలేదు. సాక్షి పేపరు ఏడాదిగా ఆయన్ను వుతికి ఆరేస్తోంది. ఇవన్నీ చాలనట్టు రంగంపై చిరు

అవతరించారు.

చిరు రాకుండా వున్నట్టయితే టిడిపికి మంచి అవకాశాలు వుండేవని చెప్పుకోవచ్చు. ఎందుకంటే అయిదేళ్ల కాంగ్రెస్ పరిపాలన తర్వాత తప్పకుండా యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీలింగ్ ఏర్పడుతుంది. యాంటీ కాంగ్రెస్ ఓటు టిడిపి, పీ ఆర్పీల మధ్య చీలిపోతే కాంగ్రెస్ లాభపడుతుంది.

అందుకనే కాంగ్రెస్ చిరు బలపడాలని కోరుకుంది, టిడిపి బలహీన పడాలని కోరుకుంది. 2004లో కాపులందరూ టిడిపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటేశారని, 2009లో చిరు బలపడి, కాపులందరూ చిరుకి ఓటేస్తే కాంగ్రెస్ ఓట్లు తగ్గిపోయి, టిడిపికి లాభమనీ కొందరు వాదిస్తారు. అందువలన చిరు బలపడడమే టిడిపికి లాభమంటారు.

కానీ కాపులు గంపగుత్తగా ఓట్లేస్తారని ఖచ్చితంగా చెప్పగలమా? పైగా బిసిల మాటేమిటి? బిసిలు టిడిపికి ఎప్పుడూ ఓటేస్తారనుకుంటే యిప్పుడు వాళ్లు చిరుకి మళ్లిపోతే టిడిపికి నష్టం కాదా? ఏ విధంగా చూసినా చిరు బలహీనపడడమే టిడిపికి కావాలి. అందుకనే టిడిపికి అనుకూలమైన మీడియా చిరుని టార్గెట్ చేసింది. అతని ప్రతి అడుగునూ విమర్శించింది. చివరకు పీఆర్పీకి ఓటేస్తే కాంగ్రెస్‌కు ఓటేసినట్టే, ఎన్నికల తర్వాత వాళ్లు కాంగ్రెస్‌తో కలుస్తారు అన్న ప్రచారాన్ని సైతం ముందుకు తెచ్చింది. నిన్న కారత్ బహిరంగంగా అన్నారు కూడా. కాంగ్రెస్‌ను ఓడించాలంటే మా వల్లే సాధ్యం అని టిడిపి జనాల్ని నమ్మిస్తోంది.

కాంగ్రెస్ అంటే పడనివారందరినీ సమీకరించు కోగలుగుతోంది కాబట్టి టిడిపికి పరిస్థితి అనుకూలంగానే వుందనిపిస్తోంది. ముఖ్యంగా సిటియస్ స్కీమ్ పేదలను ఆకర్షించిందంటున్నారు కాబట్టి. తక్కిన అంశాలన్నీ వదిలేసి దీనిమీదే పడ్డారు. టిడిపికి మొదటినుండీ వున్న క్యాడర్, పార్టీ నిర్మాణవ్యవస్థ, పార్టీ ఏకతాటిపై నడవడం, పుష్కలమైన వనరులు, చంద్రబాబు నాయకత్వం మీడియా సపోర్టు యివన్నీ – టిడిపి విజయానికి కారణాలవుతాయి.

అయితే పేదలకు యిలా దోచిపెడితే తమ గతి ఏమవుతుందనే భయం మధ్యతరగతికి పుట్టి వాళ్లు బయటకు వచ్చి ఓట్లేస్తే మాత్రం టిడిపికి ఈ పథకం ఎడ్వాంటేజి రాకపోవచ్చు. మొదటివిడతలో 70% ఓటింగ్ జరిగిందంటే వాళ్లు బయటకు వచ్చినట్లే. ఆ ఓట్లు ఈ నగదు బదిలీ పథకానికీ, కలర్ టీవీలకుమాత్రమే వ్యతిరేకం అనడానికి లేదు, కిలో 2 రూ.ల బియ్యం, ఇందిరమ్మ యిళ్లు, పావలా వడ్డీలు, యిలా సంక్షేమ పథకాలకు వ్యతిరేకం కూడా కావచ్చు. అప్పుడు అది కాంగ్రెస్‌కు దెబ్బ. ఆ మాటకొస్తే పీఆర్పీకి పథకాలున్నాయి. వంద రూపాయలకు వంటసరుకని.

టిడిపికి ఎన్ని ఓట్లు వస్తాయన్నది కాంగ్రెస్ గురించి కూడా చర్చించాక తేలుద్దాం. ఎందుకంటే వాళ్లద్దరిదీ 'సీ-సా' లాటిది. వాళ్లకు తగ్గితే వీళ్లకు హెచ్చవుతాయి. అక్కడ హెచ్చయితే యిక్కడ తగ్గుతాయి. ఇక కాంగ్రెస్ విషయానికి వెళ్లబోయేముందు మరో విషయం చెప్పి టిడిపి విషయం ముగిస్తాను.

10

టిడిపి ఒకవేళ దెబ్బ తింటే మాత్రం ఒక ముఖ్యకారణం – కమ్మల అత్యుత్సాహం! 1952 సార్వత్రిక ఎన్నికల నుండి ఇప్పటివరకూ ఎన్నడూ లేనంతగా కమ్మలు ఓ పార్టీకై యింత అడావుడి చేస్తున్నారు. టిడిపిని తమదిగా భావించి టిడిపి విజయాన్ని తమ జయంగా, దాని ఓటమిని తమ వ్యక్తిగత అపజయంగా భావించే స్థితిలోకి వెళ్లిపోయారు. కమ్మలు 100% టిడిపివాళ్లా అంటే కాదనే అంటాం. వాళ్లలో గ్రామీణులు, రైతులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులూ కాంగ్రెస్‌కే ఓటేయవచ్చుగా.

కానీ ఏజ్ ఏ రూల్, కమ్మలు టిడిపికే వేస్తారన్నమాట వచ్చేసింది. నాకు రాసే మెయిల్స్‌లో కొంతమంది 'ఈవెన్ దో ఐ యామ్ ఏ కమ్మా, ఐ వోట్ ఫర్ కాంగ్రెస్' అని రాస్తున్నారు. ఏ పార్టీకి, ఒక కులం అంతగా మమేకం కావడం మంచిది కాదు. నిజానికి టిడిపి కమ్మల కంటె రెడ్లకే ఎక్కువ సీట్లు యిచ్చిందని చూశాం కదా. అయినా కమ్మలు చేసే అడావుడి చికాకు పుట్టిస్తోంది. తానా సభల్లో, ఎన్నారైల సదస్సులలో ప్రతీచోటా కాంగ్రెస్‌ను తిట్టడం, టిడిపిని ఆకాశానికెత్తడం!

దీనివలన కమ్మవ్యతిరేక కులాలన్నీ ఏకమయ్యే ప్రమాదం వుంది. ఎప్పుడైనా అతి చేస్తే గతి చెడుతుంది. తమిళనాడు రాజకీయాల్లో 70 ఏళ్లక్రితం బ్రాహ్మణులదే హవా. రామస్వామి నాయకర్‌కు ఓ సారి తిక్క రేగింది. బ్రాహ్మణ వ్యతిరేక వుద్యమం ప్రారంభించాడు. అంతే గత 30 యేళ్లగా డిఎంకె తరఫున ఒక్క బ్రాహ్మణ ఎంఎల్ఏ లేడు! ఇప్పటికే కృష్ణా, గుంటూరు జిల్లాలలోని కాలేజీల్లో కమ్మ – యాంటీ కమ్మ గ్రూపులు కలహిస్తున్న వార్తలు వింటూనే వున్నాం.

ఎప్పుడైనా ఒకరి ప్రాబల్యం పెరిగిందంటే వారికి వ్యతిరేకంగా తక్కినవారందరూ ఏకమవుతారు. కృష్ణా, గుంటూరు జిల్లాలలో కమ్మవారి ప్రాబల్యం ఎక్కువ కాబట్టి అలాటి పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు రాజకీయాల్లో అలాటి పరిస్థితి తెచ్చిపెడుతున్నారు కమ్మలు. ఎన్టీయార్ ఎన్నికల్లో ఓడిపోవడానికి యిలాటి వాతావరణం దోహదపడిందని గతవ్యాసాల్లో రాశాను. కమ్మలకు యింత కాంగ్రెస్ ద్వేషం ఎందుకు? గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాలు రాలేదా? ఇప్పటికీ కాంగ్రెస్‌లో కమ్మ మంత్రులు లేరా?

మార్గదర్శిపై ఎటాక్ జరిగినప్పటినుండీ కమ్మలలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే కక్ష పెరిగింది. కమ్మ సదస్సులలో, కమ్మకుల పత్రికలలో ఎక్కడ చూసినా యిదే ధోరణి! మార్గదర్శిలో జరిగినది ఒక ఆర్థికనేరం. అలాటివి జరుగుతూనే వుంటాయి.

అప్పుడప్పుడు బయటపడుతూనే వుంటాయి. ఏళ్ల తరబడి విచారణ జరుగుతాయి. ఒక్కొక్కప్పుడు శిక్షలు పడతాయి. దానిగురించి యింత రాద్ధాంతం దేనికి?

పెద్దాయన, మేటి యిండస్ట్రియలిస్టు కిర్లోస్కర్‌ను ఓ ఆర్థికనేరంలో బొంబాయి రోడ్డుపై నడిపించారు. అంతమాత్రం చేత ఆయన కులస్తులు ఆ ప్రభుత్వాన్ని పడగొడతామని పగ బూనలేదే! చెన్నారెడ్డికి ఈనాడుకీ పడలేదు. మరి అప్పుడు కమ్మలు యిలాటి ప్రతిజ్ఞలు చేయలేదే!

అయినా ఈనాడుగానీ, మార్గదర్శి గానీ - కమ్మల కోసం, కమ్మలచే పెట్టబడిన కమ్మసంస్థ అని ప్రకటించుకుందా? రామోజీ ఒక వ్యాపారస్తుడు. అవసరమైతే రాజీ పడగలరు. దాసరితో అన్నేళ్ల వైరానికి స్వస్తి పలికి తన స్టూడియోకి ఆహ్వానించలేదా? రేపు వైయస్ ప్రభుత్వంలోకి మళ్లీ వచ్చి స్నేహహస్తం చాపితే యీయన అందుకోవచ్చేమో కూడా ఎవరు చూడవచ్చారు? తన ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా అలా చేయవలసి వచ్చిందని చెప్పవచ్చుకదా!

ఏది ఏమైనా ఈనాడుని కానీ, మార్గదర్శిని కానీ ఏమాత్రం విమర్శించినా, ఏదో తమనే తిట్టినంత యిదిగా ఫీలయిపోయారు చాలామంది కమ్మలు. ఈ ఎన్నికలలో వారి ఆర్భాటం మరింత పెరిగింది. ఈ రకంగా తక్కిన కులాలవారిని రెచ్చగొట్టారనే చెప్పాలి. చిరును కాపుల ప్రతినిథిగా ముద్రకొట్టి అతనికి బలం పెంచి, కాంగ్రెస్ వ్యతిరేక ఓట్ల చీలికకు కారణభూతులయ్యారు కదా.

నేను రాస్తున్నది కమ్మలందరి గురించి కాదనీ, రాజకీయంగా అనవసర ఆర్భాటం చేస్తున్నవారి గురించేననీ నొక్కి చెప్తున్నాను.

కాంగ్రెస్ - ఇప్పటికే అనేకసార్లు కాంగ్రెస్ ప్రస్తావన వచ్చింది. రాష్ట్రం వరకు కాంగ్రెస్‌పార్టీని వైయస్ స్వంత ఆస్తిగా చూడడం జరుగుతోంది. ఆయన 'ఇది మైనారిటీల (క్రిస్టియన్‌ల) ప్రభుత్వం అని బాహాటంగా ప్రకటించుకున్నా, దాన్ని మీడియాలో రెడ్డి రాజ్యంగా వ్యవహరించడం జరుగుతోంది. ఒక ఫ్యాక్షనిస్టు లీడర్ ముద్రనుండి బయటపడి ఒక స్టేట్స్‌మన్‌గా ఎదగాలని వైయస్ ప్రయత్నిస్తున్నారు. ఎన్టీయార్ స్టయిల్లో మొదట్లో కొట్టిన డైలాగులు - ఆడిన మాట తప్పని వంశం, దేవుని పాలన (ఈనాడు యిప్పటికీ దాని మీద సెటైర్లు వేస్తూ వుంది) తగ్గి పెద్దమనిషి తరహా అలవడుతోంది.

వైయస్‌కు కలిసివచ్చిన అంశం - వర్షాలు. ఆయన పాదం మంచిదన్న సెంటిమెంటు. 2008లో వర్షాలు రావనుకుంటే ఆఖరినిమిషంలో కురిసాయి. జలప్రాజెక్టుల ఫలితాలు పదిశాతమైనా జనాలకు చేరి వుంటాయి. వారందరూ హ్యేపీగానే వున్నారు. ఇందిరమ్మ యిళ్లు, మరోటి మరోటి అంటూ (వాటి నిర్మాణంలో ఎంత అవినీతి జరిగినా కనీసం స్థలాలైనా మిగులుతాయి కదా) వూళ్లల్లో ప్రతివారూ ఏదో ఒక పథకంలో లబ్ధి పొందేట్లు చూశారని విన్నాను. నగరాల నిర్వహణ మాత్రం అధ్వాన్నంగానే వుంది. విద్యుత్ పరిస్థితి అయిదేళ్లగా బాగానే వుంది కానీ ఎలక్షన్లకు రెణ్నెల్ల ముందు నుండే దెబ్బ తినేసింది. దాని దెబ్బ ఎలా పడుతుందో చూడాలి.

వైయస్ తన కాబినెట్ కొలీగ్స్‌ను పనిచేసుకోనిచ్చారు. బాబులా అన్నిటా వేలు పెట్టలేదు. రోశయ్యకు గౌరవం యిచ్చి కథ నడిపించారు. కాబినెట్‌లో పనిచేసిన మంత్రులు పనిచేశారు, చేయనివారు చేయలేదు. ఆరోగ్యశ్రీ వంటి మంచి పథకం బాగానే వుంది కానీ ప్రైమరీ హెల్త్ సెంటర్లను గాలికి వదిలేశారు. 2 రూ.ల బియ్యం పథకం పెట్టి బయటి మార్కెట్‌లో 30 రూ.లకు రేటు పెరిగేట్లా చేశారు. రియల్ ఎస్టేటు ధర్మమాని నగరం చుట్టుపట్ల గ్రామాల్లో వ్యవసాయ భూములు అంతరించి పోయి కూరగాయలు దొరకడం మానేశాయి. బియ్యం కూడా దొరక్కుండా తయారైంది.

11

వైయస్ తనపాలనలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పట్ల తప్ప యింకెవ్వరిమీదా కక్ష సాధించినట్టు తోచదు. అవి కూడా పూర్తిగా కత్తి కట్టినట్టే ప్రవర్తించాయి. 2004లో ఆంధ్రజ్యోతి పూర్తిగా చంద్రబాబును సపోర్టు చేయలేదు. (ఆయన పెట్టుబడి వుందన్న పుకారు వచ్చినా) కానీ తర్వాత తర్వాత పూర్తిగా ఈనాడు పంథాలోనే వెళ్లింది. ఈనాడైతే బొత్తిగా మేం కాంగ్రెస్ వ్యతిరేకులం అని అఫిడవిట్ యిచ్చేసింది.

దానితో దాని విశ్వసనీయత దెబ్బతింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి కాస్త సంయమనం పాటించి వుంటే వైయస్ సాక్షి పెట్టించేవారే కారు. సాక్షి రావడంతో నాణానికి మరోవైపు కూడా కనబడ సాగింది. ఈనాడు కట్టిన గంతలు విప్పుకునే చూసేందుకు వీలుపడింది. ఇది వైయస్‌కు లాభించే అంశం. కాంగ్రెస్ గెలిస్తే సాక్షి పేపరుకు, టీవీకి చాలా మార్కులు పడతాయి.

వైయస్ పాలనలో ఓ పెద్ద మచ్చ - మజ్లిస్ పట్ల ఆయన చూపిన అనురాగం. వాళ్లు డాక్టర్లను తన్నినా, ప్రభుత్వాధికారులను కొట్టినా, తస్లీమాను చంపబోయినా వాళ్లమీద కేసులు లేవు. పైగా వాళ్లు తీసేయమంటే మొహంతీని తీసేయడం. నక్సలిజాన్ని బాగానే అణిచారు కానీ ఉగ్రవాదాన్ని పెంచారు. ఆక్టోపస్‌ని పెట్టనివ్వలేదు. అనేక మంది నిజాయితీ పరులైన అధికారులు వుత్తిపుణ్యాన బదిలీ అయ్యారు.

తెలంగాణా విషయంలో వైయస్ ధైర్యాన్ని మెచ్చుకుని తీరాలి. తెలంగాణా సీనియర్లు ఎన్ని చికాకులు పెట్టినా ఓర్పుతో వాళ్ల నోరు మూయించారు. తెరాస ఆడే నాటకానికి స్వస్తి పలికారు. వాళ్లను ఎక్కడుంచాలో అక్కడుంచారు. ఇప్పుడు ఎలక్షన్ కూడా ఏ పొత్తులూ

లేకుండా దిగుతున్నారు. ఎన్నికల సందర్భంగా ఏ కొత్త పథకమూ ఎనౌన్సు చేయకపోవడంలోని ఆత్మస్థయిర్యం నాకు చాలా బాగా నచ్చింది. అందరికంటె ముందుగా టిక్కెట్లు పంపిణీ చేశారు. అసమ్మతి పెద్దగా లేకుండా చూసుకున్నారు. గెలుపైనా, ఓటమైనా నాదే అంటూ బరిలోకి దిగారు. ప్రచారానికి తానొక్కడే దిగారు. మహేష్‌బాబును రమ్మనలేదు.

తనవాళ్లనుకున్న వాళ్లందరికీ వైయస్ ఏదో ఒక మేలు చేశారు. రాజకీయంగా పనికి వస్తారనుకున్న వారందరినీ ఆదుకున్నారు. హై కమాండ్ మన్ననలు పొందారు. కాంగ్రెస్ వరస చిన్నప్పటినుండీ చూస్తున్నాను. పత్రికలు చదివి కాంగ్రెస్ ఓటమి తథ్యం అనుకుంటాం. కానీ వాళ్లకు పడే 35-40% ఓట్లు ఎప్పుడూ పడుతూనే వుంటాయి. అదేమిటంటే కాంగ్రెస్‌లో గ్రామస్థాయినుండీ నాయకులుంటారు. వీళ్లు మామూలు జనాలతో బాగా కలిసిపోయి, వాళ్ల పనులు చేసిపెడుతూ వుంటారు.

ఎన్నికల్లో నెగ్గినా, ఓడినా యీ కాంటాక్ట్స్ పోగొట్టుకోరు. ఏ జిల్లాకు ఆ నాయకుడుంటాడు. ఒక్కోప్పుడు ఇద్దరు ముగ్గురుంటారు. వాళ్లు ఆ జిల్లాను మేనేజ్ చేసేస్తారు. బస్. ఓవరాల్‌గా కాంగ్రెస్ నెగ్గేస్తుంది. తక్కిన పార్టీల్లో అలా కాదు, ఊపుంటే బాగా పడతాయి, లేకపోతే హుళక్కి. ఆ పార్టీ నాయకుడు స్వయంగా వస్తే తప్ప యిక్కడ ప్రచారరథం కదలదు. నెట్‌వర్క్ లేకపోవడమే వాళ్ల ప్రధానమైన లోపం.

1983 ఎన్నికల తర్వాత టిడిపి యీ లోపాన్ని సరిదిద్దుకుని తను కూడా కాంగ్రెస్‌లాగానే వోట్ బ్యాంక్‌ను సృష్టించుకుంది. అయినా లోకల్ లీడర్స్‌కి కాంగ్రెసు యిచ్చిన ప్రాధాన్యం చంద్రబాబు యివ్వరు. ఆయన వస్తే తప్ప కాండిడేట్లు డబ్బు ఖర్చు చేయరు. ప్రచారం సరిగ్గా చేయరు. సినిమానటులు వచ్చినపుడు చూడడానికి వచ్చిన జనం తర్వాత ఓటర్లుగా తర్జుమా కావడానికి యీ నెట్‌వర్కే అవసరం. చిరు పార్టీ అలాటిది ఏర్పాటు చేసుకోకపోవడం వలననే యిప్పుడు వెనకబడుతోంది.

వైయస్ అమ్ములపొదినుండి ఆఖరినిమిషంలో హైదరాబాదు అస్త్రం లాగారు. ప్రతిపక్షాలు అది ముఖ్యమంత్రి హోదాకు తగదు అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎవడు చూడవచ్చాడు? నెల్లాళ్లు పోయాక ముఖ్యమంత్రి అవునో కాదో! ఇక ఔచిత్యం గోల ఏల? మంచి ఆయువుపట్టు చూసి ఆయుధం విసిరారు. కెసియార్‌ను ఎంత దాచేద్దామని చూసినా ఆయన రెచ్చిపోదున్నాడట. కెసియార్ మాటలే వైయస్‌కు పెట్టుబడి. వాటిని ఖండించలేని నిస్సహాయత బాబుది.

1969 తెలంగాణా వుద్యమంలో హైదరాబాదులోని ఆంధ్రప్రాంతం వారికి బ్రహ్మానంద రెడ్డి దేవుడిలా నిలిచారు. ఆంధ్రావారిని కాపాడారు. ఆయన గురించి, ఆయన భార్య గురించి (పేరు పెట్టి రాసేవారు) చెన్నారెడ్డి, ఆమోస్, ఎమ్మెస్, వెంకటస్వామి, పురుషోత్తమరావు వంటి 'పెద్దలు' (ఇప్పటి సోకాల్డ్ సీనియర్లు) హైదరాబాదు గోడలపై బూతులు రాయించినా తొణకలేదు, బెణకలేదు. దాని కారణంగా ఆయన పదవి పోతుందన్నా బెదరలేదు. ఆనాటి బ్రహ్మానందరెడ్డి ధైర్యం యీనాడు వైయస్‌లో కనబడుతోంది. తన పార్టీ ఒత్తిళ్లకు లొంగి ఆయన తెరాసతో స్నేహం చేయవలసి వచ్చినా స్వభావతహ సమైక్యవాదినే అని నిరూపించుకున్నారు. రాయలసీమ హక్కుల గురించి పోరాడిన ఒకప్పటి ఉపప్రాంతీయవాదిలో యిది చెప్పుకోదగ్గ మార్పే! ఇక ఫైనల్‌గా ఎవరికి ఎన్ని వస్తాయో వచ్చే వ్యాసంలో!

12

ఇక ఫైనల్‌గా ఎవరికి ఎన్ని వస్తాయో చూడబోతే -

లెఫ్ట్ 8-10, మజ్లిస్, బిజెపి, లోక్‌సత్తా, ఇండిపెండెంట్స్, రెబెల్స్‌కు ఓ 15-20, తెరాసకు 12-15, పీఆర్పీకు 50-60 వస్తే 94 వరకూ లెక్క తేలాయనుకోండి. సమాన అవకాశాలున్నాయి కాబట్టి మిగిలిన 200లో 100 టిడిపికి, 100 కాంగ్రెస్‌కు వచ్చే ఛాన్సు వుందనుకుందాం. హంగ్ వస్తుంది. పీ ఆర్పీ ఎవర్ని సపోర్టు చేస్తే వాళ్లు గద్దె కెక్కుతారు.

అయితే యిలాటి హంగ్ సాధారణంగా రాదు. 1-2% మొగ్గు వచ్చి 500-1000 ఓట్ల తేడాతో తాసు ఒకవైపుకే వొరుగుతుంది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు టిడిపికి ఓట్ల తేడా 50 లక్షలు మాత్రమే! సీట్లలో తేడా వందల్లో వుంది. అలాగే యీ సారీ జరగవచ్చు. సానుభూతిపరులను బయటకు రప్పించడం, బూత్ మేనేజ్‌మెంట్, డబ్బు పంపిణీ యిత్యాది అంశాలను లెక్కలోకి వేసుకుంటేనే సరైన ఫలితం వస్తుంది. అది ఆఖరి నిమిషం వరకు తెలియదు. అందుకే ఎప్పుడో చేసిన సర్వేలు దెబ్బతింటాయి. ఎగ్జిట్ పోల్స్ కొంతవరకు దగ్గరగా వస్తాయి. (వాటిలోనూ కొన్ని తప్పిపోతాయి, ఓటర్లు నిజం చెప్పకపోవడం వలన)

ఈ విధమైన స్వింగ్ 30 సీట్ల వరకు ప్రభావితం చేయవచ్చు. అంటే నెగ్గే పార్టీకి 130, ఓడే పార్టీకి 70 అన్నమాట. ఇంకాస్త స్వింగ్ వచ్చిందనుకోండి, చిరు పార్టీనుండి కూడా దోచుకోవచ్చు. అంటే చిరుకి 30-40 వచ్చి నెగ్గే పార్టీకి 150 రావచ్చు.

అయితే ఆ 130య్యో, 150య్యో వచ్చే పార్టీ ఏది అని మీరు అడగవచ్చు. యువర్ గెస్ ఈజ్ ఏజ్ గుడ్ యాజ్ మైన్. ఇంత కూలంకషంగా చర్చించాం కాబట్టి అది ఏ పార్టీయో మీకు మనసులో ఓ రూపు వచ్చి వుండవచ్చు. మీ మనసులోని దాని రూపు, నా మనసులోని దాని రూపు ఒకటి కాకపోవచ్చు. అసలు యీ లెక్కలన్నీ చీదేసి, ఏదో ఒక పార్టీ 200 ప్లస్ సీట్లతో కూడా గెలిచేయవచ్చు. ఎనీథింగ్ యీజ్ పాజిబుల్ యిన్ డెమోక్రసీ.

10 వ్యాసాల దాకా చదివించి చివరికి యిలా అంటే ఎలాగండీ అనవచ్చు మీరు. నేను ఒక క్లూ యిస్తాను. దానికి ముందు ఓ చిన్న వుదంతం. ఎమర్జన్సీ అయిపోయాక మేమందరం కాంగ్రెస్‌పై రగిలిపోతున్నాం. 1977 ఎన్నికలు వచ్చాయి. జనతా పార్టీకి ఒకు

_ విరుచుకుని పనిచేశాం. నార్త్‌లో జనతా గెలిచినా ఆంధ్రలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఎందుకిలా? అని మా ఆఫీసులో సమీక్ష పెట్టుకున్నాం. ఓ కొలీగ్ చెప్పాడు – 'నేను ఎవరికి ఓటేసినా ఎప్పుడూ ఓడిపోతూ వుంటారండి. కాంగ్రెస్‌ను యీసారి ఎలాగైనా ఓడించాలని ఓటేశాను.' అని. ఇదాసంగతి, అందరూ యిలాగే వేసి వుంటారు, అందుకే కాంగ్రెస్ గెలిచింది అనుకున్నాం.

అలాగ ఎన్నడూ – 1971లో తప్ప – కాంగ్రెస్‌కు ఓటేయని నేను యీసారి కాంగ్రెస్‌కు ఓటేశాను. కారణం మరేమీ లేదు, సమైక్యరాష్ట్ర ఛాంపియన్‌గా వైయస్ నిలిచారు కాబట్టి! రాష్ట్రం యీ దశలో విడిపోవడం నా కిష్టం లేదు. అన్నిప్రాంతాలూ అభివృద్ధి చెందాకనే విభజన జరగాలని నా ఉద్దేశం. (దీనిపై వచ్చేవారం కొన్ని వ్యాసాలు రాస్తాను).

సమైక్యవాదిగా మొన్నటిదాకా నిలచిన బాబు, నిలుస్తారనుకున్న చిరు – అందరూ తెలంగాణాపై మాట నానుస్తున్నారు. హైదరాబాదు విషయంలో విభేదాలు పెచ్చరిల్లుతాయన్న విషయం వుచ్చరించడానికి కూడా వెరుస్తున్నారు. వైయస్ ఒక్కరే ఆ విషయాన్ని ధైర్యంగా ఎడ్రస్ చేశారు. కాంగ్రెస్ యిప్పటిదాకా నాటకాలాడింది. తెరాసతో సయ్యాటలాడింది. గడియకో మాట చెప్పింది. చిత్తశుద్ధి కనబరచలేదు. రోశయ్య కమిటీ ఐదేళ్లు లేటుగా వేసింది. అయినా వైయస్ యీ సమస్య వుంది అని ధైర్యంగా అన్నారు. అందుకే ఓటేశాను. వైయస్ కాక వేరే ఎవరైనా కాంగ్రెస్ సిఎం అభ్యర్థిగా వుండివుంటే కాంగ్రెస్‌కు ఓటేసి వుండేవాణ్ని కాను.

నాలాగే చాలామంది ఆలోచిస్తే కాంగ్రెస్ అధికారంలోకి రావచ్చు, లేదా టిడిపి!

ఈ మాట నేను బహిరంగంగా చెప్పడం వలన నష్టం ఏమీ లేదు. ఇప్పటికే సగం కంటె ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటింగ్ జరిగిపోయింది. తక్కినవారు కూడా ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చేసి వుంటారు. నా వ్యాసాలు చదివి వుద్దేశం మార్చుకోరు. అసలు చదివేవారెందరుంటారో? వాళ్లలో ఓట్లెందరు వేస్తారో!? ఈ పాటికే ఓటేసేసి వుంటారేమో!

ఈ వ్యాసాలపై మీ అభిప్రాయాలు తెలుపనవసరం లేదు. ఇవి ఒక నిపుణుడు రాసినవి కాదు. గాలి పోగేసి రాసినవి. ఏ ప్రాంతంలో ఎవరిది పై చేయి? ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? అని వివరాలు అడక్కండి. దీనిపై బుఱ్ఱ బద్దలు కొట్టుకుని మీ సమయం వృథా చేసుకోకండి. మే 16 న ఎలాగూ ఫలితాలు తెలుస్తాయి. ఇంకో నెల్లాళ్లపాటు పండితుల విశ్లేషణలు అందరం కలిసే చదువుకుందాం. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: చిరును ఎందుకు రెచ్చగొట్టినట్టు?

రెండో విడత ఎలక్షన్‌కు ముందురోజు, ఎలక్షన్ రోజున చిరంజీవితో అధికార యంత్రాంగం ఎందులా వ్యవహరించారు? తలచుకుంటే ఆశ్చర్యంగా లేదూ? ఒక పార్టీ నాయకుడి గదిని సోదా చేస్తాననడమా? ఆయన సంతానం బస చేసిన గదులను తణిఖీ చేయడమా? క్రిమినల్ రికార్డు వున్న మజ్లిస్ పార్టీ నాయకుడి యిల్లు యిలా సోదా చేయగలరా? అంతెందుకు నిలబెట్టడానికి అభ్యర్థులు దొరకని 'మన పార్టీ' అధ్యక్షుడి జోలికైనా వెళ్లగలరా? అలాటిది రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ చిన్నపిల్లవాడికి సైతం అందరికీ తెలిసిన మెగాస్టార్‌తో యింత పరాచకాలా? రాజకీయంగా చూడబోయినా ఆయన కింగో, కనీసం కింగ్‌మేకరో కాబోతున్న ఆయనతో వ్యవహరించవలసిన తీరు యిదేనా?

బాగా ఆలోచిస్తే దీనివెనుక పెద్ద పథకం ఏదో వుందనిపించింది నాకు. ఎన్నికలు ప్రారంభం కావడానికి ముందు నుండీ, ప్రభుత్వ వ్యతిరేకత పెద్దగా లేదని, చిరంజీవి పార్టీ పెద్దగా నిలదొక్కుకోలేదని, అందుకని కాంగ్రెస్ గెలిచేట్టు వుంది అని ఒక అభిప్రాయం నెలకొంది. అయితే టిడిపివారి నగదు బదిలీ పథకం పేదలను బాగా ఆకర్షిస్తోందని అనడం మొదలుపెట్టారు.

దానికి తగ్గట్టు టిడిపి తక్కిన నినాదాలన్నీ పక్కన పెట్టేసి, దానిమీదే దృష్టి పెట్టింది. అధికారం వస్తే చంద్రబాబు తొలిసంతకం పెట్టేది యీ జీవో మీదనే అని యిప్పటికి అరడజను పేర్లు చెప్పారు. చివరకి దీనిమీద సెటిల్ అయ్యారు. నమూనా నగదు వితరణ పత్రాలు, ఎటిఎమ్ కార్డులు పంపిణీ మొదలెట్టారు.

దీన్ని ఎదుర్కోవడానికి కాంగ్రెస్‌కు చిరంజీవిని బలోపేతం చేయవలసిన అవసరం కనబడింది. నా వ్యాసపరంపరలో రాశాను – చిరు బలపడితే కాంగ్రెస్‌కు లాభం – ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు సమానంగా చీలిపోతాయి కాబట్టి. సరిగ్గా అదే కారణానికి టిడిపికి నష్టం. అందుకని టిడిపి, దానికి సహాయపడుతున్న మీడియా చిరును తొక్కేద్దామని చూశారు. చిరు పార్టీ పుంజుకోలేదని, పార్టీ నిర్మాణం సాగలేదని యిలా ఓ పక్క రాస్తూ, పీఆర్పీ వ్యతిరేకులకు ప్రాధాన్యత యిస్తూ వచ్చారు. చివరకి చిరు పార్టీకి ఓటేస్తే వేస్టయిపోతుందన్న అభిప్రాయం కలిగించారు. ఇలాటి స్థితిలో చిరు సానుభూతిపరులను రెచ్చగొట్టాలంటే ఒకటే ఉపాయం – చిరుతో దురుసుగా వ్యవహరించడం!

తిరుపతి సంఘటన చూశాక అప్పటిదాకా తటస్థంగా, తటపటాయిస్తున్న చిరు అభిమానులు, సానుభూతిపరులు ఎవరూ వూరికే కూచోలేరు. పీఆర్పీకి ఓటేసి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సమకట్టక వుండలేరు. యువత, మహిళలు పెద్ద ఎత్తున బూత్‌లకు తరలి రావడానికి యిది ప్రధాన కారణం కావచ్చని నా అంచనా.

ఇలాటి ఎండల్లో 80% దాటి పోలింగ్ కావడం నేనెప్పుడూ వినలేదు. అందునా మధ్యతరగతి మహిళలు గంటల తరబడి క్యూలలో నిలబడి ఓట్లేయడమా? దీనికి పలుకారణాలు చెప్తున్నారు – ప్రభుత్వ వ్యతిరేకత, వైయస్ పథకాల పట్ల ఆకర్షణ, నగదు

బదిలీ పట్ల ఆకర్షణ, యిలాటి పథకాల పట్ల మధ్యతరగతి వికర్షణ, యిలా... చిరు ఫ్యాక్టరే మెయిన్ కావచ్చు అంటాను నేను.

ఇదే సందర్భంలో నా వ్యాసపరంపర గురించి రెండు మాటలు. చాలామందికి నా విశ్లేషణ నచ్చింది. మెయిల్స్ పంపారు. వారందరికీ థాంక్స్. కొందరికి నచ్చలేదు. 12 వ్యాసాలు చదివించి చివరకు 'వేగ్'గా రాశారు అని నిందించారు. అంతకుమించి స్పష్టంగా ఎలా రాయాలో నాకు తెలియదు. ఖచ్చితంగా చెప్పగలిగే శక్తే వుంటే యిలా వ్యాసాలు రాసుకుంటూ కూచునే బదులు ఆ యా నాయకుల వద్దకు వెళ్లి 'ఎందుకు సార్, ఓడిపోతారు, విత్‌డ్రా అయిపోండి' అని చెప్పి వాళ్లకు కోట్లలో డబ్బు మిగిల్చి లక్షల్లో పారితోషికం పుచ్చుకునేవాణ్ని.

మొదటి వ్యాసంలోనే రాశాను. 'నేనేమీ నిపుణుణ్ని కాను. ఇవన్నీ సమీక్షా వ్యాసాలు అనుకునే చదవండి.' అని. జోస్యం చెప్పేవాడైనా 'గురువు స్వగృహంలో వున్నాడు. బుధుడిపై శని దృష్టి పడింది. అందుకని..' అని వివరణ యిస్తాడు. నేను కూడా ఎవరికి ఎన్ని రావడానికి అవకాశం వుందో సహేతుకంగా చెప్పబూనాను. ప్రతీ పార్టీ బలాలు, బలహీనతలు వివరించాను. నెగ్గే పార్టీకి 130 వస్తాయని, స్వింగ్ వస్తే 150 రావచ్చు అనీ రాశాను. బహుశా అది కాంగ్రెస్ కావచ్చని యిండికేట్ చేశాను. కొమ్ములు తిరిగిన పాత్రికేయులు కూడా అదే చెప్తున్నారు. కాంగ్రెస్‌కు 125 వస్తాయని యింటెలిజెన్సు వర్గాలు చెప్పాయని అంటున్నారు. నాలుగు పార్టీల మహాకూటమి మొత్తానికి కలిపి అన్ని రావచ్చంటున్నారు. చిరు పార్టీకి 40-50 అంటున్నారు. మే 16 దాకా వేచి చూదాం.

కొందరు కులాల ప్రస్తావన తెచ్చి, సమాజాన్ని చెడగొడుతున్నందుకు హితోపదేశాలు చేయబోయారు. పదేళ్లు వచ్చేదాకా వాళ్ల కులమేదో వాళ్లకు తెలియకుండా (తర్వాత అలవి కాలేదు) నా పిల్లల్ని పెంచినవాణ్ని నాకు వారి 'సెర్మన్స్' అక్కరలేదు.

ఫలితాలు వచ్చాక ఎన్‌టివిలో ప్రణయ్ రాయ్, యోగేంద్ర యాదవ్ చెరో గడ్డం వేసుకుని కులాల వారీగా ఓటింగ్‌ను విశ్లేషణ చేస్తున్నపుడు వాళ్లకు యీ హితవు చెప్పండి. మతాలు కానీ కులాలుకానీ గంపగుత్తగా ఓట్లు వేయడం మన వద్ద లేదని, ఆ విశ్లేషణ మనకు అవసరం అని నేను నా వ్యాసాల్లో ఎప్పుడో రాశాను. అయినా మన పేపర్లు కూడా 'ఫలానా అభ్యర్థి చౌదరి గారి సామాజికవర్గం కంటె వారి ప్రత్యర్థి రెడ్డిగారి సామాజికవర్గం బలహీనంగా వుండడం వలన..' అంటూ విశ్లేషణలు చేసిపడేస్తున్నారు. వారికి చెప్పండి.

సామాజికన్యాయం అంటే కులాలవారీ టిక్కెట్ల పంపిణీ అన్న అర్థం తీసిన రాజకీయనాయకులకు చెప్పండి. కులప్రస్తావన లేని సమాజం రావాలంటూనే బిసి యునైటెడ్ ఫ్రంట్‌తో పొత్తు పెట్టుకున్న జెపిగారికి చెప్పండి.

నేను చేసినది ఒక ఎకడమిక్ డిస్కషన్. దాన్ని అలాగే చూడండి. నా ఫోటోను క్షుణ్ణంగా చదివేసి నా కులమేదో తెలుసుకునే ప్రయత్నం చేయకండి. (కొంతమంది యిలా చేశామని మెయిల్స్ రాశారు) అంతకంటె ఏ నయనతార ఫోటోనో చూస్తే మనసుకు ఆహ్లాదం కలుగుతుంది! **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: ఆంధ్రభోజనం

కెసియార్ గొప్ప పాయింటు లాగారు. తెలంగాణాలో 'ఆంధ్రభోజనం' అని బోర్డులు వున్నపుడు ఆంధ్రప్రాంతాల్లో 'తెలంగాణా భోజనం' అని ఎందుకు అమ్మటం లేదని!

నిజానికి కెసియార్ ఏం మాట్లాడినా చెల్లిపోతూ వచ్చింది. కాంగ్రెస్‌లో వున్న తెలంగాణా నాయకులను దద్దమ్మలన్నా, చవటలన్నా వాళ్లు నోరెత్తరు. కాంగ్రెస్‌ను కిలోమీటరు లోతున, ఒక్కోప్పుడు పది కిలోమీటర్ల లోతున బొంద పెడతానన్నా వాళ్లకు చీమ కుట్టినట్టు వుండదు. కానీ కెసియార్ అన్నమాటలను వైయస్ రిపీట్ చేశారో, వైయస్ మీద విరుచుకుపడతారు. అంతేకాదు, ఓ పక్క ఎలక్షన్లు అవుతూండగానే 'యీ ప్రాంతాల్లో మా విపక్షాల వాళ్లే గెలుస్తారు' అని యీ సోకాల్డ్ సీనియర్లు స్టేటుమెంట్లు పడేస్తారు. ఇలాటి కూతల కారణంగా పార్టీకి ఓట్లు తగ్గితే మళ్లీ ఆ పాపాన్ని వైయస్‌మీదనే రుద్దేస్తారు. వీళ్లని పార్టీ ద్రోహులనాలా? విధేయులనాలా?

కెసియార్ ఎన్నిసార్లు మాట మార్చినా వీళ్ల కంటికి కనబడదు. ఆంధ్ర ప్రాంతపు కార్పోరేట్ కళాశాలలను మూసేస్తానని ఆయన అన్నాడు కదా. ఇప్పుడు మాట మార్చి అక్రమాలు చేసిన ఆంధ్ర కాలేజీలను మూయిస్తానని అన్నాను అంటున్నాడు. అంటే అక్రమాలు చేసిన గుజరాతీ కాలేజీని ఏం చేస్తాట్ట? వదిలేస్తాడా? అలాటప్పుడు ఆంధ్ర పదం వాడడం దేనికి? అక్రమాలను చేసిన కాలేజీలు అంటే పోయేదిగా!?

జరిగినదేమిటంటే – ఆరోజు సక్రమాలు, అక్రమాలు అనే మాటే రాలేదు. ఆంధ్ర కాలేజీలనే అన్నాడు. వైయస్ అదే మాట చెప్పి 'హైదరాబాదులో విదేశీయుల్లా బతకవలసి వస్తుంది' అంటే కెసియార్ మాట మార్చిన విషయాన్ని బయటపెట్టని కాంగ్రెస్ సీనియర్లు 'జగన్ బెంగుళూరులో విదేశీయుడా?' అని వైయస్ ను వెక్కిరిస్తూ పెద్ద పాయింటు లాగారు కానీ బెంగుళూరులో తెలుగువాళ్లని వ్యాపారాలు చేసుకోనివ్వమని ఏ కన్నడ నాయకుడూ స్టేటుమెంటు యివ్వలేదని మర్చిపోతారు. ఆంధ్రభోజనం అని బోర్డు పెడితే దాడి చేయడం లేదని మర్చిపోతున్నారు.

తెలంగాణాలో 'ఆంధ్ర భోజనం' అని బోర్డు పెట్టడమేం? అలా పెట్టినపుడు ఆంధ్రలో 'తెలంగాణా భోజనం' అని అమ్మాలి కదా! అని కెసియార్ అడగడం హాస్యాస్పదంగా వుంది.

కరీంనగర్‌లో 'ఉడిపి' హొటల్ వుంది కానీ ఉడిపిలో 'కరీంనగర్ హొటల్' లేదేం?

హైదరాబాద్‌లో 'కరాచీ బేకరీ' అని వుంది కానీ కరాచీలో 'హైదరాబాద్ బేకరీ' లేదేం?

మెహబూబ్‌నగర్‌లో 'బాంబే లాండ్రీ' అని వుంటుంది, కానీ బాంబేలో 'మెహబూబ్‌నగర్ లాండ్రీ' అని వుండదేం?

విజయవాడలో 'హాలీవుడ్ టైలర్స్' అని వుంటుంది కానీ, హాలీవుడ్‌లో 'విజయవాడ టైలర్స్' అని వుండదేం?

నిజామాబాద్‌లో 'ఆగ్రా మిఠాయి' అమ్ముతారు కానీ ఆగ్రాలో 'నిజామాబాద్ మిఠాయి' అమ్మరేం?

హైదరాబాద్‌లో 'కలకత్తా పాన్' అమ్ముతారు కానీ కలకత్తాలో 'హైదరాబాద్ పాన్' అని అమ్మరేం?

ముస్లిం ఏరియాల్లో 'రామ్‌ప్యారీ' అని అమ్ముతారు కానీ హిందూ ఏరియాల్లో 'రహీమ్ ప్యారీ' అని అమ్మరేం?

వైజాగ్‌లో 'నెల్లూరు మిలటరీ భోజనం' దొరుకుతుంది కానీ నెల్లూరులో 'వైజాగ్ మిలటరీ భోజనం' దొరకదేం?

అసలు మిలటరీలో భోజనానికి వైజాగ్ అని కానీ, నెల్లూరు అని కానీ పేరు పెట్టరేం?

ఇలా వంద ప్రశ్నలు అడగవచ్చు. వెనక్కాల మంద వుంటే వెళ్లి బోర్డులు లాగి పడేయవచ్చు. మనం గుర్తించవలసినది – ఆంధ్రభోజనం కానీ ఉడిపి హెూటల్ కానీ కలకత్తా పాన్ కానీ ఆగ్రా హల్వా కానీ అవి బ్రాండ్ నేమ్స్. అవి మనకు అమ్మేవాళ్లు ఆంధ్రులు, కన్నడిగులు, బెంగాలీవాళ్లు, ఉత్తరాదివాళ్లు  కాకపోవచ్చు. స్థానికులే వాటిని తయారుచేసి ఆ ఉత్పాదన యిలాటిది అని చెప్పడానికి ఈ పేర్లు తగిలిస్తారు.

ఆ బ్రాండ్ సృష్టించడానికి, నిలబెట్టడానికి ఎందరో కష్టపడాలి. ఇప్పుడు 'ఉలవచారు' వుందండి. గుఱ్ఱాలు తినే ఉలవలను మన చేత తినిపించారంటే ఎంత ప్రజ్ఞ వుండాలి? హైదరాబాదులో మొదట స్వీటు స్టాల్స్‌లో 'ఇక్కడ ఉలవచారు లభించును' అని బోర్డులు వేలాడదీశారు. ఇదేమిటో అని రుచి చూశాం. పదేళ్లు తిరిగేసరికి ఇప్పుడు చాలామంది కేటరర్స్ ఉలవచారును తమ ఐటమ్స్‌లో ఒకటిగా పెట్టేసారు.

అలాగే జున్ను! చాలాప్రాంతాల్లో జున్నుపాలు పారబోసేసేవారు. ఇప్పుడు స్వీట్‌స్టాల్స్ ముందు 'జున్ను లభించును' అని బోర్డు పెట్టి అమ్మడం మొదలుపెట్టేసరికి, వాటి విలువ తెలిసి వచ్చింది. తెలగపిండి కూడా కొన్ని ప్రాంతాల్లో పశువులకే పెడతారు. కొన్ని జిల్లాల్లో తింటారు. కొంతకాలం పోయేసరికి తెలకపిండిని కూడా యిలాగే మార్కెట్ చేసేవారు పుట్టుకురావచ్చు.

ఇలా ఒక బ్రాండ్ సృష్టించడానికి ఎంతో శ్రమ పడాలి. సృష్టించాక నిలబెట్టడం విషయానికి వస్తే – శాకాహార భోజన హెూటల్‌కు 'బ్రాహ్మణ ఫలాహారశాల' అని పేరు వచ్చిందంటే దానికి కారణం బ్రాహ్మణులు పక్కా శాకాహారులు అన్న పేరు పడడమే! వాళ్లూ మాంసాహారం తింటారన్న పేరుబడిందనుకోండి, అప్పుడు ఆ 'బ్రాహ్మణ' అక్కణ్నుంచి ఎగిరిపోతుంది.

మరి తెలంగాణాకు యిలాటి బ్రాండ్ లేదా? లేకేం? పోచంపల్లి చీరలు, గద్వాల చీరలు, నిర్మల్ పెయింటింగ్స్ యిలా లేవూ...? అలాక్కాదు, తెలంగాణా అనే పేరుతో అంటారా? నాకు గుర్తు వచ్చినంతవరకూ – బెంగాలీలో ఓ నాటకం వుంది – తెలంగాణా విమోచనోద్యమం గురించి! ఈ మధ్య కెసియార్ పుణ్యమాని తెలంగాణా తల్లి వెలిసింది. 'తెలంగాణా ధూం ధాం' అనే ఓ షో వచ్చింది. కావాలంటే కెసియార్ దానిమీద పేటెంట్ తీసుకుని ఆంధ్రప్రాంతంలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రచారం చేయవచ్చు. బ్రాండ్ అంటూ ఏర్పడితే వ్యాపారస్తులు మీరు వద్దన్నా ఆ పేరు పెడతారు. దేనికైనా కావలసినది ఓపిక, ఓర్పు. కెసియార్‌లో లేనివి అవే!

ఇక్కడే యింకో మాట – కెసియార్‌ను విమర్శిస్తే 'తెలంగాణాను చులకనగా చూడవద్దు' అంటూ మెయిల్స్ రాసే ఘనులు కొందరు వున్నారు. కెసియార్ యీజ్ నాట్ యీక్వల్ టూ తెలంగాణా. తెలంగాణా ఎన్నో వేల ఏళ్లగా వుంది, వుండబోతోంది. ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన తల్లి. కెసియార్ ఒక వ్యక్తి. కెసియార్‌ను తప్పుపడితే తెలంగాణా  ను తప్పుపడితే తెలంగాణాను తప్పు పట్టినట్టు కాదు, బుష్‌ను నిందిస్తే అమెరికాను నిందించినట్టు కాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: ఎల్‌టిటిఇ పై జాలి పడాలా?

ఎల్‌టిటిఈ గురించి, శ్రీలంకలో తమిళులు పడుతున్న కష్టాల గురించి రాయమని చాలామంది పఠితలు నన్ను కోరుతున్నారు. ఈ కాలమ్ చదివేవారిలో చాలామంది స్థానిక విషయాలపైననే చదువుతారనీ, జాతీయ, అంతర్జాతీయ, సీరియస్ విషయాలపైన ఆసక్తి చూపరనీ అనే వుద్దేశంతోనే యీ శీర్షిక మొదలుపెట్టాను. క్రైమ్ సినిమా చూడడానికి వెళితే పౌరాణిక సినిమా చూపిస్తే ఒళ్లు మండిపోతుంది కదా!

అయితే క్రమేపీ నాకు ధైర్యం పెరుగుతోంది. ఆ మధ్య గాంధీపై హత్యాప్రయత్నం గురించి రాశాను. ఈ శీర్షిక పాఠకులలో చాలామంది బాగా చదువుకున్నవారున్నారు. కొంతమంది కుర్రవాళ్లలో తెలుసుకుందామనే ఆసక్తి వుంది. అందుకనే ఈ విషయంపై ధైర్యం చేసి రాస్తున్నాను. నచ్చకపోతే నిర్మొహమాటంగా చెప్పండి. మళ్లీ మన వైయస్, బాబు, చిరుల వద్దకు వెళ్లిపోదాం.

జాతీయ, అంతర్జాతీయ విషయాలపై తెలుసుకోవాలంటే ఇంగ్లీషు మ్యాగజైన్లు, పుస్తకాలు తప్పనిసరిగా చదవవలసిన  అవసరం పడుతోంది నేటి తెలుగువారికి. మా చిన్నపుడు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ దినపత్రికలలో జాతీయ, అంతర్జాతీయ వార్తలు తప్పనిసరిగా వుండేవి. ఇండోనేసియాలో సుకర్ణోను సుహార్తో ఎలా పడగొట్టాడో అన్నీ మాకు తెలుసు. రష్యాలో కృశ్చేవ్, బుల్గానిన్‌ల గురించి,

లిబ్యాలో కల్నల్ గడాఫీ గురించి బాగానే తెలిసేది.

అయితే ఈనాడు వచ్చినతర్వాత పరిస్థితి మారిపోయింది. ఈనాడు తెలుగు జర్నలిజంలో ఓ విప్లవం తీసుకుని వచ్చింది. సమయానికి పేపరు చేర్చడం, ప్రింటింగ్ క్వాలిటీ, ఫాంట్, వాడుకభాష, కలర్ పేజీలు – యిలా ఎన్నో పాజిటివ్ ఛేంజెస్‌తో బాటు కొన్ని నెగటివ్ ఛేంజెస్ కూడా తెచ్చిపెట్టింది.

వార్తలను, వ్యాఖ్యలను కలిపివేయడం మొదటిదైతే, సాహిత్యాన్ని పక్కకు పడవేయడం రెండోది. అన్నిటికంటె ఘోరమైనది – జిల్లాఎడిషన్స్ పెట్టినతర్వాత పక్కింటి ఆవిడ రంకుపురాణం తెలుస్తోంది కానీ పక్కదేశంలో పారిశ్రామిక విప్లవం జరిగినా తెలియడం లేదు. గల్లీ నాయకుల ప్రేలాపనలే మనకు న్యూస్. వాటి గురించే మనకు చర్చలు, వాదోపవాదాలు. విదేశాల న్యూస్ ఎప్పుడు వస్తుందో తెలుసా? సైనిక తిరుగుబాటు జరిగినపుడు, శాకాహారం వర్ధిల్లాలంటూ విదేశీవనితలు బట్టలు విప్పేసి ఊరేగింపు చేసినప్పుడు...! అన్ని పత్రికలూ ఈనాడుని కాపీ కొడుతూ వచ్చాయి కాబట్టి గత 25,30 ఏళ్లగా పత్రికలు చదువుతున్నవారికి గృహిణి ఆత్మహత్యల గురించి తెలిసినంత బాగా ఇటలీలో మాఫియా పట్టు గురించి తెలియదు.

ఈనాడుకి విభిన్నంగా తయారవ్వాలన్న పట్టుదలతో "సాక్షి" తయారైంది కాబట్టి దానిలో ఓ పేజీనిండా విదేశీ వార్తలు యిస్తున్నారు. అయితే చిక్కు ఎక్కడ వచ్చిందంటే వాళ్లు యివాళ్టి న్యూస్ యిస్తారు. 'పోలండ్ ఎన్నికల్లో కమ్యూనిస్టుల విజయం' అన్నారనుకోండి. అసలు పోలండ్‌లో కమ్యూనిస్టుల పాతబలం ఏమిటో, లెక్ వాలెసా ఎవరో, సామ్రాజ్యవాదుల జోక్యం ఏమిటో యివన్నీ మనకు తెలిస్తే తప్ప యీ విజయాన్ని హర్షించాలో, వద్దో, అసలు ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియదు.

సాక్షివాళ్లు యివన్నీ రాయరు. ఎందుకంటే దానిలో పనిచేసే పాత్రికేయుల సగటు వయసు 30, 35 వుంటుంది. అంటే ఈనాడు వంటి తెలుగు పేపర్లు చదివి ఎదిగినవారే! అప్పటికప్పుడు వచ్చిన న్యూస్‌ను తప్పుల తడకల పేర్లతో (ఇంగ్లీషు లిపిలో వున్న విదేశీ పేర్లను మనకు వచ్చినట్టు ట్రాన్స్‌లిటరేట్ చేయడం తప్ప ఏ బిబిసియో విని సవరించుకోవడం వుండదు) దింపేయడమే కనబడుతుంది.

ఏ ఆదివారం అనుబంధంలోనో అప్పుడప్పుడు విదేశాలపై వ్యాసం కనబడుతుంది. ఎక్కువగా అమెరికా గురించే మనకు న్యూస్. ఎందుకంటే చాలామంది తెలుగువాళ్లు అక్కడ వున్నారు కాబట్టి, అది ఆంధ్రదేశానికి ఎక్స్‌టెన్షన్‌గా మనం ఫీలవుతాం. అక్కడ జలుబు వస్తే మనకు జ్వరం వస్తుంది. హిల్లరీ, ఒబామా ఒక్కొక్క రాష్ట్రంలో పోటీ పడుతూంటే మనకు అది పెద్ద న్యూస్. రెండు రాష్ట్రాల్లో పరాజయం తర్వాత హిల్లరీ మూడో రాష్ట్రంలో నెగ్గితే 'మహిళా విజయం' అంటూ ఎడిటోరియల్స్!

ఫైనల్‌గా ఆవిడ ఓడిపోనే పోయింది. ఇక వేరే ఏ యితర విదేశం గురించైనా ఏదైనా వ్యాసం వుందంటే అది ఏ ఇంగ్లీషు మ్యాగజైన్‌లోంచో దింపేసినట్టు వుంటుంది. ఇంగ్లీషు పత్రికలో అయితే పాఠకుడికి పూర్వాపరాలు తెలిసివుంటాయన్న ఊహతో రాసినట్టు వుంటాయి. వస్తునేపథ్యం తెలియని తెలుగు పాఠకులకు అది ఏ మాత్రం నప్పదు.

టీవీలు వచ్చాక పరిస్థితి చక్కబడుతుందేమో ననుకుంటే చక్కబడలేదు. మన టీవీ ఛానెల్స్ వూరూరా ఓబి వ్యాన్‌లు పెట్టుకుని ఆత్మహత్యలు చేసుకుంటానంటూ వాటర్ ట్యాంక్‌లు ఎక్కే మహిళలను కవర్ చేస్తారు తప్ప ఏదైనా జాతీయ, అంతర్జాతీయ ఛానెల్‌తో లింక్ పెట్టుకుని ఆ కథనాలు చూపించరు.

ఈ ఎన్నికల వేళ ఎన్‌డి టివి చూడండి, మన టీవీలను చూడండి. మనదెంత సేపూ మనగోలే! పక్కరాష్ట్రంలో పోటీ చేసే పార్టీల గురించి ఎవరినైనా అడిగి చూడండి. తెల్లమొహం వేస్తారు. ఈనాడుకి, ఈ టీవీకి తప్ప విడిచి వేరెవరికీ లైబ్రరీయే వుండదు. సమాచారం తెలిసిన స్టాఫ్ ఎవరైనా వున్నా రిఫర్ చేసుకోవడానికి మెటీరియల్ గానీ, చూపడానికి ఫుటేజ్ గానీ వుండదు.

దినపత్రికల సంగతి యిలా వుంది కదా, ఫీచర్సు మీద బతికే వారపత్రికల సంగతి చూద్దాం. పాలిటిక్స్‌కై ఓ శీర్షిక యిచ్చే "స్వాతి" వీక్లీలో కూడా విదేశాల ప్రస్తావన వుండదు. నిజానికి వీక్లీలన్నిటిలోనూ పాలిటిక్స్ గురించి బాగా క్షుణ్ణంగా, పూర్వాపరాలు వివరిస్తూ రాసేది కస్తూరి మురళీకృష్ణ ఒక్కరే! ఆయన ఆంధ్రభూమి వీక్లీలో "పవర్ పాలిటిక్స్" అని రాస్తారు. దేశీయ వ్యవహారాలే కాక, విదేశీ వ్యవహారాలు కూడా బేలన్స్‌డ్‌గా రాస్తారు.

ఎల్‌టిటిఈ అని మొదలెట్టి యీ సొదంతా ఎందుకు అంటారేమో, నేను ఏం రాసినా అది మీలో చాలామందికి అర్థం కావటం కష్టం. ఎల్‌టిటిఈ ఆవిర్భావానికి దారి తీసిన విషయాలు అవీ చెప్పాలంటే ఓ పెద్ద పుస్తకం రాయాలి. రాజీవ్ గాంధి హత్యను తను ఎలా ఛేదించారో చెబుతూ 'సిట్' అధినేత కార్తికేయన్ రాసిన పుస్తకానికి వల్లీశ్వర్ గారు చేసిన తెలుగు అనువాదం 'నిప్పులాంటి నిజం' పుస్తకం మార్కెట్లో దొరుకుతోంది చదవండి చాలా విషయాలు తెలుస్తాయి. అవన్నీ చిన్న చిన్న వ్యాసాల్లో చెప్పడం కష్టం కాబట్టి నా అభిప్రాయాలు కట్టె కొట్టె తెచ్చె అన్న పద్ధతిలో రెండో భాగంలో చెప్పేస్తా.

2

శ్రీలంకలో జరుగుతూ వచ్చినది మూడు ముక్కల్లో చెప్పాలంటే – శ్రీలంక జనాభా 2 కోట్లు. దానిలో తమిళుల సంఖ్య 18%. ఈ 18% జనాభాలో చాలామంది ఒకే చోట అంటే భారతదేశానికి సరిహద్దుల్లో వున్న ఉత్తరలంకలో వుండడం వలన వచ్చింది తంటా. వీళ్లలో చాలామంది రబ్బరుతోటలలో పని చేయడానికి బ్రిటిషు వారి చేత తీసుకురాబడినవారు. కష్టపడి పైకి వచ్చారు. చదువుకుని

ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని ఆస్తులు సంపాదించుకున్నారు. అయితే వీళ్లు స్థానిక జనాభాతో కలవకుండా వేరుగా మా భాష, మా తమిళ సంస్కృతి అంటూ పట్టుకుని కూచున్నారు. ఎక్కడికైనా వేరే రాష్ట్రానికి వెళ్లినప్పుడైనా ఆ రాష్ట్రంతో మనం మమేకం అవ్వాలి కానీ, మన రాష్ట్రంలో వున్నట్టే వుంటామంటే ఎలా కుదురుతుంది? ఏ ఢిల్లీయో వెళ్లి ఆంధ్రా కాలనీ అని ఓ వెయ్యిమంది యిళ్లు కట్టేసుకుని యిక్కడే తెలుగే మాట్లాడతాం, హిందీ మాట్లాడం అంటే బాగుంటుందా?

తమిళులు అక్కడ చేసినది అదే. నిజానికి శ్రీలంకలో మలయాళీలు పుష్కలంగా వున్నారు. తెలుగువారూ తగు సంఖ్యలో వున్నారు. వారెవ్వరికీ రాని సమస్య తమిళులు తెచ్చుకున్నారు. తమిళనాడులో తమిళం తప్ప తక్కిన భాషలన్నిటినీ తొక్కి పారేసే వీరు పరదేశంలో కూడా తమ ధాష్టీకం చెలాయించడంతో వచ్చిన గొడవ యిది. కర్ణాటక చర్చిల్లో స్థానిక భాష కన్నడంలో సెర్మన్స్ యిస్తూంటే 'కూడదు, తమిళంలో యివ్వాల'ని గొడవ చేసి ఫాదర్‌ను కొట్టిన సంఘటనలున్నాయి.

వీళ్ల వాదనేమిటంటే బ్రిటిష్‌వారు ఆక్రమించడానికి ముందు వీళ్లున్న ఉత్తర లంకను మధురకు చెందిన తిరుమలై నాయకన్ పాలించాడని, బ్రిటిష్‌వాళ్లు పోయారు కాబట్టి అది తమకు యిచ్చేయాలనీ! గట్టిగా మాట్లాడితే తిరుమలై నాయకన్ తెలుగువాడు. మనం యిండియాలో ఏం చేశాం? బ్రిటిష్‌వాళ్లు వచ్చేముందు ఢిల్లీ పాలించిన బహదూర్ షా జఫర్ మొగల్ వాడు కాబట్టి, మొగళ్లు ఆఫ్ఘనిస్తాన్‌నుండి వచ్చారు కాబట్టి బ్రిటిష్‌వారి నుండి స్వతంత్రం రాగానే ఢిల్లీ పట్టుకెళ్లి ఆఫ్ఘనిస్తాన్‌కి అప్పగించామా?

ఈ తమిళులకు సింహళభాష అన్నా, సింహళీయులన్నా చిన్నచూపు. తమిళం రెండవ అధికారభాష చేయాలని, తమను తమిళంలోనే చదువుకోనివ్వాలనీ.. యిలాటి గొంతెమ్మకోరికలెన్నో! వీళ్లలో డబ్బున్నవాళ్లు ఎందరో! కానీ మమ్మల్ని తొక్కేశారని అన్యాయంగా గోల చేస్తారు. ఇలాటివాళ్లను ముందులోనే మొట్టికాయలేసి కూచోబెడితే పోయేది. వీళ్లను ఉన్న చోటే వుండనీయకుండా దేశమంతా అన్ని ప్రాంతాలకూ తరలించేస్తే పోయేది. కానీ వీళ్లు ఒకేచోట గూడు కట్టుకుని గంపగుత్తగా ఓట్లేయడంతో వీళ్ల ఓట్లకోసం లంక రాజకీయవాదుల్లో కొందరు వీళ్లని దువ్వారు.

వాళ్లకు ప్రతిగా కొందరు కాలుదువ్వారు. సింహళ నాయకుల్లో అనైక్యత కారణంగా వీళ్లపట్ల వ్యవహరిస్తూ వచ్చిన పద్ధతి మారుతూ పోయింది. కొంతకాలం మెత్తగా, మరికొంతకాలం కఠినంగా, యింకోసారి రాజీ, ఒక్కోసారి మరీ కాఠిన్యం యిలాగ.. లంక నాయకులు చవటలు అనకండి. మనం మావోయిస్టులతో, కశ్మీర్ ఉగ్రవాదులతో చేస్తున్నది యిదే కదా..! తమిళుల హక్కుల కోసం పోరాటం అంటూ కొన్ని సంస్థలు ఉద్భవించాయి. వాళ్ల రాజకీయ ప్రయోజనాలకోసం ఓసారి ముందడుగు, నాలుగుసార్లు వెనుకడుగు... యిలా నడుస్తూ వచ్చింది. దాంతో తమిళులలో అసహనం ప్రబలింది. అటు లంక నాయకులలో అతివాదులు స్పందించారు.

అలాటి పరిస్థితుల్లో ప్రభాకరన్ ప్రభవించాడు. మహా దుందుడుకు వాది. అతి క్రూరుడు. సాటి తమిళనాయకులందరినీ చంపి పారేశాడు. చట్టవ్యతిరేకమైన పనులన్నీ చేశాడు. స్మగ్లింగ్, డ్రగ్స్, ఆయుధాల సరఫరా.. ఒకటి కాదు, రెండు కాదు. సర్వవిధాల మానవాళిని నాశనం చేసే పనులన్నీ చేసి డబ్బు పోగేశాడు. అక్కడున్నవారిని భయభ్రాంతుల్ని చేసి లొంగదీసుకున్నాడు. ఎమోషనల్‌గా రెచ్చగొట్టి తను చెప్పినట్టు తుచ తప్పకుండా చేసే ఆత్మాహుతిదళాలను తయారుచేసాడు.

ప్రపంచంలో ఎక్కడా చేయనంత ఘోరంగా చిన్నపిల్లల్ని కూడా వీటికి వుపయోగించాడు. తనూ, తన కుటుంబం మాత్రం క్షేమంగా వుండేట్టు చూసుకున్నాడు. తమిళనాడులో, విదేశీయులలో వున్న తమిళులలో తను తమిళుల కోసం పోరాడే వీరునిగా చిత్రీకరించుకుని, అక్కడ నాయకులను, మీడియాను డబ్బుతో, పలుకుబడితో, బ్లాక్‌మెయిల్‌తో లొంగదీసుకున్నాడు.

పొరుగునున్న శ్రీలంక అమెరికాకు వత్తాసు పలుకుతూండడంతో, ఆ దేశాన్ని కంట్రోల్ చేయడానికి మనం ఎల్‌టిటిఈను ఆదరించాం – పాకిస్తాన్‌ను అదుపు చేయడానికి బాంగ్లాదేశ్‌ను తయారుచేసినట్టు ఎల్‌టిటిఈకు తర్ఫీదు యిచ్చి, డబ్బిచ్చి, నెత్తి కెక్కించుకున్నాం. వాళ్లు క్రమేపీ తమిళనాడులోని తీరప్రాంతాలపై పట్టు సంపాదించుకుని స్మగ్లింగ్ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగించుకున్నారు.

ఎల్‌టిటిఈ పేరు చెప్పి తమిళ సెంటిమెంటు రెచ్చగొట్టి ఓట్లు సంపాదించుకుందామని చూసిన తమిళ రాజకీయనాయకులు ఎల్‌టిటిఈకి వత్తాసు పలికారు. దాంతో రెచ్చిపోయిన ఎల్‌టిటిఈ వాళ్ల దేశపు హత్యారాజకీయాలను తమిళనాడుకీ వ్యాపింపచేసింది. మితవాదనాయకుల్ని చెన్నయ్‌లోని పాండీబజారులో కాల్చి చంపారు. చివరకు మనదేశ మాజీప్రధానిని మనగడ్డపై ఆ పరాయిదేశస్తుడు చంపాడు. మనదేశస్తులెందరో ఆ కుట్రలో పాలుపంచుకున్నారంటే ఎంత సిగ్గుచేటు!

ఇన్నాళ్లకు లంక ప్రభుత్వానికి చేవ వచ్చింది. రాజపక్షే రెండేళ్లగా చాలా తెలివిగా వ్యవహరిస్తూ కథను కంచికి తీసుకుని వస్తున్నాడు. ఎల్‌టిటిఈది పై చేయిగా వున్నంతకాలం కిమ్మనని తమిళ రాజకీయ ఘాతకులు వాళ్లు ఓడిపోతూండడంతో శ్రీలంక యుద్ధం మానేయాలని నీతులు చెపుతున్నారు. ఉగ్రవాదం ఎవరు చేసినా, అసాంఘిక కార్యకలాపాలు ఎవరు చేసినా మనం ఖండించవలసినదే!

ఇక తమిళులను ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నారు, తొక్కాతోలూ అంటే మనం ముస్లిములను, కశ్మీరీయులను అలాగే చూస్తున్నామని మరొకడు అంటాడు. పెళ్లి చేసి అమ్మాయిని పంపించేటప్పుడే 'అమ్మా అత్తవారి యింట్లో వ్యక్తిగా మెలగు' అని చెపుతాం. అలాటిది 'మీరు అక్కడి కెళ్లినా తమిళ జెండా ఎగరేసి సింహళం నేర్చుకోకండి' అని తమిళులకు చెప్పగలమా?

ప్రభాకరన్ సేన నిర్మూలించబడ్డాక శాంతి ప్రక్రియ ప్రారంభమైనపుడు శ్రీలంక కోరినా మనం కలగజేసుకోకూడదని నా అభిప్రాయం. అక్కడి తమిళులు, సింహళీయులు కలిసి కూచుని తేల్చుకోవలసిన విషయాలవి. కరుణానిధి గట్టిగా పోట్లాడితే ప్రధాని'ముందు తమిళనాడులో మూసేసిన తెలుగు స్కూళ్లను తెరిపించి ఆ పైన అడుగు' అని చెప్పాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: ఎల్‌టిటిఇ గురించి ముక్తాయింపు

ఎల్‌టిటిఈపై నేను రాసినదానికి చాలామంచి రెస్పాన్స్ వచ్చింది. రాసినవాళ్లలో 90% మంది నా దృక్పథాన్ని మెచ్చుకున్నారు. మనం పరాయిగడ్డకు వెళ్లినచోట వాళ్లతో కలసిమెలసి వాళ్లకు అనువుగా వుండాలని అనడం చాలామందికి నచ్చింది. తమిళులు నేర్చుకోవలసినది ఆ గుణాన్నే! వాళ్లు తమ మేధస్సుతో, కష్టపడే స్వభావంతో అనేక ప్రాంతాల్లో పైకి వచ్చారు. కానీ ఎక్కడికి వెళ్లినా వాళ్ల ఐడెంటిటీని చాటుకుంటారు. అక్కడే యిబ్బంది వస్తుంది. తెలుగువారిలో వున్న సుగుణం – స్థానికులతో కలిసిపోవడం!

కలిసిపోవడం విషయంలో పార్శీల గురించి ఓ ఉదంతం చెప్తాను వినండి – కొన్ని శతాబ్దాల క్రితం మాట. పారసీకదేశాన్నుండి శత్రువుల చేత వెళ్లగొట్టబడిన రాజు భారతదేశంలోని గుజరాత్ తీరానికి చేరాడు. తమను తలదాచుకోనివ్వమని కోరుతూ అభ్యర్థన పంపాడు.

గుజరాత్ రాజు యిరకాటంలో పడ్డాడు. ఇప్పటికే దేశమంతా కిటకిట లాడుతోంది. వీళ్లని ఎక్కడ ఎకామడేట్ చేస్తాం? అనుకుని పొమ్మని నోటితో చెప్పలేక రాయబారి ద్వారా గ్లాసునిండా పాలు నింపి పంపాడు. గ్లాసు యిప్పటికే నిండిపోయి వుంది. మీరొస్తే పొంగి పొర్లిపోతుంది సుమా అని సందేశం!

పార్శీ రాజు ఆ గ్లాసుడు పాలల్లో గుప్పెడు పంచదార కలిపాడు. పంచదార పాలల్లో కలిసిపోయింది. గ్లాసులోని పాలు పొర్లిపోలేదు, ఒలికిపోలేదు. పైగా మధురమైన రుచి సంతరించుకున్నాయి. 'మేము విడిగా వుండము. మీలో ఒకరిగా కలిసిపోతాం.' అని చెప్పకనే చెప్పాడు. గుజరాత్ రాజు సంతసించాడు. పార్శీలకు ఆశ్రయం యిచ్చాడు.

అప్పటినుండి పార్శీలు గుజరాత్ భూమిపుత్రులయ్యారు. భారతీయులుగానే వున్నారు. భారతదేశంతో మమేకమై దేశాన్ని వృద్ధి చేశారు. టాటాలు, వాడియాలు, నాడియాలు.. అందరూ వాళ్లే కదా! వాళ్లలో ఓ పార్శీ అయిన ఫిరోజ్, ఇందిరా గాంధీని పెళ్లాడి మన దేశపు పాలకులకు మూలపురుషుడు కూడా అయిపోయాడు!

తెలుగువాళ్లు యీ కథ విన్నారో లేదో తెలియదు కానీ యీ స్ఫూర్తిని వంటబట్టించుకున్నారు. ఎక్కడకి వెళితే అక్కడ వాళ్లతో మమేకమై పోయారు. తమిళనాడులో దాదాపు 2 కోట్లమంది తెలుగువారు యింకా నివసిస్తున్నారంటే అది తమిళ సంస్కృతిని గౌరవించే తెలుగువారి గొప్పే! వీరతమిళ వాదులుగా చెలామణీ అవుతున్న కరుణానిధి, వైగో, భాగ్యరాజ్, విజయకాంత్.. వీళ్లందరూ తెలుగుసంతతి వారే!

తమిళులు యీ పని చేయడం లేదు. ఎక్కడకి వెళ్లినా వాళ్ల కట్టూ బొట్టూ బహిరంగంగా మేన్‌టేన్ చేస్తూ 'మేము వేరే' అని చాటుకుంటారు. అందుకే వారిపై స్థానికులు దాడులు చేస్తూ వుంటారు. కర్ణాటకలో తెలుగువాళ్లు ఎంతమందో వున్నారు. తెలుగు-కన్నడ గొడవలు ఎప్పుడూ రాలేదు. ఆల్‌మట్టి సమస్య నడుస్తున్నపుడు కూడా! కానీ కావేరీ విషయంలో తమిళులకు ఎందుకు వస్తున్నాయి?

నాకు ఈ మెయిల్ రాసిన ఒకాయన ఓ విషయం చెప్పారు. కన్నడ నటాగ్రేసరుడు రాజ్ కుమార్ పోయినప్పుడు అతని అభిమానులు అందరి దుకాణాలను మూయించారట. అందరూ మూసేశారు. కానీ బెంగుళూరులో తమిళులు ఎక్కువగా వున్న ప్రాంతాల్లోని దుకాణదారులు పంతం కొద్దీ మూయలేదట. ఇదీ రెచ్చగొట్టే విధానం.

ఏ నగరంలోనైనా చూడండి, తమిళులు క్రమంగా ఓ లొకాలిటీలో వచ్చి చేరతారు. అక్కడ అప్పడాలు, కాఫీ పొడరు అమ్మే దుకాణం పెట్టిస్తారు. ఆ తర్వాత గుడి అంటారు. (స్థానికులు హిందువులే అయినా వాళ్ల గుళ్లు వీళ్లకు పనికి రావు) ఆ గుడి గోపురం మీద తమిళ అక్షరాలతో బోర్డు పెట్టిస్తారు. పూజారిని తమిళనాడునుంచి తెప్పిస్తారు. తమిళంలో మంత్రాలు చదివిస్తారు. దాంతో స్థానికులకు ఒళ్లు మండుతుంది. ఇక్క అక్కణ్నుంచి టెన్షన్లు మొదలు.

తెలుగువాళ్లకు యిలాటి సమస్యలు రావు. పక్కన మరొక తెలుగేతరుడున్నాడంటే ఇంగ్లీషులోనో, హిందీలోనో మాట్లాడి వాడు వెళ్లిపోయాక తెలుగు మాట్లాడతారు. తెలుగువాళ్లనే కాదు, కన్నడిగులు, మలయాళీలు యితర రాష్ట్రాల్లో బోల్డుమంది వున్నారు. వాళ్లెవరికీ రాని సమస్య తమిళులకు వస్తోంది. ఆఫీసుల్లో సాటి తమిళుడు కనబడగానే వాడితో అందరి ఎదుటా తమిళంలో మాట్లాడి మిగతావాళ్లకు చిర్రెక్కిస్తారు. దీనికి విపర్యమైన తమిళులు కూడా చాలామందే వుండవచ్చు. కానీ జనరల్లీ స్పీకింగ్ – తమిళులు వెళ్లిన చోటల్లా సమస్యలు తెచ్చుకుంటున్నారు. కర్ణాటకయే కాదు, సింహళం అని కాదు, మలేసియాలో కూడా రగడ ప్రారంభమైంది. దీన్ని వాళ్లే పరిష్కరించుకోవాలి.

ఈ డామినేటింగ్ స్వభావం వలననే తమిళులంటే అందరూ కాస్త దూరంగా వుంటారు. నిజానికి 1960లలో డిఎంకె వాళ్లు భారతదేశంలోంచి విడిపోయి ద్రవిడస్తాన్ ఏర్పడాలని ఆందోళన చేశారు. వింధ్యకు క్రింద ప్రదేశమంతా ద్రవిడులదేననీ, ఆర్యుల కంటె వాళ్లు భిన్నమైన జాతి అనీ, తమిళ బ్రాహ్మణేతరులు అచ్చమైన (ప్యూర్) ద్రవిడజాతి అనీ (మళ్లీ తమిళ బ్రాహ్మణులు ఆర్యులట) అందువలన తమిళనాడు నేతృత్వంలో తెలుగు, కన్నడ, మలయాళ వారితో ద్రవిడస్తాన్ ఏర్పడాలని వారి ఉద్యమం. అప్పటికే తమిళ ధాష్టీకం చవిచూసిన యితర జాతులు యింట్రస్టు చూపలేదు. అక్కడకి అది చల్లారింది.

"నడుస్తున్న చరిత్ర" అనే మాసపత్రికలో సా. వేం. రమేష్ అనే ఆయన తెలుగు భాష గురించి, జాతుల గురించి చక్కటి వ్యాసాలు రాస్తారు. తమిళనాడులో తెలుగు గురించి ఆయన జ్ఞానం అపారం. తమిళనాడు ప్రభుత్వం తెలుగుని ఎలా అణగదొక్కుతోందో ఆయన ఎన్నో ఉదాహరణలు యిస్తారు.

అంతెందుకు? ప్రాచీనభాషగా గుర్తింపు గురించి జరుగుతున్నది అందరికీ తెలుసు కదా. తమిళవాళ్లు ఆ గుర్తింపు తెచ్చుకున్నారు. మంచిదే. వాళ్లకు వచ్చాక తక్కినవాళ్లకు రాకుండా చేయడానికి కాలపరిమితి పెంచేశారు. మనం, కన్నడవాళ్లు ఏవో తంటాలు పడి ఏవో రుజువులు చూపించి ఆ గుర్తింపేదో తెచ్చుకున్నాం.

అయితే ఆ కమిటీలో వున్న తమిళుడు మనకు ఆ గుర్తింపు యివ్వకూడదని మద్రాసు హైకోర్టులో కేసు వేసి మనకు అధికారికంగా రాకుండా ఆపేశాడు. ఆ కేసు ఎన్నాళ్లు నడుస్తుందో తెలియదు. ఆ తర్వాత వాడు సుప్రీంకోర్టుకి వెళ్లకుండా వూరుకోడు. మనం బతికుండగా తెలుగు ప్రాచీనభాషగా గుర్తింపు వస్తుందో రాదో తెలియదు.

ఇక్కడ అతగాడి బుద్ధి చూడండి. తమిళానికి గుర్తింపు రావడంతో తృప్తి పడలేదు. తక్కినవాళ్లకు రాకుండా కాలు అడ్డుపెట్టడంలోనే వుంది త ృప్తి! అతను చేసినది తప్పు అని తమిళ పత్రికలు ఎడిటోరియల్స్ రాసి వుంటే ఎంత బాగుండేది! అబ్బే, వాళ్లెందుకు రాస్తారు!?

2

శ్రీలంకలో వున్న తమిళులకు సింహళం రాకపోవడం వలన ఉద్యోగాలు రావటం లేదని కొందరి వాదన. సింహళం నేర్చుకోక పోవడమేం? తమిళనాడు స్కూళ్లలో హిందీ నేర్పరు. హిందీ రాకపోతే నార్త్ యిండియాలో చెల్లుబాటు కామన్న భయంతో తమిళులు దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షలు పాసయి హిందీ నేర్చుకుంటున్నారు. అలాటి పని సింహళంలో ఎందుకు చేయకూడదు? వీడి బోడి భాష నేర్చుకునేదేమిటన్న అహంకారమా? అది సింహళీయులు హర్షిస్తారా? ఒకప్పుడు వీళ్లని మనం పాలించామన్న అహంభావం వీళ్లు మానుకోవాలి.

ఒకప్పుడు రాజరాజచోళుడు సింహళాన్ని పాలించాడు కాబట్టి సింహళం తమిళులదే అని యింకా వాదిస్తున్నారు, నా ద ృక్పథంతో విభేదించిన కొందరు. వాళ్లకు చేతులెత్తి నమస్కరించాలి. ఒకప్పుడు ఆంధ్రరాజ్యం మగధ వరకు వ్యాపించింది. అందువలన బిహార్ వెళ్లి అక్కడ తెలుగు అధికార భాష చేయాలని కోరండి చూద్దాం. ఒడిస్సాకు చెందిన గజపతిరాజులు గోదావరి తీరం వరకు పాలించారు 600 సంవత్సరాల క్రితం. అందువలన ఒడియా భాషను ఆంధ్రలో ఒకటవ లేక రెండవ అధికారభాషగా చేయమని ఒడియావాళ్లు అడిగితే మనం ఎలా ఫీలవుతాం?

ఒకాయన రాశాడు - రాజరాజ చోళుడు వెయ్యి సంవత్సరాలకు పూర్వమే సింహళాన్ని జయించాడు కాబట్టి అది తమిళులదే అని. అతని మాటెందుకు? అతని తర్వాత అతని మునిమనుమడు (రాజేంద్ర చోళుని దౌహిత్రుడు) కులోత్తుంగ చోళుడు చేర, పాండ్య, సింహళ రాజ్యాలను జయించాడు. కుంతలులను ఓడించాడు. కళింగ, కోసల, అంగ, వంగ, చక్రకూట దేశాలపై విజయయాత్ర సాగించాడు.

కులోత్తుంగ చోళ చక్రవర్తి అనే పేరుతో దక్షిణాపథాన్నీ, మధ్యభారతాన్నీ ఏకచ్ఛత్రంగా పరిపాలించాడు. అతని వారసులు చోళ రాజ్యాన్ని అయిదు శతాబ్దాలపాటు పాలించారు. అతనెవరో తెలుసా? మన తెలుగువాడైన రాజరాజ నరేంద్రుడి కుమారుడు. (తల్లి అమ్మంగదేవి రాజరాజచోళుని పౌత్రురాలు) ఆ లెక్కన సింహళం యేమిటి, పైన రాసిన దేశాలన్నీ, తమిళనాడుతో సహా తెలుగువాళ్లదేగా! పదండి మనమూ అడుగుదాం ఓ పేద్ద ఈలం!

నాతో విభేదించిన 10% వారిలో చాలామందికి సింహళీయులపై విపరీతమైన కోపం వుంది. తమిళ పోరాటం మన స్వాతంత్ర్యపోరాటంతో సమానమని వాళ్ల వుద్దేశం. (మన స్వాతంత్ర్యపోరాటంలో మనం భారతదేశం అడిగాం, ఇంగ్లండ్ కాదు. పైగా మనం ఆయుధాలు, మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ చేయలేదు. పోరాటంలో చేరమని ఎవరినీ అదలగొట్టలేదు) ఎల్‌టిటిఈ విధానాలు తప్పయినా, తమిళుల పోరాటాన్ని మనం సమర్థించి తీరాలని వీరి వాదన. 1948లో, 58లో సింహళ ప్రభుత్వం తమిళుల పౌరహక్కులు హరిస్తూ ఎలాటి చట్టం అమలు చేసిందో తెలుసా? వాటి గురించి మాట్లాడండి లాటి ప్రశ్నలు గుప్పించారు.

ఇక్కడ నా ద ృక్పథం అతి స్పష్టం. శ్రీలంక చరిత్రను మనం అధ్యయనం చేయడానికి పూనుకోలేదు. అసలు మనదేశ చరిత్ర గురించే మనం నేర్చుకోవలసి వున్నది చాలా వుంది. ఒక ఉద్యమం అంటూ మొదలయ్యాక దాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఎన్నయినా ఎత్తుగడలు వేస్తుంది. అది అప్పటి నాయకుడిపై, అతడి రాజకీయాల అవసరాలపై ఆధారపడి వుంటుంది.

మన రాష్ట్రంలో మావోయిస్టులపై నేదురుమల్లి జనార్దనరెడ్డి ప్రభుత్వం నిషేధించింది. వైయస్ ప్రభుత్వం ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లకు ఆహ్వానించింది. దాన్ని బట్టి నెల్లూరు వాళ్లు మావోయిస్టుల శత్రువులనీ, కడపవాళ్లు స్నేహితులని తీర్మానిస్తే ఎలా? ఆ రోజు ప్రభుత్వం రాజకీయ అవసరాలపై యివన్నీ నడుస్తాయి. అవన్నీ చెపుతూ పోతే ఓ బ ృహద్గ్రంథం రాయవచ్చు.

మనదేశంలో కూడా నాగాలు, బోడోలు, మిజోరం ప్రజలు, అస్సామీయులు, శిక్కులు, కశ్మీరీలు తమ తమ స్వాతంత్ర్యం కోసం

పోరాటాలు సలిపారు. సలుపుతున్నారు. వాళ్లతో మన ప్రభుత్వం వ్యవహరించే తీరుపై ఉద్యమకారుల నడిగితే వంద ఫిర్యాదులు చెపుతారు. ఏది ఏమైనా ఏ అమెరికాయో మధ్యవర్తిత్వానికి వస్తే 'ఇది మా యింట్లో గొడవ, మేం తేల్చుకుంటాం' అంటాం. చైనాయో, పాకిస్తాన్‌యో వేలెడదామని చూస్తే వూరుకుంటున్నామా? అలాగే నేననేది – లంక తమిళుల గొడవ శ్రీలంక గొడవ. మనం తలదూర్చడం మర్యాద కాదని. అబ్బే అలాక్కాదు, మనం దూర్చాలి అని కొందరి వాదన.

వాళ్లేమంటారంటే – శ్రీలంకలోని బౌద్ధులు హిందువులను అణచివేస్తున్నారు, గుళ్లను కూల్చేస్తున్నారు. సాటి హిందువులను మనం కాపాడాలి అని. (ప్రభాకరన్ క్రిస్టియన్ కాబట్టి, క్రిస్టియన్ దేశాలు వెళ్లి పరిష్కరిస్తాయేమో చూద్దామా?) నేపాల్‌లో ఆర్మీ చీఫ్, ప్రధానమంత్రి – యిరుపక్షాలా వున్నది హిందువులే. మనం వెళదామా? వెళితే బాగుంటుందా? అమృతసర్‌లోని స్వర్ణదేవాలయంలో మన ప్రభుత్వం ఆపరేషన్ బ్లూస్టార్ చేశాక విదేశాల శిక్కులు వచ్చి మనకు బుద్ధి చెప్పబోతే విన్నామా?

అక్కడ వున్నది మన తమిళులు కాబట్టి మనం వెళ్లాలి అని కొంతమంది వాదన. తమిళులు అన్న విషయం పక్కకు పెట్టి ఆలోచించండి. అనేక దేశాలలో అనేక జాతులవారు కొట్టుకుంటున్నారు. వారిలో కొంతమందిది న్యాయం కావచ్చు, మరికొంతమందిది అన్యాయం కావచ్చు. మనమేమైనా చేయగలుగుతున్నామా? ఇక్కడ మన భారతీయ సంతతివారైనంత మాత్రాన మనం ఎందుకు కలగజేసుకోవాలి? దక్షిణాఫ్రికాలో, ఉగాండాలో, పలుదేశాల్లో భారతీయ సంతతివారున్నారు, వారిలో కొందరు బాగుపడ్డారు. మరి కొందరు కష్టపడుతున్నారు. వెళ్లి వాళ్లని ఉద్ధరిస్తున్నామా? అక్కడకు మన సైన్యాలను పంపుతున్నామా?

గాంధీగారు దక్షిణాఫ్రికాలో భారతీయుల తరఫున పోరాడారంటే అక్కడకు వెళ్లి వాళ్లతో భుజం కలిపి పోరాడారు. ఈ వైగోలకు, కరుణానిధులకు దమ్ముంటే గాంధీగారిలాగ శ్రీలంక గడ్డపైకి వెళ్లి పోరాడమనండి. అది వీళ్లకు చేతకాదు. ఇక్కడవాళ్లని పుకార్లతో రెచ్చగొట్టి మనవాళ్ల ఆస్తులే నాశనం చేయగలరు. కోయంబత్తూరులో కొంతమంది మన భారతఆర్మీ వ్యాన్‌లపై దాడి చేశారు. ఎందుకంటే భారతదేశపు ఆర్మీ శ్రీలంక ఆర్మీకి సహాయపడడానికి వెళుతోందని పుకారు పుట్టించారు. ఎల్‌టిటిఈ కొనవూపిరితో వున్న ఈ దశలో శ్రీలంక సైన్యానికి మన సహాయం అవసరమా? అన్న ఆలోచన కూడా పోదు.

3

ఒకప్పుడు మనదేశపు వారు కాబట్టి మనం సాయపడాలి అంటే పశ్చిమబెంగాల్‌లో గూరా?లాండ్ ఉద్యమానికి నేపాల్ ఆర్థిక సహాయం అందిస్తే మనం వూరుకుంటామా? మా వాళ్లను ఏం చేయండి అని బెదిరిస్తే వూరుకుంటామా? నీ పని నువ్వు చూసుకో అని చెప్తాం. అదే శ్రీలంక కూడా మనతో అనవచ్చు.

ఈ దక్షిణ ఆసియాలో మనం 'బిగ్ బ్రదర్' కాబట్టి వీళ్లందరినీ అదుపు చేయాలని ఒకాయన రాశారు. తుమ్మితే వూడే ముక్కులాటి కేంద్రప్రభుత్వం పెట్టుకుని మనమేదో స్ట్రాంగ్ నేషన్ అనుకోవడం ఎందుకండీ? ఎటుచూసినా హంగ్, హంగ్ అని వినబడుతోంది. 2,3 గ్గురు ఎంపీలుంటే చాలు ప్రధానమంత్రిని దింపడానికి! మనదేశంలో వ్యవహారాలే చక్కబెట్టలేక పోతున్నాం. ఇక తక్కినదేశాలపై పెత్తనం ఎందుకు మనకి?

'మీ వ్యాసంలో ఎల్‌టిటిఈకి ఇండియా ట్రెయినింగ్ యిచ్చారని రాశారు. నేను నమ్మటం లేదు. నాకు రుజువులు చూపించండి' అని ఒకాయన డిమాండ్ చేశారు. లైబ్రరీకి వెళ్లి 1980ల నాటి ఇండియా టుడేలు చూస్తే ఫోటోలతో సహా వేశారు. చూసుకోవచ్చు. అలాగే బంగ్లాదేశ్ ఆవిర్భావంలో ఇండియా హస్తముందన్న మాట నమ్మమని కొందరన్నారు. వాళ్లకీ యిదే సమాధానం. 1970 ల నాటి ఇలస్ట్రేటెడ్ వీక్లీలు చదవండి. నేను రాసిన ప్రతీ స్టేటుమెంటుకీ రుజువులు కూడా కోట్ చేస్తూ రాస్తే యీ వ్యాసాలు పుస్తకాలయిపోతాయి. చదివేవారిలో 90% మందికి బోరు కొట్టేస్తుంది. ప్రతీ దాని గురించి కాస్త కాస్త తెలుసుకుంటే చాలు అన్న వుద్దేశంలో వుంటారు చాలామంది. నేను అలాటివారి గురించే రాస్తున్నాను. పూర్తిగా తెలుసుకోవాలనుకునే 10% మంది కష్టపడి రీసెర్చి చేయవలసి వుంటుంది.

'సరే మేము ఎల్‌టిటిఈని సపోర్టు చేయమండి, కానీ అమాయకులైన తమిళులు మధ్యలో నలిగిపోతున్నారే, వాళ్లను ఏం చేదాం?' అంటారు కొందరు. యుద్ధవాతావరణం వున్న దేశాలన్నిటిలోనూ యిది తప్పదు. మనదేశంలో కూడా మావోయిస్టుల మధ్య, సల్వా జుడుం కార్యకర్తల మధ్య అమాయక ప్రజలు ఎప్పుడూ నలుగుతూనే వుంటారు. వీరప్పన్ మధ్య, పోలీసుల మధ్య గిరిజన ప్రజలు నలుగుతారు.

నా ఉద్దేశంలో కల్లోలిత ప్రాంతాలైన ఉత్తర లంకలో వున్న ప్రజలు ధైర్యం తెచ్చుకుని మధ్యప్రాంతాలకు తరలిపోవాలి. శ్రీలంక జనస్రవంతిలో కలవాలి. అక్కడ కూడా కాలనీలు, ఘెట్టోలు ఏర్పరచుకోకుండా సింహళీయుల మధ్య బతకాలి. అప్పుడే సమస్య పరిష్కారమవుతుంది. ఈ లోపున వాళ్లు శరణార్థులుగా వచ్చిపడుతూంటారు. ఆ భారం మనమీద పడుతూంటుంది. మానవీయ దృక్పథంతో వాళ్లను ఆదరిస్తూ వుంటాం. అయితే ఈ శరణార్థులతో ఓ చిక్కు వుంది.

వీళ్లు సొంతం విదేశీయులైతే ఫర్వాలేదు. గండం గడవగానే వెళ్లిపోతారు. కానీ మన సంతతికి చెందినవారైతే చిక్కులు వస్తాయి. ఉదాహరణకి 1947–48 మతకల్లోలాలలో తూర్పు బెంగాల్‌నుండి అనేకమంది హిందూ శరణార్థులు వచ్చి కలకత్తాలో పడ్డారు.

శరణార్థులు కదా, అన్నిటికీ తెగించి వుంటారు. అందరూ కలిసికట్టుగా వుంటారు. వాళ్లు వుండడానికి నీడ అడిగారు.

అప్పట్లో ప్రతిపక్షంలో వున్న కమ్యూనిస్టులు వోట్లకోసం వాళ్లకు దన్నుగా నిలిచారు. కలకత్తా నగరమంతా పేవ్‌మెంట్‌ల మీద వాళ్లకు నివాసం ఏర్పరచారు. దుకాణాలు పెట్టనిచ్చారు. వాళ్లంతా కమ్యూనిస్టు సమర్థకులయ్యారు. కొన్నాళ్లకు పరిస్థితులు కుదుట పడ్డాయి. అయినా వీళ్లు వెనక్కి వెళ్లలేదు. కలకత్తాలో పీఠం వేసుకుని కూచున్నారు. వాళ్ల ఓట్లకోసం ప్రతీ పార్టీ వాళ్లను దువ్వడమే! అప్పటిదాకా మహానగరంగా వున్న కలకత్తా వీరి రాక తర్వాత పరమచెత్తగా తయారైంది. ఇప్పటికీ పేవ్‌మెంట్లపై కాపురాలు, షాపులు చూస్తాం.

బెంగాలీలలో రెండు జాతులున్నాయి. బంగాల్ (తూర్పు బెంగాల్‌నుండి వచ్చినవారు) ఘోటీ (స్వతహాగా పశ్చిమ బెంగాల్ వాసులు) అని. మరీ కలహించుకోరు కానీ ఫుట్‌బాల్ టీముల దగ్గర్నుంచి ఫేవరేట్స్ వుంటాయి. బంగాల్‌లు 'ఈస్ట్ బెంగాల్ టీమ్'ని ఆదరిస్తే, ఘోటీలు 'మోహన్ బగాన్' టీముకి సమర్థకులుగా వుంటారు. ఇలా చెప్పుకుపోతే చాలా వున్నాయి.

బర్మానుండి భారతీయులను తరిమేసినప్పుడు కూడా శరణార్థులు చాలా పెద్ద సంఖ్యలో వచ్చారు. వాళ్లకోసం ఏర్పరచినదే మద్రాసులోని బర్మా బజార్. పేవ్‌మెంట్‌పై దుకాణాలు పెట్టుకోనిచ్చి స్మగుల్డ్ గూడ్స్ అమ్ముకోనిచ్చారు. ఏమిటంటే 'పాపం శరణార్థులు' అని జాలి. ఈ శరణార్థులకు బతుకే ఓ పోరాటం కాబట్టి నీతికి కట్టుబడి వుండేవాళ్లు తక్కువ. అసాంఘిక కార్యకలాపాల్లో ఎక్కువగా పాల్గొంటారు.

తమలో తాము పాతకక్షలు తీర్చుకుంటారు. ప్రభుత్వాధినేతలకు లంచాలు పెట్టి స్థలాలు ఎలాట్ చేయించుకుంటారు. ఈ శరణార్థులకోసం మన డబ్బు పెట్టి యిళ్లు కడతారు. వాళ్లు ఓ పవర్‌ఫుల్ ఓట్‌బ్యాంక్‌గా, మాఫియాగా తయారు కావడంతో వాళ్లను మచ్చిక చేసుకోవడానికి రాజకీయ నాయకులు యిలాటి పనులు చేస్తారు.

అందువలన శరణార్థులకు కూడా కొన్ని వారాలపాటు ఆశ్రయం యిచ్చి వెనక్కి పంపేయాలి. కానీ వాళ్లు వెళ్లమని మొరాయిస్తారు. సముద్రంలో నావలో బయలుదేరి కాకినాడకు చేరిన శ్రీలంక తమిళ శరణార్థులు కొందరు అప్పుడే పాట మొదలు పెట్టారు – 'కావాలంటే మమ్మల్ని జైల్లో పెట్టండి. కానీ శ్రీలంకకు తిప్పి పంపకండి, అక్కడి జీవితం దుర్భరం' అని. అక్కడికి యిక్కడ జైళ్లనీ ఖాళీగా వున్నట్టు! వీళ్లకోసం రెండు పూటలా మనం వండి వార్చాలన్నట్టు!

ఈ శరణార్థులు, వాళ్లకోసం కట్టే యిళ్లు – యీ సబ్జక్ట్‌పై నేనొక కథ రాసి వున్నాను. ''కాగితాల బొత్తి'' అని. బర్మా, సింహళం పేర్లు కలిపి 'సిళమా దేశపు శరణార్థులు' అని రాశాను. 1994లో ఆంధ్రప్రభ వీక్లీలో వచ్చింది. తరువాతి వ్యాసంగా యిస్తున్నాను.. వీలుంటే చదవండి. ముందే చెబుతున్నాను. కథనం చాలా గందరగోళంగా, క్లిష్టంగా వుంటుంది. ఏ మాత్రం బోరు కొట్టినా మధ్యలోనే మానేయండి. కడదాకా చదివి తర్వాత నన్ను తిట్టుకోవద్దు, తిట్టవద్దు. – ఎమ్బీయస్ ప్రసాద్

**2019 మే** **ఎమ్బీయస్: రాష్ట్ర విభజన**

'ఎవరు గెలుస్తారు..?' అనే సీరీస్ చాలామందికి నచ్చింది. అదే పద్ధతిలో చాలా వివాదాస్పదమైన రాష్ట్ర విభజన అంశం గురించి వ్యాసపరంపర రాయబోతున్నాను. దీనిలో నేను ఏం రాయబోతున్నానో ముందే చెప్పేస్తున్నాను – ఇష్టం లేనివాళ్లు చదవడం మానేసి, టైము మిగుల్చుకోవడానికి! నేను సమైక్యవాదిని. అలా అని సిపిఎం వాళ్లలా భాషా ప్రయుక్త రాష్ట్రాన్ని ఎన్నటికీ చీల్చకూడదన్న అభిప్రాయంలో లేను.

ఎప్పటికైనా విభజన తప్పదు. అది ఎప్పుడు జరగాలి? ప్రస్తుత పరిస్థితిలో విభజన జరిగితే వచ్చే సమస్యలేమిటి? గతంలో విభజన వుద్యమాలు ఎలా జరిగాయి? వాటి పర్యవసానాలు ఏమిటి? ఇప్పటినుండి ఏ చర్యలు తీసుకుంటే విభజన బాధారహితంగా జరుగుతుంది? అని చెపుతూ అసలు విభజన ఏ విధంగా జరగాలి? అన్న దానిపై ఒక సూచన చేసి దానిపై ఆలోచించమని అందరినీ కోరబోతున్నాను. ఆ సూచన ఎందుకు చేశానో సహేతుకంగా చెప్పాలి కాబట్టి వ్యాసాల సంఖ్య పెరగవచ్చు. ఎన్ని రాస్తానో నాకూ తెలియదు. మీ ఓపిక కొద్దీ, తీరికకొద్దీ చదవండి.

దానికి ముందు చెప్పాల్సిన విషయం – తెలుగుని ఇటాలియన్ ఆఫ్ ది యీస్ట్ అని ఎందుకంటారన్నది. దానికి ఐదారుగురు సమాధానం రాశారు. అందరూ కరక్టుగానే రాశారు. తెలుగులాగే ఇటాలియన్ భాషలో కూడా అన్ని పదాలూ అచ్చుతో అంతమవుతాయి. అదే పోలిక! వడ్లగింజలో బియ్యపుగింజ! అంతకుమించి ఇటాలియన్ భాష గొప్ప సాంస్కృతిక సంపదతో వెలిగిపోతోందని కాదు. ఆ పోలికకు మనం మురిసి ముక్కలవాల్సిన పని లేదు. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని విదేశీయులచే సైతం కొనియాడ బడిన తెలుగు..' అని హెచ్చులకు పోవలసిన పని లేదు. నువ్వు అచ్చు మా సుబ్బన్నలాగానే వున్నావు, ముక్కు పొడుగ్గా... అంటే ఏం గర్వించాలి? సుబ్బన్న పండితుడైతే తప్ప! నాకు మెయిల్ రాసిన ఒకాయన ఇటలీలోనే వున్నాడు. ఇటలీ సాహిత్యాన్ని కానీ సంగీతాన్ని కానీ యూరోప్‌లో గొప్పగా చెప్పుకుంటారా? కనుక్కోండి అని అడిగాను. ఆయన జవాబివ్వలేదు.

అన్ని పదాలూ అచ్చుతో ఆఖరవడం వలన, సంగీతానికి చాలా అనువుగా వుంటుందని ఒకాయన ఊహ చేశారు. తెలుగు సంగీతానికి చాలా అనువైన భాష అన్నమాట వాస్తవమే కానీ అది అజంత భాష కావడం చేత అని నేను అనుకోవడం లేదు. సంస్కృ

ృతం, ఉర్దూ అజంత భాషలు కావు. అయినా అవీ సంగీతానికి అనువైనవే కదా! తెలుగువాడిగా పుట్టినందుకు గర్వపడనందుకు కొందరు నన్ను విమర్శించారు. గర్వపడితే ఆ వెంటనే యింకొళ్ల భాషను చిన్నచూపు చూడడం జరుగుతుంది. భారతీయుడిగా, తెలుగువాడిగా పుట్టినందుకు సంతోషిద్దాం, గర్వపడవద్దు. ఈ సబ్జక్ట్‌పై మరెప్పుడైనా విపులంగా.. ప్రస్తుతానికి విరామం.

ఇక సబ్జక్ట్‌లోకి వస్తున్నాను. మొదటే చెప్పినట్టు నేను సమైక్యవాదిని. కానీ క్వాలిఫైడ్ సమైక్యవాదిని. చిన్న రాష్ట్రాలుగా వుంటే అభివ ృద్ధి చెందుతాయని  కొందరు వాదిస్తూ పంజాబ్, హర్యాణాలను ఉదాహరణగా చూపుతారు. అక్కడున్నన్ని నదులు మనకు వున్నాయా? అక్కడున్నంత సారవంతంగా మన భూములున్నాయా? అక్కడి వారంత కష్టపడి మనం పని చేస్తామా?

అధ్వాన్నంగా వున్న చిన్న రాష్ట్రాల లిస్టు తీస్తే కనీసం అరడజను తేలతాయి. ఆర్థికపరంగా చూసినా ఒకపాటి స్థాయి వుండకపోతే ఓవర్‌హెడ్స్ ఎక్కువై పోతాయి. ఎంత చిన్న రాష్ట్రమైనా సరే, దానికి ఓ కాబినెట్, ఓ గవర్నరు, ఓ సెక్రటేరియట్.. యిలా తడిసి మోపెడయ్యే ఖర్చులుంటాయి. వచ్చిన ఆదాయంలో చాలాభాగం దానికే పోతుంది. పైగా పొరుగు రాష్ట్రాలతో సరిహద్దు వివాదాలు, జలవివాదాలు.. వీటికే చాలా సమయం ఖర్చవుతుంది.

తమాషా ఏమిటంటే చిన్న రాష్ట్రాల్లో రాజకీయ అస్థిరత కూడా విపరీతంగా వుంటోంది. దానివలన శాంతిభద్రతలు దెబ్బ తింటున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మావోయిస్టుల భయం, మరికొన్నిటిలో వేర్పాటువాదుల భయం. ఈశాన్య రాష్ట్రాలలో టూరిజానికి ఎంతో అవకాశం వుంది. కానీ వెళతామా? రిటర్న్ టిక్కెట్టు కొంటే వేస్టవుతుందేమోనన్న భయం. అలాగని ఖఋ్చు మిగులుతుందని పెద్ద పెద్ద రాష్ట్రాలను మేన్‌టేన్ చేసినా కష్టమే. నిర్వహణ అసాధ్యమవుతుంది. ఫోకస్ వుండదు. పైగా రాజకీయంగా చూసినా ఓ చిక్కు వస్తోంది.

ఉదాహరణకి ఉత్తరప్రదేశ్ తీసుకుందాం. నాలుగు ప్రధాన పార్టీలుంటే ఒక్కోదానికి ఒక్కో ప్రాంతంలో పట్టు వుంటోంది. పశ్చిమ యుపిలో పట్టున్న పార్టీకి తూర్పు యుపిలో వుండదు. రెండు మూడు పార్టీలు కలిసి పొత్తు పెట్టుకుంటున్నారు, లేదా ఎన్నికలయ్యాక సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నారు. అవి నడవటం లేదు. ఎందుకంటే పశ్చిమ యుపిలో పట్టున్నవాడు అక్కడ అభివ ృద్ధి చేస్తామంటాడు, తూర్పువాడు అక్కడ చేస్తానంటాడు. అందరూ కొట్టుకుని ప్రభుత్వం కూలిపోతోంది. యుపిని మూడు భాగాలుగా చీల్చామనుకోండి, ఎక్కడ బలం వున్నవాడు అక్కడే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంటాడు. కంపెనీ కానీయండి, రాష్ట్రం కానీయండి, ఆపరేషనల్ లెవెల్ చూసుకోవాలి. ఆ మేరకు చేరిన తర్వాత వేరే యూనిట్ పెట్టేయాలి. ఆ లెవెల్ ఏమిటని అడగవచ్చు.

నా లెక్కలో ఐదుకోట్ల జనాభా అంటాను. రాష్ట్రజనాభా అయిదు కోట్లు దాటిన దగ్గర్నుంచీ మరొక యూనిట్ పెట్టడానికి అనువుగా యిప్పటినుండీ ఏర్పాట్లు మొదలు పెట్టాలి. ఒక ఉమ్మడి కుటుంబం వుందనుకోండి. పిల్లలు ఎదుగుతున్నారనగానే వాళ్లకోసం ఓ బెడ్‌రూమ్ కట్టించడానికి యిప్పటినుండీ డబ్బు ఆదా చేస్తాం. ఇంటిపక్కవాడు స్థలం అమ్ముతూంటే కొంటాం. ఆ పక్కనా బావి తవ్విస్తాం, మొక్కలు వేస్తాం.

2

సిపిఎం వారు యివేమీ ఆలోచించడం లేదు. 'భాషాప్రయుక్త రాష్ట్రాలను చీల్చకూడదని మా పార్టీ పాలసీ' అన్న ఒక్కమాటతో విభజన ఆలోచనను కొట్టి పారేస్తున్నారు. మన రాష్ట్ర జనాభా పెరుగుతోంది.  విభజన గురించి ఆలోచించడం మొదలుపెట్టి దానికి ఇప్పటినుండీ తగిన ఏర్పాట్లు చేస్తూ వుంటే  విభజన స్మూత్‌గా జరుగుతుంది. ఆ ఏర్పాట్లు ఎన్నాళ్లు, ఎన్నేళ్లు పడుతుందన్నది పాలకుల చిత్తశుద్ధిపై ఆధారపడి వుంటుంది.

అయితే విభజన అంటూ జరగాలన్నపుడు ఆ విభజన ఏదో యిప్పుడే ఎందుకు చేసేయకూడదని మీరు అడగవచ్చు. నాకున్న అభ్యంతరాలేమిటో చెపుతాను. రాష్ట్ర విభజన అనేది ఒక ఎడ్మినిస్ట్రేటివ్ వ్యవహారంలా చూడాలి తప్ప రాజకీయ వ్యవహారంలా చూడకూడదు. ప్రస్తుతం అది ఒక ఎమోషనల్  అంశం అయికూచుంది. ఈ ఆవేశాలు చల్లారాక ప్రశాంత వాతావరణంలో దీన్ని చేపట్టాలి. దానిలో నిపుణులు వుండాలి తప్ప రాజకీయనాయకు లుండకూడదు.

ప్రస్తుతం వున్న పరిస్థితి ఏమిటి? సిపిఎం సమైక్యరాష్ట్రమంటుంది. తెరాస ప్రత్యేక తెలంగాణా కావాలంటోంది. ఇప్పటిదాకా శాంతియుతంగా ఉద్యమం నడిపాము. ఇకనైనా విభజన చేయకపోతే 1969 నాటి సంఘటనలు పునరావ ృతం అవుతాయని హెచ్చరిస్తోంది. తెరాస డిమాండ్ ప్రకారం హైదరాబాదు తెలంగాణాలో భాగమే. అది తెలంగాణా రాష్ట్రానికే చెందుతుంది. విడిపోయిన తర్వాత ఆంధ్ర ప్రాంతం కొత్త రాజధాని కట్టుకుంటుందో మానుతుందో వాళ్లకు అనవసరం. దానికి డబ్బు ఎక్కణ్నుంచి తెచ్చుకుంటారో వాళ్లకు అనవసరం. సంయుక్త రాష్ట్రంలోనుండి ఆ ఖర్చు భరిస్తామనే హామీ వాళ్లు ఏమీ యివ్వటం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఆంధ్రప్రాంతం పెట్టుబడిదారులను వాళ్లు ఆహ్వానిస్తారు. (స్థానికులకే వుద్యోగాలు యివ్వాలన్న షరతులు పెడితే పెట్టవచ్చు. ఆ విషయం గురించి ప్రస్తావన లేదు). కొన్ని ప్రాజెక్టులను ఆపేస్తారు.

ఈ వ్యాసపరంపరలో ఆంధ్రప్రాంతం అనే మాటకు కాస్త వివరణ – 1953–56 మధ్య కోస్తా, సీమ ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినందు వలన తర్వాత 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఆ ప్రాంతాలను ఆంధ్ర అనీ, నిజాం రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలను

తెలంగాణా అని ఎడ్మినిస్ట్రేటివ్‌గా కూడా వాడడం మొదలుపెట్టారు. దీనివలన తెలంగాణా వారికి వారు ఆంధ్రులు కామనే భావన ఏర్పడింది. నిజానికి వాళ్లను రాష్ట్రం బయట ఆంధ్రులనే వ్యవహరిస్తారు – ఆంధ్రప్రదేశ్ వాళ్లు కాబట్టి. కానీ రాష్ట్రం లోపల మాత్రం వారు 'మేం ఆంధ్రులం కాము, తెలంగాణావారం' అనుకుంటారు. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో వున్నవారందరూ ఆంధ్రులే, తెలుగువారే! ఆంధ్రపదం తెలుగుకి పర్యాయపదమే. కానీ అధికారులు తెచ్చిపెట్టిన తంటా యిది.

ఈ భావన పోగొట్టడానికే మహానుభావుడు ఎన్టీయార్ 'ఆంధ్రప్రదేశ్' అని తీసేసి 'తెలుగునాడు' అని పెడదామన్నారు. కొందరు రగడ చేయడంతో మానుకున్నారు. అలా చేసి వుంటే బాగుండేది. నేను సాధారణంగా ఆంధ్ర పదాన్ని పరిమితార్థంలో వాడను. ఆంధ్ర అంటే ఆంధ్రప్రదేశ్ అనే నా వుద్దేశం. ప్రాంతాల వారీగా పేర్కొనవస్తే కోస్తా, సీమ, తెలంగాణా అంటాను. కానీ యీ వ్యాసంపరంపరలో అందరూ వాడే అర్థంలోనే వాడవలసి వస్తోంది.

సిపిఎం, తెరాస తప్ప తక్కిన పార్టీలన్నీ దోబూచులాడేవే! బిజెపి తెలంగాణా యిచ్చేస్తా యిచ్చేస్తా అంటుంది తప్ప రాజధాని, తక్కిన సమస్యల గురించి నోరెత్తదు. టిడిపికూడా అంతే. అవన్నీ కమిషన్ చూసుకుంటుంది అన్న ఒక్కమాటతో చంద్రబాబు కొట్టి పడేశారు. కాంగ్రెస్ అయితే బహురూపి. దానిలో కొందరు హైదరాబాదు తెలంగాణాకే అంటారు, మరికొందరు హైదరాబాదు కేంద్రపాలితం చేయాలంటారు. రెండో ఎస్సార్సీ అంటారు. (ఆ కుంపటి వెలిగిస్తే దశాబ్దాలపాటు రగులుతుంది) సమస్యను విస్తృతం చేసి పరిష్కరించకుండా కాలయాపన చేస్తారు.

దేన్నీ తేల్చకపోవడం కాంగ్రెస్ లక్షణం. రోశయ్య కమిటీని ఐదేళ్ల క్రితం వేసి వుంటే కాస్తయినా వాళ్ల నిజాయితీని విశ్వసించేవాళ్లమేమో! కాలమే సమస్యను పరిష్కరిస్తుందని వాళ్లకు గట్టి నమ్మకం. ఏ రోటి దగ్గర ఆ పాట పాడుతూ పొద్దు పుచ్చుతారు. పంజాబ్ కాంగ్రెస్ వాళ్లు చండీగఢ్ పంజాబ్‌కి చెందాలంటారు, హర్యాణా కాంగ్రెస్ వాళ్లు హర్యాణాకు చెందాలంటారు. మళ్లీ అందరూ కాంగ్రెస్ పార్టీ వారే!

పంజాబ్, హర్యాణా విడిపోయి దశాబ్దాల గడిచిపోయాయి. అయినా యిప్పటిదాకా రాజధాని సమస్య తేలలేదు. చండీగఢే ఉమ్మడి రాజధానిగా నడుస్తోంది. కొత్త రాజధాని కట్టుకోవడానికి కేంద్రం డబ్బివ్వలేదు. ఏ రాష్ట్రమైనా విడిపోయినప్పుడు రాజధాని సమస్యగా దాపురిస్తోంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రప్రాంతం (కోస్తా, సీమ) విడిపోయినప్పుడు మద్రాసు అడిగారు తెలుగువాళ్లు. తమిళవాళ్లు యివ్వలేదు. దాంతో ఆందోళన సాగింది. మద్రాసు డిమాండ్ వలన ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం చాలా ఆలస్యమైంది. చివరకు వొట్టి చేతులతో బయటకు రావలసి వచ్చింది.

అలాగే ఉమ్మడి బొంబాయి రాష్ట్రం నుండి గుజరాత్ విడిపోయినప్పుడు బొంబాయిని రాజధానిగా అడిగారు గుజరాతీలు. మహారాష్ట్రులు ఒప్పుకోలేదు. చివరకు గుజరాత్ వొట్టి చేతులతో బయటకు వెళ్లి అహ్మదాబాదు రాజధానిగా కొంతకాలం నడుపుకుని, చివరకు గాంధీనగర్ పేర వేరే కట్టుకున్నారు. ఈ విధంగా ప్రత్యేక రాష్ట్రం కోరినవాళ్లెప్పుడూ రాజధాని కోల్పోతున్నారు. ఆ లెక్కలో ప్రత్యేక తెలంగాణా వాదులు హైదరాబాదును రాజధానిగా వదులుకోవడానికి సిద్ధపడాలి. కానీ సిద్ధపడతారా? హైదరాబాదు తెలంగాణా మధ్యలో వుండగా ఎలా వదులుకోబుద్ధవుతుంది?

అసలు రాజధాని చుట్టూ వున్న ప్రాంతం ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం వింతల్లో వింత. అదే అద్వానీగారికి అర్థం కాలేదు. 'రాజధానికి దూరంగా అభివృద్ధి కాని ప్రాంతాల వాళ్లు వాళ్ల ప్రాంతం అభివృద్ధి కాలేదని ఫిర్యాదు చేసి ప్రత్యేకరాష్ట్రం కోరతారు. వాళ్లకు యిచ్చేసి యింకో రాజధాని ఏర్పాటు చేసుకోమంటాం. కానీ తెలంగాణా విషయంలో రాజధాని వున్నవాళ్లు ప్రత్యేకరాష్ట్రం కోరడంలో అర్థం లేదు. ఇవ్వనక్కరలేదు' అన్నారు. అఫ్‌కోర్సు, ప్రతిపక్షంలోకి వచ్చాక యీ లాజిక్ మానేసి, 100 రోజుల్లో తెలంగాణా అని మొదలు పెట్టారు. ఆలోచనలో మార్పుకి కారణం చెప్పలేదనుకోండి. ఎలాగైనా అధికారంలోకి రావాలి కదా పాపం! పార్టీకి వున్న కాస్త బలం తెలంగాణాలోనే వుంది. అందుకని ప్రత్యేకజపం జపిస్తే చాలు అనుకున్నారు.

3

ఈ సీరీస్ మొదలెట్టగానే అప్పుడే మెయిల్స్ వర్షిస్తున్నాయి. కాస్త ఓపిక పట్టండి. ఈ సీరీస్‌లో ఎనిమిదో, పదో వ్యాసాలు వస్తాయి. అన్నీ చదివాక అప్పుడు రాయండి మీ అభిప్రాయాలు. నేను చెప్పదలచుకున్నది ధైర్యంగా చెప్పడం ముగించాకనే దీని గురించి మెయిల్స్ ఓపెన్ చూసి చూస్తాను. అప్పటిదాకా రాసినా ప్రయోజనం లేదు.

నాకు ఈ మెయిల్ రాసేవాళ్లలో చాలామందికి సందేహం. 'మీరు చూస్తారో లేదో తెలియదు' అంటూ మొదలెడతారు. సందేహం వద్దు. నాకు వచ్చిన మెయిల్స్ అన్నీ నేను ఓపెన్ చేస్తాను. 'ఒరే లంజకొడకా..' అని మొదలెట్టగానే డిలీట్ చేస్తాను. తెలుగుని ఇంగ్లీషు లిపిలో రాసినవి మొదటి నాలుగైదు లైన్లు చదివి వదిలేస్తాను. గూగుల్‌దో, రీడిఫ్‌దో దేనిదో తెలియదు, ఆ తెలుగు లిపి చదవడం కంటె శిక్ష లేదు... అదీ నాలుగు లైన్లే చదువుతా! ఇంగ్లీషులో అయితే పూర్తిగా చదువుతాను. చాలావాటికి థాంక్స్ అని క్లుప్తంగానైనా జవాబిస్తాను. ఏదైనా పాయింటు వుంటే మూడు నాలుగు లైన్ల జవాబు రాస్తాను.

జవాబులో సర్ అని మొదలుపెడతాను. వాళ్లలో కొందరు 'మేము వయసులో చిన్నవాళ్లం, సర్ అనవద్దు' అంటూ తిరిగి రాస్తారు.

వాళ్లు చిన్నవాళ్లు కావచ్చు, కానీ చదువులో, అనుభవంలో, ఎక్స్‌పోజర్‌లో నాకంటె పెద్దవాళ్లే కావచ్చు. హాయ్ అనడం కంటె సర్ అనడమే నాకు హాయి. దీనిపై చర్చ అనవసరం. ఈ మెయిల్స్ ఇంగ్లీషులోనే రాస్తే నాకు సంతోషం. ఇంగ్లీషులో తప్పులున్నా కొంప మునిగిపోదు. కొంతమంది తెలుగువాళ్లమై వుండి తెలుగులో రాయకపోతే ఎలా? అంటూ తెలుగును ఇంగ్లీషు లిపిలో రాసి హింసిస్తారు. అలాటివాళ్లు తెలుగులో డిటిపి చేయించి, స్కాన్ చేసి పిడియఫ్‌లో పంపిస్తే సరి. ఏ పేరాగ్రాఫ్ అయినా నాలుగైదు లైన్ల కంటె మించకుండా వుంటే మంచిది.

ఇక విభజన యిస్యూలోకి వద్దాం. ప్రజలు ప్రత్యేక తెలంగాణా కోరుకుంటున్నారా లేదా అని ఎలా తేలుస్తాం? ప్రతీ నాయకుడు తన అభిప్రాయాలను చెప్పుకోవడానికి ప్రజల్ని అడ్డేసుకుంటాడు. ప్రజలు మమ్మల్ని మహాకూటమిలో చేరమన్నారంటారు, నెల్లాళ్లు పోయాక ఎన్‌డిఏలో చేరమంటున్నారు అంటారు. ఎన్నికల ఫలితాలు వచ్చినా ప్రజాభిప్రాయం తెలియదు. తెరాస నెగ్గిన చోట్లంతా రాష్ట్రవిభజన కోరుకుంటున్నారని, ఓడిపోయినచోట్లంతా వద్దనకుంటున్నారనీ నిర్ధారించగలమా? స్థానిక అభ్యర్థి పర్‌ఫార్మెన్స్, ప్రత్యర్థుల బలాబలాలు, కులప్రభావం, ధనప్రభావం, బూత్ మేనేజ్‌మెంట్, రిగ్గింగ్, సినిమా గ్లామరు - యిలా అనేక అంశాల వలన ఫలితాలు ప్రభావితం అవుతాయి కదా!

రిఫరెండం పెడితే తప్ప ఆ అంశంపై ఖచ్చితమైన ప్రజాభిప్రాయం తెలియదు. అయితే రిఫరెండం ఎలా పెట్టాలి? ప్రత్యేక తెలంగాణా కావాలా? వద్దా? అని ఏకవాక్య అంశం పనికి రాదు కదా! ఒకవేళ హైదరాబాదు రాజధానిగా రాకపోయినా (ఆంధ్రరాష్ట్రం అడిగినప్పుడు మద్రాసు పోగొట్టుకున్నట్టు) ఫర్వాలేదా? అని కూడా పెట్టాలి. జలప్రాజెక్టులన్నీ కోర్టుల కెక్కి ఆగిపోయినా ఫర్వాలేదా? అని అడగాలి. ఈ రిఫరెండం తెలంగాణాలోనే కాక రాష్ట్రమంతా పెట్టాలి. ఏ షరతుల మీద విడిపోవడానికి రెడీ అవుతున్నారో ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగించాలి. ఆప్షన్ ఎ, బి.. అని పది అంశాలు పెడితే తప్ప విషయంపై పూర్తి అవగాహన రాదు. నిరక్షరాస్యులు మిక్కుటంగా వున్న మనరాష్ట్రంలో యిలాటి రిఫరెండం సాధ్యమేనా?

గట్టిగా మాట్లాడితే రాష్ట్రవిభజన జరిగినచోటల్లా యిలాటి రిఫరెండం జరుగుతోందా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రజల నెత్తిన నాయకులు ఏది రుద్దితే అదే అనుభవిస్తున్నారు. అందువలన విభజనలు కానీ, మరొకటి కానీ జరిగేది నాయకుల కోసం తప్ప, ప్రజలకోసం కాదు. విభజన సమయంలో నాయకులు ఎంత గట్టిగా నిలబడితే ఆ ప్రాంతానికి అంత మేలు జరుగుతుందని చరిత్ర చెపుతోంది. విభజన తర్వాత కూడా నాయకులు గట్టిగా వుండి తమ ప్రాంతం గురించి పోరాడితేనే ప్రయోజనాలు ఒనగూడుతాయి. లేకపోతే విభజన కోరిన లక్ష్యమే దెబ్బ తింటుంది.

ఆంధ్రరాష్ట్రం కోసం పోరాటం జరిగే సమయంలో ప్రకాశం గారికి, కళా వెంకటరావు గారికి మధ్య ఐక్యత లేని కారణంగానే మద్రాసు మనకు రాకుండా పోయిందని అంటారు. అవతల తమిళుల పక్షాన నిలబడినవాడు జాతీయ నాయకుల్లో పలుకుబడి బాగా వున్న రాజకీయ దురంధరుడు రాజాజీ. అందువలన న్యాయాన్యాయాల సంగతి ఎలా వున్నా రాజకీయ పోరాట పటిమ లేకపోవడం వలన ఆంధ్ర నాయకులు అన్నీ పోగొట్టుకుని బయటకు రావలసి వచ్చింది. ప్రత్యేక తెలంగాణా కోరుతున్న వారికి రాజాజీ వంటి నాయకత్వం వుందా? ఆనాటి ఆంధ్ర నాయకులవంటి నాయకత్వం వుందా? అన్నది ఆలోచించి చూడండి కాస్సేపు..

రాష్ట్రం ఏర్పడగానే ముచ్చట తీరిపోదు. నిరంతరం దాని ప్రయోజనానికై యిరుగుపొరుగువారితో పోటీ పడుతూనే వుండాలి. ఇప్పటివరకూ మనం తమిళులతో పోటీ పడలేక పోతున్నాం. వాళ్లలో వాళ్లకి అంతర్గతంగా ఎన్ని గొడవలున్నా తమిళనాడుకి సంబంధించిన విషయాల్లో వాళ్లు సమైక్యంగా వుండి కేంద్రంతో పోట్లాడి ప్రాజెక్టులు తెచ్చుకుంటారు. మనవాళ్లలో అది లేదు. విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ తెచ్చుకోవడానికి నెలల తరబడి వుద్యమం చేయవలసి వచ్చింది. అప్పట్లో కేంద్రంలో వున్న మంత్రి సంజీవరెడ్డిగారే దీనికి అడ్డు అని వార్తలు వచ్చాయి. కారణం ఏమిటంటే - ఆ ఫ్యాక్టరీ వస్తే రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వున్న ఆయన ప్రత్యర్థి బ్రహ్మానంద రెడ్డిగారికి పేరు వస్తుందని ఆయన భయమట. ఇలా మనం ఎన్ని ప్రాజెక్టులు పోగొట్టుకున్నామో లెక్కే లేదు. యుపిఏ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలబడింది - మన రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు. వారి వల్లనే యుపిఏ ప్రభుత్వంలోకి వచ్చింది. అయినా రైల్వే బడ్జెట్‌లో మనకు విదిలించినది ఏమీ లేదు. మరి వీళ్లు ఏం ఉద్ధరించినట్టు?

4

తెలంగాణా వెనుకబడి వుంది అని అందరూ అంటారు. మరి తెలంగాణా ప్రాంతం నుండి ముఖ్యమంత్రులైన పివి, వెంగళరావు, అంజయ్య, చెన్నారెడ్డి, - ఏం చేసినట్టు? ముఖ్యమంత్రులుగానే కాదు, తెలంగాణావారు గత 50 ఏళ్లగా అనేకమైన ముఖ్యమైన మంత్రిపదవులు అలంకరించారు. వాళ్లంతా ఏం చేసినట్టు? పెద్దమనుష్యుల ఒప్పందం అమలు కాకపోతే ఏం చేసినట్టు? లేటెస్టుగా దేవేందర్ గౌడ్ 'తెలంగాణాకు ఏమీ చేయలేకపోయాను. అందుకే టిడిపిలోనుండి బయటకు వచ్చాను' అన్నారు. టిడిపిలో వున్నంత కాలం యివి గుర్తుకు రాలేదా? పోనీ విడిగా పార్టీ పెట్టి గట్టిగా పోరాడారా? లేదే! ఏడాది తిరక్కుండా తన పార్టీని యింకో పార్టీలో విలీనం చేశారు. ఈయన ఆలోచనా విధానాన్ని చిరంజీవి పూర్తిగా సమర్థిస్తారని గ్యారంటీ లేదు కదా!

అలాగే రాయలసీమ వెనుకబడి వుంది అని అందరూ అంటారు. రాయలసీమ నుండి ముఖ్యమంత్రులైన సంజీవరెడ్డి, విజయభాస్కరరెడ్డి,

చంద్రబాబు, రాజశేఖరరెడ్డి ఏం చేసినట్టు? ముఖ్యమంత్రులుగానే కాదు, రాయలసీమవారూ గత 50 యేళ్లగా అనేకమైన మంత్రిపదవులు అలంకరించారు. వాళ్లంతా ఏం చేసినట్టు? శ్రీ బాగ్ ఒడంబడిక అమలు కాకపోతే ఏం చేస్తూన్నట్టు? దీన్ని బట్టి తేలుతున్నదేమిటి? ఆ ప్రాంతానికి చెందినవారు అధికారంలోకి వచ్చినంత మాత్రాన ఆ ప్రాంత అభివృద్ధి కాదనేగా! 'మీరంతా బయటకు పొండి. మా ప్రాంతం మేం ఏలుకుంటాం' అని అనడం అతి సులభం. ఇప్పటిదాకా ఏలిన తీరు చూస్తే అలాటి నమ్మకం కలిగేట్లు ఏమైనా కనబడుతోందా?

ప్రత్యేక తెలంగాణా వాదులు కోరినట్లు ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణా విడిగా ఏర్పడితే అందుబాటులో వున్న నాయకుల గురించి ఆలోచిద్దాం. కాంగ్రెస్‌లో 'సీనియర్ల' పేర చలామణీ అవుతున్న తెలంగాణా నాయకులు – కాకా, పురుషోత్తమ రెడ్డి, ఆమోస్, గోవర్ధన్ రెడ్డి, ఎమ్. సత్యనారాయణరావు, కేశవరావు యిత్యాది నాయకులలో ఎవరినైనా ముఖ్యమంత్రిగా వూహించగలమా? వైయస్‌పై కోపంతో మీడియా వీరి స్టేటుమెంట్లకు హెడ్‌లైన్స్ యిచ్చి వీరిని వార్తల్లో వుంచింది కాని, వీరు కనీసం తమ జిల్లాలో అన్ని స్థానాలను తమ పార్టీకి గెలిపించుకోగలిగిన స్థాయి నాయకులు కూడా కాదు. టిక్కెట్ల పంపిణీ వేళ వీళ్ల మాట ఎంత బాగా చెల్లుబాటైందో చూశాం. కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ రాకపోతే బయటవారి సహాయంతో ముఖ్యమంత్రి అవుదామని చూస్తున్నారని చెప్పుకుంటున్న డి. శ్రీనివాస్ స్వంత నియోజకవర్గంలో గెలుస్తారో లేదో అనుమానం అంటున్నారు.

టిడిపి తరఫున చూడబోతే నాగం జనార్దనరెడ్డిదీ అదే పరిస్థితిట. ఇక కడియం శ్రీహరి, దయాకరరావు ఇద్దరూ వరంగల్ జిల్లా వారే. ఒకరికి ఒకరు చెక్ పెట్టుకోవడంలోనే సరిపోతోంది. మొత్తం తెలంగాణాకు నాయకులుగా ఎదగగలరా? టిడిపిలో వున్నంతవరకూ దేవేందర్ గౌడ్ చాలా పెద్ద నాయకుడిలా కనబడేవారు. స్వంత పార్టీ పెట్టుకుని తనకు స్వంత బలం ఏమీ లేదని నిరూపించుకున్నారు.

ఇలా చూస్తే తెలంగాణాకు నాయకుడిగా కనబడుతున్నది కెసియార్ ఒక్కరే. అందరూ మరిచిపోయిన తెలంగాణా వాదాన్ని ముందుకు తెచ్చి దాన్ని ఒక చర్చనీయాంశంగా చేసిన ఘనత ఆయనదే. అందువలన కెసియార్ బలమే ప్రత్యేక తెలంగాణా అంశం బలం, ఆయన బలహీనతే బలహీనత. అందువలన కెసియార్ గురించే మనం క్షుణ్ణంగా మాట్లాడుకోవాలి. ఇది చాలా సెన్సిటివ్ యిస్యూ అని నాకు తెలుసు. కెసియార్‌ని పల్లెత్తు మాట అంటే విరుచుకు పడే వీరాభిమానులున్నారని నాకు తెలుసు. అయినా ఎమోషన్స్ పక్కకు పెట్టి నిజానిజాలు మాట్లాడుకోవాలి. 1969లో చెన్నారెడ్డి కెసియార్ కంటె ప్రతిభావంతుడైన వుద్యమకారుడు. బొటనవేలు కోసేసుకుని ఆయనకు బొట్టు పెట్టినవారి వార్తలు పేపర్లో వచ్చాయి. ఆ వ్యక్తులు యిప్పుడెక్కడున్నారో తెలియదు కానీ తర్వాత చెన్నారెడ్డి ఉద్యమాన్ని ఏ గంగలో కలిపేరో అందరికీ తెలుసు. ఈ మధ్య ఓ వ్యక్తి వైయస్ గెలుపు కోసం నాలుక కోసేసుకున్నాడు. వైయస్ ఓడినా, గెలిచినా ఆయన నాలుక ఆయనకు రాదు.

అందువలన ఉద్రేకరహితంగా మనం ఎకడమిక్‌గా చర్చించుకోవాలి. ఉద్యమ నాయకుడిగా కెసియార్ ఎంత గొప్పవారు? ఏ మేరకు విజయం సాధించారు? అన్న విషయం తేల్చడానికి చిన్న కొలబద్ద వుంది. 2004 ఎన్నికల్లో ఆయన పరిస్థితి ఏమిటి? 2009లో ఏమిటి? అది చూస్తే చాలు. అప్పటికీ యిప్పటికీ పోటీ చేసిన స్థానాల్లో ఎదుగుదల వుందా? నెగ్గే స్థానాల్లో ఎదుగుదల వుందా? ఉంటే ఎంత శాతం? అది ఐదేళ్ల కృషికి తగిన శాతమేనా?

నిజానికి 2004కి 2009కి మధ్య కెసియార్ స్థాయి ఎంతో ఎదిగారు. రాష్ట్ర స్థాయి మంత్రి పదవి కూడా దక్కని స్థాయినుండి కేంద్రమంత్రి అయ్యారు. తన అనుచరులకు మంత్రిపదవులు యిప్పించుకోగలిగారు. ఎన్నికల తర్వాత తెలంగాణా వుద్యమం చల్లారిపోతుందిలే అనుకున్నవారు నాలుక కరుచుకునేట్లా దాన్ని నిత్యం వార్తల్లో నలిగేట్లా చేశారు. ఎంతోమంది ఎన్నారైలు ప్రత్యేకరాష్ట్ర సాధనకోసం పంపిన నిధులు అందుకున్నారు. నగరంలో పెద్ద తెలంగాణా భవన్ కట్టారు. 2004లో ప్రత్యేకరాష్ట్రం మాట వుచ్చరించడానికి యిష్టపడని పార్టీల చేత 2009 నాటికి అందరూ దాని గురించే మాట్లాడేట్లా చేశారు. ఇదంతా నాణానికి ఒక వైపు మాత్రమే. ఇంత సపోర్టు లభించిన ఆయన న్యాయంగా మాట్లాడితే 2009 నాటికి తెలంగాణాలోని అన్ని స్థానాలూ పోటీ చేసే స్థాయికి ఎదగవలసి వుంది. పోటీ చేసిన వాటిల్లో కనీసం సగం సీట్లు గెల్చుకున్నా రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ చక్రం తిప్పి అనుకున్నది సాధించేవారు.

కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అందరికీ తెలుసు. ఎందువలన? కెసియార్ వీరాభిమానులు యీ ప్రశ్న తమకు తామే వేసుకోవాలి. తెలంగాణాలోని అసెంబ్లీ స్థానాల్లో రమారమి మూడోవంతు సీట్లకు మాత్రమే పోటీ చేయవలసిన దురవస్థలో తెరాసను వుంచిన వారెవరు? 2004 ఎన్నికల్లో గెల్చుకున్నన్ని సీట్లు కూడా గెలుస్తారో లేదో అని అనుకునే సందేహంలో పడేసిన వారెవరు? కెసియార్‌ని అభిమానించే, ఆయన ఉద్యమానికి ప్రోత్సాహం యిచ్చే మీడియా వర్గాలు కూడా ఆయన శైలికి వ్యతిరేకంగా సంపాదకీయాలు రాశాయి.

5

కెసియార్‌ని అభిమానించే, ఆయన ఉద్యమానికి ప్రోత్సాహం యిచ్చే మీడియా వర్గాలు కూడా ఆయనలో తప్పుపట్టిన అంశాలు – లాబీయింగ్‌కి ప్రాధాన్యత యిచ్చి ఉద్యమ నిర్మాణాన్ని విస్మరించడం, దక్షిణ తెలంగాణాలో విస్తరించకపోవడం, సాటి నాయకులను దూరం చేసుకోవడం, దుందుడుకు విధానాలతో గెలిచిన సీట్లలో సగం పోగొట్టుకోవడం.. ఇలా..

రాజకీయ నాయకులు పరిణతి చెందిన రాజకీయ నాయకులతో వ్యవహరించడానికే యిష్టపడతారు. కెసియార్ కూడా అలాగే వ్యవహరించాలి. మొన్న మహాకూటమి నిర్మాణ సమయంలో ఆయన వైఖరి ఎవ్వరికీ అంతుబట్టలేదు. రోజుల తరబడి కనబడకుండా పోవడం, ఎలాట్ చేసిన సీట్లలో బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టడం, కోపం వస్తే తనే స్వయంగా ప్రెస్‌కు ఫోన్ చేసి పొత్తు లేదని చెప్పడం, ఉపయెన్నికల్లో ఓడిపోయినప్పుడు మూడు రోజుల పాటు క్యాడర్‌కు కూడా మొహం చాటెయ్యడం – యిలా ఒక నాయకుడు, సీజన్డ్ పొలిటీషియన్ చేయకూడని పనులన్నీ చేశారు. ఇప్పుడు లేటెస్ట్‌గా ఎన్‌డిఏతో చేతులు కలపడం మరొకటి.

మహాకూటమి విజయావకాశాలు ఓట్ల బదిలీపై ఆధారపడి వుందని అందరికీ తెలుసు. తెలంగాణాలో తెరాస ఓట్లు టిడిపికి, టిడిపి ఓట్లు తెరాసకు పడితేనే గెలుపు సాధ్యం. ఎన్నికల సమయంలో బిజెపిని ఎవరూ లెక్కలోకి తీసుకోక పోయినా పోలింగ్ అనంతరం చేసిన విశ్లేషణలో కెసియార్‌తో విసిగిన తెలంగాణా వాదులు బిజెపికి ఓటేశారని అంటున్నారు. ఇప్పుడు కెసియార్ ఎన్‌డిఏ వైపు మొగ్గు చూపడానికి, బిజెపికి బాగా ఓట్లు పడడానికి లింక్ ఏదైనా వుందా అన్న అనుమానం కలుగుతోంది. బిజెపి సహాయం తీసుకోబోతున్నారు కాబట్టే కెసియార్ తమ ఓట్లు టిడిపికి కాక బిజెపికి వేయించారా? ఈ అనుమానం ఆయన భాగస్వాములకు వస్తే భవిష్యత్తులో ఎవరైనా ఆయనతో చేతులు కలుపుతారా?

టిడిపికి స్వంతంగా మెజారిటీ రాదని, మహాకూటమి మొత్తానికి సింపుల్ మెజారిటీ వస్తుందని అంటున్నారు. కెసియార్ యిలాటి డోలాయమాన స్థితిలో వుంటే ఆయనతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఎవరైనా సాహసిస్తారా? రిజల్ట్సు వచ్చాక అప్పటి పరిస్థితి బట్టి ప్లేటు ఫిరాయించేవాళ్లు బోల్డుమంది వుంటారు. వారితో బాటే ఈయన దూకి వుంటే పోయేది. ముందే దూకి తెచ్చుకున్న మంచి పేరేముంది? టిడిపిని తమతో తీసుకొస్తామని యిప్పుడు అంటున్నారు. రాష్ట్రంలో మహాకూటమికి పరిస్థితి అనుకూలంగా లేకపోతే టిడిపిని కూడా కలగలుపుకుని ఎన్‌డిఏ వైపుకి తీసుకెళితే బాగుండేది కదా!

కెసియార్ చేసే పనుల్లో అంతరార్థం ఆయనకే తెలియాలి. పోనీ వాటివలన ఆయన ఫైనల్‌గా విజయం సాధిస్తే గొప్ప స్ట్రాటజిస్టుగా మెచ్చుకోవచ్చు. గతవ్యాసంలో చెప్పుకున్నట్టు ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో ఆయన పరిస్థితి ఎలా వుందో యిప్పుడూ అలాగే వుంది. విభజన సమయంలో హైదరాబాదు పెద్ద సమస్యగా మారబోతున్నపుడు కెసియార్ నాయకత్వంలో తెలంగాణాకు న్యాయం జరుగుతుందా? లేదా? అన్న సందేహం రావడంలో తప్పుందా?

హైదరాబాదు సమస్యగా వుంటుందంటున్నాను కదా. దాని గురించి విపులంగా చర్చించుకుందాం. హైదరాబాదు 52 ఏళ్లగా మన రాష్ట్రానికి రాజధాని. తెలుగువాళ్లందరూ గొప్పగా చెప్పుకునే ఏకైక నగరం. దానికి సాటి కాదు కదా దానిలో పావువంతు వసతులు, గ్లామర్ వున్న నగరం జిల్లాలన్నీ కాగడా పెట్టి వెతికి చూసినా కానరాదు. హైదరాబాదు యింత చక్కగా రూపు దిద్దుకోవడానికి కారణాలేమిటి? కోస్తా, సీమ వాసులే వచ్చి దీన్ని మహానగరం చేసేశారనుకోవడం కంటె భ్రమ మరొకటి లేదు. హైదరాబాదు నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారికీ పాత్ర వుంది. అంతే కాదు, ఇతర రాష్ట్రాలవారికి కూడా. మహారాష్ట్రులు, కన్నడిగులు, మార్వాడీలు, గుజరాతీలు, కాయస్థులు .. యిలా అందరూ చేతులేస్తేనే హైదరాబాదు యిప్పుడున్న స్థాయికి వచ్చింది. నిజాం తన ఏలుబడిలో అన్ని ప్రాంతాలనూ (ఇప్పటి తెలంగాణా, మరాట్వాడా, హైదరాబాదు-కర్నాటక ప్రాంతాలు) ఎండగట్టి ఆ డబ్బంతా పెట్టి యీ నగరాన్ని నిర్మించి మేన్‌టేన్ చేశాడు. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో విద్యుత్ లేకపోయినా, యిక్కడ సిమెంట్ రోడ్లు వేయించాడు. మంచి కాలేజీలు కానీ, యూనివర్శిటీ కానీ అన్నీ యిక్కడే.

హైదరాబాదు వాతావరణం కూడా దేశంలోని పలుప్రాంతాల వారినీ ఆకర్షించింది. ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న యితర ప్రాంతీయులెందరో! ఎవరు వచ్చినా ఆతిథ్యం యివ్వడం, ఘర్షణలు తెచ్చుకోకపోవడం, భౌగోళికంగా ఉత్తరభారతానికి దగ్గర కావడం, భాష సమస్య కాకపోవడంతో ఉత్తరభారతీయులకు దక్షిణాదిన హైదరాబాదు ఓ ఫేవరేట్ స్పాట్ అయింది. నిజాం తన అధికారుల్లో ముస్లిములకు, కాయస్థులకు, మరాఠీవారికి ఎక్కువ ప్రాధాన్యం యిచ్చాడు. ఎడ్మినిస్ట్రేషన్ కాస్త స్లగ్గిష్‌గా, మందకొడిగా సాగేది కానీ ప్రశాంతంగానే సాగిపోయేది.

1800 సం॥ఎరంలో నిజాం పాలన నుండి బ్రిటిషు పాలనలోకి వెళ్లిన ఆంధ్రప్రాంతం వారు, నిజాం పాలనలో వుండిపోయిన తెలంగాణా ప్రాంతం వారు – 150 యేళ్ల తర్వాత ఐక్యమవుదామనే లక్ష్యంతో ఆంధ్ర వుద్యమం సాగింది. దాన్ని విశాలాంధ్ర వుద్యమం పేరిట కమ్యూనిస్టులు వుత్సాహంగా నడిపారు. విశాలాంధ్రకు హైదరాబాదు రాజధానిగా వుంటుందనే ప్రచారం చేశారు. ఆంధ్రప్రాంతం వారికి మద్రాసు ఎగ్గొట్టడానికి కారణం కూడా యిదే! మీకు రాజధానిగా ఎలాగూ హైదరాబాదు వుంటుందిగా, అక్కడ భవనాలు అవీ సిద్ధంగా వున్నాయి. ఈ మధ్యలో అంతదాకా, ఏదో తాత్కాలిక రాజధానిగా ఎక్కడో అక్కడ వుండండి అంటూ కేంద్రప్రభుత్వం నిధులు కూడా విదల్చలేదు.



ఆ తాత్కాలిక రాజధాని ఎక్కడ వుండాలన్న విషయంలో వివాదాలు తలయెత్తాయి. రాజకీయ చైతన్యం ఎక్కువగా వున్న విజయవాడవాసులు విజయవాడే రాజధాని కావాలన్నారు. ఆ సమయంలో ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వున్న ప్రకాశం గారు

బాగా ఆలోచించి ఆలోచించి రాయలసీమను అభివృద్ధి చేద్దామని కర్నూలుని రాజధానిగా ఎంచుకున్నారు. అప్పట్లో విజయవాడ కమ్యూనిస్టులకు కంచుకోటగా వుంది కాబట్టి విజయవాడను ఎవాయిడ్ చేశారని అనుకున్నారు. విజయవాడ వాసులకు ప్రకాశంపై విపరీతమైన కోపం వచ్చి వాళ్లు నెలకొల్పిన ప్రకాశం విగ్రహాన్ని బద్దలు కొడతామని బెదిరించారు. ప్రకాశంగారు తొణకలేదు. 'విరక్కొడితే విరక్కొట్టుకోమను. అది పెట్టమని నేనడిగానా? వాళ్ల కిష్టమై వాళ్లు పెట్టుకున్నారు. ఇప్పుడు అఖ్కర్లేదనుకుంటే విరక్కొట్టుకోమను.' అన్నారు ప్రకాశం అతి తేలిగ్గా. ఏది ఏమైనా తాత్కాలిక రాజధానే కదా అని విజయవాడ వాళ్లూ వూరుకున్నారు. పాకల్లో కర్నూల్లో ఆంధ్రప్రభుత్వం ఏర్పడింది. అయినా మన రాజధాని మనకు వచ్చేస్తోంది కదాని ప్రభుత్వ సిబ్బంది ఏమీ అనలేదు.

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడగానే మొత్తమంతా యిక్కడకు వచ్చేసింది. దేశమంతా ఇంగ్లీషువాళ్లు పెట్టిన ఎకౌంటింగ్, ఎడ్మినిస్ట్రేటివ్ పద్ధతులు యూనిఫామ్‌గా వున్నాయి. ఆంధ్రప్రాంతం వాళ్లు అవే నేర్చుకుని వచ్చారు. నిజాం పాలన పద్ధతులు వేరే వున్నాయి. నిజాం పద్ధతిలో నడుస్తున్నవాటిని మెయిన్‌స్ట్రీమ్‌లోకి లాక్కురావడంలో ఘర్షణలు వచ్చాయి. ఇక్కడున్న ఉద్యోగులకు మార్పులు రుచించలేదు. తమిళులు తమపై ధాష్టీకం చెలాయించారని బాధపడి ప్రత్యేకరాష్ట్రం కావాలని పోరాడిన ఆంధ్రప్రాంతపు అధికారులు తెలంగాణా ప్రాంతపు అధికారులపై పని నేర్పేటపుడు అదే జులుం చూపించబోయారట. దాంతో 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' అని వీళ్లు ఆందోళన చేశారు. అప్పటినుండీ యిప్పటి 610 జీవో దాకా ఆంధ్ర, తెలంగాణా గొడవలన్నీ ప్రభుత్వోద్యోగస్తుల చుట్టూనే పరిభ్రమించాయి. జనాభాలో వీరి శాతం తక్కువే కానీ వీళ్లు చేసే హంగామా అంతా యింతా కాదు. సాధారణ జనజీవితంలో ప్రాంతాల పేర కనబడని ఘర్షణలు, కొట్లాటలు సెక్రటేరియట్‌లోనే కనబడతాయి. హైదరాబాదులో వున్న మిగతా జాతులతో ఘర్షణ ఎందుకు లేదు అంటే వాళ్లు ప్రభుత్వోద్యోగాలకు ఎగబడక, వ్యాపారాలు చేసుకుంటారు కాబట్టి. ఇప్పుడు ప్రభుత్వోద్యోగాలపై మోజు బాగా తగ్గిపోయింది కాబట్టే తెలంగాణా ఉద్యమం బలంగా లేదు. అదే 1969, 1971 విభజనోద్యమాల సమాయనికి ప్రభుత్వోద్యోగాలే ఆలంబనగా వుండేవి అవి జోరుగా నడిచాయి.

సరే హైదరాబాదు గురించి చెప్పుకుంటున్నాం కదా – అలా తెలుగువారందరూ హైదరాబాదు తమదే అనుకున్నారు. అప్పటిదాకా కోస్తా, రాయలసీమ వారు మద్రాసు, బెంగుళూరులు తమ స్వంతవూరుగా అనుకునేవారు. హైదరాబాదు రాజధాని అయ్యాక క్రమక్రమంగా హైదరాబాదుకీ రావడం మొదలెట్టారు. ఇక్కడ భాష పెద్ద అవరోధంగా వుండేది. మొదట ఉర్దూలో పలకరించి, రాదంటే తెలుగులో మాట్లాడేవారు. 1976లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి వెంగళరావ తెలుగంటే హైదరాబాదులో గౌరవం పెంచారు. అప్పుడు కూడా తెలుగు మహాసభలు జరిగే లాల్ బహదూర్ స్టేడియంలోకి రావాలంటే బయట పోలీసులతో ఉర్దూలో మాట్లాడవలసి వచ్చేది. అప్పట్లో వెంగళరావుని అందరూ విమర్శించారు కానీ ఆ తర్వాతనే తెలంగాణానుండి చాలామంది కవులు, రచయితలు పుట్టుకొచ్చారు. సినారె, దాశరథివంటి మహానుభావులను వదిలేయండి. మామూలువారిలో ఉర్దూ మాట్లాడడమే ఫ్యాషన్‌గా వుండేది. ఆంధ్రప్రాంతంలో ఇంగ్లీషు మాట్లాడితే హెూదాగా ఫీలయినట్టు, యిక్కడ ఉర్దూ రాజభాష కాబట్టి ఉర్దూలో మాట్లాడి కాలర్ ఎగరేసేవారు. అయితే వీరి ఉర్దూ ప్రావీణ్యత చదివి ఆనందించడం వరకే. తెలుగు మాతృభాషగా కలిగి ఉర్దూలో కవిత్వం లేదా రచనలు సాగించినవారెవరూ నాకు కానరావటం లేదు. హైదరాబాదులో మాట్లాడే దక్కనీ ఉర్దూని ప్రామాణికమైన ఉర్దూగా దేశంలో అంగీకరించరు. అందువలన యిక్కడివారి ఉర్దూ రేడియోలో హాస్య కార్యక్రమాలకే వుపయోగపడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలుగు ముందుకు వచ్చి, ఉర్దూ వాడకం వెనక్కి టవెళ్లింది. అయినా 1969 తెలంగాణా ఉద్యమం నాటికి అనేక నినాదాలు ఉర్దూలోనే రూపొందాయి. తెలుగు మహాసభల ద్వారా కలిగించిన ఆత్మగౌరవంతో తెలంగాణా నుండి రచయితలు పుట్టుకువచ్చి రాశిలో, వాసిలో యితరప్రాంతాల రచయితలతో క్యాచ్-అప్ చేశారు.

1983లో ఎన్టీయార్ ముఖ్యమంత్రి అయాక హైదరాబాదులో తెలుగు ప్రాముఖ్యత మరింత హెచ్చింది. అప్పటినుండి తెలుగులో పలకరించి రాకపోతే ఉర్దూలో మాట్లాడుతున్నారు. ఎన్టీయార్ వచ్చాకనే మతకల్లోలాలు ఆగాయి. శాంతి ఏర్పడడంతో అభివృద్ధి పరుగందుకుంది. అప్పటినుండి ఆంధ్రప్రాంతం వారి పెట్టుబడులు హైదరాబాదులో పెరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారూ పెట్టుబడులు పెట్టడం మొదలెట్టారు. స్థలాల రేట్లు పెరిగాయి. క్రమంగా రియల్ ఎస్టేటు పెద్ద వ్యాపారమై పోయింది. గతంలో పశు గ్రాసానికై జమీందార్లు, నవాబులు యిచ్చిన భూములను రెసిడెన్షియల్ ప్లాట్లుగా చేసి అమ్ముకోసాగారు హైదరాబాదు పరిసరప్రాంతవాసులు. వీళ్లలో కొంతమందికి రియల్టర్లు యిచ్చే డబ్బు లెక్క పెట్టుకోవడం రాక స్కూలు టీచర్లను పిలిచి లెక్క పెట్టించుకున్నారు. హైదరాబాదులో రికార్డులు అస్తవ్యస్తంగా వుంచడం, పవరాఫ్ అటార్నీ మతలబులు, మాటిమాటికీ మారిపోయే గవర్నమెంటు చట్టాలు, రూల్సు – వీటి కారణంగా విపరీతమైన గందరగోళం ఏర్పడి స్థలాలు చేతులు మారుతూ రేట్లు మరింత పెరిగాయి.

## 7

1996 నుండి మొదలైన రియల్ ఎస్టేటు బూమ్ హైదరాబాదులో విపరీతమైన వేగంతో సాగింది. దేశంలో మధ్యమధ్యలో ఆ బూమ్‌కు స్పీడ్‌బ్రేకర్స్ వచ్చాయి, కానీ హైదరాబాదులో నిరంతరం పెరుగుతూనే పోయాయి. హైదరాబాదు ముక్కూ మొహం తెలియనివారు – రాష్ట్రంలోని తక్కిన జిల్లాల వారు కావచ్చు, దేశంలోని తక్కిన రాష్ట్రాలవారు కావచ్చు – యిక్కడ స్థలాలు కొనిపారేశారు. హైదరాబాదులో

జరిగిన పారిశ్రామిక అభివృద్ధి, చంద్రబాబు హయాంలో కలిగించిన 'లుక్', అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. హైదరాబాదులో ప్రతీ మూడో వ్యక్తి రియల్ ఎస్టేటు బ్రోకర్ అయిపోయాడు. ఎవరి దగ్గర చూసినా డబ్బే. ఈ పక్కన ఐటీ పార్కు అంటే ఆ పక్కన బిటీ పార్కు అంటూ రేట్లు పెంచుకుంటూ పోయారు. బ్రోకరు చెప్పిన రేటుపై బేరమాడినా, డాక్యుమెంట్లు చూపించమని గట్టిగా అడిగినా వాళ్లు విసుక్కునే రోజు వచ్చింది. 'ఉన్న డాక్యుమెంట్లతో తీసుకోండి. ఆర్నెలల్లో రెట్టింపు రేటుకి నేనే అమ్మి పెడతాను' అని బ్రోకర్లు హామీ యిచ్చేశారు.

హైదరాబాదులో స్థలం లేనివాడు ఎందుకూ కొరగాడన్న భావం జిల్లాల్లో బలపడింది. అందరూ ఎగబడి కొన్నారు. దీనివలన జరిగిన పారిశ్రామికాభివృద్ధి ఏమీ లేదు, షేరుమార్కెట్ లావాదేవీల్లా వస్తువు అక్కడే ఎదుగూబొదుగూ లేకుండా వుంటుంది. దాని ధర మాత్రం విపరీతంగా పెరుగుతూ పోయింది. దీనివలన అందరి కన్నూ హైదరాబాదు మీదే! మధ్యతరగతివాళ్లు కష్టార్జితంతో కొంటే కబ్జాదారులు దబాయింపుతో ఆక్రమించుకున్నారు. వేరే జిల్లాలనుండి వచ్చి కూడా కబ్జాలు చేశారు.

రియల్ ఎస్టేటు లావాదేవీల వలన హైదరాబాదుని సొంతం చేసుకోవాలన్న తపన కూడా అందరిలోనూ పెరిగింది. మాదంటే మాదన్నారు. మేమే చెమటతో కట్టాం అంటే మేమే రక్తంతో కట్టాం అన్నారు. నిజానికి అంత మొనగాళ్లే అయితే మరి ఏ యితర పట్టణమూ యిలా కట్టలేకపోయారా? కోస్తాలో కానీ, సీమలో కానీ, తెలంగాణాలో కానీ అక్కడివాళ్లు దీనికి పోటీగా ఓ నగరం కట్టి చూపించవచ్చుగా! సక్సెస్ హేజ్ మెనీ ఫాదర్స్, ఫెయిల్యూర్ హేజ్ నన్ అంటారు. హైదరాబాదు మహానగరంగా ఎదిగింది కాబట్టి అది మా ప్రతిభ అంటే మా ప్రతిభ అంటారు తప్ప ఏ వరంగల్‌నో, వైజాగ్‌నో, కర్నూలునో దీనిలా తీర్చిదిద్ది చూపించరు.

చూపిద్దామన్నా రాష్ట్రప్రభుత్వ విధానం సహకరించదు. రాష్ట్రంలోని వనరులన్నీ తెచ్చి హైదరాబాదు మీద పెట్టింది. తమిళనాడులో చెన్నయ్‌తో బాటు చెప్పుకోదగిన నగరాలు ఎన్నో వున్నాయి. కోయంబత్తూరు, మధురై, సేలం, తిరుచ్చి.. యిలా.. ఒక్కో చోట ఒక్కో పరిశ్రమ బలంగా వుంది. మనవాళ్లు అలా డీ సెంట్రలైజ్ చేయలేదు. దాంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలవారూ వుపాధికై వచ్చినట్టు యిక్కడికి రావలసి వచ్చింది. నిజానికి వైయస్ వచ్చాకనే పరిశ్రమలను, పెట్టుబడులను ప్రాంతాలవారీగా పంచుతున్నారు.

ఈ పని రాష్ట్రం ఏర్పడిన దగ్గర్నుంచీ గ్రామస్థాయినుండీ చేసి వుంటే ఎన్నో సమస్యలు తీరిపోయి వుండేవి. గ్రామాలనుండీ పట్టణాలకు వలసలు, పట్టణాలనుండి నగరాలకు వలసలు వుండేవి కావు. హైదరాబాదు నగరంపై పౌరసౌకర్యాలకై యింత ఒత్తిడి వుండేది కాదు. ఆ ఒత్తిడి తగ్గించడానికి కోట్లు ఖర్చు పెట్టవలసివస్తోంది. ఈ కోట్లు అన్ని జిల్లాలపై పంచివుంటే హైదరాబాదు సమస్యే అయివుండేది కాదు. 25 జిల్లాలకు కలిపి ఏకైక మహానగరం కావడంతో అందరూ మాకు కావాలంటే మాకు కావాలని కొట్టుకోవలసిన పరిస్థితి వస్తోంది. హైదరాబాదు సమస్యను ఎలాగో అలాగ పరిష్కరించినా, యికపై హైదరాబాదులో పరిశ్రమలు పెట్టరాదన్న నిబంధన పెట్టి పెట్టుబడులను జిల్లాలకు తరలించాలి. అన్ని జిల్లాలకు సమానంగా పంచి సర్వతోముఖాభివృద్ధి జరిగేట్లా చూడాలి. సరే అది తర్వాతి సమస్య అనుకోండి.

నేను గతవ్యాసాల్లో చెప్పినట్టు రాష్ట్రవిభజన అనేది ప్రధానంగా ప్రభుత్వోద్యోగుల సమస్య. అధికారపీఠానికి దగ్గర వుండడం ద్వారా ప్రమోషన్లు సంపాదించడం, పిల్లలకు మంచి చదువులు చెప్పించే అవకాశం దక్కాలంటే వీలైతే సెక్రటేరియట్‌లో లేదా కనీసం హైదరాబాదులో వుండాలని ఉద్యోగులు అనుకుంటారు. ఎవరో ఒక తెలిసున్నవాణ్ని పట్టుకుని హైదరాబాదుకి బదిలీ చేయించుకుంటారు. అక్కడే పాతుకుపోదామని ప్రయత్నిస్తారు. ఇది గమనించే పెద్దమనుష్యుల ఒప్పందం ప్రకారం జనాభా ప్రాతిపదికన ప్రతీ మూడు వుద్యోగాలలోనూ రెండు ఆంధ్ర ప్రాంతానికి, ఒకటి తెలంగాణా ప్రాంతానికి అన్నారు. ఎ,టి,ఎ ఫార్ములా అన్నారు. అంటే మూడు వుద్యోగాలు ఒకేసారి లభ్యం కాకపోతే మొదటి వుద్యోగం ఆంధ్రకు యిస్తారు, రెండో వుద్యోగం పుట్టగానే తెలంగాణాకు యిస్తారు. మూడోది పుట్టినపుడే ఆంధ్రకు యిస్తారు.

ఇంత పకడ్బందీగా రూల్సు పెట్టినా అవి అమలు కాలేదు. ఎవరికి పలుకుబడి వుంటే వాళ్లకు వుద్యోగాలు వచ్చేశాయి. సెక్రటేరియట్‌లోని తెలంగాణా వుద్యోగులు, తెలంగాణా మంత్రులు ఎవరూ ఒప్పందం సరిగ్గా అమలవుతోందో చూడలేదు. ఇదేదో ప్లానువేసి ఆంధ్రవాళ్లు ఉద్యోగాలు ఎక్కువ సంపాదించారనను. అలా చేసినవారిలో కూడా ఏ జిల్లావాళ్లు ఎంతమంది సంపాదించారో తెలియదు. ఉత్తరదక్షిణాలతో పనులు సాధించుకోగలిగినవారు సాధించుకోగలిగారు. ఉత్తరోత్రా తెలంగాణాకు అన్యాయం జరిగిందని గగ్గోలు పెట్టినవారు కూడా అప్పుడు కిమ్మనలేదు. వాళ్లకు ఏం ముట్టాయో? వాళ్లే యిలాటి పనులు చేశారో!

అయితే తెలంగాణా కాండిడేట్ ఎవరు? ముల్కీ సర్టిఫికెట్ వున్నవారు తెలంగాణా వారు. ఈ ముల్కీ పదాన్ని యిప్పుడు మర్చిపోయి వుంటారు కానీ అప్పట్లో నిత్యం వార్తల్లో నలిగేది.

## 8

నిజాం ప్రభువుల కాలంలోనే పరాయివాళ్లు అంటే ఆఫ్గన్లు, పఠాన్లు వచ్చి యిక్కడ ఉద్యోగాలు, పదవులు ఎత్తుకుపోయేవారు. దాంతో స్థానికులు గోలచేసేవారు. అప్పుడు ఆ వుద్యోగాలు స్థానికులకే, అంటే ముల్కీలకే (ముల్క్ అంటే ప్రాంతం అని అర్థం) అని చట్టం చేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డప్పుడు కూడా స్థానిక వుద్యోగాలు ముల్కీలకే యిస్తామని పెద్దమనుషుల ఒప్పందం

చేసుకున్నారు. ఏదో కొన్నాళ్లకు మాత్రమే యీ సౌకర్యం అనుకున్నారు. అయితే పాలకులు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల లాగానే వీటినీ రెన్యూ చేస్తూండేవారు. అలా చేయడం ఆంధ్రప్రాంతం వారికి రుచించేది కాదు. స్వంత రాష్ట్రంలోనే కొన్ని ప్రాంతాల్లో మాకు ఉద్యోగార్హత లేదంటే ఎలా? అని అలజడి చేసేవారు. తమాషా ఏమిటంటే బోగస్ ముల్కీ సర్టిఫికెట్లు లంచాలు పడేస్తే దొరికేవి. ఇప్పటికీ బోగస్ బిసి, ఎస్సీ సర్టిఫికెట్లు దొరకటం లేదూ – అలాగే! ఎప్పుడైనా ఎంక్వయిరీకి వచ్చినపుడు చూసుకోవచ్చు అనుకుని యీ సర్టిఫికెట్లు డబ్బుతో కొనుక్కుని వుద్యోగాలు సంపాదించేవారు.

ముల్కీ రూలు రెన్యూ చేయవలసివచ్చినపుడు పాలకులు తెలంగాణా విద్యార్థుల చేత ఓ చిన్నపాటి ఆందోళన చేయించి మరీ రెన్యూ చేసేవారు. 'చేయకపోతే వాళ్లు వూరుకోవడం లేదు, అయినా మీకు దొరికే వుద్యోగాలు మీకు దొరుకుతున్నాయిగా' అని ఆంధ్రప్రాంతంవాళ్లను వూరుకోబెడుతూండేవారు. 1969లో బ్రహ్మానందరెడ్డిగారు అలాగే చేయబోయారు. ముల్కీ సౌకర్యం పొడిగించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా వర్శిటీ విద్యార్థుల చేత ఓ చిన్న ఆందోళన చేయించి ముల్కీ రూల్సును పొడిగించబోయారు. కానీ అది అనుకోని మలుపు తిరిగింది. దానికి కారణం కాంగ్రెస్‌లో అంతర్గత కలహం. కితం వ్యాసంలో చెప్పాను కదా, విభజన వుద్యమాలకు కేంద్రబిందువు ప్రభుత్వోద్యోగాలని. అలాగే అవి వుద్యమరూపం దాల్చడానికి కారణం – అధికారపార్టీలో కలహాలు!

మొన్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో సమైక్యవాదం గెలుపు చూశాక యింకా మీరీ విభజన వ్యాసాలు రాయాలా? అని కొందరు అడుగుతున్నారు. 'హైదరాబాదు సిటీలో తెరాసతో పొత్తు పెట్టుకున్న పార్టీలేవీ గెలవలేదు. హైదరాబాదు చుట్టుపట్ల వున్న 40 నియోజకవర్గాలలో 1 సీటు తెరాసకు, 7 సీట్లు టిడిపికి తప్ప తక్కినవన్నీ సమైక్యవాదులకే దక్కాయి. విభజనవాదులతో పొత్తు పెట్టుకుని నష్టపోయామని టిడిపి లీడర్లు బాహాటంగా అనేస్తున్నారు. రేపు మహానాడులో ఏ తీర్మానం తీసుకుంటారో తెలియకుండా వుంది. తాము గెలవకపోతే రాష్ట్రం విభజింపబడుతుందన్న వైయస్ హెచ్చరికకు జనాలు బాగా స్పందించారు. తెరాస 4 జిల్లాలకు పరిమితమై పోయింది. 2004లో 26 సీట్లు తెచ్చుకుంటే ఐదేళ్ల వుద్యమం తర్వాత 10 తెచ్చుకుంది. తెరాస టాప్ లీడర్లు కెసియార్, విజయశాంతి చచ్చి చెడి సీట్లు గెలిచారు. తెలంగాణా యిస్తానని బతిమాలుతున్న బిజెపికి 2 సీట్లు వచ్చాయి. బాబు మెడలు వంచి ప్రత్యేకవాదానికి ఒప్పించిన కడియం శ్రీహరి, సమైక్యవాదిగా ఓ వెలుగు వెలిగి ప్రత్యేకవాది అయిన తర్వాత రెండు సీట్లూ ఓడిపోయిన దేవేందర్ గౌడ్, నాయిని నర్సింహారెడ్డి, వినోద్ – యిలా తెలంగాణా వాదులంతా దెబ్బ తిన్నారు.' – ఇవీ వీరి వాదనలు. ఇలాటి వాదనలు ఎన్ని వున్నా తెలంగాణా సమస్య సజీవంగానే వుంటుందని నేనంటాను.

పార్టీలంటూ వున్నాక వాటిలో అసమ్మతివాదులుంటారు. వాళ్లకు తిక్కపుట్టగానే కనబడేది తెలంగాణా వీరుని కవచం. మ్యూజియంలో కవచం, శిరస్త్రాణం ఈటె, గుఱ్ఱం వున్న బొమ్మ వుంటుంది చూడండి, తెలంగాణా వుద్యమంకూడా అలాటిదే. తమ నాయకుడిపై కోపం వచ్చిన అసమ్మతివాది ఎవరైనా సరే వెళ్లి ఆ విగ్రహంలో దూరిపోయి వుద్యమం మొదలెట్టేయవచ్చు. (చంద్రబాబు కెసియార్‌కి మంత్రిపదవి యిచ్చివుంటే ప్రస్తుత తెలంగాణా వుద్యమం రూపుదిద్దుకొనేది కాదని మనందరికీ తెలుసు) వారి అర్హత ఏమిటి అని ప్రజలు చూడరు. ఇక పార్టీలో అంటారా? తెలంగాణా పేరు చెప్పుకుంటే క్రమశిక్షణ ఎంత తప్పినా శిక్షించరు.

మొన్న చూడండి, తెలంగాణాలో ఎలక్షన్లు జరుగుతూండగానే సోకాల్డ్ సీనియర్లు 'మేం యిక్కడ వోడిపోవడం ఖాయం. ఇక్కడ మహాకూటమిదే గెలువు' అని పబ్లిక్ స్టేటుమెంట్లు యిస్తారు. వైయస్సే అడ్డం, నిలువు అంటూ ప్రకటిస్తారు. తమ పార్టీ గెలిచి ప్రమాణ స్వీకారం చేస్తూంటే రానైనా రారు. కెసియార్ మీరు చవటలు, సన్నాసులు, మీ పార్టీని బొంద పెడతా అన్నా వాళ్లకు చీమ కుట్టినట్టు వుండదు. వైయస్ తెలంగాణా గురించి ప్రస్తుతానికి ఏమీ తేల్చలేము అన్నా చాలు శివాలెత్తి పోతారు. వైయస్ అభివృద్ధి మంత్రం ఎందుకూ పనికిరాదు అని పబ్లిక్ స్టేటుమెంట్లు యిస్తారు. అయినా అధిష్టానం వాళ్లనేమీ అనదు. ఏమైనా అంటే తెలంగాణాతల్లికి ద్రోహం చేసినట్టే. ఇటువంటి కవచాన్ని ఎవరైనా విరక్కొట్టుకుంటారా? తమ కోసమైనా తెలంగాణా సమస్యను సజీవంగా వుంచకపోతే ఎలా?

ఇప్పుడు తెరాస చావుదెబ్బ తిని వుంది, అందువలన తెలంగాణా సమస్య యికపై వుండదంటారా? అబ్బే, తెలంగాణావాదుల వైఖరి చూడండి. ఎన్నికలలో ఓటమి కెసియార్ నెత్తికి చుట్టేసి తెలంగాణా వాదం సజీవంగా వుందని మనల్ని నమ్మించడానికి చూస్తారు. ఆంధ్రజ్యోతి వంటి పేపరు కెసియార్ పాతరేసి తెరాసలో అసమ్మతివాదాన్ని ఉత్తేజపరచి వుద్యమం కొనసాగేట్టు చూస్తుంది. అసమ్మతివాదం మొదలైంది కదా. వారిలో కొందరు 'కెసియార్ మెతకవైఖరి వల్లనే ఓడిపోయాం, ఉద్యమాన్ని పోరాటబాట పట్టించాలి, శాంతిమార్గం వదలండి, సమైక్యవాదులను తన్నండి' అని మొదలెడతారు. తానూ తీసిపోలేదని నిరూపించుకోవడానికి కెసియార్ కూడా వుద్యమాన్ని హింసాయుతంగా మారుస్తారు. అందువలన ప్రత్యేకవాదాన్ని జనాలు తిరస్కరించినా తెలంగాణావాదులు వూరుకోరు. లేదు, ప్రజలు కోరుతున్నారు అంటారు ప్రజలేదో వచ్చి వాళ్ల చెవిలో చెప్పినట్లు. అందువలన ఈ వాదాన్ని పూర్తిగా డీల్ చేసేవరకూ యీ వ్యాసాలు కొనసాగవలసినదే! 1969లో తెలంగాణా వుద్యమం రావడానికి కారణం అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహ?మే!

1969 నాటి తెలంగాణా వుద్యమానికి నాయకుడు మఱ్ఱి చెన్నారెడ్డి. ఆయన కాంగ్రెస్ నాయకుడు. 1940లో ఎంబిబియస్ పాసై ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూ 'ఆంధ్ర యువజన సమితి' అనే పేర నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. 1952లో ఎంఎల్ఏ అయి, బూర్గుల మంత్రివర్గంలో మంత్రిగా వున్నారు. 1956 లో సంజీవరెడ్డి కాబినెట్‌లో చోటు దక్కకపోయినా, 1962లో దక్కింది. 1967లో బ్రహ్మానందరెడ్డి కాబినెట్‌లో ఆర్థిక శాఖ నిర్వహిస్తూ అది వదిలేసి, రాజ్యసభద్వారా కేంద్రంలో ఉక్కుగనుల మంత్రిగా వెళ్లారు. అయితే 1967 అసెంబ్లీ ఎన్నికలలో తాండూరునుండి గెలిచినప్పుడు అవినీతికి పాల్పడ్డారని ఆయనకు వ్యతిరేకంగా నిలబడిన వందేమాతరం రామచంద్రరావు కేసు పెట్టారు. కోర్టు యీయన్ని ఆరేళ్లపాటు ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించింది. ఆ తీర్పు 1969లో రావడంతో యీయన కేంద్రమంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి రాష్ట్రానికి తిరిగి రావలసి వచ్చింది.

తన రాజకీయ ప్రత్యర్థి ఐన బ్రహ్మానందరెడ్డియే వందేమాతరం రామచంద్రరావు చేత యీ కేసు పెట్టించాడని చెన్నారెడ్డికి సందేహం. ఆయన పనిబడదామనుకున్నారు. తెలంగాణా వుద్యమం అందివచ్చింది. బ్రహ్మానందరెడ్డి ముట్టించిన విద్యార్థుల ఆందోళనలోకి యీయన జొరబడి, దాన్ని తెలంగాణా అంతా ఉధృతంగా వ్యాపింపజేశాడు. రాజకీయనాయకులు ఆడే క్రీడల ఫలితాలు చూడండి, దశాబ్దాలు గడిచినా వాటి దుష్ఫలితాలు పోవు. అకాలీదళ్‌ను అణచడానికి ఇందిరా గాంధీ భింద్రన్‌వాలేను తయారుచేసింది. అతడు యింతింతై, ఏకు మేకై ఎవరికీ లొంగకుండా పోయాడు. ఇందిర ఆపరేషన్ బ్లూస్టార్ చేయవలసి వచ్చింది, సిక్కుల ఆగ్రహానికి గురయింది, వాళ్ల తుపాకీగుళ్లకు ఎరయింది. ఇప్పటికీ కొన్ని సిక్కు సంస్థలు ఆమె కుటుంబసభ్యులకోసం విదేశాలలో కాచుకుని కూచున్నాయి. శ్రీలంక ప్రభుత్వాన్ని అదుపుచేద్దామని ఎల్‌టిటిఈని దువ్విన రాజీవ్ గాంధీ చివరకు వాళ్ల చేతిలోనే చావవలసి వచ్చింది. నిప్పు ముట్టించాక అది ఎవరిని దహిస్తుందో తెలియదు.

ఎన్‌టిఆర్ రాజ్యం చేసేటప్పుడు ఎలా ఎదుర్కోవాలో తెలియక రాజశేఖరరెడ్డి రాయలసీమ హక్కులంటూ ఉద్యమం లేవదీశారు. చంద్రబాబు పాతికేళ్లు పాలించేస్తాడేమోనని భయపడి చిన్నారెడ్డి చేత తెలంగాణా రాష్ట్రం అడిగించాడు. చివరకు తెలంగాణా వుద్యమం తన మెడకే చుట్టుకుంది. తెలంగాణాలో ఆయన కాబినెట్ మంత్రులెందరో మట్టి కరిచారు. షార్ట్‌టైమ్ గెయిన్స్ కోసం , తత్కాల లబ్ధికోసం ద్వేషం రగిలిస్తే చివరకు ఆహుతి అయ్యేది వారే. బ్రహ్మానంద రెడ్డి విషయంలో నాడు జరిగినది అదే. చెన్నారెడ్డిని రెచ్చగొట్టడం, తెలంగాణా విద్యార్థులచేత ఆందోళన చేయించడం ఆయన పొరబాటు. దాన్ని చెన్నారెడ్డి బ్రహ్మాండమైన వుద్యమంగా తీర్చిదిద్దారు. చెన్నారెడ్డి మంచి వక్త. మేధావి. గొప్ప నాయకుడు. తనంటే ప్రాణాలు యిచ్చే కార్యకర్తలను తయారుచేసుకున్నాడు. రాజశేఖరరెడ్డిలో వున్న రాజరికపు పోకడలు ఆయనలో పదిరెట్లు ఎక్కువగా వుండేవి. మిత్రులను రక్షించడంలో, శత్రువులను నిర్జించడంలో ఏ రూల్సునూ లెక్క చేసేవాడు కాదు. జగమొండి. ఫైటర్. ఎడ్మినిస్ట్రేషన్‌లో దిట్ట.

ఇక రాజకీయాలలో రంగులు మార్చడంలో ఏ మాత్రం జంకని వ్యక్తి. 1969లో తెలంగాణా వుద్యమం మహోధృతంగా నడిపి, 1971 ఎన్నికల్లో తెలంగాణా ప్రజా సమితి పార్టీ పేర పోటీచేసి తెలంగాణాలోని 14 సీట్లలో 10 సీట్లు గెలుచుకున్నాక ఆ పార్టీని హోల్‌సేల్‌గా కాంగ్రెస్‌లో కలిపేసి, ఉద్యమాన్ని గంగలో కలిపేశాడు. ఇందిరా గాంధీ ఓ గవర్నర్‌షిప్ యిచ్చేసింది. ఆరేళ్ల నిషేధం ఎత్తివేసే సమయానికి ఎమర్జన్సీ వచ్చిపడింది. ఎమర్జన్సీ ఎత్తేసి 1977 ఎన్నికలలో ఇందిరా గాంధీ ఓడిపోయేసరికి ఈయన 1978లో గవర్నరు పదవికి రాజీనామా చేసి ఆంధ్రకు తిరిగి వచ్చేశాడు. జనతా పార్టీలో చేరాలా, బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్‌లో చేరాలా అని సందిగ్ధంలో వున్న సమయంలో ఓ రోజు ఇందిరా గాంధీని, ఎమర్జన్సీని శుభ్భరంగా తిట్టిపోస్తూ మంచి వుపన్యాసం యిచ్చాడు.

ఆ రాత్రి ఏమైందో తెలియదు కానీ, మర్నాడే ఇందిరా కాంగ్రెస్‌కి రాష్ట్ర అధ్యక్షుడయ్యాడు. 1978 ఎన్నికల్లో ఎవరూ వూహించని రీతిలో ఇందిరా పార్టీ నెగ్గడంతో ముఖ్యమంత్రి అయిపోయాడు. 1980లో ఇందిరా గాంధీ యీయన్ని దింపేసి పంజాబ్‌కు గవర్నరుగా పంపింది. 1984లో అది వదిలేసి నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్ అనే పార్టీ పెట్టి దాని తరఫున కరీంనగర్‌నుండి పార్లమెంటుకి పోటీ చేస్తే ఓడిపోయాడు. మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చి అనూహ్యంగా 1989 ఎన్నికలలో ఎన్‌టియార్‌ను ఓడించి ముఖ్యమంత్రి అయిపోయాడు. మళ్లీ రాజీనామా చేయవలసి వచ్చింది. ముఖ్యమంత్రి జయలలిత పీచమణచడానికి తమిళనాడుకి గవర్నరుగా పంపారు..ఇదంతా ఎందుకు చెప్పానంటే ఇంతటి ఢక్కామొక్కీలు తినగలిగిన వ్యక్తి నడిపిన వుద్యమం 1969 నాటి తెలంగాణా వుద్యమం. ఇప్పుడు తెలంగాణా వుద్యమం నడిపేద్దామని ఉవ్విళ్లూరుతున్న ఏ నాయకుడిలో యింత ఫోర్సు వుంది చెప్పండి! అందుకే '1969 పునరావృతం అవుతుంది' అని వీళ్లు బెదిరించినప్పుడల్లా నాకు నవ్వు వస్తుంది.

చెన్నారెడ్డి లాటి వ్యక్తి నడిపే వుద్యమం ఎలా వుంటుందో అలాగే వుంది 1969 ఉద్యమం. కెసియార్‌లా యాసతో నవ్వించలేదు చెన్నారెడ్డి. నిప్పులుమిసే ఉపన్యాసాలు ఆయనవి. ప్రత్యర్థిని 'బిలో ద బెల్ట్' కొట్టడానికి ఏ మాత్రం సంకోచించని వ్యక్తి. హైదరాబాదు గోడలపై బ్రహ్మానంద రెడ్డిగారి భార్య గురించి ఆవిడ పేరు ప్రస్తావిస్తూ పచ్చిబూతులు రాసేవారు. అంతేకాదు అప్పట్లో గోడలపై కనబడే ఫేమస్ నినాదం – 'చింతచెట్టు చిగురు చూడు, ఆంధ్ర దాన్ని ..... (అశ్లీలం) చూడు'. ఇది విన్న తెలుగేతరులు తెల్లబోయేవారు, వీళ్లూ ఆంధ్రులే కదా, యిలా రాస్తారేం? అని. తెలంగాణావారు తాము ఆంధ్రులమని చెప్పుకోరని కొందరు అడ్డంగా వాదిస్తారు.

నిజాంకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో 1927లో తెలంగాణాలో వెలిసినది 'ఆంధ్రమహాసభ'యే! సురవరం ప్రతాపరెడ్డిగారు గానీయండి, కమ్యూనిస్టు నాయకులు కానీయండి నడిపినవి ఆంధ్రోద్యమాలే, పెట్టినది ఆంధ్ర సారస్వత పరిషత్తే! అంతెందుకు చెన్నారెడ్డి పెట్టిన సంస్థ పేరు పైన రాసాను చూడండి. ఇప్పటికీ యితర రాష్ట్రాలలో, యితర దేశాలలో వున్న తెలుగువారిని ప్రవాసాంధ్రులనే అంటారు తప్ప, వేరే పేరుతో పిలవరు. బయటి రాష్ట్రాలలో తెలుగువారి సంఘాలకు పేరు ఆంధ్ర సంఘం అనే వుంటుంది. ఈ మధ్యే బొంబాయి ఆంధ్రమహాసభ ఆహ్వానంపై అక్కడికి వెళ్లాను. కార్యవర్గంలో ముక్కాలువాసి కరీంనగర్ వాళ్లే. వాళ్లు దాన్ని తెలంగాణా మహాసభ అని పేరు మార్చలేదు! తెలుగు, ఆంధ్ర పర్యాయపదాలని చెప్పడానికి యింతకుమించి నిదర్శనాలు అక్కరలేదు. ఇలాటి పరిస్థితుల్లో ఆంధ్రయువతుల గురించి అలాటి రాతలు రాయించారు తెలంగాణా వుద్యమకారులు.

అసలు ఆనాటి నాయకులలో తెలుగేతరులు ఎక్కువ. కన్నడిగులు, తమిళులు, మలయాళీవారు వీరంతా తాము తెలంగాణా వారమని చెప్పుకుంటూ కోస్తా, సీమల నుండి వచ్చినవారిని తరిమేద్దామని చూశారు. వాళ్లని కొట్టారు. వాళ్ల కాలనీలపై దాడులు చేసేవారు. ఒక వూళ్లో ఒక టీచరును సజీవదహనం చేశారు. (తమాషా ఏమిటంటే మార్వాడీలు, గుజరాతీలు, మరాఠీలు, కాయస్థులు – వీరెవ్వరి జోలికీ పోలేదు. సాటి తెలుగువాడిమీదనే పగ) హైదరాబాదులోని కోస్తా, సీమవాసులకు భయం వేసింది. అప్పట్లో వారికి రక్షణ కల్పించినవాడు బ్రహ్మానందరెడ్డి. రక్షణ కల్పించడానికి ప్రభుత్వపరంగా పోలీసులనుండి సహకారం లభించేది కాదు. అప్పుడు బ్రహ్మానందరెడ్డికి బాసటగా నిలబడినవాడు సలావుద్దీన్ ఒవైసీ. మా ముస్లిములం రాష్ట్రవిభజనకు వ్యతిరేకం. మా బలగాలు మీ వాళ్లకు రక్షణ కల్పిస్తాయి అని హామీ యిచ్చి అలాగే దన్నుగా నిలబడి ఆంధ్రప్రాంతంవారిని కాపాడారు. దానికి ప్రతిగా కాంగ్రెస్ వాళ్లకు ఏదో యివ్వవలసి వచ్చింది. రజాకారు వుద్యమ నాయకుడు కాశీం రజ్వీ ఆస్తులు అన్‌క్లెయిమ్‌డ్‌గా ప్రభుత్వాధీనంలో వున్నాయి. వాటిని ఒవైసీగారి మజ్లిస్ పార్టీకి కట్టబెట్టడం జరిగింది. అప్పటినుండి కాంగ్రెస్‌కు మజ్లిస్‌కు దోస్తీ కుదిరింది. అది ముదిరి, ముదిరి యిప్పుడు ఏ స్థితికి వచ్చిందంటే మజ్లిస్‌వాళ్లు డాక్టర్లను తన్నినా, కార్పోరేషన్ అధికారులను గుద్దినా, తస్లీమాను చంపబోయినా వారిపై కాంగ్రెస్ కిమ్మనదు, కేసులు పెట్టదు. ఇదంతా తెలంగాణా వుద్యమం ఫాలౌట్. మొన్న వైయస్ తన పార్టీలోని తెలంగాణావాదులను ఎదుర్కోవడానికి మళ్లీ ముస్లిములను అడ్డేసుకున్నాడు. ఔనౌను, మేం యిప్పటికీ సమైక్యవాదులమే, మీరు గట్టిగా తెలంగాణా అడిగితే మేం హైదరాబాదు ప్రత్యేకరాష్ట్రంగా అడుగుతాం జాగ్రత్త అన్నాడు చిన్న ఒవైసీ.

అయితే వుద్యమానికి ఓ భూమిక అంటూ వుండాలి. అదేమిటంటే ప్రాంతీయ అసమానత. కోస్తా, సీమలలో జరిగినంత అభివృద్ధి తెలంగాణాలో జరగలేదు అని ఆరోపణ. పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘించారు అని ఆరోపణ. ఆ ఒప్పందంపై సంతకం పెట్టినవారిలో చెన్నారెడ్డి ఒకరు. తనకు పదవులున్నంతకాలం యివేమీ గుర్తుకు రాలేదు. ఎన్నికల అవినీతివలన పదవి పోగానే యిది గుర్తుకు వచ్చింది. ఇటీవల కెసియార్‌కి, దేవేందర్ గౌడ్‌కూ అంతే! పదవులున్నంత కాలం అంతా పచ్చగా కనబడుతుంది. పోగానే నా ప్రాంతానికి ఎంత నష్టం జరిగింది! అంటూ వాపోతారు.

ఈ అభివృద్ధి గురించి నేనో మాట అంటాను – తెలంగాణా వెనుకబడివుంది, రాయలసీమ వెనుకబడి వుంది, ఉత్తరాంధ్ర వెనుకబడి వుంది అంటారు అక్కడివాళ్లు. ఇక మిగిలినవేమిటి? గుంటూరులో పలనాడు కూడా వెనుకబడిన ప్రాంతమే, నెల్లూరులో ఓ పక్క పెద్దగా పండదు, ప్రకాశంలోనూ అంతే! 'బాసర పక్కన గోదావరి, కానీ బాసరలో తాగేందుకు నీళ్లు లేవు' అని వాపోయారు ఒకాయన నాకు రాసిన మెయిల్‌లో. రాజమండ్రి పక్కన అఖండ గోదావరి. బాసర కంటె వెడల్పు. ఆవూళ్లోనూ తాగునీటి కొరతే. కుళాయిలలో నీళ్లు రావు. ఇలా చూస్తే మరి ఏ ప్రాంతాలు బాగుపడ్డట్టు? రాష్ట్రబజెట్ ఏమవుతున్నట్టు?

జక్కంపూడి రామ్మోహనరావు రోడ్ల మంత్రిగా వున్నపుడు తూగో జిల్లాలో రోడ్లు శాంక్షన్ చేయించుకుంటే, జీవన్‌రెడ్డి ఆ శాఖకు వచ్చాక అక్కడ మానిపించి, కరీంనగర్‌లో వేయిస్తున్నారని ఆ మధ్య అనుకున్నారు. పోనీ ఎక్కడో అక్కడ వేస్తున్నారులే అనుకుందాం. ఇంకో మంత్రిగారు స్వ, పర భేదం లేకుండా ఏ జిల్లా కాంట్రాక్టర్ ఎక్కువ కమిషన్ యిస్తే ఆ జిల్లాలో వేయించి వుండవచ్చు. మరొక మంత్రిగారు ఎక్కడా వేయించకుండా ఆ డబ్బెట్టి తన ఎస్టేటులో వేయించుకోవచ్చు. ఇలాటి బుద్ధి ఫలానా ప్రాంతం వారికే వుంటుందని ఎవరమూ చెప్పలేం. అసలు ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఏ మేరకు అభివృద్ధి జరిగింది? అని తేల్చాలంటే 1956 పరిస్థితిని బేస్‌గా తీసుకుని ప్రతీ జిల్లాలో ఇప్పటి పరిస్థితితో పోల్చి ఎంత యిన్వెస్టు చేశారు, ఎంత అభివృద్ధి జరిగింది అని యిండెక్సులు తయారుచేసి అప్పుడు పోల్చి చెప్పాలి. నిజాం పాలనలో వున్న కొన్ని జిల్లాలు మహారాష్ట్ర, కర్ణాటకలలో కలిశాయి. అక్కడ యిలాటి విభజన వుద్యమాలు జరగలేదు. దానికి కారణం ఏమిటి? అక్కడ వీర లెవెల్లో అభివృద్ధి జరిగిపోయిందా? లేక చెన్నారెడ్లు కెసియార్లు లేకపోవడమే కారణమా? అన్నది కూడా అధ్యయనం చేయాలి. తెలంగాణాలోని అన్ని జిల్లాలలోనూ అభివృద్ధి జరగకుండా వుండి వుండదు. కొన్నిట్లో ఒకలా, మరికొన్నిట్లో మరొకలా జరిగివుండవచ్చు. దానికి కారణాలేమిటి?

స్థూలంగా చూస్తే హైదరాబాదుజిల్లాపై పెట్టినంత ఇన్వెస్ట్‌మెంట్ మరే జిల్లామీదా పెట్టలేదు. ఆ మాట చెప్తే ప్రత్యేకవాదులు కోప్పడతారు. రాజధానిగా హైదరాబాదుమీద పెట్టిన పెట్టుబడిని తెలంగాణా ఎక్కవుంటులో వేస్తే ఎలా? అంటారు. 'అంటే హైదరాబాదు తెలంగాణాలోకి రాదా?' అని అడిగితే 'అలా ఎలా? హైదరాబాదు లేనిదే తెలంగాణాయే లేదు' అంటారు. 610 జీవో పై వేసిన గిర్‌గ్లానీ కమిషన్ రిపోర్టు కూడా యింత తమాషాగానూ వుంటుంది. హైదరాబాదు జిల్లా రాజధాని ఎక్కవుంటులో రాదుట. ఆ జిల్లాలోని వారే ఆ జిల్లాలో పనిచేయాలట.

హౌ ఫన్నీ! ఎక్కడెక్కడి ఆఫీసులూ హైదరాబాదులో పెట్టడమెందుకు? ఆ జిల్లాలో వాళ్లే పనిచేయాలన్న నిబంధన ఎందుకు? కోస్తా, సీమ వాళ్లందరినీ తరిమేయవచ్చని ఆ కమిషన్ రిపోర్టును అమలు చేయబోతే తెలంగాణాలోని యితర జిల్లాల వాళ్లే ఎక్కువమంది తేలారు. కొంతకాలం రాజధానిని విడిగా పరిగణిస్తామన్నారు కాబట్టే అన్ని జిల్లాలవాళ్లూ పైరవీలు చేసుకుని ఉద్యోగం చేసే భార్యలతో, కుటుంబాలతో సహా వచ్చిపడ్డారు. ఇప్పుడు మళ్లీ రూలు మార్చారు, యీ గ్లాని గారి వలన! ఏడాదికో రూలు మార్చేసి, ఫో, ఫో, మీ జిల్లాలో యీ పోస్టు లేకపోయినా ఫో అంటే ఏమవుతారు?

11

ఇలాటి లెక్కలూ, డొక్కలూ వేసినవాళ్లెవరూ లేరు – అప్పుడే కాదు, యిప్పటికీ వేయలేదు. అన్యాయం జరిగిందంటే ఓహో కాబోసు జరిగిందనుకున్నారు. విద్యార్థులకు ఓ ఏడాది చదువు పోయింది. ఉద్యోగులకు సమ్మె కారణంగా జీతాలు పోయాయి. వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో పెట్టుబడి పెడదామనుకున్నవారు వెనక్కి జంకారు. కొన్ని నెలలపాటు జనజీవనం అస్తవ్యస్తమైంది. అయినా ఇందిరా గాంధీ చలించలేదు. రాష్ట్రవిభజన కుదరదు పొమ్మంది. ఆవిడ చెన్నారెడ్డిని మించిన జగమొండి. 1971 పార్లమెంటు ఎన్నికల్లో చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితి అనే పేర పార్టీ ఏర్పరచి 10 స్థానాలు గెలిచాక పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసేస్తే బ్రహ్మానందరెడ్డిని ముఖ్యమంత్రిగా తీసేస్తానని, చెన్నారెడ్డిని గవర్నరు చేస్తానని బేరం పెట్టింది.

చెన్నారెడ్డి ఎగిరి గంతేసి ఆ పని చేసేశారు. ఆ తర్వాత రెండు సార్లు ముఖ్యమంత్రి అయినా, మరో పాతికేళ్లు బతికినా యింకెప్పుడూ ప్రత్యేక తెలంగాణా మాటే ఎత్తలేదు. మొత్తం రాష్ట్రాన్ని హాయిగా పాలించారు. ఇదీ తెలంగాణా పట్ల ఆయన నిబద్ధత. ఇప్పుడు తెలంగాణా సీనియర్ల పేర చలామణీ అయిపోతున్న కాకా వెంకటస్వామి, ఎం సత్యనారాయణరావు, ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, విడిగా పోరాటం చేసేస్తున్న కొండా లక్ష్మణ్ బాపూజీ – వీళ్లంతా ఆనాడు చెన్నారెడ్డి అనుచరులే. ఆయనతో బాటు గోడ దూకినవాళ్లే. తర్వాత తెలంగాణా గురించి నోరెత్తనివాళ్లే. వైయస్‌ను అడ్డుకోవడానికే ఇప్పుడు మళ్లీ ఆ పల్లవి ఎత్తుకున్నారు. ఇప్పుడు మళ్లీ గప్‌చుప్ అయిపోయారు. ఇలాటివాళ్ల నేతృత్వంలో నడిచిన వుద్యమంలో ఎంత చిత్తశుద్ధి వుండి వుంటుందో ఆలోచించి చూడండి.

ఇక 1972 నాటి ఆంధ్ర వుద్యమం సంగతి చూద్దాం. దానంత అవకతవక కంగాళీ వుద్యమం మరోటి వుండదు. దాని నేపథ్యం చెపుతాను. 1971 అంటే ఇందిరా గాంధీ బలపడుతున్న రోజులవి. ప్రతీ రాష్ట్రంలోనూ అప్పటిదాకా రాజ్యమేలుతున్న కులాలను, నాయకులను తప్పించివేసి తనకు వీరవిధేయులను ప్రతిష్ఠాపించి పార్టీ మొత్తాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి చూస్తోంది. ప్రతి రాష్ట్రంలోనూ బ్రాహ్మణులను ముఖ్యమంత్రులుగా నియమించుకుంటూ వస్తోంది. ఆంధ్రలో రెడ్ల ప్రాబల్యం చూసి ఆమె తెల్లబోయింది. నాయకులందరూ సంజీవరెడ్డి వర్గం, బ్రహ్మానందరెడ్డి వర్గంగా చీలిపోయి వున్నారు. ఇప్పుడు తెలంగాణా వుద్యమం అందిచ్చిన అవకాశాన్ని పుచ్చుకుని తెలంగాణా వుద్యమ సమయంలో ఆంధ్రప్రాంతం వారి ధనమానప్రాణాలను కాపాడిన బ్రహ్మానందరెడ్డిని తీసేసి తెలంగాణా ప్రాంతపువాడు, బ్రాహ్మణుడు అయిన పివి నరసింహారావును 1971 సెప్టెంబరులో ముఖ్యమంత్రిగా కూచోబెట్టింది.

పివికి రాజకీయంగా ఏ పలుకుబడీ లేదు. ఇందిరా గాంధీ కూచోబెట్టిన బొమ్మ ఆయన. అయినా చిత్తశుద్ధి, డొక్కశుద్ధి వున్నవాడు కాబట్టి భూ సంస్కరణల చట్టాన్ని రాష్ట్ర శాసనసభలో ఆమోదింపజేశాడు. దాని ప్రకారం తలకు యింత అని పరిమితి ఏర్పరచారు. పరిమితి దాటిన భూమి ప్రభుత్వానికి అప్పగించేయాలి. భూమి నిలుపుకోవడానికి భూస్వామి వర్గాలు నానా అగచాట్లు పడ్డాయి. భార్యతో విడిపోయినట్టు చూపించిన వాళ్లు కొందరైతే, పనివాళ్ల పేర, దూరపు బంధువుల పేర ఆస్తులు రాసేసినవాళ్లు కొందరు. భూములన్నీ లిటిగేషన్‌లో పడ్డాయి. భూ సంస్కరణలనేవి చిన్నప్పటినుండీ వింటున్నారు కానీ అవి ఎప్పటికైనా చట్టరూపం దాలుస్తాయని ఎవరూ అనుకోలేదు. రాజకీయంగా నాలుగు కాలాలపాటు మన్నుదామనుకున్నవాడు ఎవడూ చేయని పని పివి చేసేశారు. దాంతో భూస్వామి వర్గాలు ఆయనపై కత్తికట్టాయి.

గతవ్యాసాలలో రాశాను – రాష్ట్రవిభజనోద్యమాలన్నీ ప్రభుత్వ వుద్యోగాల చుట్టూనే తిరిగాయని. తెలంగాణా వుద్యమం మానిపించడానికి ఇందిరా గాంధీ ముల్కీ నిబంధనలను కఠినంగా అమలు పరుస్తానని హామీ యిచ్చి అమలు చేయించసాగింది. ఈ ముల్కీ నిబంధనల కారణంగా ఆంధ్రప్రాంతం వారికి వుద్యోగాలు రావడం మానేశాయి. స్వంత రాష్ట్రంలో వుద్యోగాలు చేసుకోనివ్వని యీ రూల్సేమిటి? అని కోపం వచ్చి కొందరు విద్యార్థులు ముల్కీ వ్యతిరేక వుద్యమం మొదలుపెట్టారు. ఒక కాలేజీలో మొదలుపెట్టాక తక్కిన కాలేజీలకు పసుపు, గాజులు పంపితే అక్కడ వాళ్లూ మొదలు పెట్టారు.

ఇలాటి విద్యార్థి వుద్యమంలో తెన్నేటి విశ్వనాథం గారు ప్రవేశించారు. ఆయన ప్రకాశం గారి అనుయాయుడు. ప్రజాపార్టీలో మిగిలిన నాయకుడు. పాతతరానికి చెందిన నిజాయితీపరుడిగా పేరుబడ్డ వ్యక్తి. విశాఖపట్టణంలో ఉక్కు కర్మాగారం రాబోయి ఆగిపోతే 'విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు' అంటూ వుద్యమం లేవదీసి, విద్యార్థులందరినీ ఆకర్షించి వారితో సమ్మెలు చేయించిన వ్యక్తి. చివరకు ఉద్యమం ఓ మాదిరిగా సఫలమై (ఎందుకంటే వైజాగ్‌కు రావలసిన ఫ్యాక్టరీని మూడు ముక్కలు చేసి తమిళనాడు, కర్ణాటకలకు కూడా పంచారు) ఆయన నాయకుడిగా అందరి నోళ్లలో నానుతున్నారు. విశాఖ ఉక్కు వుద్యమంలోనే అందరికీ పరిచయమైన విద్యార్థి నాయకుడు జనసంఘ్ పార్టీకి చెందిన వెంకయ్యానాయుడు.

12

ముల్కీ వ్యతిరేక వుద్యమం కాలేజీల్లో పుట్టగానే తెన్నేటివారు, వెంకయ్యనాయుడు వూరూరా తిరిగి వుపన్యాసాలు యివ్వడం మొదలెట్టారు. స్వంతరాష్ట్రంలోనే పరాయివాళ్లలా చూస్తూంటే మనకా రాష్ట్రం ఎందుకు? అనుకున్నారు. 'ముల్కీ రద్దు చేయండి, లేదా రాష్ట్రాన్ని విభజించండి' అని పోస్టర్లు వెలిశాయి. ఇదంతా భూస్వామి వర్గాల వారికి కనులపండుగగా వుంది. ఈ దెబ్బతో పివిని గద్దె దింపేస్తే ఈ చట్టం అమలు చేసే నాథుడు లేకుండా పోతాడనుకున్నారు. ఉద్యమానికి చేయూత నిచ్చారు. విద్యార్థుల ఆందోళనతో ఉద్యోగులలో, సామాన్య జనంలో కూడా వేడి పుట్టింది. తెలంగాణా వుద్యమకాలంలో జరిగిన అవమానాలు గుర్తుకు వచ్చాయి. తెలంగాణాను వదిల్చేసుకుంటే, సారవంతమైన భూమిగల మన ప్రాంతం యిక వెలిగిపోతుంది అన్న ఆలోచన వచ్చేసింది. 'జై ఆంధ్ర' అన్నారు. తమ శాసనసభ్యులను రాజీనామా చేయమని పట్టుబట్టారు. చేసి ఉద్యమంలో కలిసి రమ్మన్నారు. అక్కడ వచ్చింది యిబ్బంది.

అప్పటి శాసనసభ్యులందరూ కాంగ్రెస్‌వారే. అందరూ ఇందిరా గాంధీ అంటే హడలి చచ్చేవారే. ఆవిడ సమైక్యవాది అని తెలుసు. ఆవిడ యిష్టానికి వ్యతిరేకంగా వెళితే ఏమవుతామేమోనన్న భయం. అందువలన విద్యార్థులు ఎదురైనప్పుడు జై ఆంధ్ర అనడం, పరిగెట్టుకుని వచ్చి హైదరాబాదులో కూచోవడం. ఇలా చేస్తే ఉద్యమం అప్పోజిషన్ చేతిలోకి వెళిపోవాలి కదా! అప్పట్లో అపోజిషన్‌లో వున్న కమ్యూనిస్టులు కూడా సమైక్యవాదులే. ఆ రోజుల్లో మన రాష్ట్రంలో సిపిఎం కంటె సిపిఐ పెద్ద పార్టీ. వారు ఇందిరా గాంధీతో అంటకాగే రోజులవి. పైగా విశాలాంధ్రకోసం పోరాడినవాళ్లం కదా రాష్ట్రం విడిపోవాలని ఎలా అంటాం? అన్నారు కమ్యూనిస్టులు. ఇక మిగిలినది బొత్తిగా బలం లేని జనసంఘ్, (దరిమిలా బిజెపి అయింది) పాత కాంగ్రెస్‌వాదులు, ఇదిగో తెన్నేటివంటి వృద్ధనాయకులు. అందువలన ఉద్యమానికి నాయకత్వం అంటూ లేకుండా పోయింది. ఇక విద్యార్థులే నాయకుల వెంట పడ్డారు. నాయకులంటే ఎవరు? ఉద్యమం అంటే యిష్టం లేని కాంగ్రెస్ శాసనసభ్యులు. విద్యార్థులు వాళ్లకి అల్టిమేటం యిచ్చి, ఇదిగో మీరంతా ఫలానా వూళ్లో కలిసి మాట్లాడుకుని ప్రత్యేకాంధ్ర కావాలని తీర్మానం చేయాలి అని శాసించేవారు. వాళ్లు తప్పదురా దేవుడా అన్నట్టు వచ్చేవారు. ఇష్టంలేని దంపతులను శోభనంగదిలోకి పంపించినట్టు వీళ్లు వాళ్లని పంపి తీర్మానాలు చేయమని చెప్పి, బయట కాపు వేసేవారు. వాళ్లు మొక్కుబడిగా తీర్మానం చేయడం, ముక్కుతూ మూలుగుతూ బయటకు రావడం. హైదరాబాదు వెళ్లి తూనా బొడ్డు అనడం.

ఇలాటి సమావేశాలు పదిహేనురోజులకోసారి అవుతూ వుండేవి. ఓ పక్క వుద్యోగులు నెలల తరబడి ఉద్యోగాలు మానేసి కూచున్నారు. విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలు మానేసి కూచున్నారు. రోజురోజుకీ ఊరేగింపులు, బంద్‌లు. అయినా ఉద్యమాన్ని నడిపించవలసిన ప్రజా నాయకులు పదిహేను రోజులకోసారి కలవడం – అదీ ప్రజలు తంతారన్న భయం చేత. కాకాని వెంకటరత్నం వంటి అంకితభావం వున్న నాయకుడు వుద్యమం ప్రథమదశలోనే పోయారు. ప్రజల్లో వేడి ఎక్కువైన కొద్దీ శాసనసభ్యులు రాజీనామాలు పంపారు. అదీ స్పీకరుకి కాదు, వాళ్ల పార్టీ నాయకులకే!

పివి కి విధేయులైన ముగ్గురు మాత్రం చేయనని ధైర్యంగా నిలబడ్డారు. ఇందిరా గాంధీ ఎప్పటిలాగానే మొండికేసింది. నెలలతరబడి రైళ్లు ఆపేసినా చలించలేదు. చివరకు ఆరుసూత్రాల పథకం అంటూ ఒకటి చూపించి ఉద్యమాన్ని విరమింపజేసింది. పివిని తొలగించివేసి, గవర్నరు పరిపాలన పెట్టింది. భూస్వామి వర్గాలు చల్లబడ్డాయి. ఉద్యమం చల్లారింది. అప్పటినుండి యిప్పటిదాకా ఆ అదనపు భూమిని స్వాధీనం చేసుకున్నారనుకోను. గవర్నరు పరిపాలన తర్వాత వెంగళరావు ముఖ్యమంత్రి అయ్యారు. 1975లో ప్రపంచ తెలుగు మహాసభలు పెట్టి తెలుగువారంతా ఒకటేనన్న భావన కలగజేశారు. ప్రత్యేక వుద్యమాల మాట జనాలు మరిచేపోయారు.

కెసియార్‌కు మంత్రిపదవి రాకపోవడంతో మళ్లీ తెలంగాణా వుద్యమం మాట ఎత్తుకున్నారు. దానికి ఉత్తర తెలంగాణాలోనే కొంత స్పందన కనబడింది. తెరాస కథ యిప్పుడు అందరికీ కంఠతా వచ్చేసింది కాబట్టి మళ్లీ అదంతా చెప్పటం లేదు. చెప్పుకోవలసినదేమిటంటే తెలంగాణా సెంటిమెంటు వుంది అనుకోవడం అనవసరం. 'హైదరాబాదులో సెటిలర్లు వున్న కూకట్‌పల్లి, వనస్థలిపురంలో తెరాసకు అంత బలం లేకపోయినా....' అంటూ మీడియా విశ్లేషణలు సాగాయి. (అసలు సెటిలర్లు అనే పదమే అభ్యంతరకరం. వాళ్లేమైనా శరణార్థులా? ప్రవాసులా? 'ఆ అమ్మాయి దానిమొగుడుతో వెళ్లింది' అన్నట్టు స్వంత రాష్ట్రంలో ఎవరైనా సెటిలర్లు అవుతారా?) ఈ ప్రాంతం ఆ ప్రాంతం అని కాదు, హైదరాబాదు నగరమంతా ముక్తకంఠంతో ప్రత్యేకవాదాన్ని తిరస్కరించింది. హైదరాబాదు ఒక్కటే కాదు, రాష్ట్రమంతా ప్రత్యేకవాదాన్ని నిరసించింది. అయితే రాజకీయవాదులు రగిలించిన నిప్పు అంత చప్పున ఆరిపోదు. అసంతృప్తి ఎప్పుడూ వుంటుంది. దాన్ని రాజేసేవాడు వుంటే రగులుకుంటుంది.

సరే పాతసొదంతా చెప్పావు, యింతకీ ఏమంటావు? అని అడుగుతున్నారా?

ఇవాళ్టికైనా, రేపటికైనా రాష్ట్రం విభజింపబడాలంటాను,

13

నాకో ఐడియా వచ్చింది. వినడానికి చాలా వింతగా వుండవచ్చు. కానీ ఆలోచించి చూడండి. మీ అభిప్రాయాలు యితరులతో

పంచుకోండి. మీలో మీరు చర్చించుకుని నాకు రాయండి. మనమంతా కలిసి ఓ ప్రజాభిప్రాయాన్ని బిల్డప్ చేద్దాం. సాధ్యాసాధ్యాల గురించి నిపుణులు ఎవరైనా చెపితే మరీ సంతోషిస్తాను. రాజకీయాల తీతంగా, టెక్నికల్‌గా ఆలోచించినపుడే మనకు చక్కని పరిష్కారం దొరుకుతుంది. ఈ సీరీస్‌లోని తక్కిన ఆర్టికల్స్‌ను ఫార్వార్డ్ చేసినా చేయకపోయినా ఈ ఆర్టికల్ లింక్ మీ స్నేహితులకు ఫార్వార్డ్ చేయండి. ఇప్పటిదాకా చెప్పిన పాయింట్లను బుల్లెట్ టైపులో చెప్పేస్తాను.

01) జనాభా పెరుగుతున్న దృష్ట్యా 10 కోట్లు జనాభా చేరేనాటికి ఐదేసి కోట్ల రెండు సమాన రాష్ట్రాలు అయ్యేట్లు చెయ్యాలి. దానికి ఇప్పటినుండీ ప్రణాళిక వేసుకుంటూ పోవాలి. ఇప్పటికిప్పుడు విడిపోకూడదు. ప్రస్తుతం వున్న ఎమోషన్లు, సెంటిమెంట్ల మధ్య అన్నదమ్ముల్లా సుహృద్భావంతో విడిపోవడం అసాధ్యం. నదీజలాలు, హైదరాబాదు పెద్ద సమస్య అయిపోతాయి. రాజకీయనాయకుల ప్రమేయం లేకుండా నిపుణులు నిర్ణయించాలి.

02) రాష్ట్ర విభజన ప్రాంతాల వారీగా జరగకూడదు. ఇవాళ తెలంగాణా అని విడగొడితే రేపు ఉత్తర తెలంగాణా, దక్షిణ తెలంగాణా అని విభేదాలు వస్తాయి. పదవులన్నీ ఉత్తర తెలంగాణావాళ్లు ఎత్తుకుపోతున్నారు అని దక్షిణం వాళ్లంటారు. వీళ్లని వాళు మరోటంటారు. అలాగే ఆంధ్ర నుండి రాయలసీమ విడిపోతానంటుంది. నాలుగు జిల్లాలతో అది మనగలుగుతుందా? అనంతపురం కర్ణాటకలో చేరతానంటుంది. నెల్లూరు 'నాకూ శ్రీకాకుళానికి బహుదూరం' అంటుంది.

03) ఉమ్మడి కుటుంబం మరీ పెద్దదై అన్‌మేనేజబుల్ అయ్యాక విడగొడతారు. విడగొట్టినపుడు ఇంటిముందు భాగం, నడుమభాగం, పెరడు, బావి సగం సగం వచ్చేట్టు విడగొడతారు కానీ ముందుదంతా ఒకరు, వెనకదంతా మరొకరు తీసుకోరు. ఇప్పుడు వేస్తున్న ప్లాన్ల ప్రకారం విడగొడితే తెలంగాణాకు సముద్రతీరం లేకుండా పోతుంది. రాబోయే రోజుల్లో పెరిగే పెట్రోలు ధరల దృష్ట్యా, రవాణా సౌకర్యాల దృష్ట్యా సముద్రతీరం వున్న ప్రాంతాలు, దాని హింటర్‌ల్యాండ్ బాగా అభివృద్ధి చెందుతాయి. (బిజెపివాళ్లు తెలంగాణాకు సముద్రం తెస్తామని అన్నారు కానీ అది వాళ్ల రామమందిర నిర్మాణం ఐడియా లాగానే వుంది!)

04) హైదరాబాదు ఎవరికి చెందాలన్న విషయంపై పెద్ద పెద్ద గొడవలు జరుగుతాయి. ఆవేశకావేషాలు పెరుగుతాయి. హైదరాబాదు లేని రాష్ట్రం ఎవరికీ అక్కరలేదు. కొత్త రాజధాని కట్టుకోవడానికి రాష్ట్రం వద్ద నిధులు లేవు. కేంద్రం యివ్వదు. (33 మంది ఎంపీల నిస్తే ఎన్ని మంత్రిపదవులు దక్కాయో చూశారుగా)

అందువలన –

నా ఐడియా ఏమిటంటే – రాష్ట్రాన్ని ప్రాంతాల వారీగా కాకుండా హారిజాంటల్‌గా రాజధాని గుండా విభజించాలి. పైది ఉత్తర ఆంధ్రప్రదేశ్, కిందది దక్షిణ ఆంధ్రప్రదేశ్. జంటనగరాల్లో పై సగం నార్త్ ఎపి కు, కింది సగం సౌత్ ఎపి కు. పక్కన ఆంధ్రప్రదేశ్ మ్యాప్ యిస్తున్నాను. స్కేలు పెట్టి అడ్డంగా హైదరాబాదుగుండా గీసేశాను తప్ప తక్కిన లెక్కలన్నీ కరక్టుగా వేయలేదు. అయినా స్థూలంగా చూస్తే ఉత్తర ఎపిలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, తూగో, వైజాగ్, విజయనగరం, శ్రీకాకుళం, మెదక్, రంగారెడ్డి, నల్గొండ, పగో లలో సగం సగం వస్తాయి. వైజాగ్ పోర్టు వాళ్లకు వస్తుంది. సికింద్రాబాద్ వస్తుంది.

అలాగే సౌత్ ఎపిలో మెహబూబ్‌నగర్, గుంటూరు, కృష్ణా, కర్నూలు, ప్రకాశం, అనంతపురం, కడప, నెల్లూరు, చిత్తూరు పూర్తిగా నల్గొండ, రంగారెడ్డి, పగో సగం వస్తాయి. కాకినాడ పోర్టు వస్తుంది. జంటనగరాల్లో హైదరాబాదు వస్తుంది.

జనాభాను, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కొన్ని జిల్లాలను అటూ, కొన్ని యిటూ తోయవచ్చు. తీరప్రాంతాలు, వెట్‌లాండ్స్, డ్రై లాండ్స్ అన్నీ సమానంగా వచ్చేట్టు చేయవచ్చు.

తర్వాత 1956ను బేస్‌గా చేసుకుని ఏ యే జిల్లాలలో ఎంత అభివృద్ధి జరిగిందో చూసి తక్కువగా వున్నచోట దృష్టి పెట్టి, పెట్టుబడులు పెట్టి, వాటిని తక్కినవాటితో సమానం చేయాలి. రాబోయే నాలుగేళ్లలో యిదంతా పూర్తి చేస్తే అప్పుడు 2014 నాటికి రాష్ట్రవిభజన ఏ గొడవలు లేకుండా సాధించవచ్చు.

ఇక నదీజలాల సమస్య అంటారా? దానికి ఒక్కటే మార్గం. నదులన్నీ జాతీయసంపదగా పరిగణించడం. అది జరగనిదే రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య గొడవలు ఆగవు. నదీజలాలపై ఎక్కడ ఎటువంటి ప్రాజెక్టు కడితే ఎక్కువమంది లాభపడతారో అంతర్జాతీయ నిపుణుల సలహాలమేరకు జాతీయస్థాయిలో నిర్ణయాలు తీసుకోవాలి. గ్రామస్థాయి రాజకీయనాయకులు కాదు.

ఇక మిగిలినది – ఈ ప్రాంతాల మధ్య ఒకరిపై మరొకరికి అపనమ్మకాలు, ఓ ప్రాంతంవారు అమాయకులనీ, మరొకరు మాయావులనీ యిటువంటి అభిప్రాయాలు ఏర్పరచుకుని అవతలివాళ్లను అనుమానంగా చూడడం! నిజాం ఫ్యూడల్‌పాలనలో కష్టపడి సంపాదించినా ఫలితం లేకపోవడంతో (జమీందారు లాక్కుంటాడు), మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తెలంగాణా ప్రజల వర్క్‌కల్చర్ ఒకలా వుండేది. ఆంధ్రప్రాంతంలో బ్రిటిష్ పాలనలో కాపిటలిస్టు వ్యవస్థలో కష్టపడితే ఫలితం వుండేది కాబట్టి అక్కడి ప్రజల వర్క్‌కల్చర్ మరోలా వుండేది. 1956 తర్వాత క్రమంగా ఒకరినుండి మరొకరు నేర్చుకున్నారు. చెప్పాలంటే తెలంగాణావారు అతిత్వరగా నేర్చుకుని గబగబా ఎదిగారు. పక్కవాడు ఎదుగుతూంటేనే మనకూ వుత్సాహంగా వుంటుంది. ఆ మెళకువలు మనమూ నేర్చుకుంటాం. అందరం మందకొడిగా వుంటే బయటివాడు వచ్చి పెత్తనం చలాయిస్తాడు. క్లాసురూములో విద్యార్థులను సెక్షన్లుగా విడగొట్టేటప్పుడు యీ సూత్రం పాటిస్తారు. నేను సూచించిన మ్యాప్ ప్రకారం నార్త్, సౌత్ రెండు ప్రాంతాల్లోనూ రెండు రకాల ప్రాంతాలూ వున్నాయి చూడండి.

దీనిపై కూలంకషంగా ఆలోచించాకనే మీరు ఫీడ్‌బ్యాక్ యివ్వండి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: ఎల్‌టిటిఇపై స్పందన

ఎల్‌టిటిఈపై వ్యాసాల సందర్భంగా తమిళులు స్థానికులతో కలవకపోవడం గురించి విమర్శిస్తే కొందరు – 'హిందీవాళ్లు మనపై హిందీ రుద్దుతున్నారు. వాళ్లని తిట్టండి' అని రాశారు. మరి కొందరు కర్ణాటకలో స్కూళ్లలో కన్నడ కంపల్సరీ చేశారు తిట్టండి అని.. ఇంకొందరు మహారాష్ట్రలో రాజ్ థాకరే విధానాలను తిట్టమని.. ఇంకొకాయన 'తెలుగువాళ్లలో మాత్రం లోపాలు లేవా? వాళ్లనీ తిట్టండి' అని...

అయ్యా, నేను జాతుల వారీగా తిట్టే కార్యక్రమం పెట్టుకోలేదు. తమిళుల ఒక గుణం గురించి విమర్శించాను తప్ప తిట్టలేదు. నాకు తమిళభాష యిష్టం. నేర్చుకున్నాను కూడా. తమిళులు అనేకమంది మంచి స్నేహితులున్నారు. తమిళనాడులో వున్నాను, స్థిరపడదామని యిల్లు సైతం కొనుక్కున్నాను. వాళ్లలో అనేక మంచి గుణాలున్నాయి. కానీ సందర్భం వచ్చినపుడు ఎవరినైనా విమర్శిస్తాం. తెలుగునాట కులం గురించి స్పృహ పెరిగిపోతోంది అని మొన్ననే కదా తెలుగువాళ్లని తప్పుపట్టాను.

కొందరు శ్రీలంకలో తమిళవాళ్లకి 70% మార్కులు వచ్చినా సీటివ్వరని, అదే సింహళీయులైతే 40% మార్కులు వచ్చినా సీటు యిస్తారని వాపోయారు. ఇలాటివి యిలాటివి యిక్కడ లేవా? అగ్రవర్ణాల వారికి 70% వచ్చినా రావు. రిజర్వ్‌డ్ కాండిడేటయితే 40% వచ్చినా వస్తాయి. అక్కడ జాతి వివక్షత, ఇక్కడ కులవివక్షత. దీన్ని విమర్శించే హక్కు తమిళవాళ్లకి – అందునా ద్రవిడపార్టీలకు అస్సలు లేదు. ఓట్లకోసం బిసిల కోటాను విపరీతంగా – సుప్రీంకోర్టు విధించిన పరిమితి దాటి – పెంచేసిన ఘనత వారిదే! అక్కడి అగ్రవర్ణాలవారు 80% మార్కులు తెచ్చుకున్నా సీట్లకోసం పరరాష్ట్రాలకు ప్రయాణం కట్టవలసినదే! డిఎంకెకు ఎంత బ్రాహ్మణద్వేషమంటే వారి పార్టీనుండి ఒక్క బ్రాహ్మణ ఎమ్మెల్యే కూడా లేడు. ఈ వివక్షతకు వ్యతిరేకంగా తమిళబ్రాహ్మణులు మాకూ ఓ ఈలం కావాలని పోరాటం మొదలుపెట్టి, అడ్డువచ్చినవాళ్ల పీకలు కోస్తూ, ఆయుధాలు, మాదకద్రవ్యాలు స్మగుల్ చేస్తూ వుంటే తక్కిన రాష్ట్రాలలోని బ్రాహ్మణులందరూ వాళ్లని సమర్థిస్తానంటే ఎలా వుంటుంది?

అలా అని నేను శ్రీలంక ప్రభుత్వ విధానాలను సమర్థించడం లేదు. వైయస్ నాకు డబ్బిచ్చి రాయిస్తున్నాడని నమ్మేవాళ్లున్నట్టే, రాజపక్షే నాకు డబ్బిచ్చి యిదంతా రాయిస్తున్నాడని నమ్మేవాళ్లుంటే నేనేమీ చేయలేను. తమిళుల–సింహళీయుల మధ్య చర్య–ప్రతిచర్య చాలా జరిగాయి. ఇరుపక్షాలా అతివాదులు, మితవాదులు వున్నారు. అందరూ కూర్చుని సామరస్యంగా పరిష్కరించుకోవాలి. దానికి కావలసినది తమిళులు గతం గురించి (మేం ఒకప్పటి పాలకులం. ఈ సీమ అంతా మాదే.. లాటివి) మర్చిపోయి, నేటి వాస్తవాన్ని గుర్తెరిగి మాట్లాడాలి. ఈ సమస్యను లంక అంతర్గత వ్యవహారంగా భావించి మనం వూరుకోవాలి. లేకపోతే సింహళ అతివాదులు మన బూచిని చూపించి సింహళీయులను రెచ్చగొడతారు. అది తమిళులకు చేటు.

కొందరు వాదించారు– తక్కిన దేశాల్లో కూడా తమిళులు వున్నారు కదా, అక్కడ సమస్యలు రాలేదేం? అని. వస్తాయి, వస్తాయి. మద్దు రవికాంత్ అనే ఆయన రాశారు – ఆయన జర్మనీలో చదువుకునే రోజుల్లో అక్కడ శ్రీలంక తమిళుల సంఖ్య ఎలా పెరిగిందో రాశారు. 'వీళ్లు చిన్న చిన్న బోట్లలో జర్మనీ చేరతారు. చేరగానే పాస్‌పోర్టు చింపేసి ఇంగ్లీషు, జర్మనీ ఏదీ రానట్టు నటిస్తారు. అప్పుడు ఇంకో తమిళుణ్ని పట్టుకుని జర్మన్ అధికారులు వీడి సంగతేమిటో చూడమంటారు. పాస్‌పోర్టు లేదట అంటాడు వాడు. జర్మన్‌వాళు వీళ్లని కొన్నాళ్లు జైల్లో పెట్టి వీడి ఆనుపానుల గురించి శ్రీలంక ఎంబసీలో అడుగుతారు. పాస్‌పోర్టు లేదు కాబట్టి వాళ్లు చెప్పలేరు. అధికారులు ఏం చేయాలో తోచక కొన్ని ఫుడ్‌పాస్‌లు యిచ్చి జైల్లోంచి వదిలేసి శరణార్థుల శిబిరాలకు (ఎసలెమ్) తరలిస్తారు.

'వర్క్ పెర్మిట్ లేందే పనిచేయడానికి వీల్లేదు. వర్క్ పెర్మిట్ రావడానికి ఏళ్లూ, పూళ్లూ పడుతుంది. అయితే వీళ్లు అక్కడి శ్రీలంక తమిళుల షాపుల్లో దొంగతనంగా పనిచేస్తూ ఎవరైనా జర్మన్ అమ్మాయిని లోబరుచుకుని పెళ్లి చేసేసుకుంటారు. సిటిజన్‌షిప్ రాగానే ఆ అమ్మాయిని వదిలించుకుని శ్రీలంక తమిళ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఆ తర్వాత ఆ అమ్మాయి తలిదండ్రులను కూడా తను వచ్చిన రాచ(?)బాటలోనే రావడానికి ఏర్పాట్లు చేస్తాడు. ఇలాగ అక్కడ వారి జనాభా పెరిగిపోతూ వుంటుంది. ఇలాటి పెద్దమనుషులు అక్కడ తమిళభాష ఔన్నత్యం గురించి, సింహళీయుల అత్యాచారాల గురించి ఉపన్యాసాలు దంచుతూ నిధులు సేకరిస్తూ ఎల్‌టిటిఈకి పంపుతూంటారుట. పారి(స్)లో కూడా యిలాటి వాళ్లకు కాలనీ వుందట. అక్కడుంటే మద్రాసులోని పారిస్ కార్నర్‌లో వున్నట్టే వుంటుందట.' ఇదీ ఆయన రాసినది.

నిజానికి ఇలాటి వాటివలన సోషల్ టెన్షన్లు పెరిగిపోతాయి. ఫాస్‌బైండర్‌ది ఓ జర్మన్ సినిమా చూశాను 'ఫియర్ యీట్స్ ద సోల్' అని. దాన్లో మొరాకోనుండి వచ్చి పర్మిట్ లేకుండా బార్‌లో పనిచేసే ఓ యువకుడిని మధ్యవయస్కురాలైన ఓ జర్మన్ వితంతువు పెళ్లాడుతుంది. సమాజం ఆమెను వెక్కిరించినా నిలబడుతుంది. ఆఖరికి ఆ యువకుడు జబ్బు పడతాడు. ఇలాటి దొంగజీవితం వలన వాళ్లకు భయం కలిగి కడుపులో నొప్పి, అల్సర్ రావడం సహజమని డాక్టర్ అంటాడు. వీళ్ల కారణంగా స్థానికులకు ఉద్యోగాలు రాకపోవడం వలన వాళ్లంతా వీళ్లపై కసిపూని వుండడం అ దీ చూపించారు సినిమాలో.

అందువలన, ఇవాళ శ్రీలంకలో జరిగినది వచ్చే దశాబ్దాలలో వేరే చోట జరిగినా ఆశ్చర్యపడనక్కరలేదని తాత్పర్యం. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: స్విస్ బాంకులపై స్పందన

ఇక స్విస్ బాంక్‌ల గురించి – మామూలుగా వాటి గురించి రాస్తే వూరుకునేవారేమో కానీ మార్గదర్శిలోని అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు, టిడిపివారి నగదు బదిలీ పథకం, వీటిని కవర్ చేస్తూ రాయడంతో కొందరు టిడిపి అభిమానులు నొచ్చుకున్నారు. 'స్విస్ బాంక్‌ల గోప్యత గురించి మీరు చెప్పేది పాత సమాచారం, ఇప్పుడవి సమాచారం యివ్వడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. యుపిఏ ప్రభుత్వానికి యిచ్చేశాయట కూడా అని ఆంధ్రజ్యోతి రాసింది' అని అన్నారు.

ఇండియా టుడే 14 ఏప్రిల్ 09 సంచికలో రాసినదిది – గడచిన సెప్టెంబరులో స్విజర్లండ్‌లోని యుబిఎస్ బాంక్ అమెరికన్ పౌరులకు చెందిన 47,000 రహస్య ఖాతాల వివరాలను అమెరికాకు వెల్లడించింది. కానీ వాటి సొంతదారులెవరనే సంగతిని చెప్పడానికి మాత్రం ససేమిరా నిరాకరించింది. అయితే, గత నెలలో చాటుమాటు వ్యాపారం కోసం ప్రయత్నాలు సాగిస్తూ దొరికిపోయిన యుబియస్ 250–300 మంది ఖాతాదారుల వివరాలను వెల్లడించడానికి దిగిరాక తప్పలేదు. అంతేకాదు, 78 కోట్ల డాలర్ల జరిమానా కూడా చెల్లించింది. మూసివేత ప్రమాదాన్ని, అంతర్జాతీయ ఆంక్షలను తప్పించుకోవడానికే, నిస్పృహతో యిలాంటి బేరానికి దిగింది.'

ఇలాటి పరిస్థితుల్లో స్విస్ బాంక్‌లు తమంతట తాము యుపిఏ ప్రభుత్వానికి సమాచారం అందించాయి అన్న న్యూస్ ఎంతవరకు కరక్ట్ అని నాకు మెయిల్ రాసిన ఓ స్విజర్లండ్ తెలుగాయనను అడిగాను. ఎందుకంటే ఆయన పనిచేసేది యుబియస్ బ్యాంక్‌లోనే! ఆయన జవాబు రాగానే పాఠకులతో పంచుకుంటాను. ఆయన అనుమతి యిస్తేనే ఆయన పేరు వెల్లడిస్తాను.

స్విజర్లండ్ తెలుగాయన రాశారు. 'స్విజర్లండ్ గురించి మీకేం తెలుసని అలా రాశారు? స్విస్‌లో ఎన్నో పరిశ్రమలున్నాయి. అనేక ఫార్మా కంపెనీల హెడ్‌క్వార్టర్స్ వున్నాయి. బ్యాంకింగ్ మీద ఆధారపడవలసిన అగత్యం స్విజర్లండ్‌కు లేదు. మీరెప్పుడైనా యిక్కడకు వచ్చారా? ఇక్కడకు వస్తే వీళ్ల సర్వీసు ఎంత బాగుంటుందో తెలుస్తుంది' అని రాశారు.

నేను స్విజర్లండ్‌కు కాదు కదా, ఏ విదేశానికీ వెళ్లలేదు. (నాకు పాస్‌పోర్టే లేదు) అందువల్లనే అమెరికాలో తెలుగు ఐటీ కుర్రవాళ్లలో కుప్పకూలుతున్న వైవాహిక వ్యవస్థ, అక్కడ తెలుగు సినిమాలు చూపించే సినిమాహాళ్ల అధ్వాన్నస్థితి, గల్ఫ్‌లో బాధపడుతున్న తెలుగువారు – యిత్యాది అంశాలపై రాయమని సంబంధిత వ్యక్తులు అడిగినా 'నాకు ఫస్ట్‌హేండ్ ఎక్స్‌పీరియన్సు లేదు. మీరు వివరాలు రాస్తే వాటిని శీర్షిక ద్వారా మీ పేర సమాచారాన్ని నలుగురితో పంచుకుంటాను.' అని జవాబిస్తూంటాను.

స్విజర్లండ్ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్‌పై ఆధారపడవలసిన అగత్యం లేకపోతే మరి ఎందుకలాటి బ్యాంకింగ్ వ్యవస్థను పెంచి పోషించాలి? ప్రపంచంలో ఏ బ్యాంక్‌లో డబ్బు దాచుకున్నాడన్నా తప్పు పట్టరు కానీ స్విస్ బ్యాంక్‌లో ఖాతా అనగానే బూతుమాట ఎందుకై పోయింది? సంజయ్ గాంధీ విమానప్రమాదంలో పోయినప్పుడు ఇందిరా గాంధీ పరిగెట్టుకుంటూ వచ్చి అతని వాచీ కోసం వెతికిందనీ, ఎందుకంటే అందులో స్విస్ బ్యాంక్ ఎక్కవుంటు నెంబరు వుందని అప్పట్లో పుకారు. ఎన్టీయార్ గుండె చికిత్స కోసం అమెరికా వెళ్లానంటే కాదు, స్విస్ బాంక్‌లో డబ్బు దాచుకోవడానికి వెళ్లాడని ఆరోపణలు. ఇప్పుడు ఎన్నికలయ్యాక బాబు ఎక్కడికో తెలియని చోటికి విశ్రాంతికి వెళ్లారంటే అది స్విజ్‌కే నని ఆరోపణలు.

అంతెందుకు? ఒక చిన్న విషయం చెబుతాను. నగదు బదిలీ పథకం లోకేష్ సూచించినదే అని చెప్పినందుకు 'నువ్వా యింతేనా చినబాబూ..?' అని నేను వ్యాసం రాస్తే ఒకాయన దానిపై మెయిల్ పంపారు. ఓ సారి ఆయన విదేశీయాత్రకు వెళ్లినపుడు చంద్రబాబు కుటుంబం కలిసిందట. సాటి తెలుగువాడు కదాని లోకేష్ అతనితో సరదాగా కబుర్లు చెప్పాడట. 'కార్ల గురించి, అవీ యివీ హుషారుగా మాట్లాడాడు, చాలా కాజువల్‌గా, భేషజం లేకుండా వున్నాడు కానీ మేధావిలా నాకు అనిపించలేదు' అని ఆయన రాశాడు. భువనేశ్వరి కూడా ఏ మాత్రం బెట్టు లేకుండా చాలా సాదా సీదాగా పంజాబీ డ్రెస్ వేసుకుని కలివిడిగా వున్నారట. చంద్రబాబు మాత్రం ఎప్పుడూ వేసుకునే డ్రస్‌లోనే సీరియస్‌గా, ముభావంగావున్నారట. టీ షర్ట్ లాటివి వేయలేదట.

ఆసక్తిదాయకంగా వుంది కదా ఇదంతా పాఠకులతో పంచుకుందామా? అనుకున్నాను.కానీ ఆయన రాసిన విదేశం స్విజర్లండ్. స్విజర్లండ్ అనగానే మనకు ఆల్ప్స్ పర్వతాలు, ప్రకృతి సౌందర్యం గుర్తుకు రాదు. చంద్రబాబు నల్లడబ్బు దాచుకోవడానికి వెళ్లారు అని నేను రాసినట్టు ఫీలయిపోతారు అనుకుని వూరుకున్నాను. ఆయన విహారయాత్రకే వెళ్లి వుండవచ్చు కానీ స్విస్ బ్యాంకులు ఎంత అప్రతిష్టపాలయ్యాయో చూడండి అని చెప్పడానికి యిది రాస్తున్నాను. ఇలాటి అప్రతిష్ట ఎందుకు మూటగట్టుకుంటున్నాయో చెప్పవలసినది స్విజర్లండ్ తెలుగాయనే!

అదే వ్యాసంలో నేను రాశాను. మన నాయకులకు చిత్తశుద్ధి వుంటే టాక్స్ హేవన్స్ ద్వారా జరిగే మనీ లాండరింగ్ (బ్లాక్ మనీని వుతికి తెల్లది చేయడం) ఆపవచ్చని. నిన్ననే పేపర్లో వచ్చింది. 2000–09 మధ్య మన దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడులలో 46% మారిషస్‌నుండే వచ్చిందని. మారిషస్‌వాళ్లకి యిండియామీద అంత ప్రేమా? అని ఆశ్చర్యపడవద్దు. అదంతా మన వాళ్ల నల్లడబ్బే! డబుల్ టాక్సేషన్ ఎవాయిడన్స్ ఒప్పందం మనకు మారిషస్‌కు వుండడం బట్టే అది సాధ్యపడుతోంది. అది రద్దు చేసేస్తే సరి. కానీ రాబోయే ప్రభుత్వమైనా చేస్తుందా? **– ఎమ్బీయస్ ప్రసాద్**

# ఎమ్బీయస్: ఎగ్జిట్ పోల్స్ చెప్పే కథ

ఇవాళ శుక్రవారం. శనివారం నాటికి రిజల్ట్స్ బయటకు వచ్చేస్తాయి. శనాదివారాలు అందరం టివికి అతుక్కుపోతాం. రాసేందుకు టైముండదు. రాసిన చదివేవాళ్లకు టైముండదు. రిజల్టు బయటకు వచ్చేశాక యిక ఎక్సయిట్‌మెంట్ ఓవర్. ఎందుకు జరిగింది, ఎలా జరిగింది అని రకరకాల వ్యాఖ్యానాలు, ఖండన మండనలు. రేపు రిజల్టనగా యివాళ డిస్కస్ చేయడంలోనే వుంది మజా.

బుధవారం రాత్రినుండి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు రాసాగాయి. యథావిధిగా చర్చలు, అబ్బే యివి కాకిలెక్కలు అని రాజకీయనాయకులు వాటిని కొట్టి పారేయడాలూ జరిగాయి. ఎన్నికలముందు జరిగే సర్వేలలో 35% ఎర్రర్ వుండే అవకాశం వుందనీ, ఎగ్జిట్ పోల్స్‌లో 25% వుండే అవకాశం వుందనీ ప్రణయ్ రాయే చెప్పుకున్నారు. సెన్సిటివ్ ఏరియాల్లో 1% ఓటింగ్ అటుది యిటైతే 20 సీట్ల దాకా గల్లంతవుతాయని చెప్పారు.

మరి యింత కాకుల్లెక్కను సుమారు పది సంస్థలు ఎందుకు నిర్వహించినట్టు? ఎన్‌డిటివి వారు 77 వేలమందితో సర్వే నిర్వహించారంటే ఎంత ఖర్చు!? ఇదంతా దేనికోసమట? ఈ బుధ, గురు, శుక్రవారాల్లో రాత్రి 9 నుండి 11 వరకు జరిగే చర్చా కార్యక్రమం మధ్యలో వచ్చే యాడ్స్ కోసమా? అబ్బే, అవి ఎలాగైనా వస్తాయి. కాకపోతే కాస్త ఎక్కువ వస్తాయేమో! వాటి గురించి యింత ఎక్సర్‌సైజ్ చేస్తారా? అబ్బే, నా అనుమానం రాజకీయ పార్టీలు వాళ్ల చేత సర్వేలు చేయించుకుంటూ ఎప్పటికప్పుడు స్ట్రేటజీ మార్చుకుంటూ వున్నాయేమో! అనేక విడతల్లో ఎన్నికలు జరిగాయి కదా.. యివి పనికి వచ్చివుంటాయి.

సరే, రకరకాల సర్వేలు రకరకాలుగా చెప్పాయి. చాలాభాగం ఏం చెప్పాయా అని తీసుకుంటే యుపిఏకు ఎన్‌డిఏ కంటె 20 సీట్లయినా ఎక్కువ వస్తాయని తేలింది. మనకు మన రాష్ట్రం గురించే ఎక్కువ ఆసక్తి కాబట్టి దాని గురించే చర్చిద్దాం. ఉన్నవాటిల్లో అన్నిటికంటె ఎన్‌డిటివి, అందునా ప్రణయ్ రాయ్ పాతకాపు. టెక్నికల్‌గా వెళతారు. లోకల్ టీవీలు, పార్టీలకూ వుండే రాగద్వేషాలు వాళ్లకు వుండవు. వాళ్ల ప్రకారం కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 28 వస్తాయన్నారు. సిఎన్ఎన్ కూడా కాస్త గట్టిదే. ఇండియా టుడే కూడా ఫర్వాలేదు. ఇలా అందరివీ లెక్కలోకి తీసుకుని సరాసరి చూస్తే కాంగ్రెస్‌కు 22 వస్తాయని తేలుతోంది. ఒక లోకసభ సీటుకి ఏడు అసెంబ్లీ సీట్లు (మనకు 42 లోకసభ సీట్లుంటే 294 అసెంబ్లీ సీట్లున్నాయి) అనుకుంటే కాంగ్రెస్‌కు 154 అసెంబ్లీ సీట్లు వస్తాయన్నమాట. క్రాస్ ఓటింగ్ జరిగిందేమోననుకుంటే ఎన్‌డిటివి ప్రకారం - ఒరిస్సా విషయంలో విపరీతంగా క్రాస్ ఓటింగ్ జరిగిందట కానీ ఆంధ్రలో కేవలం 1% జరిగిందట. అందువలన కాంగ్రెస్‌కు 150-160 సీట్లు రావచ్చు.

అంటే రాజగోపాల్ లెక్క కరక్టన్నమాట. అఫ్‌కోర్స్ ఆయన యివి కాకుండా పోటాపోటీగా వున్నవి 54 వున్నాయన్నాడనుకోండి. సాక్షి లెక్క 180 దాటిపోయింది. పోటాపోటీ 25 వున్నాయంటూనే టిడిపికి 42, పీఆర్పీకి 12 విదిల్చారు. టిడిపి కాస్త వుదారంగా వ్యవహరించింది. కాంగ్రెస్‌కు 57, పీఆర్పీకి 21 యిచ్చింది. 25 పోటాపోటీ అంటూ మహాకూటమికి 179 వస్తాయంది. టిడిపి సర్వే నిజమైతే (6 లక్షలమంది శాంపుల్స్ తీసుకున్నారట) టిడిపి స్వయంగానే 150 తెచ్చుకుని సొంత ప్రభుత్వం ఏర్పరచుకోగలదు. ఇక వైయస్ 230 మీదే వున్నారు. అరవింద్ 160 అంటున్నారు.

సాక్షి ప్రకారం కాంగ్రెస్‌కు 45%, కూటమికి 34%, పీఆర్పీకి 18% ఓట్లు వస్తాయి. పీఆర్పీ వలన యాంటీ-ఇన్‌కంబెన్సీ ఓట్లు చీలిపోయి, కాంగ్రెస్ లాభపడుతుంది. హిందూ పత్రిక వేసిన సర్వేలకు కాస్త రెప్యుటేషన్ వుంటుంది. దానిప్రకారం ఎ.పి.లో లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 42%, కూటమికి 36%, పీఆర్పీకు 14% ఓట్లు పడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 38%, కూటమికి 38%, పీఆర్పీకు 14% ఓట్లు పడ్డాయి. అంటే వీళ్ల ప్రకారం క్రాస్ ఓటింగ్ 4% వుందన్నమాట.

ఇవన్నీ చూస్తే పీఆర్పీ 15% తెచ్చుకుని తక్కువ సీట్లు తెచ్చుకోబోతోందన్నమాట. సాక్షి ప్రకారం పీఆర్పీకి తెలంగాణాలో 12%, కోస్తాలో 24%, సీమలో 17% వస్తాయి. తెలంగాణాలో పీఆర్పీ బలహీనంగా వుండి మహాకూటమి ఓట్లు చీల్చలేక పోయింది కాబట్టి కాంగ్రెస్‌కు 119కి 52 వస్తాయి. ఉత్తరాంధ్రలో కూటమితో సమానంగా 26% బలం వుంది కాబట్టి రెండూ కొట్టుకుని కాంగ్రెస్‌కు 34లో 28 తెప్పిస్తాయి. కోస్తాలోకూడా 22% ఓట్లతో కూటమి (31%)తో కొట్లాడి కాంగ్రెస్‌కు 89కి 63 తెచ్చిపెడతాయి. సీమలో 17% తెచ్చుకుని కొంతమేరే కూటమికి నష్టం కలిగిస్తోంది కాబట్టి అక్కడ 52లో కాంగ్రెస్‌కు 38, కూటమికి 11 వస్తున్నాయి.

ఇవన్నీ సాక్షి లెక్కలు అని గుర్తుంచుకుంటే మార్జిన్ చాలా యివ్వాల్సి వస్తుంది. పీఆర్పీ ఓట్లన్నీ మహాకూటమినుండే చీల్చుకుంటుందన్న ఆలోచన వారిది. కాపుల ఓట్లు కాంగ్రెస్ నుండి, బిసిల ఓట్లు టిడిపినుండి చీల్చుకుంటుందని కొందరు విశ్లేషకుల భావన. (కులప్రాతిపదికన ఓట్లు పడ్డాయో లేదో కూడా ఇంకో వారం రోజుల్లో విశ్లేషణల ద్వారా తెలిసిపోతుంది.) ఏది ఏమైనా ఒక మాట మాత్రం నిజం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేద్దామనుకునేవాడికి వున్న ఆప్షన్స్ చూడండి - కూటమి, పీఆర్పీ, బిజెపి, లోక్‌సత్తా, రెబెల్స్ వాళ్లూ ఎలాగూ వుంటారు. అపోజిషన్ విడిపోవడం వలన బిహార్‌లో నితిశ్ కుమార్‌కు 7% స్వింగ్ అదనంగా వస్తోందని ఎన్‌డిటివి అంటోంది. అదే లాజిక్ కారణంగా కాంగ్రెస్ యిక్కడ గెలుపొందవచ్చు. 2004లో లాగ అపోజిషన్ అంతా ఏకతాటిపై (బిజెపి విడిగా పోటీ చేసిందనుకోండి) నిలిచివుంటే కాంగ్రెస్ పని అయిపోయేది.

ఈ సర్వేల ప్రకారమే జరిగితే (ఒకవేళ సర్వే పూర్తిగా చీదేస్తే? దానికేముంది! ఆదివారంనాడు ఆ విషయమూ డిస్కస్ చేయవచ్చు) అపోజిషన్ నాలిక కరుచుకోవలసినదే. సిపిఐ నారాయణ చెప్పినట్టు టిడిపి-పీఆర్పీ కలయిక జరిగివుంటే బాగుండేది అనుకుంటారు.

అసలు లోకసత్తా-పీఆర్పీ కలిసినా కొంత బాగుండేది. అప్పుడు పీ ఆర్పీ బలం ఇంకో 3% పెరిగేది. తర్వాత నారాయణ చెప్పినట్టు సగం కాలం చిరంజీవి సిఎం, మిగతా సగం కాలం బాబు సిఎం ప్రాతిపదికమీద కూటమితో చేతులు కలిపివుంటే ఖచ్చితంగా గెలిచేవారు. ముందే చెప్పినట్టు యీ ఈ లెక్కలు, ఆలోచనలూ రేపటి వరకే. తర్వాత వాస్తవాలు ముందుకు వస్తాయి. అప్పుడు తీరిగ్గా ఆలోచించుకోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: పరకాల(కూట)విషం

అసలు రాజకీయాలంటేనే విషపూరితమంటారు. వాటిలో విషవృక్షం గురించి నిరంతరం పలవరించే పరకాల ప్రభాకర్ వంటి వ్యక్తి వుంటే యింకేం కావాలి? మనసులో యింత విషమా? ఇంత అసహ్యంగా వెళ్లగక్కడమా? అదీ పార్టీ కంగుతిన్న యీ వేళ? రాజకీయాలన్నాక ఎందరో పార్టీలో చేరతారు, వీడతారు. కానీ విడిపోయిన యిన్నాళ్లకు యింత దారుణంగా, సభ్యత లేకుండా విరుచుకుపడడం పరకాలకే చెల్లింది. మనసులో ఎంత కల్మషం పెంచుకున్నారో తెలుస్తోంది. పీఆర్పీ ఆయనకు చేసిన ద్రోహమేమిటట? పిలిచి పీటవేసి కూచోబెట్టడమా? రాజీనామా చేస్తే అరవింద్ స్థాయి వ్యక్తి యింటికొచ్చి గంటసేపు వెయిట్ చేయడమా? బాల్యమిత్రుణ్ని బయట వెయిట్ చేయిస్తూ, టీవీలకు ఫోన్‌లు చేసి మా గుమ్మంలో పడిగాపులు కాస్తున్నాడు అని స్క్రోలింగ్స్ వేయించినప్పుడే తెల్లబోయాం – ఇంత కుసంస్కారమా? అని.

సరే, ఏదో ఆశించి వచ్చివుంటాడు. అది నెరవేరలేదన్న అక్కసుతో యిలా వ్యవహరించి వుంటాడు పోన్లే అనుకున్నాం. కానీ ఇవాళ ప్రెస్‌మీట్ పెట్టి మరీ తిట్టవలసిన అవసరం వుందా? ఎన్నికల్లో ఓడిపోవడమంటే యింకోడి కొంప దోచడం కాదే! ఇటువంటి ముక్కోణపు పోటీలో 16% ఓట్లు తెచ్చుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదు. పరకాల భాషలో చెప్పాలంటే – ప్రొఫెషనల్‌గా వ్యవహరించకుండా పార్టీని ఓ ప్రయివేటు కంపెనీలా నడిపినా యిన్ని ఓట్లు వచ్చాయంటే, సరైన విధానంలో నడిపితే యింకెన్ని వచ్చేవో!

125 ఏళ్ల వయసున్న కాంగ్రెస్ ఓడిపోలేదా? చాణక్యుడు అనిపించుకున్న చంద్రబాబు ఓడిపోలేదా? అంతెందుకు యీ పెద్దమనిషి ప్రభాకర్ ఎన్నడూ ఓడిపోలేదా? ఓడినంతమాత్రాన పార్టీ గానీ, వ్యక్తిగానీ ఫినిష్ అయిపోతారా? గాంధీగారు 1922లో దేశమంతా తిరుగుతూ ఒక్క ఏడాదిలో స్వాతంత్ర్యం తెస్తానని ప్రచారం చేశారు. ప్రజలంతా విశ్వసించారు. కానీ తేగలిగారా? ఆ తర్వాత 25 ఏళ్లు పట్టింది. గాంధీగారు, ప్రజలూ అందరూ ఓపిక పట్టారు. కాడి పారేయలేదు. చిరంజీవిలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా కనబడుతున్నాయి. ఉపయెన్నికలలో ఘోరపరాజయం తర్వాత కెసియార్ మూడురోజుల దాకా ఎవరికీ మొహం చూపించలేదు.

అలాటిది చిరంజీవి ఫలితాలు వెలువడగానే వెంటనే ప్రెస్‌మీట్ పెట్టి 'మీరు దీనిలో ఓటమి చూస్తున్నారు, నేను గెలుపు చూస్తున్నాను' అన్నారు. అదీ శభాషైన మాట! పైకి వచ్చేలక్షణాలు అవి. ప్రతీ ఓటమీ ఓ పాఠంగా తీసుకోవాలి అని చెప్తారు చూశారా, అది ఆచరించి చూపాడాయన. ఎన్నికలయిన తర్వాత ఎక్కడికీ వెళ్లిపోకుండా గిరిజనుల సమస్యలు తెలుసుకోవడానికి పర్యటనలు చేస్తూ, ప్రజాజీవితంలోనే వున్నాను అని సంకేతం పంపి, పార్టీ క్యాడర్ నిరుత్సాహపడకుండా చూశారు. అలాటి వ్యక్తిని మెంటల్ కేసనీ, మరోటనీ అని ప్రభాకర్ తన స్థానాన్ని తనే దిగజార్చుకున్నారు.

రాజ్ నారాయణ్, సుబ్రహ్మణ్యస్వామి.. యిలాటి వాళ్లు పత్రికలకు ఫేవరేట్ కావచ్చు, తమ ప్రేలాపనలతో వినోదం కలిగిస్తారు కాబట్టి. కానీ వాళ్లు ఎన్నటికీ లీడర్లు కాలేరు. ప్రజలు వారిని గౌరవించరు. విభీషణుడు కూడా సిగ్గుపడేలా ప్రవర్తించిన ప్రభాకర్ ఎటువంటి వ్యక్తా అని సామాన్యప్రజలకు ఆశ్చర్యం కలుగుతుంది. ఈటీవీ2 లో ఏళ్ల తరబడి చర్చావేదిక నిర్వహించి తన మేధోశక్తిని, వచోపటిమను చాటుకున్న ప్రభాకర్ యింత సంస్కారహీనంగా ప్రవరిస్తున్నాడేమిటి? అని తికమకపడవచ్చు. నాకు ఆయనతో కలిగిన అనుభవాన్ని మీతో పంచుకుంటాను. అప్పుడు మీకు కొంత అర్థమవుతుంది.

2006 సంక్రాంతినాడు ఈటీవీ2 వారు హాస్యంమీద ఓ చర్చావేదిక కార్యక్రమం ప్రసారం చేద్దామనుకున్నారు. నన్ను ఆహ్వానించారు. 'నేరెళ్ల వేణుమాధవ్, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, గ్లోబల్ హాస్పటల్స్ చైర్మన్ (పేరు మర్చిపోయాను), మీరు మాత్రమే వుంటారు. పరకాల నిర్వహిస్తారు. రండి' అన్నారు. సబ్జక్ట్ ఏమిటి? అన్నాను. హాస్యం అన్నారు. హాస్యమంటే చాలా విభాగాలుంటాయి కదా. నన్ను హాస్యరచయితగా పిలుస్తున్నారా? 'హాసం' ప్రచురణల సంచాలకుడిగానా? 'హాసం క్లబ్స్' నిర్వాహకుడిగానా? అని వివరంగా అడిగాను. ఏదో ఒకటి సార్, ముందు రండి చూద్దాం అన్నారు. వాళ్లిచ్చిన టైముకంటె ముందుగానే వెళ్లి కూచున్నాను.

చర్చ కదా, సమాజంలో హాస్యానికి సరైన స్థానం యివ్వటం లేదన్న విషయంపై పాయింట్లు రాసుకుని సీరియస్ డిస్కషన్‌కి ప్రిపేరయ్యాను. రికార్డింగ్ యింకో పావుగంటలో వుంటుందనగా ప్రభాకర్ వచ్చారు. వెళ్లి పరిచయం చేసుకుని నా కాగితాలు చూపించి వీటిమీద మాట్లాడవచ్చా? అని అడగబోయాను. ఆయన వినిపించుకోలేదు. 'జస్ట్ కాజువల్‌గా మాట్లాడుకుందామండి' అంటూ కొట్టి పారేశారు. 'సబ్జక్ట్ ఏమిటో తెలియటం లేదు, నేను హాసం ప్రచురణల గురించి, హాసం క్లబ్స్ గురించి మాట్లాడితే మీ సంస్థ రూల్సుకి వ్యతిరేకమా? ప్రచారం చేసుకున్నట్టు ఫీలవుతారా?' అని స్పష్టంగా అడిగాను. ఆయన సమాధానం ఒకటే – 'జస్ట్ కాజువల్‌గా మాట్లాడుకుందామండి'!

రికార్డింగ్ ప్రారంభమైంది. సబ్జక్ట్‌మీద మాట్లాడబోతున్నానో, లేదో తెలియని అయోమయ పరిస్థితిలో నేను వెర్రిమొహం వేసుకుని కూచున్నాను. (టీవీ చర్చలు ఎందుకంత పేలవంగా వుంటాయో మీకు అర్థం అవాలని యిదంతా చెపుతున్నాను. చర్చావేదికకోసం ఛానెల్స్ డబ్బు ఖర్చు పెట్టవు. రానుపోను ఖర్చులివ్వక్కరలేదని హైదరాబాదులో వున్నవాళ్లనే వాళ్లు పిలుస్తారు – మేధావులంతా యిక్కడే గూడు కట్టుకుని వుంటున్నట్టు! ఐదారు గంటలు వెచ్చించి వచ్చినవాడికి కప్పు కాఫీ తప్ప దక్కేది ఏమీ వుండదు. అందువలన టీవీలో మొహం చూపించాలన్న తాపత్రయం మిక్కుటంగా వుంటే తప్ప చర్చావేదికలకు వెళ్లడం వేస్టు. సబ్జక్ట్ ముందుగా చెప్పరు కాబట్టి అందరూ అయోమయంగానే వుంటారు).

ప్రభాకర్ మొదలెట్టారు – 'హాస్యం పలురకాలుగా వుంటుంది. ఓ పత్రిక 'చందాదారులకు విజ్ఞప్తి. చందా కట్టండి, దానికి దారులు – ఎమ్వో చేయడం, చెక్కు పంపడం.. అంటూ 'దారులు' అనే మాటపై పన్ చేసింది' అని చెపుతూ హఠాత్తుగా నావైపుకి తిరిగి 'ఇలాటి పన్‌లు కొన్ని చెప్పండి ప్రసాద్ గారూ' అన్నారు. నేను బిత్తరపోయాను. చటుక్కున అడిగితే ఏం గుర్తుకు వస్తుంది? కెమెరా నా వెర్రివాలకాన్ని రికార్డు చేసింది. ఏదో తడబడి నెట్టుకొచ్చాను. నీ పని యిలాగుందా? అనుకుని కాస్సేపు పోయాక 'మీ జీవితంలో ఓ హాస్య సంఘటన చెప్పండి' అన్నాడు ప్రభాకర్. మళ్లీ పిచ్చిచూపులు. ప్రోగ్రాంకు ముందే చెప్పివుంటే ఏదైనా గుర్తు చేసుకునేవాణ్నేమో! ఆ అవకాశం యివ్వలేదు. సడన్ బౌన్సర్స్.

చివరకు ప్రసారమయ్యాక చూస్తే దానికి పేరు 'హాస్యం-ఆరోగ్యం' అని పెట్టారు. మేము మాట్లాడినదానిలో దాని గురించి ఏమీ లేదు. వేణుమాధవ్ మిమిక్రీ చేశారు. ధర్మవరపు 'ఆనందో బ్రహ్మ'లో జోకులు చెప్పారు, డాక్టర్‌గారు తెలుగు సాహిత్యంలో చెణుకులు వినిపించారు. హాస్యాన్ని ఆస్వాదిస్తూనే, హాస్యరచయితను మన్నించని సమాజం గురించి నేను మాట్లాడాను. త్రూ ఔట్ బిగుసుకు పోయివున్నాను – ఈ ప్రభాకర్ ఎప్పుడు ఏమడుగుతాడో తెలియక! ప్రోగ్రాం చూసినవాడికి ప్రభాకర్ జ్ఞానప్రకాశంతో మా అందరికీ కళ్లు బైర్లు కమ్మి అసందర్భంగా మాట్లాడినట్టు తోచి వుంటుంది. నామీద నాకే చికాకు వేసింది. టీవీలో కనబడాలని అంత కుతి ఏమిటి? అని నన్ను నేనే తిట్టుకున్నాను. (ఇప్పుడు ప్రతివారం వనితా టీవీలో కనబడుతున్నాను కాబట్టి అది పోయిందనుకోండి) తర్వాత ఈటీవీనుండి ఎప్పుడు ఆహ్వానం వచ్చినా ప్రభాకర్ వున్నంతకాలం నేను ఛస్తే రాను అని తిరస్కరిస్తూ వచ్చాను.

ఈ చిన్న సంఘటనతోనే తెలిసింది కదా – ప్రభాకర్ బుద్ధి. అవతలి వాళ్లను కంగారుపెట్టి తను గొప్పవాడిగా కనబడాలని కుట్ర చేస్తాడు. నిజానికి అందరూ కలిసి టీమ్‌వర్క్‌గా ప్రెజెంట్ చేస్తే ప్రేక్షకుడు కార్యక్రమాన్ని ఎంజాయ్ చేస్తాడు. ఆయనకు అది అక్కరలేదు. ఆయన వెలగాలి. అవతలివాళ్లు వెలతెలపోవాలి. పీఆర్పీలో చేరిన తర్వాత కూడా ఢిల్లీలో శివశంకర్‌తో వేదిక పంచుకుంటూ ఆయన్ను నోరెత్తనియ్యకుండా యీయనే మాట్లాడడంతో శివశంకర్‌కు కోపం వచ్చింది. నిజానికి శివశంకర్ స్థాయితో పోలిస్తే యీయన ఎక్కడ? ఈయనకు నోరుంది. తను తప్ప వేరెవరూ కనబడకూడదన్న దుగ్ధ వుంది. పీఆర్పీలో అది సాగలేదన్న అక్కసే యీ రూపేణా బయటపడింది. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: ఫలితాలు వచ్చాక...

ఫలితాలు వచ్చేశాయి. ఆర్నెల్ల సస్పెన్సు విడిపోయింది. నాకు ఈమెయిల్స్ వచ్చి పడుతున్నాయి – మీరు చెప్పినట్టు జరిగింది అంటూ. 'ఎవరు గెలుస్తారు' సీరీస్‌లో చివరికి నేను రాసినది వెనక్కి తిరిగి చూసుకుంటే –

''....లెఫ్ట్ 8-10 (ఫైనల్‌గా వచ్చినది 5), మజ్లిస్, బిజెపి, లోక్‌సత్తా, ఇండిపెండెంట్స్, రెబెల్స్‌కు ఓ 15-20, (ఫైనల్‌గా వచ్చినది 13) తెరాసకు 12-15, (ఫైనల్‌గా వచ్చినది 10) పీఆర్పీకు 50-60 వస్తే (ఫైనల్‌గా వచ్చినది 18) 94 వరకూ లెక్క తేలాయనుకోండి. సమాన అవకాశాలున్నాయి కాబట్టి మిగిలిన 200లో 100 టిడిపికి, 100 కాంగ్రెస్‌కు వచ్చే ఛాన్సు వుందనుకుందాం. హంగ్ వస్తుంది. పీ ఆర్పీ ఎవర్ని సపోర్టు చేస్తే వాళ్లు గద్దె కెక్కుతారు. అయితే యిలాటి హంగ్ సాధారణంగా రాదు. 1-2% మొగ్గు వచ్చి 500-1000 ఓట్ల తేడాతో తాసు ఒకవైపుకే వొరుగుతుంది. సానుభూతిపరులను బయటకు రప్పించడం, బూత్ మేనేజ్‌మెంట్, డబ్బు పంపిణీ యిత్యాది అంశాలను లెక్కలోకి వేసుకుంటేనే సరైన ఫలితం వస్తుంది. ఈ విధమైన స్వింగ్ 30 సీట్ల వరకు ప్రభావితం చేయవచ్చు. అంటే నెగ్గే పార్టీకి 130, ఓడే పార్టీకి 70 అన్నమాట. ఇంకాస్త స్వింగ్ వచ్చిందనుకోండి, చిరు పార్టీనుండి కూడా దోచుకోవచ్చు. అంటే చిరుకి 30-40 వచ్చి నెగ్గే పార్టీకి 150 రావచ్చు. అయితే ఆ పార్టీ ఏది అని మీరు అడగవచ్చు. సమైక్యవాదిగా మొన్నటిదాకా నిలచిన బాబు, నిలుస్తారనుకున్న చిరు – అందరూ తెలంగాణాపై మాట నానుస్తున్నారు. హైదరాబాదు విషయంలో విభేదాలు పెచ్చరిల్లుతాయన్న విషయం వుచ్చరించడానికి కూడా వెరుస్తున్నారు. కాంగ్రెస్ యిప్పటిదాకా నాటకాలాడినా వైయస్ ఒక్కరే యీ సమస్య వుంది అని ధైర్యంగా అన్నారు. అందుకే నేను కాంగ్రెస్‌కు ఓటేశాను. నాలాగే చాలామంది ఆలోచిస్తే కాంగ్రెస్ అధికారంలోకి రావచ్చు, లేదా టిడిపి!

– అని ముగించాను. లెఫ్ట్, తెరాస నేను అనుకున్నదాని కంటె తక్కువ తెచ్చుకున్నాయి. చిరుపార్టీ కనీసం 30 తెచ్చుకుంటుందనుకున్నాను. 60 స్థానాలదాకా రెండోస్థానంలో నిలిచిందంటున్నారు కానీ ఫైనల్‌గా 18 వద్ద ఆగిపోయింది. దానితో కాంగ్రెస్‌కు 157 రావడంతో బాటు టిడిపికి కూడా 91 వచ్చాయి. యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీలింగ్ 2004లో లాగ లేదని, ప్రభుత్వ

వ్యతిరేక ఓట్లు చీలిపోబోతున్నాయని నేను రాసినదాన్ని చాలామంది తప్పుబట్టారు. ఇప్పుడు రాఘవులు గారి దగ్గర్నుంచి అదే మాట చెపుతున్నారు. మీడియా పేపరు చదివేవాళ్ల కళ్లకు గంతలు కట్టగలిగింది కానీ మామూలు ఓటర్లు వాళ్లకు తోచిన విధంగానే ఓటేశారు.

'చంద్రబాబుకి అవసరమా...?' అని నేను తెరాసతో పొత్తు పెట్టుకున్నందుకు విమర్శిస్తూ కొందరు నాపై విరుచుకుపడ్డారు. ఇప్పుడు టిడిపివారే ఆ ప్రశ్న వేస్తున్నారు. 75 (దాంట్లో వాళ్లు 20% మాత్రమే గెల్చారు) సీట్లు పొత్తుపక్షాలకు యివ్వడం వలనే ఓడిపోయామని. టిడిపి ఒంటరిగా పోటీ చేసి వుంటే బాగుండేదంటున్నారు. సిటియస్ అద్భుతమైన పథకమని మీడియా ఆకాశానికి ఎత్తేసింది. నేను చాలా ఘాటుగా విమర్శిస్తే కొందరు నొచ్చుకున్నారు. కానీ ఆ పథకం ప్రజల్లోకి వెళ్లలేదని టిడిపి నాయకులే యిప్పుడు అంటున్నారు.

ఇదంతా నేను స్వోత్కర్షకై రాయడం లేదు. నాకు జ్ఞానచక్షువు ఏమీ లేదు. ఓ వూళ్లో ఓ గాడిద తప్పిపోతే ఎక్కడ దొరుకుతుందో ఒకతను అంజనం వేసి చూసినట్టు చెప్పాట్ట. దొరికాక, వెళ్లి అడిగారట 'అంత కరక్టుగా ఎలా చెప్పావు?' అని. 'ఏం లేదు, నేనే గాడిదనైతే ఎక్కడికి వెళతానా అని ఆలోచించాను' అన్నాట్ట. నాదీ అదే తెలివి. నేను మేధావిని కాను. (చాలా విషయాల గురించి రాస్తాను కాబట్టి మేధావి అని కొందరు పొరబడుతున్నారు. పాండిత్యం వేరు, మేధస్సు వేరు)

నేను సామాన్య పౌరుణ్ని. సామాన్యుడిలాగానే ఆలోచించాను. అవినీతి గురించి నేను స్పందించడం మానేశానని రాశాను. జనాలు అవినీతి గురించి పట్టించుకోలేదు కాబట్టే వైయస్ గెలిచారు. చాలా విషయాల్లో వైయస్‌పై ఫిర్యాదులున్నా సమైక్య ఆంధ్రవాది అనే ఒక్క పాయింటు మీదనే ఓటేస్తున్నాను అన్నాను. ఈ సారి ఓటింగ్ సరళి చూసినవారందరికీ అర్థమై వుంటుంది - తెలంగాణా పేరు చెప్పుకుంటే ఓట్లు రాలలేదని. నూటికి నూరుశాతం విభజనకు నిలబడిన తెరాసకు 10, బిజెపికి 2 వచ్చాయి. వేర్పాటువాదం వద్దని నాలాగే చాలామంది అనుకున్నారులా వుంది. సమైక్యవాదానికి నిలబడి, వేర్పాటువాదం వలన హైదరాబాదు సమస్యల కుంపటి అవుతుందని వైయస్ రెండో ఫేజ్‌లో గుర్తు చేయడం వలననే ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్‌కు బాగా ఓట్లు పడ్డాయని యిప్పుడు విశ్లేషిస్తున్నారందరూ.

అలా అని ఓటర్లందరూ వైయస్‌కు పూర్తిగా సమర్థించలేదనడానికి నిదర్శనం - జస్ట్ పరిపాలించడానికి తగిన సీట్లు యిచ్చి ఆపడం. 157 అంటే అత్యంత సింపుల్ మెజారిటీ. ఏ 200లో యిచ్చి వుంటే వైయస్ రెచ్చిపోయి వుండేవారు. సగం కాబినెట్ ఓడించి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుణ్ని ఓడించి, పళ్లు రాలగొట్టి 'ఏదో మళ్లీ కూర్చోబెడుతున్నాం, నీ పద్ధతులు మార్చుకో, ఎడ్మినిస్ట్రేషన్ మీద పట్టు సాధించు, అవినీతి లేకుండా సరిగ్గా పరిపాలించు.' అని సుద్దులు చెప్పినట్టు కనిపిస్తోంది.

లేకపోతే 33 పార్లమెంటరీ సీట్లు యిచ్చి మన్‌మోహన్‌ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన తెలుగు జనం వైయస్‌ను బొటాబొటీ పరిస్థితిలో ఆపడమేమిటి, చిత్రం కాకపోతే? 33 పార్లమెంటు సీట్లను అసెంబ్లీకి కన్వర్ట్ చేస్తే 231 అసెంబ్లీ రావాలి. అన్ని ఇవ్వలేదుగా? పార్లమెంటు కాండిడేట్లు గట్టివాళ్లని, అసెంబ్లీ కాండిడేట్లు వీక్‌గా వున్నారని ఏవేవో కారణాలు చెప్తున్నారనుకోండి. ఏది ఏమైనా తెలివిగా దానికి ఒకలాగ, దీనికి మరోలాగ క్రాస్ ఓటింగ్ వేసేటంత పరిణతి చూపించాడుగా మన ఓటరు! ఇంకేం కావాలి?

ఖమ్మం, మెహబూబ్‌నగర్ యిత్యాది జిల్లాల్లో కాంగ్రెస్ ఎందుకంత ఘోరంగా దెబ్బతిందో తెలుసుకోవాలంటే 'ఈ భూమి' మే సంచిక చదవండి. నేను చాలా గౌరవించే నిబద్ధత, నిష్పాక్షికత గల జర్నలిస్టు పొనుగోటి కృష్ణారెడ్డి సంపాదకత్వంలో జిల్లాల వారీగా విశ్లేషణ వేశారు. దాని ప్రకారం చూస్తే మొత్తం మీద కాంగ్రెస్‌కు 120 ఖచ్చితంగా వచ్చేట్టు కనబడింది. అన్నిటినీ సమన్వయపరుస్తూ రాసిన వ్యాసానికి 'కాంగ్రెస్‌దే హవా' అని హెడింగ్ పెట్టారు కృష్ణారెడ్డి. ఫైనల్‌గా ఇన్ని, అన్ని అని అంకెలు చెప్పకుండానే మొత్తం మీద కాంగ్రెస్ కొట్టుకుని వస్తుందని భావం వ్యక్తపరిచారు. అలాగే జరిగింది.

2

మొత్తం ఫలితాలు వచ్చాక చూస్తే అనిపించేది చాలా చక్కటి రిజల్ట్స్ వచ్చాయని. ఓటరు మంచి విజ్ఞత కనబరిచాడు. సుస్థిర ప్రభుత్వానికే నా ఓటు అన్నాడు. అరకొర మెజారిటీ యిస్తే అడ్డమైనవాళ్లమీద ఆధారపడవలసి వస్తుందని గ్రహించి, ప్రభుత్వం నడుపుకునేటంత మెజారిటీ యిచ్చాడు. అలాగని మరీ దుళ్లదోపిడీగా కట్టబెట్టలేదు. హెచ్చెరుకగా, కాస్త ఒళ్లుదగ్గర పెట్టుకుని పాలించేట్లా యిచ్చి, గట్టి ప్రతిపక్షాన్ని కూడా యిచ్చాడు. అతికి పోయిన లెఫ్ట్‌కి, రైట్‌కి లెఫ్ట్‌రైట్ చెప్పాడు. మన్‌మోహన్ చాలా వీక్ అన్న అడ్వానీని వీకెన్ చేసి ప్రతిపక్ష నాయకుడిగా వుండడానికి సైతం సిగ్గుపడేట్లా చేశాడు. ప్రతిపక్షంలో వుండడానికి అసలు యిచ్ఛగించక మహా పన్నాగాలు పన్నేసిన బాబుని యీ ఎత్తులు పొత్తులు వద్దు కానీ యింకో 60 నెలలు ఓపిక పట్టు అని చెప్పాడు. మీ పాటికి మీరు ఏం రాసినా నిజానిజాలు మాకు తెలుసు. మేం చేసేది మేం చేస్తాం. అని మీడియాకు మొహం బద్దలయేట్లా చెప్పాడు. పార్లమెంటులో ఎవరికి వెయ్యాలో, అసెంబ్లీలో ఎవరికి వెయ్యాలో ఏ మాత్రం గందరగోళ పడకుండా ఎంచి మరీ ఓటు వేశాడు.

అహంభావులైన మాయావతికి, లాలూకి, పాశ్వాన్‌కి, జయలలితకు, పిఎంకెకు, కారత్‌కు, మోదీకి, మళ్లీ మతతత్వం నెత్తికెత్తుకున్న అడ్వానీకి, దేశాన్ని అస్థిరం పాలు చేద్దామని చూసిన సిపిఎంకు సెంటర్లో బుద్ధి చెపితే,

రాష్ట్రానికి వచ్చేసరికి - సిఈఓ చొక్కా యిప్పేసి ఆల్‌ఫ్రీ లన్న బాబుకి, నోరుపారేసుకునే కెసియార్‌కు, జాతర్లో తప్పిపోయిన కుర్రాడిలా కనబడిన చిరంజీవికి, రాత్రికి రాత్రి సర్వే చేయించామని బుకాయించిన అరవింద్‌కు, పక్కలు పావనం చేసేవారి లెక్కలడిగిన రోజాకు, తొడలు కొట్టేవారికి, మీసాలు మెలేసేవారికి, మైకు వీరులైన తెలంగాణా సీనియర్లకు, కుతంత్రాల డియస్‌కు, ఐయస్‌ఐ ఉగ్రవాదులను అరెస్టు చేస్తే విడిపించినవారికి, ప్రజారోగ్యం విస్మరించిన ఆరోగ్యమంత్రులకు, అసమర్థతకు ఆలవాలమైన కాబినెట్ మంత్రులకు, అహంభావి రేణుకా చౌదరికి, దబాయింపుల ఎర్రం నాయుడుకు, నవంబరు 1 తర్వాత ఆంధ్రప్రదేశ్ అన్న రాష్ట్రమే లేదన్న దేవేందర్ గౌడ్‌కు, తనకెన్ని సీట్లు అవతలివాళ్లు యివ్వాలో డిక్టేట్ చేయబోయిన మంద కృష్ణ మాదిగకు, మజిల్ పవర్ నమ్ముకున్న కోడెల, బలరాంలకు, విభజన చేయకపోతే రాష్ట్రానికి ముక్తి లేదని వాదించినవారికి- ఒకరేమిటి పాఠాలు నేర్చుకోవలసిన వారందరికీ పాఠాలు చెప్పడంతో బాటు వైయస్‌కు కూడా బాగానే హితవు చెప్పారు. ఇదివరకు కంటె మెజారిటీ తగ్గించి, సజావుగా రాజ్యం చేయమని చెప్పారు.

ఎన్నో ఏళ్లతర్వాత ఆదివారం నాడు ఈనాడు, ఆంధ్రజ్యోతి పార్టీ కరపత్రాలుగా కాక అచ్చమైన పత్రికలుగా కనబడ్డాయి. ఏ పార్టీ ఎందుకు గెలిచిందో, ఎందుకు ఓడిందో నిష్పక్షపాతంగా చక్కటి విశ్లేషణలు యిచ్చాయి. అవి మీలో కొందరు చదివే వుంటారు. చదవనివారికోసం అవే కాక వేరే అనేక పేపర్లలో 2,3 రోజులుగా వచ్చిన విశ్లేషణలను క్రోడీకరించి ఓ చోట యిస్తున్నాను. పాయింట్ల వారీగా యిచ్చేస్తున్నాను, వివరణలు లేకుండా. ఇవి చదివితే మీకు ఓ ఐడియా వచ్చేస్తుంది. ఇవి ఆల్‌రెడీ విడివిడిగా చదివేసినవారికి బోరు కొడితే క్షంతవ్యుణ్ని.

కాంగ్రెస్ నెగ్గడానికి కారణాలు - గతంలో కాంగ్రెస్ అధిష్టానవర్గం తరచుగా ముఖ్యమంత్రులను మార్చేది. ఇప్పుడు పద్ధతి మార్చుకుని వైయస్‌కు పూర్తి మద్దతు యిచ్చింది. వైయస్ అంతా తన భుజస్కంధాలపై మోసారు. తెలంగాణా వంటి కీలకాంశాలలో వైయస్‌నే విశ్వసించిన సోనియా సీనియర్లకు యింటర్వ్యూలు కూడా యివ్వలేదు. తెరాసతో పొత్తు వద్దని వైయస్ అంటే సరేనన్నారు. సర్వేలు నిర్వహిస్తూ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వున్నచోట్ల వైయస్ ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. టిక్కెట్ల కేటాయింపులో సర్వేఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. అభ్యర్థుల జాబితాను ముందుగా ప్రకటించడం వలన అసమ్మతివాదులను తమవైపు తిప్పుకోగలిగే సమయం అభ్యర్థులకు చిక్కింది. 50 మంది సిటింగ్‌లకు టిక్కెట్ నిరాకరించినా వీరిలో అత్యధికులు వ్యతిరేకంగా పనిచేయకుండా సహకరించారు.

కాంగ్రెస్ చేసిన అభివృద్ధి- సంక్షేమం మంత్రం పనిచేసింది. జలయజ్ఞం, ఇందిరమ్మ యిళ్లు, ఆరోగ్యశ్రీ, 108, 2 రూ.ల బియ్యం, పింఛన్లు, స్కాలర్‌షిప్స్, పావలావడ్డీ, రైతుల రుణాల మాఫీ యిత్యాది కార్యక్రమాలు గెలుపుబాట పట్టించాయి. వైయస్ ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించలేదు. ఎప్పటికప్పుడు సర్వేలు చేయిస్తూ లోపాలను సరిదిద్దుకున్నారు. సిటింగ్ కాండిడేట్‌లు బాగా సంపాదించుకుని వుండడంతో ఖర్చు విషయంలో వెనుకాడలేదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందని కాంగ్రెస్ చెపుతూ వచ్చింది, అలాగే జరిగింది. పైగా ప్రకృతి కాంగ్రెస్‌ను కరుణించింది.

వైయస్ 1999లో బాబుపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ ఉచిత విద్యుత్ హామీ యిస్తే జనాలు నమ్మలేదు. చంద్రబాబు మృదుత్వం చూసి జనాలు విశ్వసించారు. ఇప్పుడు రోల్స్ రివర్స్ అయ్యాయి. పరిపాలనాదక్షుడైన బాబు తన యిమేజికి భిన్నంగా ఉచిత హామీలు యివ్వడంతో ఆయన ప్రతిష్ట దిగజారింది. వైయస్ 100 మందికి పైగా తప్పిద్దామనుకున్నాడు. కానీ 51 మందికి మాత్రమే అనుమతి లభించింది. 130 మంది సిటింగ్ ఎమ్మెల్యేలలో 56 మంది ఓడిపోయారు. తెలంగాణాలో 49 మందిలో 25 మంది ఓడిపోయారు. కాంగ్రెస్‌కు మహాకూటమికి మధ్య తేడా 2%. కానీ అధికంగా వచ్చిన సీట్లు 51.

3

మహాకూటమి వైఫల్యానికి కారణాలు - చాలా స్థానాల్లో ఓట్ల బదిలీ జరగలేదు. సీట్ల సందర్భంగా ఏర్పడిన విభేదాలు ఖమ్మం, నల్గొండల్లో వెన్నుపోట్లకు దారితీశాయి. టిడిపి కూటమి పక్షాలకు యిచ్చిన 75 సీట్లలో 15 మాత్రం (20%) గెలవగలిగారు. మంగళగిరి వివాదం వలన సిపిఐ, సిపిఎంల మధ్య కూడా మనస్ఫూర్తిగా బదిలీ జరగలేదు. లెఫ్ట్‌కు ఎన్ని స్థానాలు యివ్వాలో తేల్చడానికి 15 రోజులు పట్టింది. వారికిచ్చిన 29 స్థానాల్లో 5 మాత్రం గెలిచారు. (17%) కాండిడేట్ల పేర్లు తేల్చి ప్రచారం మొదలుపెట్టడానికి చాలా టైము పట్టింది.

టిడిపి గురించి చూడబోతే - బాబు జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి లెఫ్ట్‌తో జట్టు కట్టినా లాభం లేకపోయింది. తన పార్టీలోని నాయకుల మధ్య వున్న అంతర్గత విభేదాలను సరి చేయలేకపోయారు. ధరల పెరుగుదల, సెజ్‌లు, బాబ్లీలపై చేసిన వుద్యమాలు ప్రజల్లోకి వెళ్లలేదు. జిల్లా కేంద్రంలో, మండల కేంద్రంలో ఒక ధర్నా, రాస్తారోకోతో సరిపెట్టడం తప్ప ప్రజల్లోకి వెళ్లిన నేతలు లేరు. బెంగాల్లో ఒక నందిగ్రామ్‌పై మమతా చేసిన ఆందోళనతో 50 సెజ్‌లున్న ఆంధ్రలో టిడిపి చేసిన ఆందోళన పోల్చి చూస్తే తెలుస్తుంది, పార్టీ ఎంత నిస్తేజంగా వుందో! వైయస్ గద్దె కెక్కిన మొదటివారంలోనే అవినీతి అవినీతి అంటూ హడావుడి చేశారు బాబు. కాస్త టైము యిద్దాం అని తక్కిన నాయకులు అంటే మన సీట్లు తక్కువ కదా, హంగామా చేయకపోతే లాభం లేదు

అంటూ విపరీతంగా చేసి, జనాలను అవినీతి అంటే యిమ్యూన్ చేసేశారు. అంతేకాదు ప్రజల్లో తమ పార్టీ పట్ల, తమ పథకాల పట్ల విశ్వసనీయత కల్పించలేకపోయారు.

బాబు కోటరీయే (లోకేశ్, నారాయణ విద్యాసంస్థల నారాయణ, సిఎం రమేష్, జి మోహన్‌రావు, సుజనా చౌదరి) ప్రత్యేక తెలంగాణాకు జై అనమనీ, తెరాసతో పొత్తు పెట్టుకోమని ఒత్తిడి తెచ్చారట. అభ్యర్థుల ఎంపికలో లోకేష్ చాలా యిన్వాల్వ్ అయ్యారట. ఆరునెలల ముందే అభ్యర్థులను ఎనౌన్సు చేస్తానన్న బాబు ఆఖరి నిమిషం వరకూ ప్రకటించలేకపోవడానికి కారణం – ఈ కోటరీట. నగదు బదిలీ పథకం నెలరోజుల ముందే ప్రకటించారు. అది ఎలా అమలు అవుతుందో పార్టీ అభ్యర్థులలో క్లారిటీ లేదు. ఉన్నవాటికి బదులా, లేకపోతే అదనంగానా అన్నదానిపై ఎవరూ చెప్పలేకపోయారు. ఇప్పుడున్న పింఛన్లు వదులుకుని నగదు బదిలీ అంటే మబ్బుల్లో నీళ్లు చూసి ముంతలో నీరు పారబోసుకోవడం అని జనాలు అనుకున్నారు.

ఓడిన టిడిపి నాయకుల్లో ప్రముఖులు యనమల, ఎర్రన్నాయుడు సోదరులు, కడియం శ్రీహరి, తలసాని, కోడెల, రోజా, ప్రతిభా భారతి, గౌతు శివాజీ ఓడిపోయారు. జూనియర్ ఫ్రెండ్ వంశీమోహన్, దేవినేని నెహ్రూ, సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, సిబిఐ విజయరామారావు, పార్టీ ఫిరాయించిన మాగంటి బాబు,అంబికా కృష్ణ, వున్నారు. టిడిపి తెలంగాణాలో బాగా పెర్‌ఫామ్ చేసింది. 64 పొత్తుదారులకు యిచ్చి, 59లో పోటీ చేసి 35 గెలుచుకుంది. కానీ ఉత్తరాంధ్రలో పరమఘోరంగా 34లో 6 తెచ్చుకుంది. (కాంగ్రెస్‌కు 24) జూనియర్ పర్యటన చేసింది అక్కడే. బాలకృష్ణ మీసం తిప్పిన 89 సీట్ల కోస్తాలో 29 వచ్చాయి. కాంగ్రెస్‌కు 51.

పీఆర్పీ విషయానికి వస్తే – పోటీ చేసినది 288. గెలిచినవి 18. రెండోస్థానంలో 32, మూడోస్థానంలో 222. 7గురు నాలుగోస్థానం, 9 మంది ఐదవ స్థానం. పార్టీ ఆవిర్భావానికి ముందు వున్న వారధి, స్పార్క్‌ల హడావుడి తర్వాత కానరాలేదు. చాలామంది నాయకులకు చిరంజీవి దర్శనమే దక్కేది కాదు. సీనియర్ నాయకుల్ని నిర్లక్ష్యం చేశారు. సరైన రీతిలో వినియోగించుకోలేదు. ఇతర పార్టీలనుండి సీనియర్లను చేర్చుకుంటే వారితో పాటు ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు క్యూ కడతారని అనుకున్నారు కానీ వారెవరూ రాలేదు. ఆఫీస్ బేరర్స్‌కు బాధ్యతలు అప్పగించలేదు. రెండేసి జిల్లాలకు ఇన్‌చార్జులుగా మిత్రా, ప్రభాకర్‌లను నియమించినా వీరి ప్రమేయం లేకుండానే ఆ జిల్లాల కార్యకలాపాలు, అభ్యర్థుల ఎంపిక జరిగిపోయాయి.

రోడ్‌షోలకు విరగబడిన జనం ఓట్లేయలేదు. చిరంజీవి పర్యటనలు చేయడమే తప్ప ప్రజల్లోకి వెళ్లలేదు. రోడ్‌షోలపై హైకోర్టు నిషేధం విధించగా హాయిగా 4 వారాల పాటు ఆఫీసులోనే కూచున్నారు. ఎన్నికల ప్రకటన విడుదలవడానికి కొద్ది సమయం ముందు మాత్రమే కొన్ని జిల్లాలకు మొదటిసారి వెళ్లారంటే అర్థం చేసుకోవచ్చు – చొరవ ఏ మాత్రం వుందో! అర్థ, అంగ బలాల్లేక కొందరు పోటీ నుంచి దాదాపు వైదొలగగా, మరికొందరు ప్రత్యర్థులకు అమ్ముడుపోయారట. చిరంజీవి తిరుపతిలో 10 వేల మెజారిటీతో నెగ్గి, పాలకొల్లులో 5 వేల తేడాతో ఓడిపోయాడు. అరవింద్ మాత్రమే కాదు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ సీనియర్లందరూ – డాక్టర్ వినయ్, సి రామచంద్రయ్య, తోట చంద్రశేఖర్, దేవేందర్ గౌడ్, భూమా నాగిరెడ్డి, అందరూ మూడోస్థానంలో వున్నారు. తమ్మినేని సీతారాం, కోటగిరి, పోసాని, వంగవీటి రాధా, కత్తి పద్మారావు ఓడిపోయారు. వైజాగ్, కాకినాడ, అమలాపురంలో మాత్రం ద్వితీయస్థానం. అసెంబ్లీలో 18 గెల్చింది. (వాటిలో 5 చోట్ల వెయ్యి ఓట్ల తేడాతో గెలిచింది.) వాళ్ల పార్టీతో చేతులు కలిపిన మనపార్టీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ లోకసభ, అసెంబ్లీ రెండూ ఓడిపోయారు. దేవేందర్ గౌడ్ అసెంబ్లీ, పార్లమెంటు రెండిట్లో ఓడిపోయారు. పీఆర్పీకి సిటీలో 12% ఓట్లు వచ్చాయి

4

తెరాస గురించి – కెసియార్ మెహబూబ్‌నగర్ పార్లమెంటు సీటు, విజయశాంతి మెదక్ సీటు కష్టపడి గెలిచారు. కెసియార్‌కు టిడిపి ఓట్లు ట్రాన్స్‌ఫర్ కాలేదు. హరీశ్ రావు సిద్దిపేటనుండి తెచ్చిన ఓట్ల వలనే విజయశాంతి గట్టెక్కారు. కెసియార్ కొడుకు రామారావు కరీంనగర్ జిల్లాలోనే సిరిసిల్ల అసెంబ్లీ సీటు కేవలం 171 ఓట్లతో గెలిచారు. టిడిపి అసెంబ్లీ అభ్యర్థులు గెలిచిన చోట కూడా తెరాస పార్లమెంటు అభ్యర్థులు (కరీంనగర్, నాగర్‌కర్నూలు, పెద్దపల్లి) ఓడిపోయారు. అంటే టిడిపివాళ్లు పార్లమెంటుకి తెరాసకు కాకుండా వేరేవారికి వేశారన్నమాట.వరంగల్ లోక్‌సభకై టిడిపి అభ్యర్థి లక్ష ఓట్లు తెచ్చుకుని తెరాస గెలవకుండా చేశాడు. టిడిపితో పొత్తు కుదుర్చుకుంటే చాలు 100 సీట్లు కూటమికి వస్తాయనుకున్నారు కెసియార్. రోడ్‌షోలు చేస్తానని, బస్సుయాత్రలు చేస్తానని హంగామా చేయడమే తప్ప గుమ్మం కదలలేదు. 9 జిల్లాల్లో పోటీ చేస్తే 3 జిల్లాల్లో ప్రాతినిథ్యమే కరువైంది. హైదరాబాద్, నల్లగొండల్లో ఖాతాయే తెరవలేదు. మెహబూబ్‌నగర్‌లో నెటగ్గింది కసియార్ ఒక్కరు మాత్రమే. ఆయన స్వంతజిల్లా మెదక్‌లో 1 అసెంబ్లీ, 1 ఎంపీ. ఆదిలాబాద్ (9 పోటీచేసి 4), కరీంనగర్‌లలో (5 పోటీ చేసి 3) మాత్రమే ఫర్వాలేదు. వినోద్, లక్ష్మీకాంతరావు ఓడిపోయారు. వరంగల్‌లో 7 పోటీచేసి 1 గెలుచుకుంది. నిజామాబాద్‌లో 1. 2004లో 26 గెల్చారు. తర్వాత 16 మంది మిగిలారు. ఉపయెన్నికల్లో 7గురు మిగిలారు. ఇప్పుడు 10. తెరాసకు బలమైన సీట్లు యిచ్చి నష్టపోయామని టిడిపి గోల. టిడిపిని నమ్మి మోసపోయామని తెరాస గోల. నాయిని నర్సింహారెడ్డి, విజయరామారావు, వినోద్ కూడా ఓడిపోయారు. తెరాస సిటీలో 9 టిల్లో పోటీచేసి 11.7% ఓట్లు తెచ్చుకుంది. తెరాస ఉపయెన్నికల్లో నిలబెట్టుకున్న 7 స్థానాల్లో 4 పోగొట్టుకుంది. గెలిచినది 10. 9

స్థానాల్లో మూడోస్థానం. 9 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు. నాంపల్లిలో అయితే 4 వేలే వచ్చాయి.

లెఫ్ట్ – తొలిదశలో భూమి వస్తుందన్న ఆశతో ప్రజలు లెఫ్ట్ చేసిన భూ పోరాటాలలో పాల్గొన్నా పోనుపోను అది వచ్చేట్టు కనబడకపోవడంతో వెనక్కి తగ్గారు. లెఫ్ట్ 2004లో 18 స్థానాలు తీసుకుని 15 గెలిచారు. ఇప్పుడు 29 తీసుకుని 5 గెలిచారు. చాట వెంకటరెడ్డి, నోముల నర్సయ్య, సురవరం, తమ్మినేని, న్యూ డెమోక్రసీ నర్సయ్య అందరూ ఓడిపోయారు. ఖమ్మంలో సిపిఎం తుక్కుతుక్కు అయిపోయింది. తమ్మినేనితో సహా 4గురు ఓడిపోయారు. సిపిఐ నారాయణ టిడిపిని తిట్టిపోశాడు. కూటమి సరిగ్గా నడపలేకపోయారన్నాడు. పీఆర్పీతో చేతులు కలపమని చెపితే వినలేదన్నాడు. తెరాసకు అనవసరంగా ఎక్కువ యిచ్చారన్నాడు. రాఘవులు, నారాయణ ఒకరి నొకరు తిట్టుకున్నారు. ఓటమికి కారణాలు వెతుకుతూ కాంగ్రెస్‌పై వ్యతిరేకత కానరాలేదని రాఘవులు అన్నాడు. అవినీతిపై ప్రచారం ఫలించలేదని నారాయణ అన్నాడు.

లోక్‌సత్తా – రాష్ట్రం మొత్తం మీద 1.6% ఓట్లు తెచ్చుకుంది. సిటీలో 8.6% ఓట్లు వచ్చాయి. సిటీలో మొత్తం 22 స్థానాలు వుంటే కూకట్‌పల్లిలో జెపి 71 వేలు తెచ్చుకుని గెలవగా, సిటీలో 3 చోట్ల 20 వేలు మించి వచ్చాయి. 5 చోట్ల 10–20 వచ్చాయి. 25 చోట్ల లోకసత్తాకు వచ్చిన ఓట్లు మహాకూటమికి వచ్చి వుంటే కూటమి గెలిచివుండేది. కానీ లోకసత్తాకు వేసినవాళ్లందరూ మహాకూటమి అభిమానులని ఎలా నిర్ధారించగలం?

తెలంగాణావాదం – హైదరాబాదు జిల్లాలో 15 స్థానాల్లో 7 కాంగ్రెస్, 7 మజ్లిస్, 1 బిజెపి. గ్రేటర్ హైదరాబాదు చుట్టుపక్కల 40 స్థానాల్లో సమైక్యవాదానికి కట్టుబడ్డ కాంగ్రెస్‌కు 23 స్థానాలు, మజ్లిస్‌కు 7 వచ్చాయి. 6 స్థానాలు మాత్రమే టిడిపికి, 1 తెరాసకు. 100 రోజుల్లో తెలంగాణా యిస్తానన్న బిజెపి కేంద్రంలో రాలేదు. యుపిఏకు తెరాస అవసరం లేదు. విజయశాంతి పార్టీ, దేవెగౌడ పార్టీ విలీనం అయిపోయాయి. తెలంగాణావాదుల్లో మధు యాష్కీ తప్ప వేరెవరూ గెలవలేదు.

కులప్రభావం – ప్రకాశం జిల్లాలో కమ్మలు ఎక్కువగా వున్నా టిడిపికి అండగా నిలవలేదు. కాపులు ఎక్కువగా వున్న తూగో జిల్లాలో పీ ఆర్పీ నెగ్గలేదు. పగోజిల్లాలో కూడా యిదే పరిస్థితి.

సినిమా గ్లామర్ – చిరు స్వయంగా ఓడిపోయారు. సినిమారంగానికి చెందిన 20 మంది (నిర్మాతలతో సహా) బరిలో నిలబడితే ఆరుగురే గెలిచారు. జూనియర్ ఉత్తరాంధ్రలో 5 జిల్లాలు, ఖమ్మంలో 72 అసెంబ్లీ, 11 ఎంపీ స్థానాల్లో పర్యటించగా కూటమికి 19 అసెంబ్లీ స్థానాలు, 1 ఎంపీ మాత్రం దక్కాయి.

రాష్ట్రంలో విశేషాలు – 1) ఉండవల్లి చివరిదాకా వూగిసలాడి చివరిలో నెగ్గారు. రాజమండ్రి నియోజకవర్గం మారడంతో పగో జిల్లాలోని 4 అసెంబ్లీ సెగ్మెంట్లలో, తూగోజిలోని 2 సెగ్మెంట్లలో టిడిపికి ఆధిక్యత వచ్చింది. అయితే అనపర్తిలో 40 వేల మెజారిటీ రావడంతో గట్టున పడ్డాడు. 2) రోజా ఓడిపోగానే వెక్కి వెక్కి ఏడ్చింది. 3) బాలశౌరి పార్లమెంటు స్థానం గురించి పట్టుబట్టి వైయస్ అనేకమంది సీట్లు మార్చారు. అతనే ఓడిపోయాడు. 4) జోస్యుడు బివి మోహనరెడ్డి ఓడిపోయాడు 5) కోట్ల కొడుకు నెగ్గితే కోడలు ఓడిపోయింది. 6) తన కుటుంబానికే 4 సీట్లు తీసుకున్న బొత్స అన్ని చోట్లా గెలిచాడు. 7) తూగోజిలో 1983 నుండి గెలుపెరగని 2 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. 8) ఆంధ్రప్రభ ముత్తా గోపాలకృష్ణ కాంగ్రెస్ టిక్కెట్టు రాక యిండిపెండెంటుగా కాకినాడలో పోటీ చేసి డిపాజిట్ పోగొట్టుకున్నాడు. 9) ఏ పార్టీకి మారదామా అని తెగ ఆలోచించి పీఆర్పీలోకి వచ్చిన కృష్ణంరాజు ఓడిపోయాడు 10) తూగోజి ఎటుంటే అటే గెలుపని సెంటిమెంటు. ఈ సారి 19 లో 11 కాంగ్రెస్ గెలుచుకుంది. అధికారంలోకి వచ్చింది. 11) జెసి దివాకరరెడ్డి 6 సార్లు వరసగా గెలిచారు. 12) మండలి బుద్ధప్రసాద్ ఆఖరి నిమిషంలో ఓడిపోయాడు 13) నెల్లూరు నుండి చిరు టిక్కెట్టు యిచ్చిన సామాన్యురాలు మునెమ్మ మూడోస్థానంలో వుంది 14) వైయస్ మెజారిటీ పెరుగుతూ వచ్చింది స్టేట్ ఫస్ట్ వస్తే బాబు మెజారిటీ తగ్గింది. 2004లో పోలైన వాటిలో 70% ఓట్లు వస్తే ఈ సారి 62% వచ్చాయి. 15) మజ్లిస్‌ని ఎదిరించిన ఉర్దూ పత్రిక ఎడిటర్ జాహెద్ ఆలీఖాన్‌ను టిడిపి, సిపిఎం అన్నీ బలపరచినా అతనికి 2 లక్షల ఓట్లు వస్తే ఒవైసీకి 3 లక్షలు వచ్చాయి

5

## జాతీయ పరిస్థితిని పార్టీల ద్వారా పరామర్శిద్దాం.

మొదటగా ప్రాంతీయ పార్టీలు – నితీశ్ మహిళలకు, దళితులకు చేసిన పథకాలు బాగా పనిచేశాయి. క్లీన్ యిమేజి వుంది. మోదీకి వున్న బ్యాడ్ యిమేజిని బిజెపి ఎన్నికల తర్వాత గుర్తించింది కానీ అతను అప్పుడే గుర్తించి వేదిక పంచుకోనన్నాడు. మొత్తం మీద ఎలాగో అలాగ బులిపించి లూధియానాల ఎన్‌డిఏ మీటింగుకి లాక్కు వచ్చి మోదీ అతన్ని వాటేసుకున్నాడు. అప్పటికి ఏం చేయలేక నితీశ్ తర్వాత వచ్చి మీద పడిపోతే నేనేం చేయగలను? అని సంజాయిషీ చెప్పుకున్నాడు. బిహార్ ప్రజలు యివేమీ పట్టించుకోలేదు. 40 సీట్లున్న బిహార్‌లో నితీశ్ కుమార్ పార్టీ జెడియుకి 14 పెరిగి 20 వస్తే, అతనితో పొత్తు కలిపిన బిజెపికి 5 పెరిగి 12 వచ్చాయి. ఎన్నికల తర్వాత నితిశ్ బిహార్‌ను ప్రత్యేకహోదా గల రాష్ట్రంగా గుర్తించి ఎవరు స్పెషల్ ప్యాకేజీ యిస్తే వాళ్లకే మా వోటు అన్నాడు తప్ప ఎన్‌డిఏతోనే కలుస్తానని అనలేదు. ఎన్నికల ఫలితాలు వచ్చాక యుపిఏకి యితని మద్దతు అక్కరలేకపోయింది.

జెడియుకి చెందిన జార్జి ఫెర్నాండెజ్‌ని పోటీ చేయవద్దని అతని సహచరులు బతిమాలినా వినలేదు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఘోరంగా ఓడిపోయాడు. ఒకప్పటి వీరాగ్రేసరుడు యిలా తయారు కావడం ముదిమి ప్రభావమేమో!

రైల్వే శాఖను బాగా నిర్వహించాడన్న పేరు రావడంతో లాలూ గర్వానికి పట్టపగ్గాలు లేకపోయాయి. హార్వర్డ్‌కి కూడా వెళ్లి మేనేజ్‌మెంట్ పాఠాలు చెప్పిన లాలూకి తన సహచరపార్టీలతో ఎలా వ్యవహరించాలో ప్రజలు పాఠం చెప్పారు. అతనూ, పాశ్వాన్ కలిసి కాంగ్రెస్‌కు 2 సీట్లు ఆఫర్ చేసి అవమానించారు. దాంతో రాహుల్‌కి ఒళ్లుమండి కాంగ్రెస్‌ను ఒంటరిగా పోటీకి దింపాడు. యుపిలో యీ ప్రయోగం సక్సెసయింది కానీ బిహార్‌లో అంతగా ఫలించలేదు. గతంలో 3 వుండే యిప్పుడు 2 మాత్రమే వచ్చాయి.

అయినా వాళ్లకు ఆనందమేమిటంటే కాంగ్రెస్ 10% ఓట్లు గెలిచి 12 సీట్లలో లాలూ-పాశ్వాన్‌లను చెడగొట్టింది. లాలూ పార్టీకి 18 వుండేవి పోయి 4 సీట్లు మాత్రమే వచ్చాయి. లాలూ స్వయంగా ఓ సీటులో ఓడిపోయి మరోదానిలో గెల్చాడు. లాలూ డీలాపడిపోయి కాంగ్రెస్‌తో విడిపోయి తప్పు చేశానని ఒప్పుకున్నాడు. బయటనుండి మద్దతు యిస్తానన్నాడు. మంత్రిపదవి కోరనన్నాడు. ఇక పాశ్వాన్ పరిస్థితి మరీ ఘోరం. పార్టీ పోటీ చేసిన 4 చోట్లా ఓడిపోయింది. ఒకప్పుడు దేశం మొత్తం మీద అధిక మెజార్టీతో నెగ్గిన పాశ్వాన్ యీ సారి అదే హాజీపూర్‌లో ఓడిపోయాడు. పాశ్వాన్ కూడా కాంగ్రెస్‌తో విడిపోవడం తప్పని ఒప్పుకున్నాడు. శతృఘ్నసిన్హ శేఖర్ సుమన్‌ను ఓడించాడు.

జార?ండ్‌లో (మొత్తం 14) బిజెపి కాంగ్రెస్ నుండి 5, జెఎంఎంనుండి 2 గెలుచుకుని 8కి చేరింది. కాంగ్రెస్ లాలూతో తెంపుకుని జెఎంఎంతో కలిసి పోరాడింది కానీ దెబ్బ తింది.

మహారాష్ట్ర (48) లో కాంగ్రెస్‌కు 4 పెరిగి 17 (పోటీ చేసినది 25) వచ్చాయి. శరద్ పవార్ ఎన్సీపీకి 1 తగ్గి 8 (21 వాటిల్లో పోటీ చేసింది) వచ్చాయి. బిజెపికి 4 తగ్గి 9 (26టిల్లో పోటీ చేసింది) వచ్చాయి. శివసేనకు 1 తగ్గి 11 (పోటీ చేసినది 22) వచ్చాయి. విదర్భలో బాగా దెబ్బ తింది. ముంబయిలో శివసేన-బిజెపి కూటమి తుడిచిపెట్టుకుపోయింది. రాజ్ థాకరే సిటీలో దెబ్బ తీశాడు. ఎన్‌సిపి బాగా దెబ్బతినడంతో శరద్ పవార్ ప్రధానమంత్రి పదవి గురించి నోరెత్తలేదు.

ఒరిస్సా (21)లో బిజూ జనతాదళ్‌కు 2 పెరిగి 14, కాంగ్రెస్‌కు 2 పెరిగి 6, సిపిఐకు 1 కొత్తగా వచ్చాయి. ఈ అయిదూ బిజూతో బంధం తెంపుకున్న బిజెపికి పోయాయి. నవీన్ పట్నాయక్ క్లీన్ యిమేజికి తోడు మహిళలకై పెట్టిన మిషన్ శక్తి, స్వయం సహాయక సంఘాలు మంచి ఫలితాలు చూపాయి. 2 రూ.లకు కిలో బియ్యం పథకం కూడా. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాడు. బిజెపిని వదులుకోవడంతో లాభపడ్డాడు.

పంజాబ్(13)లో అకాలీదళ్‌కు 4 పోయి 4 మిగిలాయి. వారితో పొత్తున్న బిజెపికి 2 పోయి 1 మిగిలింది. యివి వచ్చి చేరడం వలన కాంగ్రెస్ సంఖ్య 8 కు చేరింది.

ఛత్తీస్‌గఢ్‌లో (11) బిజెపి 10 నిలబెట్టుకుంది. కాంగ్రెస్ 1 నిలుపుకుంది. అసెంబ్లీ ఎన్నికల నాటి హవా అలాగే నడుస్తోందన్నమాట

గుజరాత్ (26) లో మోదీ తెగ హడావుడి చేసినా 1 మాత్రమే పెంచుకుని 15 తెచ్చుకున్నాడు. కాంగ్రెస్‌కి 1 పోయి 11 మిగిలాయి. కాంగ్రెస్ ముస్లిం కాండిడేట్లను నిలబెట్టకుండా సెకండ్ బిజెపిలాగానే వ్యవహరించిందట. పటేల్ వర్గం బిజెపినుండి కాంగ్రెస్ వైపుకి మొగ్గింది. సౌరాష్ట్రలో 7 సీట్లలో 4 కాంగ్రెస్‌కు వచ్చాయి.

హర్యాణాలో (10) కాంగ్రెస్ 9 నిలబెట్టుకుంది.

హిమాచల్(4) లో - బిజెపి కాంగ్రెస్‌నుండి 2 గెలుచుకుని 3 కు చేరింది

కశ్మీర్ (6) నేషనల్ కాన్ఫరెన్సు 1 పెంచుకుని 3కు చేరింది. దానితో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ 2 నిలుపుకుంది

కర్ణాటక (28)లో బిజెపి 1 పెంచుకుని 19కి చేరింది. ఇంకో సీటు దేవెగౌడ పట్టుకుపోగా కాంగ్రెస్‌కు 6 మిగిలాయి. మూడో ఫ్రంటును ముంచేసి దేవెగౌడ యుపిఏలో చేరిపోయాడు,

తమిళనాడు (39) సీట్లలో డిఎంకె కు 2 పెరిగి 18 వచ్చాయి. టి ఆర్ బాలు నెగ్గాడు. కాంగ్రెస్‌కు 2 తగ్గి 8 మిగిలాయి. ఈ మధ్యే ఈలం పాట ఎత్తుకుని నెగ్గేశాక కరుణానిధి ప్రభుత్వాన్ని డిస్మిస్ చేస్తానన్న కూటమితో చేతులు కలుపుదామనుకుని ప్లాన్లు వేసిన జయలలిత అన్నా డిఎంకెకు 9 కొత్తగా వచ్చాయి. చిదంబరం చివరిదాకా వూగిసలాడి గెల్చినా, మణిశంకర్ అయ్యర్ ఓడిపోయాడు. వైగోకు 3 తగ్గి 1 మిగిలింది. ఈలం ఈలం అన్న వైగో ఓడిపోయాడు. హెల్త్ మినిస్టర్‌గా డాఎవేణుగోపాల్‌తో పోట్లాటకే ప్రాధాన్యం యిచ్చిన అన్బుమణి రాందాస్ పార్టీ అయిన పిఎంకెకు పోటీ చేసిన 7 సీట్లలో ఒక్క సీటు కూడా దక్కలేదు. జయలలితతో చేతులు కలిపిన సిపిఐ, సిపిఎంలకు చెరో సీటు తగ్గి చెరోటి నిలుపుకున్నాయి. డిఎంకెకు తగ్గాయి కానీ, ఫర్వాలేదన్న స్థాయిలో వచ్చాయి. దానికే కరుణానిధి యుపిఏ కాబినెట్లు పోస్టులివ్వాలంటూ గొంతెమ్మ కోరికలు కోరుతున్నాడు.

## 6

ఉత్తరప్రదేశ్ విషయానికొస్తే వున్న 80 సీట్లలో కనీసం 50 గెలిచి ప్రధాని అయిపోదామనుకున్న మాయావతి బియస్పీ పార్టీకి గతంలో వున్న 21లో నుండి 1 తగ్గి 20 మిగిలాయి. గతంలో 35తో విర్రవీగిన సమాజ్‌వాదీకి 12 తగ్గి 23 మిగిలాయి. జయప్రద

67 వేల మెజారిటీతో నెగ్గింది. ఆమెపై అశ్లీల ప్రచారం చేసిన ఆజంఖాన్ పార్టీ వదిలిపోయాడు. సమాజ్‌వాదీ చేస్తున్న అవమానాన్ని సహించక ఒంటరిగా పోటీ చేసిన కాంగ్రెస్‌కు (2004లో 12.%% ఓట్లతో 9 తెచ్చుకుంది) 21 తెచ్చుకుంది. ఒంటరిగా పోటీ చేద్దామన్న నిర్ణయం తీసుకున్న ఘనత రాహుల్‌దే. బిజెపికున్న 10లో ఎదుగూ, బొదుగూ లేదు. అజిత్‌సింగ్ పార్టీకి 2 కలిసి 5కు చేరాడు. కాంగ్రెస్‌లో చేరిపోదామా అని ఆలోచిస్తున్నాడు.

ముస్లింలు కాంగ్రెస్ చెంతకు మళ్లీ చేరారని, అందుకే యింత మంచి రిజల్టు వచ్చిందని అంటున్నారు. యుపిలో యీ రిజల్టు వలన చాలా లాభాలు కలిగాయి. కేవలం కులం కారణంగా మాయావతిని ప్రధాని చేయాలని ఉవ్విళ్లూరిన మూడోఫ్రంట్ నాయకులకు దిమ్మ తిరిగింది. మాయావతికి అహంకారానికి కళ్లాలు పడ్డాయి. అసెంబ్లీ ఎలక్షన్‌లో కులం కార్డు (బ్రాహ్మణ ప్లస్ దళిత) వలనే గెలిచామనుకుని అన్ని రాష్ట్రాల్లోనూ అదే పాచిక విసురుదామనుకున్న మాయావతి పునరాలోచించుకోవలసిన అవసరం పడింది. అలాగే కులాల లెక్క వేసి కళ్యాణ్‌సింగ్‌ను అక్కున చేర్చుకున్న ములాయంకు మొట్టికాయ పడింది. ఇప్పుడు యిద్దరూ కలిసి కాంగ్రెస్‌కు బయటనుండి మద్దతు యిస్తామని కాళ్లావేళ్లా పడుతున్నారు.

లెఫ్ట్ విషయానికి వస్తే ఈ ఎన్నికలు చావుదెబ్బ కొట్టాయి. జాతీయపార్టీ గుర్తింపు పోయే దశకు సిపిఐ చేరుకుంది. అహంభావంతో వ్యవహరించిన సిపిఎంకు ఎడాపెడా దెబ్బలు తగిలాయి. బెంగాల్‌లో ( మొత్తం 42 సీట్లు) సిపిఎం 17 పోగొట్టుకుని 9 మిగుల్చుకుంది. సిపిఐకు 1 పోయి 2 మిగిలాయి. ఫార్వర్డ్ బ్లాక్ 1 పోగొట్టుకుని 2 మిగుల్చుకుంది. ఆర్‌యస్‌పి డిటో. తృణమూల్ 18 పెంచుకుని 19కి చేరుకుంది. కాంగ్రెస్ 6 నిలుపుకుంది. ఆశ్చర్యంగా బిజెపి (జశ్వంత్ సింగ్) డార్జిలింగ్‌లో ఎక్కవుంట్ ఓపెన్ చేసింది. ఫ్రంట్‌లో తక్కినవారితో సిపిఎం విభేదాలు, తృణమూల్–కాంగ్రెస్ జత కట్టడం, బుద్ధదేవ్ ప్రతిపాదిస్తున్న మార్పును పార్టీ సీనియర్లు వ్యతిరేకించడం, యివన్నీ పార్టీని దెబ్బ తీశాయి. 2008 మేలో పంచాయితీ ఎన్నికలలో సిపిఎం ఓటమి కనబడింది. తర్వాత జరిగిన 13 మునిసిపల్ ఎన్నికల్లో కేవలం ఐదింటిలో గెలిచింది. సింగూర్–నందిగ్రామ్ మిస్‌హేండ్లింగ్ గురించి చెప్పనే అక్కర్లేదు.

ఇటు కారత్ స్వంత రాష్ట్రం కేరళకు వస్తే (మొత్తం 20 సీట్లు) పరిస్థితి మరీ ఘోరం. పినరాయ్ విజయన్‌పై అవినీతి ఆరోపణలపై అతన్ని వెనకేసుకుని రావడంతో సిపిఎం యిమేజి మసకబారింది. పైగా ముస్లిం ఉగ్రవాదులతో లింకున్న పిడిపితో సిపిఎం పొత్తు కుదుర్చుకోవడంతో, లష్కరే కార్యకర్తలు కేరళలో తర్ఫీదు అవుతున్నారన్న వార్తలు రావడంతో లెఫ్ట్‌పై నమ్మకం పోయింది. యుడిఎఫ్‌కు 15 వస్తే లెఫ్ట్‌ఫ్రంట్‌కు 5 వచ్చాయి. కాంగ్రెస్‌నుండి శశి థరూర్ నెగ్గాడు. త్రిపురలో మాత్రం రెండు సీట్లూ సిపిఎం గెలుచుకుంది.

సిపిఎం యీ స్థితికి రావడానికి కారణం కారత్, యేచూరి. వీళ్ల మొండిపట్టు వలననే గతంలో జ్యోతి బసు ప్రధాని కాలేకపోయారు. ఇప్పుడు అణు ఒప్పందం గురించి తెగేదాకా లాగి చెడగొట్టుకున్నారు. లెఫ్ట్ వైఖరి వలననే మన్‌మోహన్ ప్రభుత్వం ఆర్థికపరమైన కొన్ని జాగ్రత్తలు (ఇన్సూరెన్సు రంగం) తీసుకోవలసి వచ్చింది. దానివలన ఆర్థికమాంద్యంలో కూడా భారత్ నిలదొక్కుకోగలిగింది. దాని క్రెడిట్ మన్‌మోహన్ ఎక్కవుంట్‌లో పడింది. సరైన ప్రత్యామ్నాయం చూపకుండా ఆ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నించినందుకు లెఫ్ట్‌ను శిక్షించారు ప్రజలు. అణు ఒప్పందంపై అంతదూరం వెళ్లిన లెఫ్ట్ విద్యావంతులున్న కేరళలో కూడా ప్రజలను కన్విన్స్ చేయలేదని యిప్పుడు తేటతెల్లమైంది. అసలు వాళ్లు కన్విన్స్ చేయడానికి ప్రయత్నించిందెప్పుడు? మేం చెప్పినది యితరులు విని తీరాలన్న పంతమే కనబడింది. సోమనాథ్‌తో వ్యవహరించిన తీరు కూడా చాలా ఆక్షేపణీయంగా వుంది. మూడో ఫ్రంటు పెట్టేసి ప్రభుత్వాన్ని నడిపేద్దామనుకోవడం చాలా హాస్యాస్పదంగా వుంది. కావాలంటే ప్రధాని బాధ్యత వహించేస్తానని కారత్ అనడం మరీ పెద్ద జోక్. బిజెపి,

కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా కూటమి కట్టేయాలనే వుద్దేశంతో తాము అవినీతిపరులైన నిందించిన జయలలిత, మాయావతి, బాబు, ములాయం, లాలూ... ఎవరితో బడితే వాళ్లతో జట్టుకట్టి యిమేజి క్షవరం చేసుకున్నారు. తమ యిల్లు తాము చక్కబెట్టుకోలేకపోయారు. అధికారం యిచ్చిన రాష్ట్రాలలో నిలబెట్టుకోలేకపోయారు. తగుదునమ్మానని యితరులకు సలహాల నివ్వసాగారు. విజయన్ వ్యవహారంకారణంగా అవినీతిపరులను రక్షించడంలో కాంగ్రెస్‌కు తాను తీసిపోనని సిపిఎం నిరూపించుకుంది.

ఫలితాలు వెలువడ్డాక కారత్‌ను పీకిపారేస్తేగాని పార్టీ బాగుపడదని అలజడి వచ్చింది. కానీ దాన్ని సమర్థవంతంగా అణిచేశారు. కానీ సిపిఐ బర్ధన్ వూరుకోలేదు. కారత్‌కు చాకిరేవు పెట్టేశాడు. సిపిఎం పెద్దన్న తరహా భరించలేక సిపిఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఆర్‌ఎస్‌పి మమతా పంచన చేరే రోజు వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. అప్పుడు బెంగాల్ యూనిట్ కారత్‌పై తిరుగుబాటు చేస్తుంది. చిన్నప్పటినుండీ చూస్తున్నా ఎంతసేపూ సిపిఎం రాజకీయాలు బెంగాల్, కేరళ చుట్టూనే తిరుగుతాయి. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ పెట్టి 70 యేళ్లు దాటినట్టుంది. ఇంకా 2% ఓట్లు కూడా లేవు. (దేశం మొత్తం మీద ఓటింగ్ % చూడబోతే కాంగ్రెస్‌కు 30% ఓట్లు వస్తే బిజెపికి 19% వచ్చాయి. లెఫ్ట్‌కు 7% – ఈ 7%తో వీళ్లు ప్రత్యామ్నాయం చూపెడతామంటారు) పైగా ఖమ్మంలో తుడిచిపెట్టుకు పోయింది. వీళ్లు పార్టీ విస్తరణపై దృష్టి పెట్టరు. ఎంతసేపూ లాబీయింగ్ మీదనే పని నడిపిద్దామని చూస్తారు.

7

లెఫ్ట్ అలా అఘోరిస్తే బిజెపి యింకోలా అఘోరించింది. యుపిఏకు, ఎన్‌డిఏ కంటె 20 సీట్లు మాత్రమే ఎక్కువ వస్తాయని

సర్వేలన్నీ అన్నాయి. కానీ ఫైనల్‌గా చూస్తే 100 సీట్లు తేడా వచ్చింది. పార్టీ పరంగా చూస్తే కాంగ్రెస్‌కు 61 పెరిగి 206 వస్తే బిజెపికి 22 తగ్గి 116 వచ్చాయి. రెండిటిమధ్యా వార 90! బలహీన ప్రధాని మన్‌మోహన్ అని నోరుపారేసుకున్న అద్వానీని బలహీన ప్రతిపక్ష నాయకుణ్ని చేసింది జనత. తనకు మంచి బలం వుండే మధ్యప్రదేశ్‌లో 9, రాజస్తాన్‌లో 17, మహారాష్ట్రలో 4, ఒరిస్సాలో 5, పోగొట్టుకుంది. ఉత్తరాఖండ్‌లో ఐదికి ఐదూ కాంగ్రెస్‌కు సమర్పించుకుంది. ఛత్తీస్‌గఢ్‌లో, కర్నాటకలో మాత్రం నిలుపుకోగలిగింది. గుజరాత్‌లో 1 మాత్రమే పెంచుకోగలిగింది. మధ్యప్రదేశ్ (29) బిజెపి అధికారంలో వున్నా 9 తగ్గి 16 వస్తే కాంగ్రెస్‌కు 8 పెరిగి 12 వచ్చాయి. బియస్పీకి 1 వచ్చింది. గిరిజన ప్రాంతాల్లో ఆరెస్సెస్‌కు పట్టు నిలిచింది. రాజస్థాన్ (25)లో 16 పెరిగి 20 వచ్చాయి. బిజెపికి 17 తగ్గి 4 మిగిలాయి. ఢిల్లీలో 7 స్థానాలూ కాంగ్రెస్‌వే. బిజెపికున్న ఒక్క సీటూ కూడా పోయింది.

నిజానికి బిజెపి విధానాలకు, కాంగ్రెస్ విధానాలకు తేడా ఏముంది? అవే పద్ధతులు కొనసాగేవి. అయితే అద్వానీ మన్‌మోహన్‌ను అతిగా విమర్శించడం, కాంగ్రెస్‌లోలాగానే అంతర్గత కలహాలు బయటకు రావడం (అరుణ్ జైట్లీ, రాజ్‌నాథ్‌ల మధ్య), దెబ్బతీశాయి. మోదీని కాబోయే ప్రధానిగా ఎందుకు ప్రొజెక్టు చేశారో తెలియదు కానీ ముస్లిములు బెదిరిపోయి బిజెపిని ఆమడదూరం పెట్టేశారు. మోదీ వ్యవహారాలను హిందువులు కూడా సమర్థించలేదని బిజెపికి ఎప్పటికి అర్థమవుతుందో!

గుజరాత్ మొదటినుండీ అగ్రగామిగా వున్న రాష్ట్రమే. పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రదేశమది. మోదీ వచ్చాక అడ్మినిస్ట్రేషన్ మెరుగుపడింది. అందులో సందేహం లేదు. కానీ అవినీతి కూడా చాలా జరిగింది. 2001లో భూకంపం వచ్చినపుడు అహ్మదాబాదులో నాణ్యత లేక ఎన్ని బిల్డింగులు కూలిపోయాయో! డబ్బిస్తే అధికారులు కళ్లు మూసుకున్నారు. మోదీ కూడా వ్యక్తిగతంగా ముస్లిం విరోధి అయి వుండడు. ఎందుకంటే యిప్పటికీ గుజరాత్‌లో అనేకమంది ముస్లిములు ఏ గొడవలు లేకుండా జీవిస్తున్నారు. అయితే కులసమీకరణల వలన రాష్ట్రంలో బలహీనపడిన తన పార్టీని మతతత్వం వైపు మరలించి హిందూ ఓట్లను కన్సాలిడేట్ చేయడానికై మోదీ వేసిన చదరంగపు ఎత్తు – గోధ్రా. ఆ ఎత్తు ఫలించింది, బిజెపి బలపడింది కానీ దేశవ్యాప్తంగా గోధ్రాపై నిరసన వ్యక్తమైంది. సాధారణ హిందువులు కూడా దాన్ని అసహ్యించుకున్నారు.

దాన్ని బిజెపి గ్రహించడం లేదు. నెగ్గాలంటే ప్రతి ఒక్కడూ మోదీలాగ కావాలని ఉద్బోధిస్తున్నారు. మోదీలాగే మాట్లాడిన వరుణ్ గాంధీ (అలాటి కూతే హిందువులకు వ్యతిరేకంగా యిక్కడ కూసిన డి శ్రీనివాస్‌ను ఓడించేశారు కానీ అక్కడ వరుణ్ నెగ్గాడు) పార్టీకి చెరుపు చేశాయని, ఎలక్షన్ కమిషన్ సూచించినట్టు అతనికి టిక్కెట్టు యివ్వకుండా వుండే బాగుండేదని యిప్పుడు అర్థమైంది. ఒరిస్సాలో కంధమాల్ గొడవ లేవనెత్తిన బిజెపి నష్టపోవడం, శివసేనకు 1 తగ్గడం – యివన్నీ హిందూత్వం మీద అతి చేయవద్దని ఓటర్లు చెప్పినట్టు అయింది. ఎలక్షన్ అనగానే రామమందిరం భజన ప్రారంభించడం కూడా బిజెపిని చులకన చేస్తోంది. వాజపేయి లేని లోటు కనబడుతోంది అన్నారు ఎలక్షన్లు అయిపోయాక. వాజపేయి అంటే అందరికీ ఆమోదయోగ్యుడైన మోడరేట్ భావాలున్న వ్యక్తి. అద్వానీ ఆరెస్సెస్ మనిషిగా, హిందూత్వవాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు కాబట్టి అలాటివాడు మాకు అక్కరలేదు అన్నారు దేశజనత. కానీ 116 సీట్లు తెచ్చుకోవడం సామాన్యం కాదు. అంటే వాటిలో స్థానిక ప్రభుత్వాల పాత్ర కూడా చాలా వుంది అని అర్థం చేసుకోవాలి.

అద్వానీ యివన్నీ అర్థం చేసుకున్నారు కాబట్టే తాను ప్రతిపక్ష నేతగా దిగిపోతానన్నారు. కానీ పార్టీ వద్దంది. ఈయన ఒప్పేసుకున్నాడు. అవతల కాంగ్రెస్‌లో యువతకు పెద్దపీట అంటూ రాహుల్, ప్రియాంకా దూసుకుని వస్తున్నారు. పోలింగ్‌లో యువతరం శాతం పెరుగుతోంది. బిజెపిలో యువత కాకపోయినా కనీసం సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ లాటి మధ్యవయస్కులను ముందుకు తీసుకుని వచ్చినా బాగుండేది. మళ్లీ అద్వానీయే అనడం ఆత్మహత్యాసదృశం. రామమందిరం, రామసేతు వంటివి ప్రజలు పట్టించుకోరు కాబట్టే మందిరం కడతానన్న యుపిలో గాని, సేతువు రక్షిస్తానన్న తమిళనాడులో కానీ బిజెపికి ఓట్లు రాలలేదు. ప్రజలకు కావలసినది గతం కాదు, మతం కాదు. ఆర్థికప్రగతి. మోదీలను అదుపు చేసి, ఉదారవాదులను, యువతను ప్రొజెక్టు చేస్తేనే బిజెపికి భవిష్యత్తు వుంది.

ఇక కాంగ్రెస్‌కు వద్దాం. ఇక్కడ విజయం సాధించినది సోనియా–మన్‌మోహన్ జంట. మన్‌మోహన్‌ది డిగ్నిఫైడ్ పెర్సనాలిటీ. రాజకీయనాయకులంటే అందరం అసహ్యించుకుంటాం కాబట్టి మన్‌మోహన్‌పై గౌరవం పెరుగుతుంది. మధ్యతరగతే కాక, శ్రామికజనం కూడా మన్‌మోహన్‌ను ఆమోదించినట్టు కనబడింది యీ ఎన్నికలలో. మన్‌మోహన్‌పై ఎలాటి అవినీతి ఆరోపణలు లేవు. ఆయన కాబినెట్ కొలీగ్స్ అవినీతి ఆరోపణలు ఆయనను అంటలేదు. ఆ డిపార్టుమెంటు సోనియాది, యుపిఏకు సమర్థన యిస్తున్న యితర పార్టీలదీ. 1984 అల్లర్లకు సిక్కుజాతికి మన్‌మోహన్ కాంగ్రెస్‌చే క్షమాపణ చెప్పించాడు. జగదీష్ టైట్లర్‌కు సిబిఐ క్లీన్‌చిట్ యిచ్చినా పార్టీ టిక్కెట్ యివ్వకుండా తప్పించాడు. అణు ఒప్పందం విషయంలో తను ఎంత గట్టివాడో చూపించుకున్నాడు. ముస్లిములపై సచార్ కమిటీ సిఫార్సులు అమలు చేయించడానికి చూశాడు. అణు ఒప్పందంపై మన్‌మోహన్ స్టాండ్ ని విద్యావంతులు ఆదరించారనడానికి కేరళ, బెంగాల్ ఫలితాలే నిదర్శనం. ఆర్థిక సంక్షోభం భారత్‌ను మరీ అంతగా తాకకపోవడానికి మన్‌మోహన్–చిదంబరం ప్రొఫెషనల్‌గా వ్యవహరించడమే కారణమని మధ్యతరగతి విశ్వసించింది. పూర్తి మెజారిటీ యివ్వకపోతే అణు ఒప్పందంపై ఓటింగు సమయంలో అందరి కాళ్లూ పట్టుకోవలసి వచ్చిందని గ్రహించి యీసారి సాధ్యమైనంత ఎక్కువ సుస్థిరత యిచ్చింది.

ఇక సోనియా గురించి చెప్పాలంటే చాలా వుంది. క్లుప్తంగా చెప్పుకుందాం. ఇందిరా గాంధీ కుటుంబం తప్ప దేశంలో వేరెవరూ పాలించడానికి తగరా? అని వాపోతున్నాం కానీ గ్రౌండ్ రియాలిటీ కూడా చూడాలి. ఇందిరా పుణ్యమాని దేశంలో జాతీయస్థాయి నాయకుడన్నవాడు లేకుండా పోయాడు. ఎవరు ఎదుగుతున్నా ఆవిడ తొక్కేసేది. ఆమె తర్వాత కాంగ్రెసుకు నాయకత్వం వహించడానికి ఎవరూ దొరకలేదు. దొరికినవారికి జాతీయస్థాయి లేదు. అందుకే రాజీవ్‌ని తీసుకు వచ్చిందావిడ. రాజీవ్ పోయాక సోనియాను తీసుకువద్దామంటే ఆవిడ రానంది.

ఆవిడకు రాజకీయాలంటే రోత అని ప్రతీతి. పివి హయాం తర్వాత కాంగ్రెస్ చిన్నాభిన్నమై పోయిన తర్వాత కాంగ్రెస్‌వాళ్లు ఆవిడ కాళ్లమీద పడి లాక్కుని వచ్చారు. దేశంలోని కాంగ్రెస్ నాయకులందరికీ ఆమోదయోగ్యమైన మనిషి – ఇందిరా గాంధీ వారసులొక్కరే. మిగతా ఎవర్ని తెచ్చినా తక్కినవారు వూరుకోరు. పివిని పడగొట్టేదాకా సీతారాం కేసరి నిద్రపోలేదు. బిజెపిని నిలవరించడానికి సిపిఎం జనరల్ సెక్రటరీ సుర్జీత్ సోనియాను ప్రధానిని చేయడానికి కంకణం కట్టుకున్నాడు. ఆవిడా వుబలాటపడింది. అయితే ఆవిడ అహంభావ ప్రవర్తన వలన అలిగిన అమర్ సింగ్ ములాయంతో గట్టిగా చెప్పి ఆమె ప్రధాని కాకుండా చూశాడు.

మళ్లీ 2004లో సోనియాకు అవకాశం వచ్చింది. ఆమె ప్రధాని కావడం ఖాయం అనుకున్నారు. నా హృదయం రోదించింది – 110 కోట్ల జనాభా పెట్టుకుని ఓ విదేశీయురాలిని ప్రధాని చేయడమా? అని. ఆవిడ కూడా ఏ అనీ బిసెంటో, ఏ మదర్ థెరిసాయో అదో దారి. బొత్తిగా – భారతపౌరసత్వం తీసుకోవడానికే దశాబ్దాలు తీసుకున్న సోనియాను ప్రధాని చేయడమా? అని. కాంగ్రెస్ వాదులందరూ ఆవిడ కాళ్లమీద సాష్టాంగపడ్డారు. నువ్వు లేకపోతే అనాథలై పోతాం తల్లో అని రోదించారు.

అంతా విని, చివరకు ఆమె మన్‌మోహన్ ప్రధాని అంది. కాంగ్రెస్‌వాళ్లలాగ నేను దాన్ని త్యాగం అనను కానీ పదవీ వ్యామోహానికి లొంగలేదని మెచ్చుకోకతప్పదు. పైగా యిది మోస్ట్ వర్కబుల్ ఎరేంజ్‌మెంట్. అసలు ప్రధానమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఒకరే కావలసిన అవసరం ఎన్నడూ లేదు. ఇందిరా గాంధీ కాలంలో మొదలుపెట్టారిది. క్రమంగా ప్రాంతీయ పార్టీల్లో కూడా యిది పాకింది. ముఖ్యమంత్రిగా అడ్మినిస్ట్రేషన్ చూసుకుంటూ పార్టీని నిర్లక్ష్యం చేయడం వలననే పార్టీ ఓటమి పాలైందని చంద్రబాబు చెపుతూ వచ్చారు. ఈసారి నెగ్గినా పార్టీ అధ్యక్షపదవిని మరొకరికి వదిలేవారో లేదో తెలియదు. నిజానికి రెండూ ఫుల్‌టైమ్ జాబ్స్. రెండూ ఒకరే చేయబోయి, రెండింటినీ చెడగొట్టడం జరుగుతోంది. సోనియాకు అడ్మినిస్ట్రేషన్‌లో ఏ అనుభవమూ లేదు. చిన్న మంత్రి పదవి కూడా చేయలేదు. ఏకాయెకి ప్రధానమంత్రి అయితే ఎంత కంగాళీగా వుండేదో! ఆ మాటకొస్తే రాజకీయాల్లోనూ అనుభవం లేదు. కానీ సరిగ్గా చేయక తగలడితే పార్టీ తగలడుతుంది. కానీ ప్రధానమంత్రిగా అయితే దేశం అధ్వాన్నమై పోతుంది. మన్‌మోహన్ వంటి టెక్నికల్, ప్రొఫెషనల్ వ్యక్తి వస్తేనే దేశం యిలా వుంది. సోనియా అయివుంటే ఎలా వుండేదో వూహించడం కష్టం.

ఈ విషయాన్ని అందరి కంటె ముందుగా ఆవిడ గ్రహించింది. అందుకే 'నో థ్యాంక్స్' అంది. రాజకీయాలు తను చూసుకుంది. మన్‌మోహన్‌ను పాలిటిక్స్ నుండి యిన్సులేట్ చేసింది. తన తరహాలో పని చేయడానికి ఆయనకు వీలైనంత వెసులుబాటు కల్పించింది. ఏ అర్జున్ సింగ్, ప్రణబ్ వంటి రాజకీయవ్యక్తినో కాక, మన్‌మోహన్‌ను పెట్టడంలో జాగ్రత్త కనబరచింది. గతంలో అనుభవజ్ఞుడు కదాని పివిని పెట్టిస్తే, ఆయన రాజకీయ దురంధరుడిగా తేలాడు. సోనియా కుటుంబాన్ని సింహాసనానికి ఆమడదూరంలో పెట్టాడు. మన్‌మోహన్ రాజకీయ వేత్త కాదు, తన పని ఏదో తను చూసుకుంటాడు. గ్రూపులు కట్టడు. దేశవ్యవహారాలు సరిగ్గా చేయలేకపోతే చెడ్డపేరు మన్‌మోహన్‌కి వస్తుంది. సోనియాను అంటదు. కానీ ఆయన చెడ్డపేరు తెచ్చుకోలేదు. సోనియా మాత్రం ఈ ఐదేళ్లలో పుష్పగుచ్ఛాలు, కంకరరాళ్లు అనేకం తెచ్చుకుంది. ఎందుకంటే ఎన్నికలలో గెలుపోటములు వచ్చినపుడల్లా ఆవిడను మెచ్చుకోవడమో, నిందించడమో చేశారు.

రాజకీయాల్లో కూడా సోనియా మరీ విగరస్‌గా లేరు. పని చేసేవాణ్ని చేయనిచ్చారు. ఇందిరా గాంధీలా అసమ్మతి ప్రేరేపించి, ముఖ్యమంత్రులను బలహీనపరచలేదు. ముంబయ్ పేలుళ్ల తర్వాత మాత్రం మహారాష్ట్ర ముఖ్యమంత్రిని, హోం మంత్రిని, కేంద్రంలో హోం మంత్రిని తప్పించారు. ఆ మాత్రమైనా జవాబుదారీ వుండాలని మనమూ ఆశిస్తాం. రాజకీయక్రీడల కంటె రాజకీయాలు సజావుగా, స్మూత్‌గా నడపడం మీదనే ఎక్కువ దృష్టి పెట్టారు. ఫిరాయింపులు ప్రోత్సహించి అవతలిపార్టీ ప్రభుత్వాన్ని కూలదోయడాల వంటి వాటికి మరీ పోలేదు. తెలంగాణా వంటి సున్నితమైన అంశాల విషయంలో డ్రాస్టిక్‌గా ఏ యాక్షనూ తీసుకోలేదు. అణు ఒప్పందం విషయంలో మన్‌మోహన్ పట్టుదల గమనించి సహకరించారు. ఆంధ్రలో వైయస్‌ను పూర్తిగా నమ్మింది. ఆయన 33 గ్గురు ఎంపీలను పంపి తన విధి తను నిర్వర్తించాడు.రాహుల్, ప్రియాంకాలను ఎలాగైనా రాత్రికి రాత్రి మంత్రులను చేసేద్దామనే ఆదుర్దా చూపలేదు. ఇలాటి ఆవిణ్ని గొప్ప నాయకురాలిగా ఎవరూ అనుకోం. కానీ లీస్ట్ మేనేజ్‌మెంట్ యీజ్ బెస్ట్ మేనేజ్‌మెంట్ అనే సూక్తి ప్రకారం ఆవిడ ప్రణాళిక ఫలించింది.

జాతీయ రాజకీయాల గురించి యిక్కడితో ఆపుతాను. సుస్థిర ప్రభుత్వం తెచ్చినందుకు ఓటర్లందరూ ధన్యులే, అభినందనీయులే. కాంగ్రెస్‌కు ఇన్ని సీట్లు యిస్తేనే డిఎంకె మంత్రిపదవుల విషయంలో ఎలా బేరమాడుతోందో చూసారు కదా. అవినీతి ఆరోపణలున్న బాలూకి, రాజాకి అవే మంత్రిత్వశాఖలు యివ్వాలని పట్టుబడుతోంది. ఇంతకంటె తక్కువ సీట్లు వచ్చివుంటే ఎలా వుండేది? డిఎంకె

ప్రభుత్వాన్ని కూల్చేస్తేనే సమర్థిస్తానని జయలలిత, సిపిఎం ప్రభుత్వం కూల్చేస్తేనే మద్దతు యిస్తానని మమతా బెనర్జీ, మాయావతిని పీకేస్తేనే సపోర్టు అని ములాయం, నితీశ్‌ను పడగొడితే మిమ్మల్ని నిలబెడతానని లాలూ... నానా బీభత్సంగా వుండేది. ఆ అవస్థ తప్పింది.

వివిధ పత్రికలు విశ్లేషణలు యింకా కొనసాగిస్తూనే వున్నాయి. ఏవైనా ముఖ్యమైనవి వుంటే బుల్లెట్ పాయింట్లలా మరో వ్యాసంలో ఎపుడైనా చెపుతాను. ప్రస్తుతానికి ఈ ఫలితాల తర్వాత.. సీరీస్ స్వస్తి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**2009 జూన్** **ఎమ్బీయస్: ఎందుకిలా ఓటేశారు...?**

1

ఎన్నికల విశ్లేషణలు బోల్డు వచ్చిపడుతున్నాయి. ఈనాడు కూడా అచ్చమైన పాత్రికేయ ధోరణిలో చక్కటి విశ్లేషణలు యిస్తోంది. గతవారంలో టిడిపి ఓటమి గురించి ఎడిట్‌పేజి వ్యాసంలో బాగా విమర్శించారు. తెరాస పార్టీ ఆవిర్భావం నుండీ ఆ పార్టీ గురించి వార్తలు తప్ప, వ్యాఖ్యలు చేయని ఈనాడు యిటీవల విమర్శనాత్మకమైన వ్యాఖ్యలు చేస్తోంది. ఆంధ్రజ్యోతి తెరాసను, కెసియార్‌ను తూర్పారబడుతోంది. పీఆర్పీ అంతర్గత చర్చల్లో 'మనం కొత్తదనం యివ్వలేకపోయామని, ఇతర పార్టీలనుండి నాయకులకోసం అనవసరంగా ఎదురుచూశామని' అంది. లోకసత్తా 'వన్‌మ్యాన్‌షో యికపై పనికి రాదని' స్వయంగా ఒప్పుకుంది. అభ్యర్థుల ఎంపికలో జాప్యంవలన తీవ్రంగా నష్టపోయామని మహాకూటమి పార్టీలన్నీ ఒప్పుకుంటున్నాయి. నిజానికి యీ అంశాలన్నీ నా 'ఎవరు గెలుస్తారు...?' ఆర్టికల్స్‌లో నేను రాశాను. అప్పుడు నన్ను నానా రకాలుగా దూషించినవారున్నారు. లోకసత్తాకు 2% కంటె ఓట్లు రావని రాస్తే చాలామంది ఎన్నారైలు కోపగించుకున్నారు. ఈరోజు ఆయా పార్టీలే లోపాలను అంగీకరిస్తున్నాయి.

జాతీయ, అంతర్జాతీయ విషయాలపై రాయమని చాలామంది కోరుతున్నారు. నాకూ సరదాయే! వైయస్ కొత్త ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో గమనించడానికి కొంతటైము పడుతుంది కదా! ఈలోపునే వ్యాఖ్యలు చేయడం దేనికి? ఈలోపున కాస్త తక్కిన విషయాలు తిరగేద్దాం. 2009 ఎన్నికలలో ఓటర్లు యీ విధంగా ఎందుకు ఓటేశారు? అన్న విషయంపై జాతీయపత్రికలలో చర్చలు చాలా జరుగుతున్నాయి. ది హిందూ, ఇండియా టుడే, ఔట్‌లుక్ వంటి పత్రికలను నేను గౌరవిస్తాను. గతవారం హిందూ 'హౌ ఇండియా ఓటెడ్' అని 8 పేజీల సప్లిమెంట్ ప్రత్యేకంగా వేసింది. నేషనల్ ఎలక్షన్ స్టడీ 2009 అని 35 మంది స్కాలర్లు తయారుచేసిన రిపోర్టు రాష్ట్రాలవారీగా వేసింది. చాలా బాగుంది. అదంతా చదివి దాన్ని సంక్షిప్తీకరించి గోరుముద్దలా కాకపోయినా వెన్నముద్దలా చేసి మీకు అందిద్దామని ప్రయత్నిస్తున్నాను.

దానిలోకి వెళ్లబోయేముందు రెండు విషయాలు చెప్పాలి. ఒకటి – నా నేపథ్యం గురించి అడుగుతున్నారు చాలామంది. నా ఫోటో కింద కనబడే 'ఇతరాలు ఆర్కైవ్స్'లో 'ఇకపై రోజూ...' అనే ఆర్టికల్‌లో నా గురించి నేను చెప్పుకున్నాను. రెండు – 33 మంది ఎంపీల నిచ్చినా కాబినెట్‌లో ఆంధ్రకు అన్యాయం జరిగిన విషయంపై రాయమని చాలామంది అడుగుతున్నారు. కాబినెట్ కూర్పు అన్నది పెద్ద మాట్రిక్స్ అయిపోయింది. రాష్ట్రంలో అయితే అన్ని జిల్లాలకు, కులాలకు ప్రాతినిథ్యం, కేంద్రంలో అయితే అన్ని రాష్ట్రాలకు, అన్ని పార్టీలకు ప్రాతినిథ్యం అనేది పెద్ద చర్చనీయాంశం అయిపోయింది. కాబినెట్‌లో ఉంటేనే పెద్ద గొప్ప అని నేననుకోను. బాబుగారి ఎంపీలు ఎన్‌డిఏలో లేకపోయినా బాబు కొన్ని సాధించుకుని వచ్చారు – ఒక్క తమిళ ఎంపీ వున్నా తమిళనాడుకి పనులవుతాయి, మనవాళ్లు అరడజను మంది వున్నా ఒక్క ప్రాజెక్టూ రాదు.

మన వాళ్లలో మంత్రి పదవులు రాని ఎంపీలలో సమర్థులని పేరుబడి అయ్యో వీళ్లకు రాలేదే అనేవాళ్లు ఎవరైనా వుంటే చెప్పండి. (తెలియకే అడుగుతున్నాను) లగడపాటి, ఉండవల్లి వివాదాలు రేపడంలో సమర్థులన్న మాట నిజమే.. పరిపాలనలో.? లగడపాటి వ్యాపారం మానేసి ఫుల్‌టైమ్ మంత్రిగా వుంటారా? ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వంలో మమతా, అళగిరి లాటివాళ్లు చొరబడ్డారు. వీళ్లందరినీ కాంపెన్సేట్ చేసేట్టు తక్కినవాళ్లు కష్టపడి పనిచేయాలి. రైల్వేలు బాగా నడిపిన లాలూ మన రాష్ట్రంవాడు కాకపోయినా ఫర్వాలేదు (మనకు అన్యాయం చేశాడనుకోండి) అదే శాఖలో చేసిన దత్తాత్రేయగారు కంటె మెరుగు కదా! బాగా పరిపాలించే వాళ్లు ఎక్కడివాళ్లయినా నేనేమీ అనుకోను.

ఎలాగోలా కష్టపడి పనిచేసి ఆర్థికమాంద్యం నుండి బయటపడేస్తే చాలు. మన రాష్ట్రం 33 మందిని యిచ్చినందుకు బహుమతిగా మన జలప్రాజెక్టులు జాతీయ ప్రాజెక్టులుగా ప్రకటించి నిధులు సమకూరిస్తే చాలు. వైయస్ గారు యిన్నాళ్లూ హైదరాబాదు భూములు అమ్ముకుని బండి లాగించారు. ఇప్పుడు అమ్మడానికి భూములు మిగల్లేదు, ధరలూ పలకవు. ప్రాజెక్టులను దిష్టిబొమ్మలుగా మిగిల్చేబదులు జాతీయం చేసి నిధులిస్తే చాలు. మంత్రిపదవులు కావాలా? ప్రాజెక్టులు కావాలా? అంటే ప్రాజెక్టులే కావాలంటాను. మంత్రులైతే వాళ్లలో ఎందరు భోక్తలో తెలియదు. ప్రాజెక్టులైతే సగం దుర్వినియోగం అయినా సగమైనా పని జరుగుతుంది.

ఇక యీ 'ఎన్ఈఎస్' స్టడీ గురించి – ఇది ఓటు ఎటు వేశారని తెలుసుకొని ఎన్నికల ఫలితాలు అంచనా వేసే ఎగ్జిట్‌పోల్

వంటిది కాదు. ఓటు ఎలా, ఎందుకు వేశారు? అని తెలుసుకోవడం దీని లక్ష్యం. ఇది ఏ పార్టీకోసమో చేయలేదు. ఎన్నికల జరిగిపోయిన తర్వాత ఫలితాలు వచ్చేలోపున దీన్ని నిర్వహిస్తారు. కానీ దీనివలన ప్రజల యిష్టాయిష్టాలు, ఆలోచనాసరళి తెలిసి సంఘంలో తేవలసిన మార్పుల గురించి ప్రభుత్వానికి ఒక అంచనాకు వస్తుంది. అందుకే దీనికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సు రిసెర్చు వారు నిధులు సమకూర్చారు. రేండమ్‌గా సెలక్టు చేసిన 729 అసెంబ్లీ స్థానాల్లో 2346 పోలింగు బూత్ ఏరియాల్లో 589659 మందిని ఎప్రోచ్ అయి వారిలో 34,365 మంది క్షుణ్ణంగా అనేక ప్రశ్నలతో యింటర్వ్యూ చేశారు.

వాళ్లు కనుగొన్నవి (ఫైండింగ్స్) అంశాలవారీగా – ఈ ఎలక్షన్ ఏ ఒక్క అంశం ప్రధానంగా సాగలేదు. ఎటువంటి ఎమోషన్ లేకుండా, ఏ వ్యక్తి చుట్టూ పరిభ్రమించకుండా జరిగిన సాధారణ ఎన్నిక. జాతీయ అంశాలు ప్రతిబింబించినా, రాష్ట్రస్థాయిలో జరిగిన అంశాలను కలగలిపితేనే యీ ఫలితం వెలువడింది. ఈ ఎన్నికలో ప్రాంతీయపార్టీలు మట్టిగరిచాయని, యికపై జాతీయపార్టీలదే హవా అనుకోవడం తప్పు. కాంగ్రెస్, బిజెపిల సీట్లు కలిపితే 2004లోని 283 నుండి 2009 నాటికి 322 కి చేరింది. కానీ వాళ్లకు వచ్చిన ఓట్ల శాతాన్ని కలిపి చూస్తే పెరిగినది 1.3% మాత్రమే! ప్రాంతీయ పార్టీల సంయుక్త బలం ఓట్ల పరంగా గత 4 ఎలక్షన్లుగా 29.2%గానే వుంది. ఏ మాత్రం తగ్గలేదు. ఇంటర్వ్యూ చేసినవారిలో 70% మంది మనం తొలుత మన రాష్ట్రానికి విధేయత ప్రకటించి, తర్వాత దేశానికి చూపాలని అభిప్రాయపడ్డారు.

2

ఓటింగ్ శాతం గురించి చూస్తే గత అయిదారు పార్లమెంటు ఎన్నికలుగా 60% దరిదాపుల్లో వుంటోంది. ఈ సారీ 58.4%. తమిళనాడులో 2004 కంటె 12% ఎక్కువ శాతం ఓటేస్తే బిహార్‌లో 13% తక్కువ శాతం ఓటేశారు. పంజాబ్‌లో 8% పెరిగితే ఢిల్లీ, కశ్మీర్‌ల్లో 4% పెరిగింది. ఓటేయనివాళ్లను ఎందుకు వెయ్యలేదని అడిగితే 25% మంది ఊళ్లో లేమన్నారు. 14% మంది ఒంట్లో బాగాలేదన్నారు. 10% గుర్తింపు కార్డులు లేవన్నారు. 6% మంది మాకు యింట్రస్టు లేదన్నారు. 35% మంది ఏ కారణమూ చెప్పలేకపోయారు. ఓటేసిన వారిలో 70% మందికి ఎన్నుకున్న ప్రతినిథులు ఏమీ చేయరని నమ్మకం. 50% మందికి ఎవరొచ్చినా, ఏ పార్టీ ఉద్ధరించేది ఏమీ లేదని నమ్మకం.

ఏ అంశం ప్రధానంగా వుందా? అని చూద్దామనుకున్నారు. అణు ఒప్పందం గురించి విన్నవాళ్లు 40%టే ట. ఇక టెర్రరిజం గురించి – ముంబయి దాడుల గురించి విన్నవాళ్లు 67%. వారిలో 41% మంది ప్రభుత్వం చేయవలసినదంతా చేసింది అనుకున్నారు. ఇక మిగతా అంశాలలో ఆర్థికపరమైన అంశాలనే ప్రజలు పట్టించుకున్నారు. ఓబిసి రిజర్వేషన్ల గురించి తెలిసినవారు 43% ఐతే, రామసేతు వివాదం గురించి 38% మందే విన్నారు. చాలామంది జనాల ద ృష్టిలో మెదిలే సమస్యలు – తాగేనీరు, కరంటు, ఆసుపత్రులు, రోడ్లు. దారిద్ర్యం, నిరుద్యోగం, కూడు, గూడు. జనాభాలో చాలామంది గత కొద్ది సంవత్సరాలుగా వాళ్ల స్థితి మెరుగుపడుతోందని ఫీలవుతూ, రాబోయే రోజుల్లో మరింత మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు. 36% మంది యుపిఏ విధానాల వలన డబ్బున్నవాళ్లే బాగుపడ్డారన్నారు. ఆర్థికకారణాల వలన యుపిఏ అంటే యిష్టపడని అనేకమంది బిజెపికి ఓటేయలేదు, ప్రాంతీయపార్టీలకు వేశారు.

నాయకుడిగా ఎవరి యిమేజి ఎలా వుంది అని చూడబోతే – వాజపేయి లేని లోటు బిజెపిపై స్పష్టంగా కనబడింది. వాజపేయికి 2004లో 38% సరేనంటే అద్వానీని 2009లో 10% మందే ఆమోదించారు. ప్రధాని పదవి వదులుకున్న తర్వాత సోనియా ప్రతిష్ఠ పెరిగింది. ప్రధాని అయ్యాక మన్‌మోహన్ ప్రతిష్ట కాస్త పెరిగింది. కాంపెయినింగ్ పూర్తయాక మన్‌మోహన్‌కి 17%, సోనియాకు 15% వస్తే అద్వానీ 14%తో వీరిద్దరి తర్వాతి స్థానంలో వున్నారు. రాహుల్‌కి 6%. మన్‌మోహనే మా ప్రధాని అని సోనియా, రాహుల్ అనడంతో వాళ్ల % కూడా వచ్చి ఆయనకు కలిసింది. మన్‌మోహన్ పాప్యులారిటీ ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా వుంది. పంజాబ్‌లో 55%, కేరళలో 37%, ఢిల్లీలో 31%, తమిళనాడులో 28%. అద్వానీ కైతే బిజెపి పాలిత ఝార్‌ఖండ్‌లో 48%, కర్ణాటకలో 32%, ఎంపీలో 27% ఒరిస్సాలో 33%,!

మహిళల ఓట్ల గురించి చూస్తే – కాంగ్రెస్‌కు మగవారు, ఆడవారు సమానంగా ఓటేశారు. బిజెపికి ఓటేసినవాళ్లలో మగవాళ్లు ఎక్కువ. మహిళలు కాంగ్రెస్‌కు అనుకూలంగా అవుతున్నారు. 43% మంది స్త్రీలు ఎవరికి ఓటేయ్యాలో తమంతట తామే నిర్ణయించుకుంటామన్నారు. 21% మంది ఇంట్లో వాళ్లని అడిగి వేస్తామన్నారు. మగవాళ్లలో అయితే 60% మందిది స్వంత నిర్ణయం. ఇంట్లో సంప్రదించి వేసేది 4% మాత్రమే!

ఇక యువత గురించి – యువత కమ్యూనిస్టు, బియస్పీ లాటివాటికి వేస్తాయనుకోవడం భ్రమ అని తేలింది. 2004 వరకు 25 సం.ఎలోపు వాళ్లు బిజెపికి వేసేవారు. ఈ సారి అది లేదు. కానీ రాహుల్ గాంధీ కారణంగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చినది యువత అనుకోవడం కూడా అపోహే! పెద్దవాళ్లు ఎలా ఆలోచించారో యువత కూడా అలాగే ఆలోచించారు. తేడా ఏమీ లేదు.

ఇక ముస్లిం ఓటు గురించి చెప్పాలంటే – ఎంచుకోవడానికి పరిమిత అవకాశాలున్న ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ముస్లిములు మూకుమ్మడిగా ఓటేస్తున్నారు. ఎక్కువ అవకాశాలున్న ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, బిహార్, జార?ండ్,

మహారాష్ట్రలలో ముస్లిం ఓట్లు చీలిపోతున్నాయి. ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో కాంగ్రెస్ బాబ్రీ మసీదు కారణంగా పోగొట్టుకున్న ముస్లిం ఓట్లను మళ్లీ రాబట్టుకుంటోంది. ముస్లిం అతివాద సంస్థతో పొత్తు పెట్టుకున్న లెఫ్ట్ ఫ్రంట్‌కు కేరళలో ముస్లిములలో ఒక వంతు వేస్తే పొత్తు పెట్టుకోని యుడిఎఫ్‌కు రెండు వంతులు మంది వేశారు. దేశం మొత్తం మీద చూస్తే ముస్లిములలో 36% కాంగ్రెస్‌కు వేస్తే బిజెపికి 3% వేస్తున్నారు. 11% వామపక్షాలకు వేస్తున్నారు. ములాయం పార్టీకి 1996లో 25% వేశారు. క్రమంగా తగ్గుతూ వచ్చి 2009లో 10% మాత్రమే వేశారు.

ఇప్పుడు పార్టీల వారీగా చూద్దాం. కాంగ్రెస్ పార్టీ – కాంగ్రెస్ అధికారంలో వున్న పార్టీ, 2004 కంటె దానితో పొత్తు కట్టినవారు తక్కువగా వున్నారు. అయినా 206 సీట్లు గెలిచింది. వేవ్ లాటిది ఏదీ లేకపోయినా, ఒక ట్రెండ్ కాంగ్రెస్‌కు లబ్ధి చేకూరేట్లా తయారైంది. 2% ఓట్ల శాతం మాత్రమే పెరిగినా సీట్లు మాత్రం 61 పెరిగాయి. సీటు–ఓటు మల్టిప్లయర్ (నెగ్గిన సీట్లు/ఓట్లనిష్పత్తి) కాంగ్రెస్‌కు 1999లో 0.74 వుంటే 2004 నాటికి అది 1.01 అయింది. 2009లో ఏకంగా 1.34 అయింది. అంటే 1% ఓట్లకు 1999లో 4 సీట్లు వస్తే 2004లో 5.5, 2009లో 7.2 !

ఇలా రావడానికి కారణం ఏమిటంటే కాంగ్రెస్ కొన్ని ప్రాంతాలపై అంటే – ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, కేరళ, రాజస్థాన్‌వలపై ఫోకస్ చేసి ఓట్లశాతం ప్రకారం న్యాయంగా రావలసినదానికంటె ఎక్కువ సీట్లు తెచ్చుకుంది. కాంగ్రెస్‌వైపు మొగ్గు దేశమంతా ఒకలా లేదు. ఆలిండియాలో 2.1% వున్నా, ఒరిస్సాలో –7.6%, మహారాష్ట్రలో –4% కర్నాటకలో 0%, ఉత్తర ప్రదేశ్‌లో 6%, అయితే పంజాబ్‌లో 11% ! అయితే ఒరిస్సాలో బిజెపి, బిజూ జనతాదళ్ ఓట్ల చీలిక వలన కాంగ్రెస్ లాభపడి 4 సీట్లు అదనంగా గెలుచుకుంది. ఆంధ్రలో ప్రజారాజ్యం, మహారాష్ట్రలో నవనిర్మాణసేన కారణంగా ఓట్లశాతం తగ్గినా ప్రతిపక్షాల ఓట్లు చీలిపోయి లాభపడింది. రాజస్థాన్ (6%), మధ్యప్రదేశ్ (6%), కేరళ (8%)లలో పాజిటివ్ స్వింగ్ ఓట్లు తెచ్చిపెట్టింది. ఉత్తరప్రదేశ్‌లో తెచ్చుకున్నది 18% యే అయినా అవన్నీ ఒకే ప్రాంతంలో రావడం చేత రావలసినదానికకంటె ఎక్కువగా సీట్లు వచ్చాయి.

1990ల నుండి కాంగ్రెస్‌కు ఖచ్చితంగా ఓట్లు వేసే వర్గాలు తగ్గుతూ వచ్చాయి. 2004 నాటికి అన్నివర్గాలలోనూ కొంతకొంతమంది కాంగ్రెస్‌కు ఓట్లు వేసే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నికలో ఆ యిమేజి మరింత బలపడింది. ముస్లిములు, సిక్కులు కాంగ్రెస్‌కు చేరువవుతున్నారు. మధ్యతరగతి జనాభాను, నగరజనాభాను, విద్యావంతులను కాంగ్రెస్ ఆకర్షించింది. దళితులు, హరిజనుల్లో కాంగ్రెస్ బేస్ అలాగే వుండగా యివి వచ్చి చేరాయి. కానీ కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ యింకా ఎదగలేదు. బిజెపిని ఛాలెంజ్ చేసే స్థితిలో లేదు. కాంగ్రెస్‌కు పెరిగే అవసరం, అవకాశం యింకా చాలా వుంది. (సశేషం)

3

ఇప్పుడు సీట్ల సంఖ్య 138 నుండి 116కి, ఓట్లశాతం 22.2% నుండి 18.8%కి పడిపోయిన బిజెపి గురించి చూద్దాం. 1989లో జాతీయస్థాయికి చేరిన దగ్గర్నుంచి యింత తక్కువ ఓట్లశాతం ఎప్పుడూ రాలేదు. 1998లో ఉచ్చస్థితికి చేరిన తర్వాత వరుసగా మూడుసార్లుగా ఓట్లశాతం తగ్గుతూనే వస్తోంది. కాంగ్రెస్‌కు దేశమంతా పాజిటివ్ స్వింగ్ రాలేదు కానీ బిజెపి దేశమంతా ఒకలాటి స్వింగే – నెగటివ్ స్వింగ్! కర్నాటకలో, హిమాచల్ ప్రదేశ్‌లలో వచ్చిన తలా 5% పాజిటివ్ స్వింగ్‌లు మాత్రమే విపర్యం. పంజాబ్‌లో –0.4, గుజరాత్‌లో –0.8, చాలాచోట్ల –4% నుండి –5%. రాజస్థాన్‌లో అయితే ఏకంగా –12%! అయినా సీట్ల సంఖ్య మరీ అంతగా తగ్గలేదు. బిహార్ (–0.6%), జార్ఖండ్ (–5.5%) లలో ఏడేసి సీట్లు ఎక్కువ వచ్చాయి కూడా!

అభ్యర్థుల ఎంపిక, ప్రచారవ్యూహం విషయాలలో బిజెపి కాంగ్రెస్‌కంటె మెరుగ్గా వ్యవహరించింది. కానీ యింత ఘోరమైన పరాజయం చవిచూడడానికి కారణం ఏమిటి? మచ్చలేని ప్రధానమంత్రిపై దాడి చేయడం, వరుణ్ గాంధీని వెనకేసుకుని రావడం, ప్రచారం మధ్యలో మోదీని కాబోయే ప్రధానిగా ముందుకు తీసుకురావడం యివన్నీ బిజెపి చేసిన తప్పిదాలే. దీనికి మించిన కారణాలు వున్నాయి. 01) 1990 నుండి బిజెపి ఎదగడానికి దోహదపడిన అంశాలు యీసారి రివర్స్ అయ్యాయి. దక్షిణాన, తూర్పున కొత్త రాష్ట్రాలకు విస్తరించడం ఆగిపోయింది. ఈశాన్య రాష్ట్రాలన్నిటిలోనూ బిజెపి చాలా భారీగా నష్టపోయింది.

02) 1999–2004 మధ్య ఎన్‌డిఏలో ఎన్నో పార్టీలుండేవి. క్రమంగా అవి తగ్గిపోతూ వచ్చాయి. 1999లో ఎన్‌డిఏ భాగస్వామ్యపక్షాల ఓట్లశాతం 41.1% వుంటే 2004 నాటికి అది 35.9% అయి, 2009 నాటికి 24.1% అయింది. టిడిపి, తృణమూల్, అన్నా డిఎంకె వంటి పెద్ద పార్టీలు ఎన్‌డిఏను విడిచిపెట్టేశాయి. ఎందుకు? బిజెపితో కలిస్తే మైనారిటీ ఓట్లు పోతాయన్న భయం పట్టుకుంది కాబట్టి! ఈసారి అసాం గణపరిషత్, హర్యానాలో లోక్‌దళ్ వంటివి బిజెపి చెంతన చేరాయి కానీ ఘోరంగా దెబ్బ తిన్నాయి. అందువలన అవి బిజూ జనతాదళ్‌లా వెనక్కి తగ్గవచ్చేమో. నితీశ్ యిప్పటికే గోడమీద పిల్లిలా వున్నాడు. ఇతర పార్టీవిధానాలను తనలో యిముడ్చుకోగల శక్తి తగ్గుతున్నకొద్దీ బిజెపికి మిత్రులు దక్కరు సరికదా, కొత్తవారు కూడా ఎవరూ రారు.

03) బిజెపి వ్యాపించేదశలో నగరప్రాంతాలనుండి గ్రామీణప్రాంతాలకు విస్తరించింది. అగ్రవర్ణాల పార్టీగా పడిన ముద్ర చెరిపేసుకుంటూ దిగువ ఓబిసిలలో కూడా ప్రాచుర్యం పొందింది. మధ్యభారతంలో ఆదివాసీల ఓట్లు తెచ్చుకుంది, మైనారిటీల ఓట్లు కూడా సంపాదించుకోగలిగింది. 1999లో వీటన్నిటితో బాటు తనకు సాంప్రదాయికంగా వస్తున్న ఓట్లు కూడా జతపడి అధికారంలోకి

రాగలిగింది.

ఈ ఎన్నికలలో ఈ ప్రక్రియ ఆగిపోయింది, కొన్నిచోట్ల తిరుగుముఖం పట్టింది కూడా. ఒక్క కర్ణాటకలోనే బేస్ విస్తరించింది. తక్కినచోట్ల మైనారిటీలలో, ఆదివాసీలలో విస్తరణ రివర్స్ అయింది. దిగువ ఓబిసి విషయంలో ఆగిపోయింది. అగ్రవర్ణాలకు యిప్పటికీ బిజెపియే ఫేవరేట్ అయినా వారిలో కూడా కొద్దిగా విముఖత కనబడిందీసారి. నగరప్రాంతాలలోని మధ్యతరగతి వర్గాల ఓట్లు బిజెపి కంటె కాంగ్రెస్‌కు పడడం చూస్తే బిజెపి తిరోగమనంలో వుందని అర్థమవుతోంది. అయినా బిజెపి అతి పెద్ద ప్రతిపక్షం. అనేక రాష్ట్రాలలో అధికారంలో వుంది. వాళ్ల పరిపాలనకూడా మరీ తీసికట్టుగా ఏమీ లేదు. ద్వితీయశ్రేణి నాయకులు కూడా చాలామంది వున్నారు. అందువలన భవిష్యత్తు వుంది అనుకోవాలి. అయితే దానికి కావలసినది – కార్గిల్ వంటి ఒక అసాధారణ ఘట్టం, వాజపేయి వంటి అసాధారణ నాయకుడు, 1999 నాటి ఎన్‌డిఏ వంటి అసాధారణ మిశ్రమం!

లెఫ్ట్ గురించి చూస్తే – 2004 నాటి 61 సీట్ల నుండి 24కి పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా వారి ఓట్లశాతం క్రమంగా పడిపోతూ వస్తోంది. 1990ల్లో 10% వుంటే 2004కి 8% అయింది. ఇప్పుడు దాని కంటె కూడా తగ్గింది. బెంగాల్, కేరళ, త్రిపురలను దాటి వారు విస్తరించడం లేదు. ఇప్పటికీ వారికి ఓటేసేవర్గాలలో – 52% మంది పేదలు, నిరుపేదలు, ఆదివాసీలు 42% మంది దళితులు, ముస్లిములు. వారి ఓటర్లలో 80% మంది గ్రామీణులే. అణు ఒప్పందం కారణంగా యిలా ఓట్లేశారని అనుకోవడానికి లేదు. లెఫ్ట్‌కు ఓటేసినవారిలో 55% మందికి ఆ ఒప్పందం గురించి తెలియనే తెలియదు. మిగిలిన 45% మందిలో సగం మంది దానిపై ఏ అభిప్రాయమూ లేదు.

ఇక బియస్‌పి గురించి – 2004లో దేశం మొత్తం మీద 5.3% వున్న ఓట్లు తెచ్చుకుంటే యీ సారి ఆ శాతం 6.2% అయింది. మూడు ఎన్నికలుగా అది పెరుగుతూనే వస్తోంది. ఉత్తరప్రదేశ్ వరకే చూసుకుంటే బియస్పీయే అందరికంటె పెద్ద పార్టీ. 2007 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే దాని ఓట్ల శాతం అతి స్వల్పంగా తగ్గింది. హర్యాణా, ఉత్తరాఖండ్‌లలో ఓట్లశాతం బాగా పెంచుకుంది. ఢిల్లీ, మహారాష్ట్ర యిత్యాది రాష్ట్రాలలో పెరిగింది కానీ ఫలితాలు మార్చేటంత కాదు. ఈ పార్టీకి ఓట్లేసేవారిలో 55% మంది దళితులు, 3–4% అగ్రవర్ణాలు, పల్లెటూరి భూస్వామి వర్గాలు, ఓబిసిలు. షెడ్యూల్ ట్రైబ్స్‌లో 2% మంది, ముస్లిములలో 7%, దళితుల్లో 25% వేశారు. (మాయావతి కులస్తులయిన జాతవుల్లో చాలామంది బియస్పీకి వేశారు). దళితులలో 30% కాంగ్రెస్‌కు వేశారు. ఆమె దళిత సమర్థకుల్లో 46% మందికి ఆమె అగ్రవర్ణాల వారికి ప్రాధాన్యం యిస్తోందని కోపంగా వున్నారు. ఆమె అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆమె దళితేతర సమర్థకులకు కోపం.

4

ఇక కొన్ని రాష్ట్రాల సంగతి చూద్దాం – ఆంధ్రప్రదేశ్ – పార్లమెంట్‌లో కాంగ్రెస్‌కు 2.6% ఓట్లు తగ్గాయి కానీ 4 సీట్లు అదనంగా వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో – కాంగ్రెస్‌కు 2% ఓట్లు తగ్గాయి కానీ 28 సీట్లు పోయాయి. టిడిపికి 9% ఓట్లు తగ్గినా 44 సీట్లు అదనంగా గెలుచుకుంది – తెరాస, లెఫ్ట్‌లతో మహాకూటమి ఏర్పరచిన కారణంగా! కాంగ్రెస్ సమర్థకులలో 80% మంది యుపిఏ సామర్థ్యంపై సంతృప్తిపడ్డారు. 82% మంది రాష్ట్రప్రభుత్వంపై సంతృప్తి చెందారు. లోకసత్తా, పీఆర్పీలు ప్రభుత్వవ్యతిరేక ఓట్లు చీల్చడం కారణంగా మహాకూటమి దెబ్బతింది. 2004లో టిడిపికి ఓట్లేసినవారిలో 16% మంది ఈసారి పీఆర్పీకి వేశారు. గతంలో తెరాసకు ఓట్లేసినవారిలో 18% మంది, లెఫ్ట్‌కు వేసినవారిలో 28% మంది ఈ సారి కాంగ్రెస్‌కు వేశారు.

కులాలవారీగా చూస్తే పీఆర్పీని కాపులు, టిడిపిని కమ్మలు ఆదరించారు. బిసీలు టిడిపివైపు కాస్త మొగ్గు చూపారు. కాంగ్రెస్‌కు దళితులు (అందునా మాలలు ఎక్కువ), 50% మంది ముస్లిములు ఓట్లేశారు. కాంగ్రెస్‌కు ఓట్లేసినవారు – మగవాళ్లలో 45% ఆడవాళ్లలో 41%! ఆర్థికపరంగా చూస్తే అతిపేదల్లో 46%, బీదల్లో 43%, దిగువ మధ్యతరగతిలో 44%, మధ్యతరగతిలో 42%, ఎగువతరగతిలో 43%! కులాలపరంగా చూస్తే అగ్రవర్ణాలలో (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కాబోలు) 38%, రెడ్లలో 66%, కమ్మల్లో 21%, కాపుల్లో 31%, యాదవుల్లో 35%, గౌడల్లో 36%, ఇతర బిసిల్లో 38%, మాలల్లో 51%, మాదిగల్లో 48%, గిరిజనుల్లో 54% ముస్లిముల్లో 51%!

టిడిపి సారథ్యంలోని మహాకూటమికి ఓట్లేసినవారు – మగవాళ్లలో 33% ఆడవాళ్లలో 37%! ఆర్థికపరంగా చూస్తే అతిపేదల్లో 41%, బీదల్లో 40%, దిగువ మధ్యతరగతిలో 38%, మధ్యతరగతిలో 33%, ఎగువతరగతిలో 28%! కులాలపరంగా చూస్తే అగ్రవర్ణాలలో 34%, రెడ్లలో 20%, కమ్మల్లో 64%, కాపుల్లో 16%, యాదవుల్లో 46%, గౌడల్లో 40%, ఇతర బిసిల్లో 38%, మాలల్లో 29%, మాదిగల్లో 46%, గిరిజనుల్లో 33% ముస్లిముల్లో 25%!

చిరంజీవి పీఆర్పీకి ఓట్లేసినవారు – మగవాళ్లలో 12% ఆడవాళ్లలో 14%! ఆర్థికపరంగా చూస్తే అతిపేదల్లో 9%, బీదల్లో 13%, దిగువ మధ్యతరగతిలో 12%, మధ్యతరగతిలో 14%, ఎగువతరగతిలో 11%! కులాలపరంగా చూస్తే అగ్రవర్ణాలలో 5%, రెడ్లలో 3%, కమ్మల్లో 7%, కాపుల్లో 53%, యాదవుల్లో 11%, గౌడల్లో 11%, ఇతర బిసిల్లో 16%, మాలల్లో 14%, మాదిగల్లో 5%, గిరిజనుల్లో 7% ముస్లిముల్లో 7%!

కేరళ – 2004లో లెఫ్ట్‌కు 18 సీట్లు వస్తే ఈసారి యుడిఎఫ్‌కు 16 వచ్చాయి. ఎందుకంటే 2004 ఓట్లశాతం 11% పెంచుకుంది. సిపిఎం లీడర్ పినరాయి విజయన్‌పై అవినీతి ఆరోపణల గురించి 70% విన్నారు. వారిలో సగం మంది ఆ ఆరోపణలు నిజమని నమ్మారు. నమ్మినవారిలో 57% మంది యుడిఎఫ్‌కు ఓటేశారు. సిపిఐ, ఆర్ఎస్‌పి అభ్యంతర పెట్టినా వినకుండా సిపిఎం ముస్లిం ఉగ్రవాదపార్టీ పిడిపితో పొత్తు పెట్టుకుంది. ఓటర్లలో చాలామంది దీన్ని నిరసించారు. పైగా దానివలన ముస్లిముల ఓట్లు చేరకపోగా 3% తగ్గాయి కూడా. ఓటర్లలో 60%మంది ముఖ్యమంత్రి అచ్యుతానందన్ సామర్థ్యంపై విశ్వాసం ప్రకటించారు. అతన్ని పక్కకు పెట్టడమే సిపిఎం పొరబాటు. సమాజంలోని అన్ని వర్గాలలోనూ ఎల్‌డిఎఫ్ సపోర్టు పోగొట్టుకుంది. యుడియఫ్‌కు ఎప్పుడూ వుండే క్రైస్తవులు సపోర్టు యీసారి మరింత (13%) పెరిగింది. అంటే ఆ మేరకు ఎల్‌డిఎఫ్ నష్టపోయినట్లే! అంతేకాక ఎల్‌డిఎఫ్ నాయర్ల సపోర్టును కూడా బాగా (–14%) పోగొట్టుకుంది. నగర ఓటర్లలో బిజెపి 4% ఓట్లు పోగొట్టుకుంది. అవి ఈ రెండు ఫ్రంట్‌లకూ వచ్చి చేరాయి.

తమిళనాడు – మాములుగా ఎవరిదెంత పెద్ద కూటమి వుంటే వాళ్లదే గెలుపు అని యిక్కడి లెక్క. అలా అయితే ఎడిఎంకెకు పూర్తి సీట్లు రావాలి. ఎందుకంటే పిఎంకె, ఎండిఎంకె, లెఫ్ట్ డిఎంకెను వదిలి జయలలిత పంచన చేరాయి కాబట్టి. కానీ డిఎంకె (18) – కాంగ్రెస్‌కు (8)– విడుదలై చిరుతగళ్ కచ్చి (1) కూటమికి 27 సీట్లు వస్తే ఎడిఎంకె కూటమికి 12 వచ్చాయి. డిఎంకెకు ఓట్లశాతం పెరగలేదు. వణ్నియార్‌ల ఓట్లు రెండు కూటముల మధ్య చీలిపోయాయి. గ్రామాల్లో, మహిళల్లో ఎడిఎంకె కూటమికి యెక్కువ ఓట్లు పడ్డాయి. కరుణానిధి యీ మధ్య షెడ్యూల్‌కాస్ట్ రిజర్వేషన్‌లో అరుంధతీయులకు ఏర్పరచిన సబ్ కోటా వలన వాళ్ల ఓట్లు పడ్డాయి కానీ ఇతర షెడ్యూల్ కులాల ఓట్లు తగ్గలేదు.ఓటర్లలో 81% మందికి ఎల్‌టిటిఈ కోర్కెలు సమంజసంగా తోచాయి. 75% మంది ప్రభాకరన్ తమిళులకోసమే పోరాడుతున్నాడని నమ్ముతున్నారు. కానీ దీనివలన ఏ కూటమీ లాభపడినట్లు తోచదు.

విజయకాంత్ డిఎండికె 10% ఓట్లు తెచ్చుకుంది. ఒక్కసీటు కూడా రాలేదు. అతనికి ఓట్లేసినవారిలో డిఎంకె నుండి యిటు మొగ్గినవారే ఎక్కువమంది వున్నారు. అందువలన ఎడిఎంకె ఓటమికి విజయకాంత్‌ను నిందించడం సరికాదు. ఇక రామదాసు పిఎంకె, వైగో ఎండిఎంకె ల బలాన్ని యిన్నాళ్లూ ఎక్కువగా అంచనా వేసినట్టు తోస్తోంది. వారి ఓట్లను కూడా సగం మాత్రమే బదిలీ చేయగలరు. కరుణానిధి పరిపాలనపై 68% మంది సంతృప్తి వ్యక్తం చేశారు. డిఎంకె–ఎడిఎంకెలను పోల్చిచెప్పమంటే 42% మంది డిఎంకె బెటరంటే, 25% మంది ఎడిఎంకె మెరుగన్నారు. కలర్ టివీల వలన, నిత్యావసరాల పంపిణీ విధానం బాగా నడవడం వలన ప్రభుత్వ వ్యతిరేకత తక్కువగా వుంది – ముఖ్యంగా పేదల్లో!

కర్ణాటక – 60% మంది ఓటర్లు ప్రభుత్వం పనితీరుపై సంతోషంగా వున్నారు. కానీ కుమారస్వామి పరిపాలన యింతకంటె మెరుగని 65% అన్నారు. అభ్యర్థులను ముందే ఎంపిక చేయడం, ఎలక్షన్ ప్రచారం చక్కగా నిర్వహించడం, యువత, విద్యావంతులతోబాటు గ్రామీణప్రాంతాలకు విస్తరించడం బిజెపి బలాలైతే, అంతర్గత కలహాలు, గందరగోళం కాంగ్రెస్ పాలిట శాపాలయ్యాయి. లింగాయతుల్లో 75% మంది బిజెపికి ఓటేశారు. ఒక్కళిగలు ఓట్లు యిదివరలో చీలిపోయేవి, యీసారి వారిలో 38% బిజెపికి, 30% దేవెగౌడకు, 28%, కాంగ్రెస్‌కు వేశారు. ఓబిసిఓటులో 44% కూడా బిజెపికి దక్కింది. గిరిజనుల్లో 42% మంది బిజెపికి, 45% కాంగ్రెస్‌కు వేశారు. (సశేషం)

5

ఉత్తర ప్రదేశ్ – కాంగ్రెస్‌కు 2007 అసెంబ్లీ ఎన్నికల్లో 8.5% ఓట్లు వస్తే అవి యిప్పుడు 18.3%కి చేరాయి. కాంగ్రెస్‌కు అగ్రవర్ణాల నుండి (ఎస్పీ, బియస్పీలనుండి స్వింగ్), లోధ్ (బిజెపినుండి) యాదవులు తప్ప అగ్ర ఒబిసిలనుండి, జాతవులు తప్ప దళితులనుండి, ముస్లింలనుండి (ఎస్పీనుండి స్వింగ్) వచ్చాయి. అన్నికులాలకు ఆమోదయోగ్యమైన పార్టీగా కాంగ్రెస్ గతంలో వుండేది. ఇప్పుడు మళ్లీ ఆ రోజులు వస్తున్నాయి. బియస్పీ అగ్రవర్ణాలకు అధికారాన్ని కట్టబెట్టకపోవడం, బియస్పీ యాదవులు తప్ప తక్కిన ఓబిసిలను పట్టించుకోకపోవడం దానికి కలిసివచ్చింది. ఎస్పీనుండి వేణీప్రసాద్ వర్మ కాంగ్రెస్‌లో వచ్చి కలవడంతో అప్పటిదాకా బిజెపితో వున్న కూర్మి (24%)–కోయిలీ కులాలవారు కాంగ్రెస్ వైపుకి వచ్చారు. కళ్యాణ్‌సింగ్‌ను చేర్చుకోవడంతో ముస్లింలలో 18% మందికి ఎస్పీపై కోపం వచ్చిందట. కానీ దానివల్ల కళ్యాణ్ కులస్తులైన లోధ్‌లు (32%) ఎస్పీకి భారీగా ఓటేశారు. ములాయం ఎస్‌పికి సీట్లు ఎక్కువ వచ్చాయి కానీ, మాయా బియస్పీకి ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఎందుకంటే మాయా ప్రభుత్వంపై 55% మంది సంతృప్తి చెందారు. కులాలవారీగా చూస్తే బ్రాహ్మణులలో 53% మంది బిజెపికి, 31% మంది కాంగ్రెస్‌కు, 9% మంది బియస్పీకి (గతంలో 17% వేశారు) వేశారు. రాజపుత్రుల్లో 53% మంది బిజెపికి, 16% కాంగ్రెస్‌కు వేశారు. తక్కిన అగ్రవర్ణాల్లో 54% మంది బిజెపికి, 31% కాంగ్రెస్‌కు వేశారు. యాదవుల్లో 73% మంది యస్పీకి వేశారు. దళితుల్లో 72% మంది బియస్పీకి 20% మంది ఎస్పీకి వేశారు. ముస్లిముల్లో 30% మంది ఎస్పీకి, 25% కాంగ్రెస్‌కు, 18% బియస్పీకి, 6% బిజెపికి వేశారు.

పశ్చిమ బెంగాల్ – 8% నెగటివ్ స్వింగ్ వలన అధికారంలో వున్న ప్రభుత్వానికి సీట్లు సగం సీట్ల కంటె ఎక్కువ పోయాయి. ప్రభుత్వంపై సంతృప్తి చెందిన వారి శాతం 66 నుండి 58కి తగ్గింది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసినవారిలో 93% మంది

మళ్లీ కాంగ్రెస్‌కు వేశారు. తృణమూల్ విషయంలో యిది 85%. బిజెపికి 27% ఓటర్లు పోయారు. లెఫ్ట్‌కు 12%! ఓటర్లలో 64% మంది నందిగ్రామ్‌గురించి విన్నారు. విన్నవారిలో 48% మందికి సిపిఎం తీరు నచ్చలేదు. సిపిఎంకు గ్రామీణప్రాంతాల్లో 10% ఓట్లు తగ్గగా ఉద్యోగి వర్గాల్లో 20% పెరిగాయి. జనాభాలో 25% మంది వున్న ముస్లిములు లెఫ్ట్‌నుండి దూరంగా వెళ్లిపోతున్నారు. వారిలో 39% మంది లెఫ్ట్‌కు ఓటేయగా 58% మంది తృణమూల్-కాంగ్రెస్‌కూటమికి వేశారు.

రాజస్థాన్ - 2008 అసెంబ్లీ ఎలక్షన్లలో కాంగ్రెస్‌కు బిజెపిపై 2% ఎక్కువ ఓట్లు వస్తే యీసారి అది 10% కావడంతో 25 సీట్లలో 20 గెలుచుకుంది. 61% మంది అశోక్ గెహ్లాట్ ప్రభుత్వంపై తృప్తి వెల్లడించారు. కాంగ్రెస్‌లో కొద్దిగా కలహాలున్నా, ఎలక్షన్ కాంపెయిన్ చాలా మోటివేటెడ్‌గా చేశారు. బిజెపిలో నాయకులు ఎక్కువై పోయి కలహాలు ముదిరిపోయాయి.

మహారాష్ట్ర - కాంగ్రెస్-ఎన్సీపి కూటమికి 5% ఓట్లు తగ్గగా, బిజెపి-శివసేన కూటమికి 8% తగ్గాయి. పేదవారిలో (47%), మధ్యతరగతివారు, దళితులు (55%) ముస్లిములు (69%) ఓట్లేయడం వలననే కాంగ్రెస్-ఎన్సీపి కూటమి విజయం సాధించగలిగింది. బిజెపి కూటమికి పేదవారిలో 26%, ముస్లిములలో 9% ఓట్లేశారు. మరాఠా, కుంబీలలో 49%, ఓబిసిల్లో 45% వారికి ఓట్లేశారు.

మధ్యప్రదేశ్ - బిజెపి 1999 నుండి గెలుస్తూ వచ్చిన యీ రాష్ట్రంలో కాంగ్రెస్ 2004 కంటె 6% ఓట్లు ఎక్కువ తెచ్చుకుని 4 సీట్లనుండి 12 సీట్లకు చేరుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గత కలహాలు తారస్థాయిలో వున్నాయి. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రతిష్ఠ వలనే యిన్ని ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ ఓటర్లలో 75%మంది, మొత్తం ఓటర్లలో 80% మంది రాష్ట్రంలోని బిజెపి ముఖ్యమంత్రి పనితీరుపై సంతృప్తి వ్యక్తపరిచారు.

మనం పరామర్శించబోయే తక్కిన రాష్ట్రాలు బిహార్, ఒరిస్సా, గుజరాత్, ఛత్తీస్ గఢ్. వీటిల్లో బిజెపి బలీయమైన శక్తి. బిజెపి ఎందుకింత ఘోరంగా దెబ్బతిందో ఒక బిజెపి నాయకుడు చక్కగా విశ్లేషించారు. సుధీంద్ర కులకర్ణి అనే బిజెపి నాయకుణ్ని ఎన్‌డిటివి సర్వేల విశ్లేషణ సందర్భంగా టీవీ ప్రేక్షకులు చూసే వుంటారు. ఆయన ఆంధ్రజ్యోతిలో కాలమిస్టు. బిజెపి వైఫల్యం గురించి ఆయన నిష్పక్షపాతంగా రాసిన వ్యాసం నన్ను ఆకట్టుకుంది. దానిలో కొన్ని అంశాలు యిక్కడ రాస్తున్నాను. లోకసభలో 143 స్థానాలు కల నాలుగు రాష్ట్రాలలో బెంగాల్, ఎపి, కేరళ, తమిళనాడు. వీటిలో కాంగ్రెస్‌కు 60 సీట్లు వస్తే బిజెపికి వచ్చినది ఒఖ్కటి! దీనికి కారణం ఏమిటో ఆయన రాశారు -

'1999లో వాజపేయి నేతృత్వంలో ఎన్‌డిఏలో వున్న తెలుగుదేశం, (అన్నా) డిఎంకె, తృణమూల్ యివన్నీ 2002 గుజరాత్ మారణహోమం తర్వాత దూరమైపోయారు. బిజెపితో కలిసి వుంటే ముస్లిము ఓట్లు దూరమవుతాయన్న భావన వాటిలో బలపడింది. వారిలో ఆ భావన తొలగించడానికి 2004-09 మధ్య బిజెపి చేసినదేమీ లేదు. ఒక్కరు కూడా చేరువ కాకపోగా 2009 ఎన్నికలముందు నవీన్ పట్నాయక్‌ను కూడా దూరం చేసుకుంది. దాంతో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటు చేయగలదని ఓటర్లు నమ్మలేదు. బిజెపిలో సైద్ధాంతిక అయోమయం వుంది. వాజపేయి హిందూత్వ స్ఫూర్తిని త్యజించడం వలనే బిజెపి ఓడిపోయిందని 2004 ఓటమి అనంతరం పార్టీ అనుకుంది. ఇది పూర్తిగా తప్పుడు దృక్పథం.

వాస్తవమేమిటంటే హిందువులు ఎప్పుడూ మూకుమ్మడిగా ఏ ఒక్క పార్టీకి ఓటేయలేదు. అయోధ్య వుద్యమం తర్వాత పదేళ్లపాటు హిందూ సమాజంలోని అత్యధికులను బిజెపి ఆకట్టుకుంది. అది కాకుండా బిజెపికి ఓ అవకాశం యిచ్చి తీరాలన్న భావన ఓటర్లందరిలోనూ కలగడం వల్లనే 1990ల్లో బిజెపి బలపడింది. 'సబ్‌కో దేఖా బారి బారీ, అబ్ కీ బారీ అటల్ బిహారీ' అన్న స్లోగన్ వాజపేయికి గల విశేష ప్రజాదరణ తోడై ఆయన్ని ప్రధాని చేసింది. అది ఎల్లకాలం కొనసాగదు. మైనారిటీలను సన్నిహితం చేసుకుంటే తప్ప బిజెపికి మిత్రులు దొరకరు. మైనారిటీల సంక్షేమం విషయంలో, వారి న్యాయబద్ధమైన డిమాండ్‌ల విషయంలో బిజెపిలో చాలామంది అభిప్రాయాలు సంకుచితమైనవి. ముస్లిం సమస్యల గురించి ఏ మాత్రం శ్రద్ధ వహించినా వారిని బుజ్జగిస్తున్నారని నిరసన వ్యక్తం చేయడం బిజెపిలో చాలామందికి పరిపాటి.

6

గత ఐదేళ్లలో ముస్లిములు హర్షించే ప్రతిపాదనేదీ బిజెపిని రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సచార్ కమిటీ నివేదిక తీసుకోండి. ఆ నివేదికలో అన్నీ అభ్యంతర కరమైనవి కావు. ముస్లింల సామాజిక - ఆర్థిక వెనుకబాటుతనాన్ని వెల్లడించిన ఆ నివేదిక ఆధారంగా ఎక్కువకాలం అధికారంలో వున్న కాంగ్రెస్ నిర్వాకాన్ని బహిర్గతం చేయడానికి వినియోగించుకుని వుండవచ్చు. 'మీరు విధేయంగా వున్న కాంగ్రెస్ మీకేమీ చేయలేదని' ముస్లిములకు నచ్చచెప్పి వుండవచ్చు. కానీ ఆ నివేదికను పూర్తిగా తిరస్కరించింది బిజెపి. ఇది ఎంతవరకు సబబు? అంతకంటె ముస్లింలను పేదరికం , నిరక్షరాస్యత నుంచి విముక్తి పరచడానికి తన వంతు కృషి చేసివుంటే బాగుండేది. కానీ అలా చేయలేదు. దానికి కారణం - పార్టీలోని సంకుచిత వైఖరి.

ముస్లిములు మనకు ఎలాగూ ఓటు వేయరు. ఇక వారి గురించి పట్టించుకోవలసిన అవసరం ఏముంది? అనే ఆలోచన బిజెపిలో కరడు గట్టుకుపోయి వుంది. మొన్న ఎన్నికలలో పార్టీ తరఫున పోటీ చేయడానికి కేవలం ముగ్గురంటే ముగ్గురు అభ్యర్థులకు పార్టీ టిక్కెట్టిచ్చింది. పార్టీ మానిఫెస్టోలో ముస్లింలకు సంబంధించిన అనేక అంశాలున్నా అవి ముస్లింల దృక్పథంలో బిజెపికి వున్న

ముద్రను చెరిపివేయకపోవడానికి యిలాటివే కారణాలు. దేశజనాభాలో 15% వున్న ముస్లిములు బిజెపికి వ్యతిరేకులు. క్రైస్తవులు కూడా యిటీవల దూరమవుతున్నారు. హిందువుల్లో 25% కంటె తక్కువమంది బిజెపికి మద్దతు దారులుగా వున్నారు. భౌగోళికంగా గాని, సామాజికంగా గాని కాంగ్రెస్‌ను సవాల్ చేయగల శక్తి సామర్థ్యాలు బిజెపికి లేనేలేవు. '

ఇదీ కులకర్ణిగారి వ్యాసంలో ముఖ్యమైన అంశాలు. ఇదివరకు నేను బిజెపిలో లోపాల గురించి రాసినప్పుడు కొందరు నన్ను 'సూడో సెక్యులరిస్టు' అని నిందించారు. నేను ఎవరన్నది అనవసరం. బిజెపి ఎటువంటిది, ఎందుకు ఎదగలేకపోతున్నది అన్నది ముఖ్యం. సుధీంద్ర కులకర్ణి వంటి ముఖ్యనేత రాసిన యీ వ్యాసంపై బిజెపిలో చర్చ జరిగి, ఆలోచనా ధోరణిలో మార్పు వస్తే తప్ప దానికి మిత్రులు దొరకరు. అధికారానికి ఆమడదూరంలోనే నిలిచిపోతుంది. కాంగ్రెస్ ఒక్కటే మనకు ఏకైక దిక్కుగా మిగిలిపోతుంది. బలమైన ప్రతిపక్షంగా బిజెపి ఎదగాలి. దానికి గాను తమ పట్ల ముస్లింలకున్న భయం పోగొట్టాలి. మోదీకి పగ్గాలేసి వుంచి, ఏవైనా ట్రస్టులు పెట్టి వాళ్లలో నిరక్షరాస్యత, ఛాందసం పోగొట్టి ఆర్థికంగా ఎదిగేట్లా చేసినప్పుడు వారు తార్కికంగా ఆలోచించి మంచి పరిపాలన అందించేవారికి – బిజెపి వారైనా సరే – ఓటేస్తారు.

ఇప్పుడు నేషనల్ సర్వేకు మళ్లీ వద్దాం. బిజెపికి పెద్ద దిక్కుగా వున్న మోదీగారి గుజరాత్ చూద్దాం. మోదీ అదరగొట్టేస్తాడని బిజెపి ఆశ పెట్టుకుంటే ఒక్క సీటు మాత్రం అదనంగా తెచ్చి 15 దగ్గర ఆగాడు. అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి గాలి వీచిన సౌరాష్ట్ర ప్రాంతంలో 7 సీట్లలో యీసారి కాంగ్రెస్ 4 గెలిచింది. బిజెపినుండి పార్టీ ఫిరాయించినవారితో పెట్టిన మహా గుజరాత్ జనతా పార్టీ బిజెపిని దెబ్బ తీసింది. డైమండ్ పరిశ్రమలో వుద్యోగాలు పోవడం వలన దక్షిణ గుజరాత్‌లో కూడా బిజెపి నష్టపోయింది. ముఖ్యమంత్రిగా మోదీ పనితీరు పట్ల 65% మంది సంతృప్తి వ్యక్తం చేయడం వలనే బిజెపికి యిన్ని ఓట్లు వచ్చాయి. కులాలవారీగా చూస్తే అగ్రవర్ణాలలో 63% మంది, పతిదార్‌లలో 83%, ఓబిసిల్లో 49% బిజెపికి ఓటేశారు. దళితుల్లో 62%, ఆదివాసీలలో 55%, ముస్లిములలో 69% కాంగ్రెస్‌కు వేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో 2004 కంటె 3% ఓట్లశాతం తగ్గినా 11 సీట్లలో 10 సీట్లు బిజెపి గెలిచింది. నక్సలైట్లను అణిచినందుకు, ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌కు మంచి యిమేజి వున్నందుకు అన్ని కులాలవారూ, అన్ని ప్రాంతాలవారూ బిజెపిని ఆదరించారు. బిహార్‌లో నితీశ్ జనతాదళ్ (యు) తో కలిపి పోటీ చేసిన బిజెపి లాభపడింది. ఆ కూటమికి 12% ఓట్లు ఎక్కువ వచ్చాయి. నితీశ్ కుమార్‌కున్న క్లీన్ యిమేజి వలన యిది సాధ్యపడింది. లాలూకి ఓటేసిన ముస్లిములు, యాదవులతో సహా 86% మంది ఓటర్లు నితీశ్‌పట్ల తృప్తి వెల్లడించారు. ఆ కూటమికి బ్రాహ్మణులు (69%), రాజపుత్రులు (80%), భూమిహార్లు (48%), ఇతర అగ్రవర్ణాలవారు, కూర్మిలు– కోయిరీలు(62%) ఓట్లేశారు. కానీ గెలవడానికి యిది చాలదనుకున్న నితీశ్ మోస్ట్ బాక్‌వర్డ్ ఓట్లను (25% ఓట్లు వీళ్లవే. వీళ్లలో 58% మంది యీ కూటమికి వేశారు) ఆకర్షించ గలిగాడు. అందుకే యీ విజయం. కాంగ్రెస్‌కు 10% ఓట్లు మాత్రం వచ్చాయి. ముస్లిములలో 29%, బ్రాహ్మణులలో 18% మంది వాళ్లను ఆదరించారు. యాదవుల్లో 65%, ముస్లిములలో 31% లాలూ వెంటే వున్నారు.

ఒరిస్సాలో కంధమాల్ కారణంగా బిజెడికి, బిజెపికి పొరపొచ్చాలు వచ్చాయి. ముక్కోణపు పోటీలో కాంగ్రెస్ లాభపడవలసినది. కానీ నాయకత్వ సమస్య కారణంగా కాంగ్రెస్ ఓట్లు, సీట్లు పోగొట్టుకుంది. బిజెడి బిజెపినుండి కొన్ని ఓట్లు, కాంగ్రెస్‌నుండి మరిన్ని ఓట్లు గుంజుకోగలిగి 7% ఎక్కువ తెచ్చుకుంది. 3 సీట్లు పెంచుకుని 14 తెచ్చుకుంది. అసెంబ్లీ ఎలక్షన్లలో అయితే 11.5% ఎక్కువ తెచ్చుకుంది. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేనంత పాప్యులారిటీ నవీన్ పట్నాయక్‌కు వుంది. అయినా పేదల్లో కాంగ్రెస్‌కు బలం వుంది. పశ్చిమ ఒరిస్సాలో బిజెపి కూడా బలంగా వుంది.

దీనితో ఎన్నికల విశ్లేషణకు స్వస్తి పలుకుతున్నాను. మీకు మధ్యలో బోరు కొట్టిందేమో తెలియదు. కానీ ఈ అంకెలూ, శాతాలు చాలా ముఖ్యం. ఇవాళ 2 సీట్లు తెచ్చుకున్న పార్టీ ఐదేళ్లు తిరక్కుండా 82 తెచ్చుకుందంటే దానికి కారణం యిలాటివే. ఏ వర్గాల్లో చొచ్చుకుపోవాలో, ఏ వర్గాలను ఎలా నిలుపుకోవాలో తెలియకపోతే గుడ్డెద్దు చేల్లో పడ్డట్టే వుంటుంది.

ఇక కొత్త సీరీస్‌లోకి వెళదాం. అది చిరంజీవి రాజకీయ భవిష్యత్తు గురించి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

• • •